ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

ఆగస్టు-అక్టోబర్, 2020
సంచిక : 437
వెల : 40/-




జనసాహితి ప్రచురణ

# కామ్రేడ్ పోలవరపు జశ్వంతరావుకు జోహార్లు



డా॥ పోలవరపు జశ్వంతరావు ఆగస్టు 27, 2020న కరోనా వ్యాధితో హైదరాబాద్‌లో మరణించారు. ఆయన 1947 మే 29న గుంటూరులో జన్మించారు. జశ్వంతరావు 'ప్రజాసాహితి'కి ఆప్తులు.

1970లలో ఆయన కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో వైద్య విద్యను అభ్యసించే రోజుల్లో విద్యార్థి ఉద్యమానికి ఆకర్షితులైనారు. ఆ తర్వాత ఆయన విప్లవ కమ్యూనిస్టు రాజకీయాలలో అంకితభావంతో చివరిశ్వాస వరకు కృషిచేశారు. 1973–75 కాలంలో కాకినాడలో "యువ సాహితీ సాంస్కృతిక సంస్థ" ద్వారా పలు ప్రజాసాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంలో ప్రముఖపాత్ర పోషించారు. ఈ సంస్థ పలు ప్రజా కళారూపాలను రూపొందించి, ప్రదర్శించింది. ప్రజాసాహిత్య సాంస్కృతిక అంశాలపై చర్చావేదికలను, అధ్యయన సమావేశాలను నిర్వహించింది.

'ప్రజాసాహితి'లో వస్తున్న రచనలపై తమ అభిప్రాయాలను తెలియపరుస్తూ వుండేవారు. ఆయన రాజమండ్రి సెంట్రల్ జైలు నుండి కూడా 'ప్రజాసాహితి'లో కొడవటిగంటి కుటుంబరావు 'బుద్ధికొలత' వ్యాసాలపై విమర్శలు ప్రతివిమర్శలతో కూడిన ధారావాహిక అంశాలపై శాస్త్రీయ దృక్పథాన్ని ప్రతిఫలింపచేస్తూ వ్యాసాలు రాశారు. 'ప్రజాసాహితి'లో రచనలు ప్రజల జీవితం కేంద్రంగా, సాహిత్య సాంస్కృతిక కేంద్రంగా, ప్రజాస్వామికంగా ఉండాలని ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తుండేవారు. కారల్‌మార్క్స్ శతవర్ధంతి సందర్భంగా సాహిత్య సామాజిక అంశాలను, సాహిత్యానికుండే సామాజిక పాత్ర గురించి జశ్వంతరావు రాసిన వ్యాసాన్ని 'ప్రజాసాహితి' సంపాదకీయంగా ప్రచురించాము. ప్రముఖ పాత్రికేయులు ఏ.బి.కె. ప్రసాద్ రచించిన 'పరాధీన భారతం' పుస్తకంపై ఆయన రాసిన సమీక్షను 'ప్రజాసాహితి'లో ప్రచురించాము. ప్రజారచయిత, కళాకారుడు కామ్రేడ్ సుంకర సత్యనారాయణపై 'ప్రజాసాహితి' వెలువరించిన ప్రత్యేక సంచిక కోసం జరిగిన కృషిలో చాలా సహకరించారు.

జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక రాజకీయ పరిణామాలపై జశ్వంత్ సాధికారతతో విశ్లేషించేవారు. 'జనశక్తి', 'క్లాస్ స్ట్రగుల్' పత్రికలకు సంపాదకత్వం వహించారు. తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాలపై లోతైన విశ్లేషణ చేస్తూ సులభమైన, సరళమైన వ్యక్తీకరణలతో అనేక వ్యాసాలు రాశారు.

ఉన్నత మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన జశ్వంత్ వైద్య విద్యను అభ్యసించారు. వైద్యునిగా సంపన్నవంతమైన జీవితం గడపగలిగిన అవకాశాలున్నప్పటికీ వాటిని కాదనుకుని ఈ అసమాన సమాజాన్ని రూపుమాపటం కోసం, సమాజంలో ప్రజల జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పుకోసం, సమసమాజాన్ని నిర్మించటం కోసం ప్రజల పక్షాన నిలబడ్డారు. ఎమర్జెన్సీ కాలంలో అరెస్టు అయి కుట్రకేసులో ఇరికించబడి అనేక చిత్రహింసలు అనుభవించారు. అంకితభావంతో నిబద్ధతతో ప్రజలపక్షాన నిలబడిన ఆయన త్యాగపూరితమైన జీవితం అత్యుత్తమ విలువలను నెలకొల్పిన దార్శనికుల సరసన నిలుస్తుంది.

నేడు అనేక ఆటుపోట్లని ఎదుర్కొంటూ సాగుతోన్న విప్లవోద్యమానికి జశ్వంత్ మరణం ఒక లోటుగా భావిస్తున్నాం. వారి అకాల మరణానికి జనసాహితి సంతాపాన్ని ప్రకటిస్తూంది. వారి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియపరుస్తున్నాం. ❖

# డాక్టర్ వాసిరెడ్డి వీరభద్రరావు మరణానికి సంతాపం



డాక్టర్ వాసిరెడ్డి వీరభద్రరావు 6-9-2020నాడు తన 70వ ఏట అనారోగ్యంతో కన్ను మూశారు. వీరు కృష్ణాజిల్లా వత్సవాయి మండలం ఇందుగపల్లి గ్రామంలో 1950లో జన్మించారు. వాసిరెడ్డి వీరభద్రరావు 'ప్రజాసాహితి'కి ప్రారంభ సంచిక నుండి పాఠకులు, అభిమాని, సన్నిహితులు.

వీరభద్రరావు హైదరాబాదు గాంధీ కళాశాలలో వైద్యశాస్త్రం చదువుకునే రోజులలో ప్రజాతంత్ర విద్యార్థి ఉద్యమానికి, సాహిత్య - సాంస్కృతిక కార్యకలాపాలకు సన్నిహితులయ్యారు. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను అందించాలన్న సంకల్పంతో నైపుణ్యాలను పొందటానికి సింగరాయకొండలో ప్రజా వైద్యులుగా పనిచేస్తున్న డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి వద్ద జూనియర్‌గా చేరారు. అయితే పార్వతీపురం కుట్రకేసులో ముద్దాయి అయిన డాక్టర్ శివరామిరెడ్డిని ఎమర్జెన్సీ రోజులలో అరెస్టు చేసినప్పుడు తిరిగి తన స్వగ్రామానికి చేరుకున్నారు. పెనుగంచిప్రోలులో వైద్యశాలను ప్రారంభించారు. వైద్యుడిగా ఆయన పనిచేసిన ప్రతిచోటా రోగ నిర్ధారణ చికిత్సలో మంచి నైపుణ్యం గల వారిగా గుర్తింపు పొందారు.

పేద ప్రజలకు సాధ్యమైనంత వైద్య సేవలనందించటానికి డాక్టర్ వీరభద్రరావు ఎప్పుడూ ముందుండేవారు.

విశాఖపట్నంలో పూర్ణ మార్కెట్ సెంటర్లో చాలా సంవత్సరాలు వైద్యశాలను నిర్వహించి శ్రామిక ప్రజలకు బాగా అందుబాటులో ఉండే వైద్యుడిగా పేరు పొందారు. రోగుల ఆర్థిక - సాంఘిక స్థాయిలను ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకుని వైద్యం అందించేవారు.

విజయనగరం జిల్లా కొమరాడ - దుగ్గేరు మండలాలలో రైతు కూలీ సంఘం నిర్వహించిన వైద్య శిబిరాలన్నిటికీ బాధ్యత వహించి, అవి విజయవంతం కావడానికి ఎంతో చొరవ, ఉత్సాహం చూపారు.

కార్పొరేట్ వైద్యం పేరుతో నేడు సాధారణ ప్రజలకు వైద్య సౌకర్యాలను దూరం చేస్తున్నారనీ, వైద్య విద్య యొక్క మౌలిక సేవాతత్పరత నుండి వైద్యులు దూరం కావడం పట్ల చాలా ఆవేదన చెందేవారు. తను పుట్టిన గ్రామానికి చేరువలో ఉన్న పెనుగంచిప్రోలుతో పాటు నవాబుపేట, జగ్గయ్యపేటలలో కూడా ఆయన వైద్య సేవలు అందించారు.

ఒక ఆత్మీయ మిత్రుడుని కోల్పోయిన బాధతో జనసాహితి వారి అకాల మరణానికి సంతాపాన్ని తెలియపరుస్తూంది. వారి కుటుంబ సభ్యులందరికీ సానుభూతిని ప్రకటిస్తున్నాము. ❖

44 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

జనసాహితి ప్రచురణ

సంపుటి : 44

సంచిక : 01-03

ఆగస్టు-అక్టోబర్ 2020

437

www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


| | | | |
|---|---|---|---|
| ❑ ముఖచిత్రం | : | సంకెళ్ళతో బంధించి శిలువ వేయబడ్డ భారతం – చిత్రం : రాంబాబు | .....01 |
| ❑ రెండవ అట్ట | : | డా॥ పోలవరపు జశ్వంతరావు, డా॥ వి. వీరభద్రరావుకు జోహార్లు | .....02 |
| ❑ మూడవ అట్ట | : | నాతోపాటు నాలుగు అడుగులు వేస్తావా (కవితలు) – అనిల్ అబ్రహం | .....63 |
| ❑ నాల్గవ అట్ట | : | పిరికిపందల్లారా (కవిత) – హుతంగి ప్రసాద్ | .....64 |
| ❑ సంపాదకీయం | : | జెండాలు మారినా ఎజెండాలు మారని పాలకవర్గాల జాతీయ విద్యావిధానం.... | .....05 |
| ❑ సమకాలీనం | : | సంస్కృతికి సోకిన కరోనా అత్యంత ప్రమాదకరం – దివికుమార్ | .....07 |
| ❑ కథ | : | మాలకుంట – సింధు | .....09 |
| | : | మందిరమూ – మసీదూ హిందీమూలం : ప్రేమ్‌చంద్ తెలుగు : బాలాజీ (కోల్‌కతా) | .....44 |
| ❑ వ్యాసం | : | రామాయణం, భారతం చారిత్రక నేపథ్యం – రాహుల్ | .....14 |
| | : | కరోనా – డా॥ పి. జశ్వంతరావు | .....19 |
| | : | భగత్‌సింగ్ అంటే అధ్యయనం... – దివికుమార్ | .....24 |
| ❑ పుస్తక పరిచయం | : | సంపన్నులైన విజేతలే సమస్తం హస్తగతం చేసుకుంటారు – ఆనంద్ గిరిధర్‌దాస్ | .....30 |
| ❑ కవితలు | : | కొత్తపల్లి హరిబాబు (**08**), కె. భానుమూర్తి (**18**), డా॥ జి.వి. కృష్ణయ్య (**25**) | |
| ❑ బాలసాహితి | : | ఓ.హెచ్. మిత్ర, అలపర్తి వెంకట సుబ్బారావు, జ్యోత్స్న | .....28, 29 |
| ❑ పుస్తక సమీక్ష | : | వలస "దుఃఖ" భారతం – డా॥ ఎ.కె. ప్రభాకర్ | .....20 |
| ❑ గల్పిక | : | సందట్లో సడేమియా – శంకరం | .....26 |
| ❑ ప్రకటనలు | : | వ్యవసాయాన్ని పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు అప్పగించే పార్లమెంటు బిల్లులు, చట్టాలకు వ్యతిరేకంగా కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు విజ్ఞప్తి | .....54 |
| | : | మనీషా వాల్మీకి అత్యాచార నేరస్థులను కఠినంగా శిక్షించాలి | .....55 |
| ❑ ఈ నెల పుస్తకం | : | 'వలస భారతం' – డా॥ జి.వి. కృష్ణయ్య | .....27 |
| ❑ వివిధ | : | ఇలీనాసేన్ మరణం (**06**); ఉత్తరాలు (**23, 48**); అలీసియా అలోంసో మరణం (**56**); ముప్పై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి (**57**); హచాలు హండీసా హత్యను ఖండిద్దాం (**58**); చైతన్యవాహిని (**60**); ఈ పుస్తకాలు అందాయి (**60, 61**), కార్టూన్లు (అంతర్జాలం నుండి) (**27**) | |
| ❑ శాశ్వతనిధి | : | డా॥ పవన్‌సాగర్, నేతల లక్ష్మీరావు (**04**), కొత్తపల్లి సరళాదేవి (**13**), గోరంట్ల వాణీదేవి (**29**), బొర్రా సత్యనారాయణ (**59**) | |
| ❑ సంతాపాలు | : | ఎస్.ఎ. కరీం, ఎన్.విక్రం, నిసార్, బి.పి. కరుణాకర్, బి. పాండురంగారెడ్డి, వాకాటి శిరీష్‌కుమార్, వంగపండు ప్రసాద్, కలువకొలను సదానంద, పి.సి. నర్సింహారెడ్డి, శారదమ్మ, కాట్రగడ్డ నర్సయ్య, స్వామి అగ్నివేశ్, ఉ.సా., నాస్తిక్ వెంకన్న, ఎన్. చౌదరిబాబు | .....49-53 |


**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు ఫోన్ : 9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
**30-7-6,** అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – **520002.**
ఫోన్ : **7075957010** prajasahithi1977@gmail.com

*రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. **59,** రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – **532001**
ఫోన్ : **9441913829** prajasahithi1977@gmail.com

ISSN 0971-278X

LCCN 94903393

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**

| | | |
|---|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | | రు. 300-00 |
| ఐదేళ్లకు | చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు

1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| రెండవ, మూడవ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు మీ పేరు పైన వుంటాయి. దాని ప్రకారం చందా పూర్తికాకమునుపే, చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# డా॥ పవన్ సాగర్

## 11వ వర్థంతి (10-9-2020)



డా॥ బుసిరెడ్డి పవన్ సాగర్‌రెడ్డి అనంతపురం జిల్లా ఇప్పేరు గ్రామంలో 1981 మార్చి నెల 19న జన్మించారు. ఆయుర్వేద వైద్య విద్యలో థావనొగెరె ఆయుర్వేద కళాశాల నుండి బి.ఏ.ఎం.ఎస్. పట్టా అందుకున్నారు. అల్లోపతి వైద్యంలో కూడా తర్ఫీదు పొందారు. ప్రజల వైద్యుడిగా వైద్యసేవలందించాలని భావించి సన్నద్ధమైన సమయంలో ఆకస్మిక గుండెపోటుకు గురై 28 ఏళ్ళ చిన్నవయసులో 2009 సెప్టెంబర్ 10న కన్నుమూశారు. డా॥ పవన్ నిర్మలచిత్తుడు, ప్రేమ మనస్వి, ప్రజాతంత్ర ఉద్యమ అభిమాని. అతని జ్ఞాపకార్థం తల్లిదండ్రులు బి. సరోజ, డా॥ బి. సూర్యసాగర్ అతని రెండవ వర్ధంతి సందర్భంగా (10.9.2011) 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి రు. 25,000 విరాళం అందించారు. 'ప్రజాసాహితి' డా॥ పవన్ సాగర్‌ను 11వ వర్ధంతి సందర్భంగా జ్ఞాపకం చేసుకుంటోంది.

# నేతల లక్ష్మీరావు 8వ వర్థంతి



**నేతల** లక్ష్మీరావుగారు పంచాయత్‌రాజ్‌లో అసిస్టెంట్ ఇంజనీరుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. 1977లో అత్యవసర పరిస్థితి ఎత్తివేసిన తర్వాత డి.ఎస్.వో‌లో 1981 వరకు చురుకుగా పాల్గొన్నారు. కాకినాడలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్న వీరు, 24.10.2012న మరణించారు. వారి ప్రథమవర్ధంతి సందర్భంగా (24.10.2013) వారి కుటుంబసభ్యులు భార్య శాంతకుమారి, కూతురు హెప్సిబా, కుమారులు రాహుల్ కుమార్, ఉత్సవ్ కుమార్‌లు 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి ఇరవై ఐదువేలు విరాళంగా ఇచ్చారు. నేతల లక్ష్మీరావుగారిని వారి 8వ వర్ధంతి సందర్భంగా 'ప్రజాసాహితి' జ్ఞాపకం చేసుకుంటోంది. ❂

## సంపాదకీయం

# జెండాలు మారినా, ఎజెండాలు మారని పాలకవర్గాల "జాతీయ విద్యావిధానం"

"**భవిష్యత్** భారతదేశం తరగతి గదిలో నిర్మాణం అవుతుంది" ఈ వాక్యంతో కొఠారీ కమీషన్ నివేదిక మొదలవుతుంది.

తరగతి గది ఒక సాంస్కృతిక కేంద్రం

ఉపాధ్యాయుడు సాంస్కృతిక సైనికుడు.

విద్యాబలంతో ఏ లక్ష్యాలు సాధించాలో జాషువా చెబుతారు.

ప్రజల్ని పీల్చి పిప్పిచేసే దురాచారాల్ని విద్యాబలం అణచివేయాలనీ, విద్య మూఢత్వం అనే పులికి ఇంపైన భోజనం కాకూడదనీ మోసపూరిత కోతలకు రక్షాబంధం కాకూడదనీ, మనిషిని మనిషిగా నిలబెట్టలేని చదువులెందుకనీ నిరసించాడు కవి జాషువా. ప్రజల అభ్యున్నతికి తోడ్పడని చదువులు ఊటసారా లాంటిదనీ, ఆ మత్తు సమాజాన్ని మరింత దిగజారుస్తుందనీ విద్యాసారాన్ని చెప్పాడు.

ఏడుపదులు దాటిన స్వతంత్ర భారతదేశంలో ఈ విద్యా లక్ష్యాలు ఏ మేరకు నెరవేరాయో అంచనా వేయటానికి ప్రభుత్వ మేధావులు సిద్ధంగా లేరు. గతాన్ని సమీక్షించకుండానే కొత్త విద్యా విధానాలను రూపొందించి, దోపిడిశక్తులకు దేశాన్ని ధారపోసే విద్యా సంస్కరణలు ఎప్పటికప్పుడు చేస్తూనే వున్నారు.

రాజ్యాంగంలో 45వ నిబంధన ప్రకారం 1960 నాటికల్లా 6-14 సం॥ల బాలబాలికలందరికీ నిర్బంధంగా ఉచితంగా ప్రాథమిక విద్య నేర్పాలని నిర్ణయం. ఇప్పుడు జాతీయ విద్యావిధానం-2020లో ఆ లక్ష్యం 2025 నాటికి అందరికీ అక్షరాస్యత అనే నినాదంగా వినిపిస్తున్నారు.

వాళ్ళ దృష్టిలో అక్షరాస్యత అంటే - అప్పుల పత్రాల మీద - ఒప్పందపు పని విధాన పత్రాల మీద సంతకం చేయగలిగేంత. మార్కెట్‌లో సరుకులపై ఉన్న ఇంగ్లీషు పేర్లను చదవగలిగే వినియోగదారుని అవసరం మేరకు - అంతే. కానీ, నూతన ఆవిష్కరణలకూ, నూతన సమాజాన్ని ఆవిష్కరించడానికీ సొంతంగా ఆలోచించేవాళ్ళు తయారవడానికీ కాదు. అందుకే మాతృభాషలో విద్యని నిషేధిస్తున్నారు. ప్రజలు జ్ఞానవంతులు అయితే చాలు - పాలకవర్గాల పరిధిలో - కానీ చైతన్యవంతులు కాకూడదు.

మెకాలే ఆంగ్ల విద్యా విధానం ద్వారా తాము (వలస పాలకులు) పాలించే కోట్లాది ప్రజలకూ - తమకూ మధ్యవర్తులుగా ఒక చదువుకున్న వర్గాన్ని తయారుచేయడమే అసలు లక్ష్యం. అదే లక్ష్యం మార్కెట్ అవసరాల రీత్యా నేటికీ అమలవుతూ వస్తోంది. నిజానికి వలస పాలకులకు కావాల్సింది మన దేశ అభ్యున్నతి కాదు. ఈ దేశాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థలోకి తీసుకెళ్ళడం వాళ్ళ లక్ష్యం అస్సలు కానేకాదు. ఆ వలస పాలకుల దృష్టిలో భారతదేశం కేవలం ముడిసరుకుల వనరు మాత్రమే. ఆ వనరుల్ని తమకు కట్టబెట్టే - దళారీవర్గాన్ని సృష్టించుకోవడమే ఆంగ్ల విద్య ప్రధాన లక్ష్యం. అదే నేటి 70 ఏళ్ళ పైబడి వలస పాలకులు పరోక్షంగా పొందుతున్నారు. అందుకు ఇక్కడి మత వైరుధ్యాలు, కులాల కుంపట్లు మంచి ఉపాధేయాలు.

మతతత్త్వ శక్తులకు నియలమైన ఎన్‌డిఏ - యుపిఏ కూటములు ఇక్కడ పాలకవర్గాల దళారీలు.

ఇక్కడ నుండి చరిత్రలోకి అవలోకిస్తే - భారతీయ రాజకీయ రంగంలో సంపూర్ణ స్వాతంత్రానికి ఆలోచనలు చేసిన నేపథ్యంలో జాతీయోద్యమ నాయకులు "జాతీయ విద్యావిధానం" అనే దృక్పథాన్ని ముందుకు తీసుకువచ్చారు. 1906లో కలకత్తా కాంగ్రెస్ సభలో జాతీయవిద్య కోసం తీర్మానం చేశారు. ఆ జాతీయ విద్యావిధానం కేవలం గత వైభవాన్ని భవిష్యత్ తరాలకు అందివ్వడమే. ముఖ్యంగా భారతీయ అగ్రవర్ణాల సాహిత్యం, చరిత్ర, సంప్రదాయ శాస్త్ర విజ్ఞానం, సంప్రదాయ కళలు, యింకా యుద్ధవిద్య ప్రధానం. వారు ఆంగ్లభాషా పెత్తనాన్ని కూడా తిరస్కరించారు.

ఈ చారిత్రకదృక్పథంతో చూస్తే - మతతత్త్వశక్తుల కూటమి (ఎన్‌డిఏ)కి ప్రతినిధి అయిన మోడీ ప్రభుత్వం 2020 జాతీయ విద్యావిధానం ఫక్తుగా కొత్త సీసాలో పాత సారాయే.

ఆనాటి జాతీయోద్యమ నాయకత్వం జాతీయ విద్యావిధానాన్ని సాధించాలంటే - రాజకీయ స్వాతంత్ర్యం అవసరమని భావించింది. కానీ, ఆర్థిక - సాంస్కృతిక పరాధీనత పట్ల నిర్లక్ష్యంగానే వున్నారు అనేకంటే దురాచారాల, మూఢాచారాల మత మౌఢ్య సమాజాన్ని కొనసాగించే పరాధీన ఆలోచనలో వున్నారు అనడం సమంజసం.

ఈ నేపథ్యంలోంచి దేశం రాజకీయంగా దళారీ బూర్జువాల చేతుల్లోనూ, సామ్రాజ్యవాద బహుళజాతి శక్తుల ఆర్థిక కబంధహస్తాల్లోనూ 73 ఏళ్ళుగా నలుగుతూనే వుంది.

ఈ పరిస్థితుల్లో 29-07-2020న కేంద్రమంత్రివర్గం జాతీయ విద్యావిధానాన్ని ఆమోదించింది. 34 సం॥ల తర్జన భర్జనల తరువాత రూపొందించబడిన పరాధీన "జాతీయ విద్యావిధానం ఇది.

1986లో రాజీవ్‌గాంధీ నూతన విద్యావిధానం, 1992లో నూతన ఆర్థిక విధానాలు, జనార్ధనరెడ్డి కమిటీ, ఆ తరువాత 2019 జాతీయ విద్యావిధానం ముసాయిదా విజన్ 2020 - ఈ వరుసలో రూపొంది నేటి జాతీయ విద్యావిధానం ఎన్‌డిఏ కూటమి సారధ్యంలో - మోడీ పాలనలో విడుదల అయింది.

భారతదేశంలో పాఠశాలలకు ప్రభుత్వ నిధులు ఇవ్వడం అనే పద్ధతి 1823లో ప్రారంభమైంది. అలాగే విద్యా పరిస్థితుల్ని సర్వే చేయడం. 1822 నుండే ప్రారంభమైంది.

ఎలాంటి చదువులు కావాలి?

ఏ భాషలో చదువులు కావాలి?

ఎందుకోసం చదువు కావాలి?

ఈ చర్చ వలస పాలకుల నాయకత్వంలో 1813 నుండి జరుగుతూనే వుంది.

వేమన చెప్పినట్లు – పెద్దకులంవాడైనా – చిన్న కులంవాడైనా; ఏ వంశంలో పుట్టినా, ఎంత ఉన్నతవిద్య నేర్చినా – వీళ్ళంతా ధనవంతునికి బానిస కొడుకులే" అన్నట్లు ఈ విద్యావిషయక చర్చలు ఉన్నవాళ్ళ ప్రయోజనాలకే తోడ్పడుతున్నాయి.

కొఠారీ కమీషన్ సూచించిన – మాతృభాషలో విద్య, కామన్ స్కూల్ విధానం, అందరికీ సమాన అవకాశాలూ, శ్రమకు తగిన ఫలితం, జాతి, కుల, మత, లింగ వివక్షతలు లేని సమాజ నిర్మాణం – మొదలైన లక్ష్యాలు నిర్లక్ష్యానికి గురవుతూనే వున్నాయి. అందువల్ల ఏర్పడిన పరిస్థితుల పర్యవసానాల్ని ప్రజలు అనుభవిస్తూనే వున్నారు. పాలకవర్గాలు తమ సంక్షోభాన్ని ప్రజల నెత్తిన రుద్దుతున్నారు.

యాంత్రిక బోధనాపద్ధతులు ఒకవైపు; జ్ఞాపకశక్తికే ప్రాధాన్యత ఇంకోవైపు; అశాస్త్రీయ పాఠ్యాంశాలు మరోవైపు; ఆన్‌లైన్ పాఠాలనే గొప్పలు ఒక వైపు, వాటిని అద్దుకోలేని పేద విద్యార్థులు మరోవైపు. మొత్తంమీద చదువుకున్న నిరక్షరాస్యుల్నీ, నిరుద్యోగుల్నీ తయారు చేయడమే దళారీ పాలకులకు నిత్యకృత్యం. ఉత్పత్తితో సంబంధంలేని, శ్రమని గౌరవించని, సోమరి, బలాదూర్ లంపెన్‌వర్గాన్ని తమ రాజకీయ రౌడీ, మాఫియాలకు అనుగుణంగా మలచుకోవడమే ఈ విద్యావిధానం అసలు లక్ష్యం. ఏ స్థాయిలోనైనా చదువు మానేసే అవకాశాన్ని జాతీయ విద్యావిధానం చూపిస్తోంది.

ఉన్నతవిద్య ఉన్నతవర్గాలకు రిజర్వు చేయడమనే ఆంతర్యం ఈ విద్యావిధానంలో దాగి వుంది. కులవృత్తుల్ని పెంచి పోషించడం ద్వారా చవకగా కూలీలను పెట్టుబడిదారీ వర్గాలకు పంపిణీ చేయడం మరో లక్ష్యం. రాజాజీ ఆనాడు ప్రవేశపెట్టిన ఒంటిపూట బడుల ద్వారా కులవృత్తుల్ని ప్రోత్సహించాలని చూశారు. నేడు మరలా తాజా ప్రయత్నం. ఇప్పుడు మరి ఎంతమంది సింగరాజులు, చెన్నుపాటిలు, మాణిక్యాంబలూ కావాలో!

"జాతీయ విద్యావిధానం – 2020" అమలుకొచ్చినప్పటి నేటి కరోనా పరిస్థితుల్లో ఈ డొల్లబారిన విద్యావ్యవస్థ మొత్తంగా ఎందుకు కుదేలై, కుప్పకూలిందో సమీక్ష అస్సలు లేదు. ఎందుకంటే విద్యారంగపు బాధ్యత నుండి ప్రభుత్వం పూర్తిగా తప్పుకోవాలన్నదే అసలు ఆంతర్యం. స్వచ్ఛంద సంస్థలకీ, కార్పొరేట్ శక్తులకు, సామ్రాజ్యవాద బహుళజాతి శక్తులకు విద్యా విధానాన్ని ధారపోయడమే దాని లక్ష్యం. "మార్కెట్ విద్య"కు బహిరంగంగా తెర లేపడానికే – ఈ "జాతీయ విద్యా విధానం – 2020"!

ఇంతేకాదు – పాఠ్యపుస్తకాలను ఎన్‌సిఇఆర్‌టి తయారుచేసి రాష్ట్రాలకు పంపించడమంటే ఉమ్మడి జాబితాలో వున్న విద్యకి తిలోదకాలిచ్చి, కేంద్రీకృతంగా నియంతృత్వ పోకడలతో రాష్ట్రాల హక్కుల్ని దిగమింగి, సమాఖ్య సంస్కృతికి గండికొట్టడమే! విద్యాకాషాయీకరణకి బార్లా తలుపులు తెరవడమే!

ఆకలి, పేదరికం, అణచివేత, సాంస్కృతిక పతనత్వం, పరాయిభాషా బానిసత్వం, అవిద్య, నిరుద్యోగం ఇన్నిన్ని అణచివేతల మధ్య పీడనను పెంచుకుంటూపోతే – ప్రజలు తెగించి చరిత్రని తామే పునర్నిర్మించుకుంటారు.


"పాలు పోసినవాళ్ళు, కూరలు తెచ్చినవాళ్ళు
చెప్పులు కుట్టినవాళ్ళు, ఇళ్ళు ఊడ్చినవాళ్ళు
చొక్కాలు కుట్టినవాళ్ళు, కుక్కల్నీ, మొక్కల్నీ పెంచినవాళ్ళు"

తమకు ఎదురైన పరిస్థితుల తీవ్రతతో బలం పుంజుకొని తెగింపుగా – ఈ ప్రజలే చరిత్రని తిరగరాస్తారు.

ఆ ప్రజల పాత్రను వేగవంతం చేయడానికే కథ, కవిత, వ్యాసం, నాటకం, రూపకం, పాట, మాట – అదే ప్రజాసాహిత్య, సాంస్కృతిక పోరాట సారాంశం!!

**30-09-2020** ✪

# ఆదివాసుల అభ్యున్నతికి కృషిచేసిన ఇలీనాసేన్ మరణం



**ఇలీనాసేన్,** ఛత్తీస్‌ఘడ్‌లో కార్మిక ఉద్యమాలలోను, ఆదివాసీల సమస్యలపైనా తన భర్త డా॥ వినాయక్‌సేన్‌తో పాటు పనిచేసిన సంఘసేవిక. తన 69వ ఏట 2020 ఆగస్టు 9న మరణించారు. పిల్లల వైద్యుడు, మానవహక్కుల కార్యకర్త ఐన డా॥ వినాయక్‌సేన్‌పై రాజ్యం మావోయిస్టులకు సహకరిస్తున్నాడన్న ఆరోపణపై అరెస్టు చేసిన సందర్భంగా, ఇలీనాసేన్ రాజ్యం చేసే అకృత్యాలను ఖండిస్తూ ఉద్యమం నడిపారు. ట్రయల్ కోర్టు వినాయక్‌సేన్‌కు 2010లో జీవిత ఖైదు విధించగా, 2011లో సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

ఇలీనాసేన్ 1979 చివర్లో, 1980 ప్రారంభంలో జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో సాగిన వరకట్న హత్యలకు వ్యతిరేకంగా సాగిన ఆందోళనలోను, మధుర అనే యువతిపై జరిగిన లైంగిక దాడిని ఖండిస్తూ సాగిన ఉద్యమంలోనూ క్రియాశీలంగా పాల్గొన్నారు. డాలీరాజహరిలో శంకర గుహానియోగి ప్రారంభించిన ఛత్తీస్‌ఘడ్ గనుల శ్రామిక సంఘటన (సిఎంఎస్ఎస్)కు చెందిన షహీద్ హాస్పిటల్ తరపున భర్తతోపాటు ఆదివాసీ గ్రామాల్లో పనిచేశారు. జండర్ సమస్యలపైనా, వ్యవసాయ జీవ వైవిధ్యంపైనా కృషిచేసే 'రూపాంతర్' అనే స్వచ్ఛంద సంస్థను నెలకొల్పారు.

ఆమె కొంతకాలం వార్ధాలో మహాత్మాగాంధీ అంతర్రాష్ట్రీయ హిందీ విశ్వవిద్యాలయంలోనూ, బొంబాయిలోని టాటా సామాజికశాస్త్రాల సంస్థలోని మహిళా సమస్యల అధ్యయన కేంద్రంలోనూ పనిచేశారు. ఆదివాసీలతో పనిచేసినప్పటి తన అనుభవాలను రెండు పుస్తకాలుగా ప్రచురించారు. ✪

(సమకాలీనం)

# సంస్కృతికి సోకిన కరోనా అత్యంత ప్రమాదకరం!

**"ఆడదై** పుట్టటం కంటే అడవిలో మానై పుట్టటం మేలు" అన్న సామెత మధ్య యుగాలనాటిది.

"గత కాలమే మేలు వచ్చు కాలము కంటెన్" అని నమ్మే భాజపా పాలకుల హయాంలో మహిళల బ్రతుకులు ఎలాంటి ఆటవికతకు బలవుతాయో, ఆగమాగమయి పోతాయో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాలన మంచి ఉదాహరణ. ఆ రాష్ట్రం హత్రాస్‌లో వాల్మీకి తెగకు చెందిన 19 ఏళ్ల దళిత యువతిపై అగ్రకులాల యువకులు నలుగురు అత్యాచారం చేయటమే కాక, తమ పేర్లు బయట పెట్టకుండా చేయటానికి ఆమె నాలుకను తెగ్గోశారు. నిర్దాక్షిణ్యంగా ఆమె మెడ ఎముకనూ, వెన్నుపూసను విరిచేశారు. పశువుల మేత సేకరణ పనిలో తల్లికి కూత వేటు దూరాన పొలంలో వుండగా దుండగులు చున్నీతో నోరు నొక్కి ఈ దురాగతం చేశారు. 15 రోజుల పాటు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడి సెప్టెంబరు 29న ఢిల్లీ సఫ్దర్జంగ్ ఆసుపత్రిలో ఆ యువతి కన్ను మూసింది. ప్రభుత్వ, పోలీసు యంత్రాంగపు నిర్లక్ష్యం అడుగడుగునా కనిపించింది. బాధితురాలిని బ్రతికించటానికి మంచి వైద్య సౌకర్యాలని కల్పించటానికంటే ఆమెపై అత్యాచారం జరగలేదని ప్రకటించటానికి అత్యుత్సాహ పడ్డారు. ఆమెకు జరుగుతున్న చికిత్సను గురించి తెలుసుకోవటానికి ఢిల్లీ ఆసుపత్రికెళ్లిన 'ఆం - ఆద్మీ' పార్టీ ఎం.ఎల్.ఏ.ను పోలీసులు కొట్టి బెదిరించారు. ఆ అమ్మాయి తల్లిదండ్రుల అనుమతి లేకుండా, వారి సాంప్రదాయాలను ఏ మాత్రం గౌరవించకుండా, వత్తిడిచేసి, దౌర్జన్యంగా తెల్లవారుజామున (తెల్లవారితే 30వ తేదీ అనగా) ఆమె శవాన్ని గ్రామంలో దహనం చేసేశారు. శాంతి భద్రతల సమస్యను సాకుగా చూపుతున్నారు. యు.పి. పోలీసు యంత్రాంగం ఆరెస్సెస్ కార్యకర్తలు లాగా ప్రవర్తిస్తున్నారు.

నేటి కరోనా.. మనుషుల కదలికలను, ప్రజా సమీకరణలను కట్టడి చేస్తే, ఆదిత్యనాథ్ పోలీసులు శాంతి భద్రతలను చీకటి మాటున కాపాడుతున్నారు. డా॥ కఫీల్ ఖాన్ లాంటి సేవాతత్పరత గల వైద్యునిపై తప్పుడు కేసులు బనాయించి 'బెయిలు' కూడా లభించకుండా జైళ్ళలో మగ్గేట్లు చేయగల ఫాసిస్టు కళలో యు.పి. పోలీసులు ఆరితేరారు. 2017లో ఉన్నావో గ్రామంలో ఉద్యోగార్థం వచ్చిన ఒక మహిళపై భాజపా ఏం.ఎల్.ఏ. అత్యాచారం కావించిన కేసుపై ఆదిత్యనాథ్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు లోక విదితమే! చట్టబద్ధ పరిపాలనలో నేరస్తులను శిక్షించవలసినది న్యాయస్థానాలు కాగా, తాము నేరస్తులనుకున్నవారిని ఎన్‌కౌంటర్లలో హతమార్చి, చట్టం కళ్ళకు తూటాల మాలను చుట్టబెట్టారు. కేవలం నిర్భయ లాంటి చట్టాలతో మహిళలపై అత్యాచారాలు ఆగిపోతాయని భ్రమపెట్టినట్లే, తమ ప్రత్యర్థి ముఠాలలోని కొందరిని తుడిచి పెట్టేసి నేరాలను అదుపు చేస్తున్నట్లు సాక్షాత్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రే ప్రగల్భాలు పోతున్నాడు. అవన్నీ కేవలం డాంబికాలేనని హత్రాస్ యువతిని దహనం చేసిన రోజే వెలువడిన 'నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో' (జాతీయ నేరచిట్టా నమోదు కేంద్రం) ప్రకటించిన నేరాల వివరాలు చెపుతున్నాయి.

గత సంవత్సర నేరాల చిట్టా ప్రకారం అత్యధికంగా ఎస్.సి., ఎస్.టి.లపై దాడులు జరుగుతున్న రాష్ట్రం ఉత్తరప్రదేశే! 2018వ సంవత్సరంలో ఎస్సీలపై 42,793 దాడులు దేశవ్యాపితంగా జరుగగా, 2019లో 45,935 జరిగాయని రిపోర్టు చెప్పింది. ఇది ఒక్క ఏడాదిలోనే 7.3% పెరిగినట్లుగా చూపిన నివేదిక, ఒక్క ఉత్తరప్రదేశంలోనే 11,793 (సుమారు 25%) దాడులతో మొదటి స్థానంలో వుందని చెప్పారు. (తర్వాత స్థానాలు రాజస్థాన్, బీహార్లవి.)

2019వ సంవత్సరంలో 554 మంది ఎస్సీ మహిళలపై రాజస్థాన్‌లో అత్యాచారాలు జరుగగా, ఉత్తరప్రదేశ్‌లో 537 మందిపై జరిగాయి. ఎస్టీలపై దాడులు గత సంవత్సరం 26.5% పెరిగాయి. (2018లో 6,528 నేరపూరిత జరుగగా 2019లో అవి 8,257కు పెరిగిపోయాయి.)

ప్రధాని మోడీ ఇచ్చిన "బేటీ పఢావో- బేటీ బచావో" నినాదం యొక్క సోకు ఆయన అధికారంలోకి వచ్చిన దగ్గరనుండి ఎలా వుందో కూడా తెలుసుకుందాం. 2015వ సంవత్సరంలో దేశ వ్యాపితంగా ఎస్సీలపై జరిగిన నేరపూరిత దాడులు 38,670 కాగా, 2019లో 45,935. 2016లో ఎస్టీలపై జరిగినవి 6,568 అయితే 2019కి 8,257కి పెరిగాయి. మొత్తంగా మహిళలపై నేరపూరిత దాడులు 2018లో 3 లక్షల, 78 వేల, 236 జరిగాయనీ, అవి 2019కి 4 లక్షల, ఐదు వేల, 861కి పెరిగిపోయాయనీ ప్రకటించింది. (సరాసరిన నెలకు రెండు వేల దాడులు పెరిగినట్టు) ఇవన్నీ ప్రభుత్వం బయట పెట్టినవేనని మనం గుర్తుపెట్టుకోవాలి. వీటికి మూలకారణంగా ధన మదమూ, అగ్రకుల ఆధిపత్యమూ, పితృస్వామిక దురహంకారమూ పని చేస్తున్నాయనేది స్పష్టమే! ఇవన్నీ ఏ నాటినుండో సంక్షోభంలో కొట్టు మిట్టాడుతూ, గిడసబారి పోయిన, అభివృద్ధి నిరోధక భారత అర్థవలస - అర్థభూస్వామ్య సమాజపు సాంస్కృతిక వ్యక్తీకరణలు. గత వ్యవస్థతో ఒక విప్లవాత్మక తెగదెంపులు లేనందువల్ల ఇంకా కొనసాగుతున్న, కరోనా కంటే ప్రమాదకరమయిన, మొండి వ్యాధులివి. వీటికి తోడుగా జతయినదే మతోన్మాద సంస్కృతి. బాబ్రీ మసీదును ఉన్మాద పూరితంగా వివాదగ్రస్తం చేసి దాని శిధిలాలపై నడుచుకుంటూ నేడు అధికారంలో పీఠమేసిన భాజపాలకుల ముఖ్యులెవ్వరూ మసీదు విధ్వంసంలో లేరని, నిర్దోషులని నిన్ననే (హత్రాస్ యువతిని దహనం చేసిన రోజు, నేరాల గణాంకాలు విడుదలయిన రోజు) సీబీఐ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఇలాంటి తీర్పులు ఇవ్వటం మన న్యాయస్థానాలకు కొత్తకాదు. హంతకులు లేని హత్యాకాండగా చుండూరును ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఒకనాడు ప్రకటించినట్లే, ఇపుడు ధ్వంసకులు లేని విధ్వంసకాండగా బాబ్రీని పరిగణించాలన్నమాట! సత్యమే గెలిచిందని చిందులు

తొక్కుతున్నవాళ్ళకు, సత్యాన్ని హత్య చేసిన రోజుగా సెప్టెంబరు 30ని ప్రపంచం గుర్తు పెట్టుకుంటుందని తెలియకపోవటం ఆశ్చర్యం! బాబ్రీ మసీదు విధ్వంసకాండ రహస్యంగా, అర్థరాత్రి జరగలేదు. నిండు కౌరవ సభలో ద్రౌపదికి అవమానం జరిగినట్లు, పట్టపగలు టీవీల ద్వారా ప్రపంచమంతా చూస్తుండగానే కూల్చివేత జరిగింది. దాన్నిపుడు తెలియని దుండగులెవరో ధ్వంసించినట్లుగా పరిగణించిన సీబీఐ కోర్టు, జరిగిన అన్యాయ పర్యవసానాలను, నష్టాన్ని సరిదిద్దాలి కదా! అంటే కూల్చి వేయబడిన చోటనే తిరిగి మసీదుని నిర్మించి ఇవ్వమని తీర్పు చెప్పి వుండాలి. దానికి బదులు సరియైన సాక్ష్యాధారాలను సమర్పించని పోలీసు నిర్లక్ష్యాన్ని అడ్డం పెట్టుకుని సీబీఐ కోర్టు అడ్డగోలు తీర్పునిచ్చేసింది.

యాంటీ టెర్రరిస్టు దళం అధికారి హేమంత్ కర్కారేకి చావు శాపం పెట్టింది తానేనని బహిరంగంగా ప్రకటించిన భోపాల్ పార్లమెంటు సభ్యురాలు సాధ్వీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, బాబ్రీ మసీదు కూల్చివేతలో పాల్గొన్నందుకు తాను గర్విస్తున్నానని బహిరంగంగా చెప్పిన విషయం లోకమెరిగిన సత్యమే కదా! బాబ్రీ కూల్చివేత దుండగుల పనయితే ప్రజ్ఞాసింగ్ శిక్షార్హురాలే కదా! ఎలుకతో చెలగాటమాడుతూ, "అబ్బే! ఏంలేదు, ఆడుకుంటున్నానంతే!!" అని పిల్లి అన్నట్లుగా, గండు పిల్లుల్లాంటి నిర్దోషులందరూ, నోటికంటిన రక్తాన్ని తుడుచుకుంటూ సత్యమే గెలిచిందనటం లోకం కళ్ళు కప్పాలనుకోవటమే!

బ్రిటీషు వలస పాలకులు పెంచి పోషించుకుంటూ వచ్చినదీ మతోన్మాదం. ఇది సామ్రాజ్యవాద ప్రపంచీకరణ కాలానికి పాలక వర్గాల అత్యవసరంగా, కాంగ్రెసుకు ప్రత్యామ్నాయంగా రంగం మీదకు తేబడింది. ప్రపంచీకరణ రిహార్సల్ దశలో వున్నపుడు ఇది బాబ్రీ మసీదు సమస్యను ఆలంబన చేసుకుని భారత సమాజంలో మత ఉన్మాద కాలుష్య వ్యాప్తికి పూనుకుంది. 1991లో ప్రపంచీకరణ వాస్తవ రూపం ధరించే కాలానికి శిలాన్యాసాలు, కరసేవలూ, రథయాత్రలతో మతకలహాల వ్యాప్తితో, చివరకు బాబ్రీ మసీదు కూల్చివేతతో దాని శిధిలాలపై నడుచుకుంటూ ఢిల్లీ పీఠానికి ఎగబాకింది. ఈ 25 ఏళ్ల కాలంలో అమెరికా సామ్రాజ్యవాద ప్రపంచ టెర్రరిస్టు వ్యూహంలో భాగంగా భారత్‌ని మరో పాకిస్తాన్‌లా ఎదిగించి తిరుగులేని అధికారాన్ని కైవసం చేసుకోగలిగింది. ప్రపంచీకరణ విధానాల దుష్ఫలితాలకు అడ్డుపడే సమస్త ప్రజా నిరసనలనూ, ఆందోళనలనూ, ఉద్యమాలనూ నిర్దాక్షిణ్యంగా అణచివేయగల సత్తా కలిగిన శక్తి తానేనని భాజాయిస్తోంది.

ప్రజా ఉద్యమాల వెన్నుని విరిచేసే సామ్రాజ్యవాద వ్యూహం, మతోన్మాద శక్తులకు అడ్డంకులు లేని రాజకీయ రహదారిని నిర్మించింది. దేశ వనరులను ప్రపంచ, దేశీయ కార్పొరేట్ వర్గాలకు ధారాదత్తం చేయటంలో నీతినీ, నియమాల్నీ వారు పట్టించుకో దలచటం లేదు. కరోనాను అడ్డం పెట్టుకుని భారత వ్యవసాయ రంగాన్ని శకుని పాచికలు లాంటి అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ జూదం క్రిందకు మార్చేశారు. డా॥ స్వామినాథన్ కమిటీ సూచనలను పాటిస్తానని పైపై వాగ్దానాలు చేసి రైతుల పంటలకు న్యాయమైన మద్దతు ధరను ఇవ్వటం, అందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు నిర్వహించటానికి బదులు 'అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టు' పెడుతున్నారు. పూర్వం వలస కాలంలో మన రైతులపై బ్రిటీషు పాలకులు నీలి పంటను రుద్దినట్లు, మన వ్యవసాయరంగాన్నంతా కార్పొరేట్ల లాభసాటి వ్యాపారం క్రిందకు మార్చేసుకుంటున్నారు. పార్లమెంటరీ చట్టబద్ధ నిబంధనలను ఎడమ కాలితో తన్నేసి వ్యవసాయ బిల్లులను, కార్మిక చట్టాలను తమ చిత్తం వచ్చినట్లు మార్చేశారు. రాష్ట్రాల అధికారాలను హరించి బిచ్చపు జోలెలతో ఢిల్లీ చుట్టూ తిరిపెమెత్తాల్సిన దుస్థితికి వాటిని దిగజార్చారు. "ఏ రూపంలో వున్నా ప్రజల ఆస్తులనన్నిటినీ ప్రైవేటు వ్యక్తుల పరం కావించటం, వ్యక్తిగత విశ్వాస స్థాయిలో వుండాల్సిన మతాన్ని ఉన్మాద స్థాయికి పెంచి రాజకీయ అధికార పనిముట్టుగా వాడుకోవటం, కార్పొరేట్ల సేవకులుగా, కేంద్రీకృత అధికారాలతో దేశంపై తిరుగులేని ఆధిపత్యాన్ని నెలకొల్పుకోవటం" – ఇదే వారి విధానం. చారిత్రక దృష్టితో ఆలోచిస్తే వారిదొక పగటికల! (1939లో వచ్చిన) 'గ్రేట్ డిక్టేటర్' సినిమాలో హిట్లరు బెలూను పేలిపోయినట్లే ఈ కల పగులుతుంది. కానీ వర్తమానంలో అది దేశం మెడమీద కత్తి. దాని పరాధీన దళారీ స్వభావం కారణంగా సామ్రాజ్యవాదుల ముందు వారు ఇంకా ఇంకా సాగిలపడక తప్పదు. దేశాన్ని అసమానతలతో, అవమానాలతో ముంచక తప్పదు. నేటి ఆర్థిక – రాజకీయ సంక్షోభాన్నుండి ప్రజలను పక్కదారి పట్టించటానికి, కరోనా కంటే ఘోరాతి ఘోరమయిన నీచ సాంస్కృతిక విధానాలను అమలు పరచక మరో దారి ఈ పాలకులకు లేదు.

సామ్రాజ్యవాదుల సేవలో వున్న ఫ్యూడల్ కులోన్మాద – హిందుత్వ మతోన్మాద శక్తులను, సమస్త జీవనరంగాలతో సహా భావజాలరంగంలో కూడా ఎదుర్కోవటానికి, ప్రజలముందు వారి దళారీ స్వభావాన్ని బహిర్గత పరిచేందుకు రచయితలూ, మేధావులూ సంసిద్ధులమవాలి. అందుకు నిజాయతీగా కలిసి వచ్చే సాహితీ సాంస్కృతిక శక్తులనూ ఐక్యం చేసి సంఘటితపర్చాలి.

**1-10-2020** – దివికుమార్ ✪

కవిత

# తుది సమరందాకా

**- కొత్తపల్లి హరిబాబు**

ఎగసే జ్వాల
దహనం చేసేదాకా ఆగదు
మండే గుండెలు
చెండాడుతాయి
రగిలే పోరు
తుది సమరందాకా నిద్రపోదు
నీలో నాలో మరిగే రక్తం
నీలో నాలో చెలరేగే కవితలకు మూలం
అది ప్రజాస్వామ్యాన్ని పునాదుల్తో పెకలిస్తుంది
విప్లవానికి బాటలు వేస్తుంది
సోషలిస్టు సమాజ నిర్మాణానికి దోహదం చేస్తుంది. ✪

కథ

# మాల కుంట

- సింధు

**మండలంలో** అదో పెద్ద గ్రామపంచాయతి. ఆరువేలకు పైగా జనాభా ఉంటుంది. అందుకే దాన్ని పేట అంటారు. ఊరుకు తూర్పున ఉత్తర దక్షిణంగా మాలవాడ, మాదిగ వాడలున్నాయి. ఈ వాడలు చెరో గ్రామ పంచాయితిలా వుంటాయి. రెండింటి మధ్యన లోతట్టు. మధ్యన కాపుల, తెనుగుల, రెడ్ల, గౌండ్ల వారి పొలాలకు, చేళ్ళకు దారుంది. దారికి ఇరువైపుల ఇరువాడలకు వెట్టిమడ్లు ఉన్నాయి. ఇవి వివిధ వృత్తులు చేసే మాల, మాదిగలకు ఇచ్చిన ఇనామ్[1] భూములు. ఒక్కొక్క కుటుంబానికి అయిదు కుంటలకు మించి వుండదు. ఈ చిన్న కమతాలు కూడా ఏటవాలుగా ఉండడంతో నాగలి కూడా తిరగని చిన్న చిన్న మళ్ళుగా వున్నాయి. ఊరివారి పొలాలకు తూర్పువైపున దామర చెరువు వుంది. ఈ చెరువు శిఖం పై భాగమున దట్టమైన అడవి వుంది. దీనికి కుడి, ఎడమ రెండలుగులున్నాయి. కుడి అలుగు పారితే మాలవాడకు పైన ఉన్న మాలకుంటకు వస్తాయి. ఎడమ అలుగుపారకంతో మాదిగల పొలాలు పండించుకోవాలి. వర్షాలు బాగా పడితే మూన్నెళ్ళకు పైగా అలుగు పారుతుంది. అందుకే ఆ కాలానికి సరిపడే వరినే నాటుకుంటారు. కాలం పోతే పంటలు ఎండుతాయి.

మాలకుంట నిండుతే మాలల పొలాలు పండుతాయి. దామర చెరువు మధ్య తూము ఊరి పొలాలకే గాని, ఈ ఇరు వర్గాల భూములకు ఎక్కవు. అందుకే జలపంటలు[2] పండిస్తారు. లేకపోతే బీడుంటాయి. రానురాను ఎవుసం బందు కావడంతో ఉన్నకాస్త భూములు పడీతుగా మారిపోతున్నాయి. ఇప్పుడు ఇరువర్గాలకు ఆ వెట్టిమడ్లు[3] బొందలగడ్డగా మారిపోయాయి. వేసవిలో పశువుల కోసం పొదులు[4] వేస్తారు.

మాలకుంటకు పశ్చిమాన ఊరి శ్మశానం వుంది. శ్మశానం పక్కనుంచే అడవిలోకి దారి వుంది. ఊరికి కావల్సిన కలపను, వంట చెరుకును ఈ దారి గుండానే జనాలు బండ్లపై తెచ్చుకుంటారు. చనిపోయిన వ్యక్తులకు కావల్సిన కట్టెను అడవినుంచే కొట్టుకొస్తారు. ఒకప్పుడు పులులకు నిలయమైన అడవి బయలుగా మారింది. కొండెంగలు, ఎలుగుబండ్లు, అడవి పందులు మాత్రమే ఇప్పుడు మిగిలాయి.

ఊరుకు ఆనుకోని పశ్చిమాన పెద్ద చెరువుంది. దీని పైభాగన ఉల్లెంగ చెరువు. ఆవలగల అడవిలో మద్దికుంట వుంటాయి. పెద్ద చెరువు కింద సగం పొలాలు దొర నారాయణరావువి కాగా, మిగతావి రెడ్లవి, బ్రాహ్మలవి, కోమట్లవి, అయ్యవార్లవి, సాలెవారివి! ఈ చెరువు నీళ్లే గ్రామ జనం ఇప్పటికీ తాగుతారు. పెళ్ళీలకు, పేరంటాలకు బండ్లపైన టాకీలు పెట్టి ఈ చెరువు నీటినే నింపుకొని పోతారు. దీని అలుగుళ్లో చాకిరేవు, కట్టపైన మడేలయ్య గుడి వుంది. అలుగు లోపల బెస్తవారి గంగమ్మ గుడి వుంది.

కమ్మరి, కుమ్మరి, వడ్రంగులకు, మంగలి, చాకలివారికి భూముల్లేవు. బలంత[5] పైన వారు బతుకుతారు. దక్షిణవైపు నుంచే ఊరిలోకి దారి. ఈ దారిలోనే జంగం వారి సమాధు లున్నాయి. ఈ సమాధులు ఓ చిన్న ఇల్లులా వుంటాయి. రోడ్డుకు కుడిపక్కన గౌండ్ల వారి రేణుకాదేవి ఆలయం, దీనికి ఆనుకొనే కల్లు డిపో వుంది. ఇక్కన్నుంచే ఊర్లోని రెండు దుకాణాలకు మాల, మాదిగ వాడలకు కల్లు పంపిణీ జరుగుతుంది. ఊరి మొదట్లోనే విశాలమైన మైదానంలో ఉన్నత పాఠశాల వుంది.

✤ ✤ ✤ ✤

మాదయ్య ఈ మాలవాడలోనే పురుడు పోసుకున్నాడు. ఇక్కడి ఉన్నత పాఠశాలలోనే ఏడవ తరగతిదాకా చదివాడు. ఎనిమిది నుంచి పదోతరగతిదాకా ఉప్పల్‌వాయి రెసిడెన్షియల్ స్కూళ్లో, ఇంటర్ భిక్‌నూర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో, డిగ్రీ నాగార్జునసాగర్ రెసిడెన్షియల్ కాలేజీలో చదివాడు. దేహదారుఢ్యానికితోడు తెలివితేటలుండడంతో ఎస్సై ఉద్యోగం దొరికింది.

తండ్రి బక్కయ్య. బేగరి[6] వృత్తి. తల్లి బక్కవ్వ. వ్యవసాయ కూలి. వారసత్వంగా వచ్చిన బేగరి వృత్తి కింద అయిదు గుంటల భూమి వుంది. మాలవాడలో నాగళ్ళు తెరమరుగు కావడంతో భూములన్నీ పడీతుగా మారాయి. బేగరిపని చేసినందుకు ఊర్లో బలంత దొరుకుతుంది. అదీ దోపసలు[7] పండుతే ఫర్వాలేదు. ఖరీప్ పంట, రెండో పంట పండకపోతే ఊరి జనం బలంత పెట్టడానికి ఇబ్బంది పడుతారు. ఆబితాబి[8] పండుతేనే ఇంట్లో కొంత గాసం వుంటుంది. శవాలు కాలబెట్టుతే వచ్చే పైసలు, బక్కవ్వ కూలి డబ్బులు ఇల్లు గడవడానికి ఆడికాడికే! మాదయ్య ఊషారుండుట్ల ఖర్చు లేకుండానే చదువు, ఉద్యోగం ప్రాప్తించాయి.

బేగరి, గాదం వృత్తి శవాల్ని కాల్చడం. ఊరిలో ఏ శవమైనా మాలకుంట పక్కన శ్మశానానికే తెస్తారు. దహన సంస్కారాల తర్వాత పెద్ద చెరువుకెళ్లి స్నానం చేస్తారు. సెలవు రోజుల్లో మాదయ్య శవదహనాలుంటే తండ్రితో కూడా పోయేవాడు. అక్కడ జరిగే తంతు మాదయ్యకు అర్థమయ్యేది కాదు. కాడు చుట్టూ తిప్పడం, నీళ్ళ కుండను రంధ్రం చేసి ఎత్తుకోని తిరగడం, కింద పడేయడం, అగ్గిపట్టిన మనిషిపై పడి ఏడ్వడం తమాషాగా అనిపించేది. 'తనూ అట్లనే చేయాలా?' అని ఆలోచించేవాడు. కాని వారి వాడలో ఇలా శవాన్ని కాల్చడం ఉండదు. అందరిని పాతిపెట్టడమే! ఊరి జనం మాలకుంటలో ఎందుకు స్నానం చేయరో మాదయ్యకు అర్థమయ్యేది కాదు. ఒసారి తండ్రిని అడిగాడు కూడా!

'ఇది మాలకుంట అంటే మనది. మనం వాడే కుంటలో వాళ్ళు తానం చేస్తే మైల పడిపోతారు. పైగా కాలిన శవాల బూడిద ఈ మాలకుంట్లకే వస్తది. అందుకే వారు తానం చేయరు' అని బక్కయ్య చెపితే,

'మరి మనమెందుకు పెద్ద చెరువులో స్నానం చేయ్యద్దు...?' అంటూ ప్రశ్నించాడు మాదయ్య.

'అది పెద్దోళ్ళ చెరువు. మనం దాంట్లో కాలుపెట్టద్దు' అంటూ సమాధానమిచ్చాడు బక్కయ్య.

మాదయ్యకు అంతగా అర్థం కాలేదు.

మాలవాడ జీవనమంతా మాలకుంట పైననే. ఈ మాత్రం సౌకర్యం మాదిగలకు లేదు. దగ్గరలోని మోటబావుల నుంచి, దామరచెరువు పారినప్పుడు కయ్యల్లో నిలిచి నీళ్ళను వాడుకో వాల్సిందే! వాడంతా బండ వుండడంతో బోర్లు పడని స్థితి.

మాదయ్య పెండ్లైన కొద్ది రోజులకే అతని తండ్రి కాలం చేసాడు. తల్లి వారసత్వపు వృత్తిని కొనసాగించేది. అందుకే మాదయ్య రమ్మన్నా పోయేదికాదు. ఊరిగాని ఊరికి రావడం తనతో కాదని చెప్పేది బక్కవ్వ. ఉద్యోగందృష్ట్యా మాదయ్యకు ఊరికి రాలేని పరిస్థితి. ముందు జిల్లాలోని కోటగిరిలోనే పోస్టింగు. తర్వాత జిల్లాలు మారుతూ కృష్ణాజిల్లా గూడురుకు బదిలీ అయింది. ఉద్యోగంలో చేరిన కొత్తలోనే గుంటూరు ప్రాంతం నుంచి వచ్చి స్థిరపడిన ఏసురాణితో పెళ్ళి జరిగింది. ఇద్దరు పిల్లలు. పెద్దపాప పదోతరగతి. చిన్నపాప ఐదోతరగతి. ఇద్దరు విజయవాడలోని ఓ ఇంగ్లీష్ మీడియం రెసిడెన్షియల్లో చదువుతున్నారు.

ఉన్నట్టుండి తల్లి పోయిందన్న వార్త. ఉటాఉటిన భార్య పిల్లలతో సుమోలో బయలు దేరాడు మాదయ్య. కామారెడ్డికి చేరుకోగానే చిన్నాన్న కొడుకు బాలీరు వచ్చాడు. బాలీరు ఊర్లో పదోతరగతి కానిచ్చి, ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆటోను తెలిసిన వ్యక్తి దగ్గర పెట్టి మాదయ్యతో సుమోలో బయలు దేరాడు బాలీరు.

సూర్యుడు నెత్తి మీది నుంచి పడమటికి వంగుతున్నాడు. అశ్లేషకార్తె కాబట్టి చలిగా లేదు. వేడిగాలేదు. సుమో అద్దాల గుండా పడుతున్న కిరణాలు హాయిగా అనిపిస్తున్నాయి. సుమో చప్పుడు తప్ప అంతా గంభీరంగా వుంది. ఏసురాణికి, పిల్లలకు ఏమి మాట్లాడాలో తోయడం లేదు. బాలీరుకు మాటలు ఎలా కల్పాలో అర్థం కావడంలేదు. కూర్చున్నట్లే గాని అంతా బిడియంగా వుంది.

సుమో రెగ్యులర్ రూట్లో కాకుండా, మరో దారిగుండా పోతుంటే, 'ఇదే రోడ్డు...?' అంటూ మౌనాన్ని చేదిస్తూ బాలీరును అడిగాడు మాదయ్య.

'గూడెం నుంచే...' అంటూ మాదయ్య మాటలు కలిపినందుకు బాలీరు సంతోషంగా సమాధానం చెప్పాడు.

'అట్లనా – మరి రామడిపేట రూట్...?' అంటూ ప్రశ్నించాడు మాదయ్య.

'అట్లగూడా పోవచ్చు. ఇది గూడా డాంబరు అయింది. ఈ రోడ్డు మంచిగుందని ఇట్ల పోతున్నాం' అని చెప్పాడు బాలీరు.

మళ్లీ కొంచెంసేపు నిశ్శబ్దం. మాదయ్య మదిలో చిన్ననాటి జ్ఞాపకాలు సుడులు తిరగసాగాయి. తాను చుదువుకున్నప్పుడు అన్నల ప్రభావం ఉండేది. గ్రామాలన్నీ వారి ఆధీనమే! ఏ గ్రామంలో ఎన్నికలు జరిగేవికావు. ఊళ్లను శాసించిన పెద్దలు పట్టణ బాటపట్టారు. అన్నల ప్రభావం తగ్గడంతో తిరిగి పాత పరిస్థితులు మొదలయ్యాయి.

సుమో గూడెం దాటి సింగరాయిపల్లి శివార్లొంచి పోతున్నది. సింగరాయిపల్లి పేట మధ్యన అడవంతా ఖాళీ అయింది. రోడ్డెంబటి చెరుకు తోటలు, మొక్కజొన్న చేళ్ళు కనపడ సాగాయి. సుమో ఘనపూర్ తండా దాటుతున్నది. ఒకప్పుడు దట్టమైన అడవిలో వుండే తండా మైదానంలా కనపడసాగింది. తండా దాటితే ఊరు. ఊర్లోకి రాగానే సుమోను పాఠశాల తూర్పు వైపు నుంచి పొమ్మని పురమాయించాడు బాలీరు.

'అదేంటి...ఊర్లో కెళ్ళి పోదా...?' అంటూ ప్రశ్నించాడు మాదయ్య.

'లేదన్నా... మొన్ననే పనికి ఆహార పథకం కింద ఈ రోడ్డేసారు...' అని బాలీరు చెప్పాడు.

కొత్తగా వేసిన రోడ్డు మాల మాదిగ వాడలకు ఓ బైపాస్‌లా ఉంది. నిన్నటిదాకా ఈ వర్గాలవారి వాడలకు రాకపోకలు ఊరి మధ్యలోని హన్మాండ్ల గుడి ముందర నుంచే సాగించే వారు. ఊరికి అదే కేంద్ర బిందువు. చిల్లర కిరాణం దుకాణాలు, చిన్నపాటి బట్టల దుకాణం, మెడికల్ షాప్, ఓ ఇద్దరు ఆర్ఎంపీలు ఆసెంటర్లోనే! ఎస్‌బిహెచ్ బ్యాంక్ గుడికి ఎదురుగా గల గ్రామపంచాయితి భవనంలో వుంది. ఇప్పుడు పరిస్థితి అంతా మారుతున్నది. సెంటర్లో దుకాణాలు ఊరిబయట స్కూలు దగ్గరికి వచ్చాయి. బస్సుస్టాపు ఉండడంతో చిన్నపాటి హోటళ్ళు వెలిశాయి. దగ్గరలోనే కల్లు దుకాణం. మాల మాదిగల జనాలతో పాటు, చుట్టూ వుండే తండాలు ఊర్లోకి పోవల్సిన అవసరం లేకుండా పోయింది. ఇప్పుడా సెంటర్లో మిగిలింది పాడుబడ్డ దొరగడి, గ్రామపంచాయితి, అందులో బ్యాంకు, వీటికి కాపలాగా హన్మాండ్ల గుడి. భవిష్యత్తులో బ్యాంకు కూడా తరలిపోవచ్చు!

మాదయ్య మనస్సులో ఏదో మెదల సాగింది. తాను స్కూలుకు పోయేటప్పుడు, వచ్చేటప్పుడు సెంటర్ దగ్గర దారిలో ఉండే గౌండ్ల జానకీ కొడుకు రవితో రావడం, పోవడం చేసేది. బక్కవ్వ ఎప్పుడైనా చిల్లర పైసలిస్తే గుడ్డి కిష్టయ్య దుకాణంలో పిప్పరమెంట్లు కొనుక్కోని రవి తాను తినేవారు. రవివాళ్ళ అమ్మ కల్లు తాగేవారి కోసం శనగల్ని వేయించి, ఉప్పు కారం చల్లి అమ్మేది. అప్పుడప్పుడు వాటిని రవి తెచ్చేవాడు. అలా ఇద్దరు శనగల్ని తింటూ స్కూలుకెళ్ళడం ఓ గమ్మత్తుగా వుండేది. రవి ఇప్పుడు ముస్తేదారుగా[9] మారి, ఓ పర్యాయం గ్రామ సర్పంచు అయ్యిండట!

'ఊరు బాగా డెవలప్ అయిందన్నా...!' అంటూ సంతోషంతో బాలీరు అంటే....

'ఏం డెవలప్‌మెంట్...?' మధ్యలోనే ప్రశ్నించాడు మాదయ్య.

'మనకో అంగన్‌వాడి, ప్రైమరీ స్కూలు కట్టింద్రు. అట్లాగే మాదిగ వాడకు కూడా.. ఇక ముందర ఓ పెద్ద ఆర్చీ కడుతరట! చెందాలు పోగుజేస్తున్నరు...' అంటూ ఈ మధ్యన జరుగుతున్న విషయాల్ని బాలీరు మాదయ్యకు చెప్పసాగిండు.

ఇవన్నీ వింటున్న మాదయ్యకు మనసెందుకో కలుక్కుమంది. తాను చదువు కున్నప్పుడు ఊర్లో పిల్లలందరితో కలిసి చదువుకునే వాడు. ఇప్పుడు అందుబాటులో స్కూలు పేరున ఏదో అంతరాల దొంతరలో ఇరుక్కుంటుందేమో ఈ అభివృద్ధి అని అనిపించింది.

'మరి, టీచర్లెవరు...?' అంటూ ప్రశ్నించాడు.

'మనూరోల్లే. ఓ రెడ్డీల సారు మన స్కూల్లో, ఓ బాపనోళ్ళ మేడమ్. హరిజనవాడలో....' అంటూ బాలీరు చెపుతుండగానే ఇల్లొచ్చింది.

చనిపోయిన గుర్తుగా ఇంటి ముందర కొర్రాయి కాలుతున్నది. జనం మూగి ఉన్నారు. మాదయ్య రాక జనంలో కదలిక తెచ్చింది. కొందరు ఏడ్పులంగించుకున్నారు. సుమో దిగడంతో మాదయ్య ఇంట్లోకి వెళ్ళాడు. తల్లి నిర్జీవంగా ఉన్న దృశ్యాన్ని చూసి ఏడ్పొచ్చింది. అది ఒకే ఒక గది. పైన పెంకులు. వర్షాకాలం తప్ప వంట వెనుక వైపున చేసుకునేది బక్కవ్వ. కొంత పెరడు. అందులోనే స్నానం చేయడానికి పొరకతో కొంత చాటు వుండేది.

తల్లి చుట్టూ ఆడవారు కూచోని ఏడుస్తున్నారు. బక్కవ్వతో వరుసలు కలిపి ఏడ్చేవారు కొందరైతే, తమ పెనిమీటీలను యాది చేసుకుంటూ ఏడ్చేవారు మరికొందరు. తలవైపు మాదయ్య మేనత్త కూచుంది. మాదయ్యను చూడగానే.....

'ఒరే మాదయ్య మీ అవ్వపోయింది రా...!' అంటూ శోకాన్ని లంకించుకుంది.

మాదయ్యకు దుఃఖము ఆగలేదు. అత్తా, చిన్నాన్న బిడ్డ మీదపడి ఏడ్చారు. బయట నుంచి ఎవరో పిలిస్తే బయటికి వచ్చాడు. కొందరు గుసగుసలాడితే, మరికొందరు గట్టిగా మాట్లాడుతున్నారు.

'అవును! కొడుకంటే గట్లుండాలే.... సూడు ఎంత దూరం నుంచి పెండ్లాన్ని, పోరగాండ్లను తోలుకోని అచ్చిండు.....' అంటూ కొందరంటే –

'ఆ అచ్చిండు. సచ్చినంక అత్తేంది...... రాకపోతేంది..... ఉన్నప్పుడు ఒక్కసారీ రాకపాయే.. ముసల్దాన్ని తోలక పోకపాయే...' అంటూ మరికొందరు దీర్ఘాలు తీసారు.

ఈ మాటలు మాదయ్య మనసును బాణాల్లా తాకాయి. అవును.. తన తల్లిని తన దగ్గరనే వుంచుకుంటే..' అనుకోగానే మరింత దుఃఖం వచ్చింది.

'ఆ! ఈ ముసల్ది విన్నదా? పాపం కొడుకు రమ్మంటే ఇది ససేమిరా.... అనే' అంటూ సమాధానం చెప్పారు మరికొందరు.

అందరి తల్లుల్లాగనే బక్కవ్వ మాదయ్యను పెంచింది. కొడుక్కు పెట్టినంకనే తినేది. బట్టల్ని సౌడు[10] బెట్టి మల్లెపూలోలె పిండేది. హాస్టల్లో వున్నప్పుడు వారం, వారం తెచ్చిన బట్టల్ని ఎంచక్కా ఉతికేదో! బక్కయ్య బట్టల్ని కూడా మల్లెమొగ్గలోలె ఉతికేది. ఈ జ్ఞాపకాల దొంతర మాదయ్యను కన్నీరు పెట్టించింది. తండ్రి కన్నీరు చూసి పెద్దకూతురు, ఈ ఇద్దర్ని చూసి ఏసురాణి కన్నీరు పెట్టుకున్నారు.

'ఇంకేందిరా... మాదయ్య అచ్చిండుగా.. కానిద్దాం..' అంటు కులపెద్ద పురమాయించాడు.

'అయినా, ఆయన్ని ఓ మాటడుగుండి సందం[11] ఎట్లా చేద్దామంటాడో'.. అంటూ మరో పెద్దమనిషి అన్నాడు.

'ఏందిరా ఆన్ని అడిగేది.... ఇదేమన్నా కొత్తగనా....?' అంటూ, 'కానియండి.... కానియండి... సప్పుడు..సప్పుడు..' అంటూ డప్పుల్ని పురమాయించాడు మరో వ్యక్తి.

ఈ మాటలన్నీ మాదయ్య చెవున పడుతున్నాయి. కళ్ళు తుడ్చుకుంటూ బయటకు వచ్చాడు.

'మాదయ్యా! బట్టలిడిసేయి.... అగ్గి పట్టాలే!....' అంటూ మేనత్త మొగుడు చెపుతుంటే...

'ఫర్వాలేదు.... ఇట్లనే పట్టుకుంట.... అంటూ, 'ఇంతకి అవ్వను ఎటు తీసుకెళ్తరు..?' అంటూ కుల పెద్దల్ని ప్రశ్నించాడు మాదయ్య.

'ఎటు తీసుకెళ్ళడమేందిరా...? మునుపు మనం మన మాలకుంట్లనే ఓ పక్కకు బొంద పెడితిమి. మీ అయ్యను కూడా అట్లేగా పెట్టింది. ఇప్పుడాడ పెడుతలేం. మన ఎట్టిమడ్లు పడ్తీతుండబట్టే! ఇప్పుడండ్లనే బొంద పెడుతున్నం. బొంద గూడా తయారైంది....' అంటూ జరుగుతున్న విషయాల్ని మాదయ్యకు చెప్పాడు కులపెద్ద.

'వద్దు... మా అవ్వను. ఆడపెట్టద్దు...' అంటూ అనుకోకుండానే గట్టిగా అన్నాడు మాదయ్య.

ఈ మాటలకు అందరు ఒక్కసారి నిర్ఘాంతపోయారు. ముఖాలన్నీ చిట్లించి, 'మరి యాడ పెడుతవ్....' అంటూ అందరూ ఒక్కసారిగా అడిగారు.

'ఏం లేదు.. మా అయ్య చనిపోయినప్పుడే ఊరోళ్ళ శ్మశానంలో అందరిలా దహనం చేయాలని ఉండే.. అప్పుడు నాకు ధైర్యం లేక ఏం అనలేదు..' అంటూ నసుగుతు మాదయ్య అంటుంటే, 'ఏంది... ఈనికేమన్నా పిచ్చా...?' అంటూ పెద్దమనిషి కోపంగా అరిచాడు.

'అదేం లేదు కాక.... మనం గూడా ఊరోళ్ళలాగా శవాల్ని దహనం చేద్దామని....' అంటూ సమాధానపర్చబోయాడు మాదయ్య.

'అది ఊరోళ్ళది. అయినా మనకు కాష్టమెక్కడిది[12]...? బొందపెట్టుడేనాయే...!' అంటూ వివరించాడు మాదయ్య చిన్నాన్న.

'అవును మనకు బొందనేనాయే! కొత్త రివాజేంది...?' మరి కొందరు

'ఈనికి పట్నంగాలి సోకినట్లున్నది..' అంటూ మరో ముసలావిడ దీర్ఘం తీసింది.

'ఏముంది.. కాలబెట్టద్దనే రూలేమన్నా ఉందా...?' అంటూ మాదయ్య ప్రశ్నించాడు.

'ఊర్లల్ల రూల్సేముంటయి. అన్నీ రివాజులే! ఎనికటినుంచి ఎట్ల వస్తుందో గట్లనే నడవాలి గాని. కొత్త రివాజ్ ఎక్కడిది?' అంటూ మరో తాత.

'ఊరోళ్ళను కాలేస్తరు. మనని బొంద పెడుతరు. అంతే!' అంటూ కరాఖండిగా చెప్పాడు కులపెద్ద.

'కానీయండి... కానీయండి. ఉద్యోగం చేసుకునేటోనికి గివన్నీ సమజ్‌గావ్...' అంటూ చేయాల్సిన పనులను పురమాయించారు. డప్పుల చప్పుడు మొదలైంది. సన్నాయిలు చావు రాగాన్ని ఆలపించసాగాయి. పాడె కట్టేవారు కడుతున్నరు. కొత్త కుండలో మాదయ్యతో నీళ్ళు తెప్పించారు. కాలుతున్న కొర్రాయిపై పెట్టారు. కోమటి దుకాణంకెళ్ళి తెచ్చిన మూటలోంచి[13] వస్తువులన్నీ తీసారు. జరగాల్సిన తంతు జరుగుతున్నది.

✤ ✤ ✤ ✤

మాదయ్య మనసు పరి పరి విధాల ఆలోచించ సాగింది. తన మనసులోని కోరికను చెప్పగానే కులపోళ్లు ఒప్పుకుంటారనే నమ్మకం లేదు. అయినా చెప్పినా ప్రయోజనం కనపడలేదు. తన ప్రమేయం లేకుండానే పనులన్నీ జరిగిపోతున్నాయి. కనీసం తనని డబ్బు కూడా అడగడంలేదు. తానులేకుండానే కులపెద్దలు చేస్తున్న పనికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పాడు. ఇప్పటికీ గ్రామాల్లో మానవీయకోణం కనపడుతున్నందుకు కళ్ళు మరోమారు చెమ్మగిల్లాయి. పట్టణాలకు, పల్లెలకు ఎంత తేడా అని అనిపించింది. అవ్వ తనతో

ఎందుకు రాలేదో అర్థమయింది. బహుశ వచ్చుంటే అవ్వ మరింత ముందుగానే చనిపోయేదని మాదయ్య అనుకున్నాడు. ఏదైనా అవ్వ పోయింది. కడసారి చూపుకైనా వచ్చినందుకు సంతోషం మిగిలింది. అయినా తల్లి శవాన్ని దహనం చేయాలనే కోరిక తగ్గలేదు.

'పోనీ, మన మడికట్లల్లనే అవ్వను దహనం చేద్దాం. కట్టె తెప్పియ్యండి....' అంటూ జేబులోనుంచి డబ్బు తీయబోయాడు మాదయ్య.

'ఓరే మాదయ్య! కట్టె, గిట్టె కాదు బిడ్డా! మనకు రివాజులేని పనులు చేయద్దు. అరిష్టం[14]. అయినా కట్టెక్కడికెళ్లి తెస్తవు? ఊరోళ్ళకు హక్కుంది. అడవికెళ్ళి తెచ్చుకుంటరు. మనకది లేదుగా...?' అంటూ ఉన్న విషయం చెప్పాడు పెద్దమనిషి.

'అదంతా నేను జూసుకుంట...' అంటూ మాదయ్య చెప్పపోగా, 'సూస్తవ్, సూస్తవ్... ఇయ్యాలుంటవ్... రేపోతవ్.. ఎప్పటికి ఈడ ఉండేది మేం. కొత్త పద్దతులద్దు...' అంటూ మిగతా పనులను కానియ్యండంటూ చెప్పాడు కులపెద్ద.

జరగాల్సిన తంతు జరుగుతున్నది. బక్కవ్వను కొంత మంది మగాళ్ళు బయటకు తీసుకరాగ, ఆడవారు గొల్లుమని ఏడుస్తూ బయటకు వచ్చారు. ఓ ప్లాస్టిక్ కుర్చీలో కూచోబెట్టి చుట్టూ దుప్పటి పట్టి స్నానం చేయించారు. తెల్లగుడ్డను కట్టి, పూలదండలేసి పాడెపై పెట్టారు.

డప్పులు జోరందుకున్నాయి. సన్నాయి రాగం పెరిగింది. వాతావరణం గంభీరంగా మారింది. పోలీసు అధికారిగా పోలీసు స్టేషన్లో చేసే హుకూం ఇక్కడ నడవదని తెలిసినా, ఏదో ప్రయత్నం చేయబోయాడు.

'మీ అవ్వ కాళ్ళు మొక్కు, పాడె లేపాలే' అనగానే పెళ్ళాం పిల్లలతో వచ్చి తల్లి కాళ్లు మొక్కాడు మాదయ్య. పాడె కదిలింది. మాదయ్య ముందు అచేతనంగానే నడువసాగాడు. నడుస్తున్నట్లే గాని మనసంతా కకావికలమైంది. కుల మత భేదాలు లేవని పుస్తకాల్లో చదువు కున్నాడు. పోలీసుగా ఉద్యోగం చేస్తున్నా అంతా పేపరు మీదనే అని అనుభవంలో తెలుసు కున్నాడు. అయినా, ఊరోళ్ళకు ఒక పద్ధతి, తనకో పద్ధతిని జీర్ణించుకోలేకపోతున్నాడు. తాను అంబేద్కరు కాదు. కాలేకపోయాడు. ఆ మహానుభావుడు కొంతలో కొంత చైతన్యం నింపాడు. ఆ చైతన్యంతో చదువుకున్న తనలాంటివారు తన వర్గానికై చేస్తున్నదేంటో అర్థం కాలేదు. సమస్య కాల్చడమా, బొందనా అని కాదు. కాని ఈ వ్యత్యాసాలు మనుషుల్ని భిన్న వర్గాలుగానే ఉంచుతున్నాయి. మరికొన్ని అలవాట్లు మరింత బలోపేతం అవుతున్నాయి. ఒకప్పుడు అందరు కలిసి చదువుకునే స్కూళ్లు కులాలవారిగా వేరైతున్నాయి. పట్టణాల్లో ఓ పరిస్థితి. పల్లెల్లో మరో పరిస్థితి! పరిస్థితి ఏదైనా మనుషుల మధ్యన అంతరాలు మరింతగా పెరుగుతున్నాయి. ఈ వ్యవస్థకేనా 'ప్రజాస్వామ్యం, సమసమాజం..' అని పేరూ....' అంటూ మాదయ్య మనస్సులో ప్రశ్నించుకోసాగాడు.

వెట్టిమడ్లు రానే వచ్చాయి. దింపుడు కళ్ళం దగ్గర దించారు. చేతికున్న వెండి[15] గోట్లను, ఉన్న ఒక్క ముక్కు పుడకను తీసి అత్త చేతికిచ్చారు. చివరి రోజుల్లో తల్లికి అత్తనే సేవ చేసింది. తాను డబ్బులు మాత్రం పంపగలిగినా తల్లి రుణం తీర్చుకునే భాగ్యం కల్గనందుకు చదువుకోకున్నా బాగుండేదని అనుకున్నాడు మాదయ్య. తాను చదువుకోని ఉద్యోగం చేసుకుంటూ, పెళ్ళాం పిల్లలతో హాయిగా ఉన్నందుకు అదృష్టవంతుడో, కనీసంగా తల్లికి సేవ చేయలేని దీనావస్థకు దురదృష్టవంతుడో తెల్చుకోవడానికి మాదయ్య సతమతమయ్యాడు.

బొంద రానే వచ్చింది. బొంద చుట్టూ తిరగడం, కుండ నెత్తుకోని తిరగడం ఎత్తేయడం, తన మీద పడి అందరూ ఏడ్వడం చకచకా జరిగిపోయాయి. బక్కవ్వపై మట్టి పెళ్లలు పడుతుంటే, తన గుండెను తాకినట్లుగా ఫీలయ్యాడు మాదయ్య. బొంద నిండింది.

పైసల పంపకాలు జరిగాయి. అందరు మాలకుంటలో స్నానానికి వెళ్ళారు. నీరంతా బురదగా ఉంది. పైనంతా బూడిద తేలుతుంది. ఊరి శ్మశానం బూడిద వర్షానికి కొట్టుకచ్చింది. అందులోనే మునిగి తేలారు. మాదయ్య, పెళ్ళాం పిల్లలతో మునిగాడు.

✤ ✤ ✤ ✤

తల్లిని పండబెట్టిన తలాపుకు దీపం పెట్టారు. దీపం చూసి అందరు మొక్కుకుంటూ ఎవరి దారిన వారు పోయారు. చిన్నమ్మవాళ్ళు వండితే అక్కడే తిన్నాడు. వేడన్నంతో పచ్చిపులుసు తన తల్లిని జ్ఞప్తికి తెచ్చాయి. తనకు పచ్చిపులుసు ఇష్టమంటే వెంటనే చేసేది తల్లి. బహుశ భవిష్యత్తులో పచ్చిపులుసుతో తినే భాగ్యం తనకు రాకపోవచ్చు....! కళ్ళల్లో కన్నీరు సుడులు తిరుగుతుంటే తల్లే వండిపెట్టినట్లుగా భావిస్తూ తిన్నాడు మాదయ్య.

అప్పటికే చీకటి పడింది. తిరిగి పెద్దలందరు జమయ్యారు. స్తంభానికి రెండేసిగా ఉన్న కరెంటు దీపాలు గుడ్డిగా వెలుగుతున్నాయి. చల్లనిగాలి వీస్తుంటే అందరు అరుగులపైన కూచున్నారు.

'చెప్పయ్యా! మాదయ్య.... దినాలెట్ల[16] జేస్తవ్....?' అంటూ కులపెద్ద నిశ్శబ్దాన్ని చీల్చుతూ ప్రశ్నించాడు.

'నాకేం దెలుసు.... మీరెట్లంటే గట్లనే....' అంటూ ముక్తసరి జవాబు ఇచ్చాడు మాదయ్య. మాదయ్యలో ఓడిపోయాననే బాధ ఉంది. తానుండి చేసేది కూడా ఏమి లేదు. ఏమి చేసినా తల్లి తిరిగి రాదు. ఇదంతా ఉపశమనానికి జరిగే ఓ తంతు. లేకుంటే బాధను దిగమింగడం కష్టం. అందుకే చర్చ పెట్టకుండా మాట్లాడాడు మాదయ్య.

'సరే! ఖర్చును బట్టి పనుంటది. కులపోల్లకు కుడుపుంటుంది[17]. కల్లుగిల్లుండనే ఉండే! యాట[18] సంగతేంటి? యాటల్ని బట్టి వాడలో చెప్పాలి...' అంటూ వివరించాడు మరో పెద్ద మనిషి. వివరాలకు పోకుండా.. 'ఎంతైదదేంటి..?' అంటూ అడిగాడు మాదయ్య.

'నువ్ పెట్టిందాని బట్టి.... ఏడెనిమిది వేలైతే గావాలి. ఇయ్యాలటి ఖర్చు మూడువేలు...' అంటూ చెప్పుకపోయాడు లెక్కల్ని చూసే మరో కుల పెద్ద.

'సరే! ఓ ఇరవై వేలుంచండి...' అంటూ మాదయ్య కులపెద్దకు ఇచ్చాడు.

అందరు ఆశ్చర్యపోయినా – ఉద్యోగస్తుడు కాబట్టి ఖర్చు చేస్తున్నడని తీసుకున్నారు.

తెల్లవారింది. బాలీరును తీసుకొని తల్లి బొంద దగ్గరికి పోయాడు. కాళ్ళదిక్కు మరోసారి మొక్కి పిడికెడు మట్టిని తీసి దస్తీలో కట్టుకున్నాడు. ఉన్నవాళ్ళు ఎముకల్ని గంగలో కలుపుతారు. ఆపనిచేద్దామంటే తల్లి ఎముకలు లేకుండా పోయాయి. కనీసం మట్టినన్నా కలుపుదామనే ఆలోచనతో తిరుగు ప్రయాణమయ్యాడు.

వస్తూవుంటే మాలకుంట, శ్మశానం, ఊరి మధ్యలో హన్మాండ్ల గుడి చుట్టూ కోమటి దుకాణాలు, కొత్తగా వేసిన రోడ్డు, మనసులో మెదలసాగాయి. తన మనుసులోని కోరిక, ఎప్పటికి నెరవేరదని అర్థమయింది. పుస్తకాల్లో చదువుకున్నదానికి, వాస్తవ స్థితికి 'ఎంత తేడా?' అని అనిపించింది. చదువుకునే రోజుల్లో హోటళ్లో రెండు గ్లాసుల పద్ధతి ఉండేది. రెడ్డోళ్ళ రాజయ్య పోరాటంతో ఆ విధానం పోయింది. రాజయ్య తనకన్నా సీనియర్. మంచి గాయకుడు. 'అడవి తల్లకి దండాలో....' అనే పాట ఎంతో గంభీరంగా పాడేవాడు. ఆయన గొంతు తీయగా ఉండేది. అందుకే గణపతి పండక్కి ఆయనచే యువకులంతా పాటలు పాడిచ్చేవారు. ఆ రోజుల్లో ఊరి మొత్తంగా హన్మండ్లగుడి పక్కనే ఒకే గణపతి పెట్టేవారు. ఆ తొమ్మిది రోజులు ఊరంతా సందడిగా ఉండేది. రాజయ్యతో తాను కోరస్‌గా పాడేవాడు. తర్వాత కొద్దిరోజులకు అన్నల ప్రభావం రావడంతో రాజయ్యను పోలీసులు పట్టుకెళ్ళారు. యువకులంతా చందాలు పోగు చేసి ఎస్సైకి లంచమిచ్చి విడిపించుకు వచ్చారు. ఇప్పుడు వాడకో గణపతిని పెడుతున్నారు. చివరికి మాల, మాదిగ వాడలో అంబేద్కర్ సంఘం పేరున గణపతుల్ని పెడుతున్నారని బాలీరు చెపితే ఆశ్చర్యం వేసింది. అంబేద్కర్ ఉంటే ఏం చేసేవాడని అనిపించింది. మరి, 'తానేం చేస్తున్నడనే....?' మరో ప్రశ్న బుర్రలో తొలియ సాగింది. కనీసం రెడ్డీల రాజయ్య పాత్రను కూడా తాను పోషించనందుకు సిగ్గనిపించింది. తానూ, భార్య, పిల్లలు, ఉద్యోగం! ఈ ఊరి గాలి పీల్చి, నీరు తాగి, గాసం[19] తిని పెరిగిన తాను ఉద్యోగం పేరున ఎటో వెళ్ళిపోయాడు. తాను ఏమి చేయకుండా, ఊరిలో మార్పును ఆశించడం తన స్వార్థ చింతనే అనిపించింది.

జ్ఞాపకాలు సుడులు తిరుగుతుండగా సుమో బైపాస్ రోడ్డుగుండా ముందుకు సాగుతున్నది. స్కూలు మలుపు తిరుగుతుంటే మరికొన్ని జ్ఞాపకాలు ఎద నుంచి తన్నుక రాసాగినవి.

కోపం వస్తే 'నిన్ను మాలకుంట్ల పెట్ట....' అనే తిట్టు పదాన్ని ఊరి జనం ఎందుకు వాడుతారో మాదయ్యకు అర్థం అయ్యేదికాదు. తల్లిచావు దానికి అర్థాన్ని చెప్పింది. మాలకుంట్ల పెట్టడం అంటే.... బొంద పెట్టడమని ఊరి జనాలు తిట్టుకున్నపుడు మాలోల్లతో పోల్చుతారని అప్పుడు అర్థమయింది.

తండ్రితో కాదు పేర్చడానికి వెళ్ళిన జ్ఞాపకాలు, పీర్ల పండక్కి తల్లి చంకలో ఎత్తుకొని ఊర్లోకి తీసుకొచ్చినప్పుడు మెడలో వేసిన కుడకపేర్లు, బచ్చీసపేర్లు[20] వేసిన జ్ఞాపకాలు, మాలసిందోళ్ళు ఎల్లమ్మ కథ చివరి రోజున ఎల్లమ్మ వేషం వేసిన స్త్రీ ఊరిలోకి ఉరికి వచ్చిన జ్ఞాపకాలు, ఊరడమ్మ పండక్కి బైండ్ల ఇస్తారి పోత లింగయ్య దగ్గర మేకపిల్లను జముడుకంతో జోల పాట పాడిన జ్ఞాపకాలు వెంటాడుతుండగా ఊరు తెరమరుగు కాసాగింది.

## మాండలికాల వివరాలు :

1. **ఇనామ్ భూములు** – కులవృత్తులవారికి ప్రభుత్వం ఇచ్చిన భూములు
2. **జలపొలాలు** – నీటి దారలకు పండే వరి
3. **వెట్టిమడ్లు** – వెట్టి కులవృత్తుల వారికిచ్చిన భూమి (మడులు)
4. **పొదులు** – వేసవిలో చేళ్ళల్లో పశువులకై వేసే పందిళ్లు
5. **బలంత** – కులవృత్తులు చేసినందుకు పెట్టే ధాన్యం
6. **బేగరి / గాదం** – కింది కులాలవారు చేసే శవ సంస్కార వృత్తి
7. **దోపసల్** – వర్ష / వేసంగి
8. **ఆబి తాబి** – రెండు పంటలు
9. **ముస్తేదార్** – కల్లు కాంట్రాక్టర్
10. **సొదు** – సున్నపురాయి గల భూమి
11. **సందం** – శవాన్ని పూడ్చే / కాల్చే పని
12. **కాష్టం** – శవాన్ని కాల్చడం
13. **మూట** – శవానికి కట్టే గుడ్డ / అలంకరణ సామగ్రి
14. **అరీస్టం** – చెడు
15. **గోట్లు** – ముజ్జేతి వెండి కడియాలు
16. **దినాలు** – తద్దినం
17. **కుడుపు** – తద్దినంనాడు పెట్టే విందు
18. **యాట** – గొర్రె / మేక
19. **గాసం** – తిండి గింజలు
20. **బచ్చీసపేర్లు** – మిఠాయితో చేసిన దండ ✪



# కొత్తపల్లి సరళాదేవి

## 30వ వర్ధంతి (27-9-2020)

**సరళాదేవిగారు** స్వాతంత్ర్య సమరయోధులు, సేవా గ్రామంలో శిక్షణ పొంది కస్తూర్బా ట్రస్టు శాఖలలో పనిచేసి, తన 72వ ఏట 27.9.1990న మరణించారు. 2011లో వారి కుమార్తెలు వాణి, ఉమ, కుమారులు రవి, శశి, గురు, హరి తమ తల్లి జ్ఞాపకార్థం 30 వేల రూపాయలు 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి అందించారు. వారి 30వ వర్ధంతి సందర్భంగా 'ప్రజాసాహితి' సరళాదేవిగారిని గుర్తు చేసుకుంటోంది.

ప్రజాసాహితి

# రామాయణం, భారతం - చారిత్రక నేపథ్యం

- రాహుల్

**ఒకవైపు** తీవ్ర ఆర్థిక సంక్షోభం, మరోవైపు కరోనా కరాళనృత్యం మధ్య ఆగస్టు 5, 2020న అయోధ్యలో రాముడి గుడికి భూమిపూజ జరిగింది.

కాషాయరంగు కండువా, వెండి కిరీటం, పెరిగిన గడ్డంతో భారత ప్రధానమంత్రి ఓ రాజర్షిలా ఈ పవిత్ర మత కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 5 వందల ఏళ్లనాటి మసీదు స్థానంలో ఒక హిందూ దేవాలయానికి పునాది పడింది. అన్ని టి.వి.లు ప్రత్యక్ష ప్రసారం చేశాయి. పత్రికలు పతాక శీర్షికలు పెట్టాయి. హిందూశక్తులు సంబరాలు జరుపుకున్నాయి.

రాముడి గుడికి ఇదా సమయం? ఒక సెక్యులర్ స్టేట్ అధిపతికి ఇది అవసరమా? అని అడిగితే అవుననే జవాబు చెప్పాలి. చిన్నాభిన్నమైన ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే మరో దారి కానరావటంలేదు. అప్పులిచ్చే పెద్దన్న పీకల్లోతు సంక్షోభంలో కూరుకుపోయాడు. దిక్కులేని జనానికి దేవుడే దిక్కని చెప్పటం తప్ప మరో పాచిక లేదు. అదే విసిరారు. ఆకలి, దారిద్ర్యం, కన్నీళ్లకి ఓ దారి జూపారు. రాముడిని, కృష్ణుడిని మరోమారు తెరపైకి తెచ్చారు.

రాముడి పేరుతో మత ఘర్షణలు జరిగాయి. వివాదం ఏళ్లతరబడి కోర్టుల చుట్టూ తిరిగింది. రామాయణం చారిత్రకమా? పురాణకావ్యమా? ఏ కాలం నాటిది? వందల సంఖ్యలో వున్న రామాయణ గాధలలో ఏది వాస్తవం? ఏది కల్పితం? అయోధ్యలోనే, ఆ 2 ఎకరాల 77 సెంట్లలోనే రాముడు జన్మించాడనటానికి ఆధారాలేమిటి? చివరికి రెండే ప్రశ్నలు మిగిలాయి. హేతువాదమా? విశ్వాసమా? ఎన్నటికీ కలవని దారులయ్యాయి.

ఆలయమా? మసీదా? ఆరామమా? ఏది ముందు? ఏది వెనుక? అనే తర్కంలోకి వెళితే ఎన్నో చిక్కు సమస్యలు ఎదురవుతాయి. మతం మత్తుమందు లాంటిదన్నాడు కారల్‌మార్క్స్. ఆ మత్తులో ఎన్నో యుద్ధాలు, మనదేశంలోనే కాదు, ప్రపంచమంతటా జరిగాయి. రాజ్యాధికారం, ఆర్థికవనరుల కోసం జరిగిన ఈ యుద్ధాలలో గుళ్లు, చర్చిలు, మసీదులు, జైన, బౌద్ధ ఆరామాలు లక్ష్యంగా మారాయి. వీటి వెనుక వున్న వందల, వేల ఎకరాల పంటపొలాలు, వెండి బంగారాలు, వజ్ర వైఢూర్యాలు దోచుకోవటమే అసలు ఆంతర్యం. ఇందులో ఏ మతమూ తక్కువ తినలేదు. హిందువులు జైన, బౌద్ధ ఆరామాలను ధ్వంసం చేశారు. మహమ్మదీయులు హిందూ ఆలయాలను కూల్చివేశారు. క్రైస్తవులకి, ముస్లింలకి మధ్య యూరప్‌లో క్రూసేడ్ల పేరుతో యుద్ధాలు జరిగాయి. రక్తపుటేరులు పారాయి. ఇది గత చరిత్ర. ఈ చరిత్ర నుండి గుణపాఠాలు నేర్చుకోవాలి. మతాన్ని రాజ్యం నుండి వేరుచేయాలి. వ్యక్తిగత విశ్వాసంగా పరిగణించాలి. కాని అలా జరగటంలేదు. అన్ని కాలాల్లోనూ మతాన్ని స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకున్నారు. అందుకోసం చరిత్రను వక్రీకరించారు. విశ్వాసం పేరుతో మతాన్ని, దేవుళ్ళను అడ్డం పెట్టుకున్నారు.

చరిత్రను శాస్త్రీయ దృష్టితో చూడాలి. అశోకుడు, అలెగ్జాండర్ గురించి చెబుతున్నామంటే అందుకు తగిన ఆధారాలున్నాయి. పురాతత్వ శాఖ త్రవ్వకాలు, శాసనాలు, నాణేలు, ప్రాచీన చరిత్రకారుల గ్రంథాలు మనకు సాక్ష్యాలుగా నిలుస్తాయి. రామాయణాన్ని, మహాభారతాన్ని ఆ కోణంలోనే చూడాలి.

చరిత్ర గతానిది. అభిప్రాయం వర్తమానంది. 'గతానికి, వర్తమానానికి జరిగే నిరంతర సంభాషణే చరిత్ర' అన్నాడు ఇ.హెచ్. కార్. చరిత్ర ఊహల అల్లిక కాదు, అది వాస్తవాల పుట్ట. ఆ పుట్టను త్రవ్వి వాస్తవాలను వెలికితీయాలి. వాస్తవం అందరికీ వాస్తవమే. కాని దానిని విప్పి చెప్పటంలోనే విభేదాలొస్తాయి. ఉదా॥కి బుద్ధుడి అహింసా సిద్ధాంతం ఒక వాస్తవం. ఎవరూ కాదనరు. ఆ సిద్ధాంతం ఎలా ఉద్భవించింది? భిన్నాభిప్రాయాలున్నాయి. మహనీయుడైన బుద్ధుడు బోధివృక్షం క్రింద కూర్చొని తపస్సు చేయటం వలన ఆయన మదిలోకి ఆ ఆలోచన వచ్చిందని కొందరంటారు. వేదకాలంనాటి యజ్ఞ యాగాదులలోని జంతుబలులు ఆనాటి వ్యవసాయాభివృద్ధికి అడ్డంకిగా వుండటం వలన దానిని నివారించటానికి బుద్ధుడు అహింసా సిద్ధాంతాన్ని ప్రవచించాడని మరికొందరంటారు. చరిత్రను నడిపేది కొందరు వ్యక్తులా? భౌతిక పరిస్థితులా? ఇది భావజాలాల మధ్య సంఘర్షణ. ఈ సంఘర్షణే రామాయణం, భారతం నేపథ్యంపై కూడా పై చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలకు కారణమైంది.

"రామాయణంలో చెప్పబడి, ఇప్పటికీ వున్న చిత్రకోట, అయోధ్య లాంటి ప్రదేశాలను పరిగణనలోకి తీసుకున్నా రామాయణం చరిత్రాత్మకమైన అంశం కాదనేది వాస్తవం. రాముడు అయోధ్యలో వున్నాడని, పాలించాడని చెప్పటానికి పురాతత్త్వశాఖపరంగాగాని, చారిత్రకంగాగాని, ఎలాంటి ఆధారమూ లేదు (సట్టార్, ఐ.సి.హెచ్.ఆర్. మాజీ ఛైర్మన్)

"వృత్తిరీత్యా చరిత్రకారుడునైన నేను నమ్మకంపై ఆధారపడి చరిత్రను రాయటం జరగదని భావిస్తున్నాను. అలా రాసినా, చెప్పినా కట్టుకథే"

"భారత పురాతత్త్వశాఖ, ఒక హిందూ మతశాఖ ఆలయం పిల్లర్లపై ఆధారపడి వుందని వాదించారు. అయోధ్యలో త్రవ్వకాల్ని మొదట ప్రారంభించిన భారత పురాతత్త్వశాఖ మాజీ డైరెక్టర్ జనరల్ బి.బి.లాల్ వైఖరిలోని కొన్ని అంశాలపై స్పష్టతనివ్వాలి. ఆయన తన మొదటి రిపోర్టులో పిల్లర్లను గురించి అసలు ప్రస్తావించలేదు. 1988లో ఐసిహెచ్ఆర్ సెమినార్‌లో ప్రవేశపెట్టిన పేపరులో ఆయన పిల్లర్లు గురించి పూర్తిగా మౌనం వహించారు. రామాయణం చారిత్రకతపై ఇచ్చిన ఒక ఉపన్యాసంలో పిల్లర్ల ప్రస్తావన తేలేదు. కాని 1989 నవంబరులో

శిలాన్యాలు జరిగిన తర్వాత ఆయన పూర్తిగా మారిపోయారు. 1990 నవంబరులో ఆర్ఎస్ఎస్ ప్రచురించే ఒక పత్రికలో మసీదు సమీపంలో వున్న పిల్లర్ల నిర్మాణం గురించి అయోధ్యలో త్రవ్వకాలు జరిగిన 15 ఏళ్ళ తర్వాత చెప్పాడు" ('ది వైర్'లో ఇంటర్వ్యూ డి.ఎన్.ఝా ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్, ఐసిహెచ్ఆర్ మాజీ మెంబరు)

ఆర్.ఎస్.ఎస్, వి.హెచ్.పి, శివసేన లాంటి హిందూ మతసంస్థలు, పార్టీలు అయోధ్య రామజన్మభూమిపై దేశవ్యాప్తంగా పెద్దఎత్తున విస్తృతంగా విష ప్రచారం చేశాయి. అది ప్రజల సెంటిమెంటుగా, విశ్వాసంగా ప్రకటించి చరిత్ర వాస్తవాలలోకి వెళ్ళటానికి నిరాకరించాయి. దీనిని ఖండిస్తూ 1991 మే లో ఆర్.ఎస్. శర్మ, అక్తర్ ఆలీ, డి.ఎన్.ఝా, సూరజ్‌భానులు "జాతికి చరిత్రకారుల రిపోర్టు పేరుతో ఒక ప్రకటన చేశారు. వి.హెచ్.పి విషప్రచారాన్ని ఖండించారు. మశీదు ముఖద్వారం వద్దనున్న 14 నల్లరాతి స్తంభాలు అలంకారప్రాయంగా నిర్మింప బడినవేగాని పిల్లర్లు కాదని తేల్చి చెప్పారు. ఆలయ స్థలానికి చెందిన నోట్‌బుక్‌ను యివ్వమని అడిగితే భారత పురాతత్త్వశాఖ నిరాకరించింది.

సుదీర్ఘ కాలం కొనసాగిన వివాదంపై నవంబరు 9, 2019న సుప్రీంకోర్టు అంతిమ తీర్పునిచ్చింది. చరిత్ర పుటల్లోకి వెళ్లకుండా ప్రభుత్వ పన్నుల రికార్డును బట్టి వివాదగ్రస్తమైన ఆ భూమిని ఒక ట్రస్టుకు అప్పజెప్పి ఆలయం నిర్మించుకోవచ్చునని చెప్పింది.

రామాలయ నిర్మాణానికి సుప్రీంకోర్టు పర్మిషన్ యిచ్చినా, మశీదు కూల్చివేతను సమర్ధించలేదు. "కాసేపట్లోనే మొత్తం కట్టడాన్ని నేలమట్టం చేశారు. నిజానికిది సిగ్గుపడాల్సిన విషయం. మెజారిటీకి న్యాయం, క్రీడాస్ఫూర్తితో ఆడిన ఆట పేరుతో మైనారిటీల విశ్వాసాన్ని దెబ్బతీశారు." (1994 సుప్రీంకోర్టు తీర్పు)

భవిష్యత్‌లో ఇలాంటి మత ఘర్షణలు జరగకుండా వుండాలంటే నమ్మకాల్ని ప్రక్కనబెట్టి చరిత్ర పట్ల శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలి.

ప్రాచీనకాలం గ్రంథాలలో మత విషయాలు ప్రధానంగా వుంటాయి. అతిశయోక్తులతో కూడుకొని వుంటాయి. పురాణ పురుషులు దేవుళ్లను ప్రసన్నం చేసుకొని మానవాతీత శక్తులను పొందుతారు. ఇలాంటి పాత్రలు మన రామాయణ, భారతాలలోనే కాదు, గ్రీకుల ఇలియడ్, ఒడెస్సీ కావ్యాలలోనూ వున్నాయి. ఇరాక్, ఈజిప్టు, చైనాల ప్రాచీన సాహిత్యాలలోనూ వున్నాయి. ఈ ప్రాచీన కావ్యాలు, పురాణాలు, ఇతిహాసాలను యధాతథంగా చూడగూడదు. వాటిని గౌరవించాలి. అదే సమయంలో వాటిల్లోని పరస్పర విరుద్ధాంశాలను, చారిత్రక నేపథ్యాన్ని, సామాజిక పరిణామదశల్ని అధ్యయనం చేయాలి. పౌరాణిక సాహిత్యంలో తుక్కు, తాలు ఎక్కువ. ఎంత చెరిగినా దొరికే గింజలు తక్కువ. వాటిని ఇతర సాక్ష్యాధారాలతో సరిపోల్చి చరిత్రను కట్టుకథలా గాక ఒక సైన్సుగా అభివృద్ధి చేయాలి. ఉదాహరణకి మహాభారతంలో భీష్ముడు తన మరణ రహస్యాన్ని పాండవులకు చెబుతాడు. మర్నాడు యుద్ధంలో తనకు ఆఖరి రోజని తెలుసు. ఆ రోజురాత్రి తనకి నమ్మకమైన దశులని పిలుస్తాడు. వారికి ధనాన్ని ఇచ్చి రాజ్యానికి చెల్లించి దాస్యవిముక్తి పొందమంటాడు. దీని అర్థం ఏమిటి? ప్రాచీన కాలంలో బానిసత్వం వుంది. అది ఇంటి పనులకు పరిమితం. ధనం ఇచ్చి విముక్తి పొందవచ్చు. హేతుబద్ధంగా ఆలోచించాలి.

రాముడు పుష్పక విమానంలో విహరించాడంటే, ఆ కాలంలోనే మనకు ఏవియేషన్ టెక్నాలజీ వుందనుకోగూడదు. వినాయకుడికి ఏనుగు తలను అతికించారంటే, అప్పుడే మనకు ప్లాస్టిక్ సర్జరీ తెలుసునని అనుకోగూడదు. కౌరవుల నూరుగురు సంతానం కృత్రిమ సంతాన సాఫల్య విజయంగా చెప్పుకోగూడదు. ఇవన్నీ ప్రకృతి శక్తులపై మానవుల విజయాన్ని కాంక్షించేవిగా అర్థం చేసుకోవాలి.

చెడుపై మంచి గెలుపొందుతుంది. ఇది పురాణాలలో సదాసత్యంగా కనపడుతుంది. ఏది మంచి? ఏది చెడు? రాముడు బలవంతంగా సీతనెత్తుకుపోయిన రావణాసురుడిని సంహరించాడు. అదే రాముడు వేదాధ్యయనం చేశాడని శంబూకుడిని వధించాడు. వాలి, సుగ్రీవుల ఆధిపత్య పోరులో జోక్యం చేసుకొని వాలిని చంపివేశాడు. కురుక్షేత్ర యుద్ధంలో పాండవ, కౌరవులలో ఏ ఒక్కరూ యుద్ధ నియమాల్ని పాటించలేదు.

అలాగే పురాణాలలో నీతి, ధర్మం గురించి వుంటుంది. ఏది నీతి? ఏది అవినీతి? ఏది ధర్మం? ఏది అధర్మం? శ్రీరాముడి ఏకపత్నీవ్రతాన్ని కొనియాడుతాం. దశరథుడికి ముగ్గురు భార్యలున్నా, ద్రౌపదికి ఐదుగురు భర్తలున్నా అభ్యంతరాలుండవు. వర్ణానికి అత్యంత ప్రాధాన్యత వుంటుంది. వీరుడైన కర్ణుడిని సూతపుత్రుడిగా పాండవులు అవమానిస్తారు. పెళ్లిళ్లకి వర్ణం అడ్డురాలేదు. శంతనుడు మత్స్యకులానికి చెందిన గంగను, భీముడు ఆటవిక స్త్రీ అయిన హిడింబిని, అర్జునుడు యాదవ వంశానికి చెందిన సుభద్రను పెళ్లాడుతారు. శూర్పణఖని మాత్రం ముక్కు, చెవులు కోసి పంపుతారు.

నీతి, న్యాయం, ధర్మం ఏదీ శాశ్వతం కాదు. అవి కాలానుగుణంగా సామాజిక దశలను బట్టి మారుతూ వుంటాయి. వాటిని నిర్ణయించేది వ్యక్తులుగాదు, భౌతిక పరిస్థితులే. రామాయణ, భారతాలలో పితృస్వామిక, రాజ్యవ్యవస్థలో జ్యేష్టపుత్రుడిదే వారసత్వం. అక్కడనుండే కథ మొదలవుతుంది. మాతృస్వామిక గణతంత్ర వ్యవస్థలో ప్రజలే 'రాజు'ను ఎన్నుకుంటారు. స్త్రీల పరిస్థితి కూడా అంతే. పెళ్లికి ముందే గర్భవతి అయిన కుంతి, జూదంలో ఆటవస్తువయిన ద్రౌపది దయనీయమైన స్థితి మనకి తెలుసు. మాతృస్వామ్యంలో స్త్రీలకి పురుషులతో సమానంగా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలున్నాయి. రామాయణ, భారతాలలోని సంఘటనల్ని విడిగాగాక, ఆయా సామాజిక పరిణామ దశలలోని మార్పులుగా అర్థం జేసుకోవాలి.

ప్రముఖ చరిత్రకారుడు ఆర్.ఎస్. శర్మ ఇలా రాశారు. "పురాణాలలో కనిపించే సుదీర్ఘమైన వంశవృక్షాల కంటె పురాతత్త్వ సాక్ష్యాధారాలను ఎంతో ముఖ్యమైనవిగా పరిగణించాలి. పురాణ సంప్రదాయాలు ప్రకారం అయోధ్యాయాధిపతి అయిన రాముడు క్రీ.పూ. 2000 సంవత్సర కాలానికి చెందినవాడు. కాని అయోధ్యలో విస్తృతంగా జరిగిన త్రవ్వకాలలో గాని, పరిశీలనల్లో గాని ఆ కాలానికి చెందిన ఒక్క నివాసం బయటపడలేదు. అలాగే మహాభారతంలోని శ్రీకృష్ణుడు నిర్వహించిన పాత్ర ఎంతో ముఖ్యమైనది. మధురలో జరిపిన త్రవ్వకాలు క్రీ.పూ. 200 – క్రీ.శ. 300 కాలానికి చెందిన శిల్పాలెన్నో బయటపడ్డాయి. అందులో శ్రీకృష్ణుని జాడే లేదు! గతంలో వచ్చిన ప్రాచీన భారతదేశ చరిత్ర గ్రంథాలలో పురాణయుగాన్ని ఒక అధ్యాయంగా

పరిగణించేవారు. కాని ఇంతవరకు చర్చించిన కారణాల వల్ల రామాయణ, భారతాల మీద ఆధారపడ్డ పురాణయుగాన్ని తిరస్కరించక తప్పదు. కాని సామాజిక పరిణామానికి సంబంధించిన వివిధ దశల్ని రామాయణ, భారతాలలో గుర్తించవచ్చు. ఎందుకంటే ఈ గ్రంథాలు సామాజిక పరిణామంలోని ఒకే దశలో రాసినవి కావు.... అనేక సామాజిక దశలలో రాసినవి" (ప్రాచీన భారతదేశ చరిత్ర).

రామాయణ, భారతాలు ఏ కాలంనాటివి? కొందరి జవాబు వింటే విస్తుపోవాల్సిందే. రాముడి జననం క్రీ.పూ. 10-1-5114, 12:05p.m. స్థలం అయోధ్య. జీవితకాలం 10,052 సంవత్సరాలు. మహాభారత యుద్ధకాలం క్రీ.పూ. 13-10-3139 మరికొందరు చరిత్రకు దగ్గరగా జరగాలనే ఉద్దేశ్యంతో రామాయణం క్రీ.పూ. 7000, భారతం క్రీ.పూ. 5000 నాటిదంటారు.

భారత ఉపఖండంలో కొత్తరాతియుగం క్రీ.పూ. 6000 నుండి ప్రారంభమైంది. ఈ దశలో వ్యవసాయం, కుండల తయారీ ప్రారంభమైంది. కంచుయుగం హరప్పానగర నాగరికత క్రీ.పూ. 2500-1800 కాలంలోనిది. రాత వుంది కాని విప్పి చెప్పలేకపోతున్నాం. క్రీ.పూ. 1500లో ఆర్యులు సింధునదీ తీరంలోని పంజాబ్‌కి వలస వచ్చారు. ఆర్యులు వచ్చిన తర్వాతే గుర్రాలు, రథాలు, వేదాలు, సోమరసం మనకు తెలుసు. ఆర్యులు పశుపాలక తెగలు. పితృస్వామిక వ్యవస్థలో వున్నారు. సంస్కృతం వారి భాష. లిపి లేదు. ఆర్యులు గురించి తెలుసుకోవాలంటే ప్రధానంగా వేదాలపై ఆధారపడాలి.

రుగ్వేదకాలం క్రీ.పూ. 1500-1000. ఈ కాలంలో వర్ణాలు లేవు. వర్గాలు లేవు. రాజ్యవ్యవస్థ లేదు. అంతా తెగల వ్యవస్థే. సమస్యలు తలెత్తిందీ, యుద్ధాలు జరిగిందీ తెగల మధ్యనే. వర్ణం, రాజ్యం చుట్టూ తిరిగే రామాయణ, భారతాలకు ఈ కాలంలో చోటు లేదని చెప్పగలం.

కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతలం'లోని దుష్యంతుడు, శకుంతలకు పుట్టిన భరతుడి పేర 'భారతదేశం' అని పిలుస్తారని, ఆ భరతుడి సంతానమే కురువంశమని చెబుతుంటారు. గుప్తుల కాలంలో రాయబడిన ఈ నాటకానికి చారిత్రకత లేదు.

రుగ్వేదంలోని 'భరతులు' పాలక ఆర్య తెగలలో ఒకటి. మన దేశానికి వచ్చిన ఈ భరత తెగ పేరుతోనే 'భరత వర్షం' అని పిలువబడుతోంది. సింధునదీ తీరంలో వున్న ఈ తెగతో మరో పది తెగలకీ దాని నదీ జలాలపై యుద్ధం జరిగింది. ఈ పది తెగలలో ఐదు ఆర్య, ఐదు అనార్యతెగలు. రుగ్వేదంలో దీనిని దశరాజ యుద్ధం అంటారు. ఈ యుద్ధంలో సుదాసు నాయకత్వాన భరత తెగ విజయం పొందుతుంది. ఓడిన తెగలలో ప్రధానమైనది 'పురు'. కాలక్రమేణా భరత, పురు తెగలు కలిసిపోయి 'కురు' తెగగా ఏర్పడుతుంది.

మలివేదయుగం క్రీ.పూ. 1000-600 నాటిది. యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం, బ్రాహ్మణాలు ఈ కాలంలో రచింపబడినాయి. ఈ కాలంలోనే ఆర్యులు సింధునదీ తీరం నుండి గంగానదీ తీరానికి వలస వెళ్ళారు. ఇక్కడ జరిగిన పురాతత్వశాఖ త్రవ్వకాలలో 700 జనావాసాలు బయల్పడినాయి. బూడిదరంగు మట్టిపాత్రలు దొరికాయి. ఇనుము ఆయుధాలు వుపయోగించిన దాఖలాలు కనపడినాయి. బార్లీతో పాటు వరి, గోధుమ, పండించసాగారు. వ్యవసాయంతో స్థిర నివాసాలు ఏర్పడినాయి. వాటిని 'జనపదాలు' అంటారు. చేతివృత్తులు, శ్రమవిభజనకి దారితీసింది. ఈ విభజన ప్రాతిపదికపై బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు ఏర్పడినాయి.

బ్రాహ్మణులు బోధకులు - వేదాలు వల్లిస్తారు. యజ్ఞ, యాగాదులు, జంతుబలులు నిర్వహిస్తారు. అందుకు దానాలు పొందుతారు. క్షత్రియులు తెగల రక్షకులు, పాలకులు - యుద్ధాలు చేస్తారు. తెగ నాయకుడిని 'రాజు' అంటారు. సభ, సమితి అనే తెగల సంస్థల అజమాయిషీలో అన్ని వ్యవహారాలు జరిగేవి. వైశ్యులు వ్యవసాయం చేస్తారు. చేతి పరిశ్రమలులో పాల్గొంటారు. శూద్రులు పై మూడు వర్ణాలకి సేవలు అందిస్తారు. వైశ్యులు, శూద్రులు శారీరక కష్టం చేస్తారు. సంపదలు సృష్టిస్తారు.

క్రీ.పూ. 600లో ఇనుప పనిముట్లు గంగా తీరంలోని బీహార్ ప్రాంతంలో విరివిగా ఉపయోగంలోకి వచ్చాయి. బీహార్‌లోని ఇనుము గనులు నుండి పెద్దయెత్తున ఈ ఖనిజం లభ్యమైంది. ఇనుప కర్రునాగలి, గొడ్డలితో ఉత్పత్తిశక్తులు గొప్ప ముందడుగు వేశాయి. గంగానదీ తీరంలోని అడవుల్ని నరికి మైదానాలుగా పంటభూములుగా మార్చివేశారు. చేతివృత్తులు అభివృద్ధి చెందాయి. వైశ్యుల, శూద్రుల శారీరక కష్టంతో సంపదలు సృష్టింపబడినాయి. ఈ ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొనని బ్రాహ్మణులు, క్షత్రియులకు మిగులు సంపదను జేరవేయాలి. రాజ్యవ్యవస్థ పుట్టింది అదే 'మహా జనపదం'. ఇలాంటివి 16 వచ్చాయి. కురు, పాంచాల మహాజనపదాలే గాని ఆ తెగలకి పూర్వ వైభవంలేదు. మిగిలినవి కాశి, కోసల, గాంధార, అంగ, చేది, వర్సి, మగధి, అవంతి, మొదలైనవి. ఈ పేర్లన్నీ మహాభారతంలో, రామాయణంలో వున్నాయి. అంగరాజు, కర్ణుడు, గాంధారరాజు, శకుని, చేదిరాజు శిశుపాలుడు, కోసల, అయోధ్య రాముడిది. ఈ రాజ్యాల పేర్లను పురాణాలలో వాడుకున్నారు. ఇక్కడీమాట చెప్పాలి. అయోధ్య రాముడి రాజధాని. క్రీ.పూ. 6వ శతాబ్దంకి పూర్వం అక్కడ జనావాసాలు లేవని పురాతత్వ ఆధారాలు చెబుతున్నాయి.

మహాభారతంలోని ఇతిహాసం అతి ప్రాచీనమైనది. వ్యాసుడిచే రాయబడినదిగా చెబుతున్న భారతం క్రీ.పూ. 1000 నుండి క్రీ.శ. 400 వరకు జరిగిన సామాజిక పరిణామ దశలకు అద్దం పడుతుంది. అందులో వర్ణాలు, గంగా మైదానానికి పయనం, ఇనుము వాడకం, అటవీదహనాలు, వ్యవసాయం, నగరాలు, మహాజనపదాలు, వాటి మధ్య యుద్ధాలు మన కళ్ళముందు కదలాడినట్లుంటాయి. ఈ ఇతిహాసం 8800 శ్లోకాలతో ప్రారంభమైంది. 'జయం' అనిపిలిచేవారు. తర్వాత 24 వేల శ్లోకాలతో భారతం అయింది. చివరికి 1 లక్ష శ్లోకాలతో మహాభారతమైంది.

వాల్మీకి రాసిన రామాయణం 6000 శ్లోకాలతో వుండేది. అది 12 వేలకి, చివరికి 24 వేలకి పెరిగింది. మహాభారతం తర్వాతనే రామాయణం వచ్చింది. అది క్రీ.పూ. 5వ శతాబ్దంలో ప్రారంభమై దశదశలుగా పెరుగుతూ క్రీ.శ. 12వ శతాబ్దానికి పూర్తయింది.

మలివేదయుగం నుండి గుప్తులు కాలం వరకు, తెగల వ్యవస్థ నుండి నగర రాజ్య వ్యవస్థ వరకు అనేక దశలను భారత, రామాయణాలలో మనం చూడగలం.

ఇతిహాసాలన్నీ మన రామాయణం, భారతమైనా, గ్రీకుల ఇలియడ్, ఒడెస్సీలైనా జానపద పాటలుగానే ప్రారంభమైనాయి. జానపదాలు ఆనోటా ఆనోటా ఊళ్లన్నీ పాకుతాయి. భరతుల నుండి కురు, పాంచాల వంశాల గాథలు, భారత యుద్ధ నోటిమాటగా, జనంపాటగానే మొదలైంది. తర్వాతి కాలంలో కథాబోధకులు, ఆస్థానకవులు అందుకున్నారు. తరతరాలుగా బహురంజకమైన వాక్యంగా ప్రజాదరణ పొందింది. ఎందరో రాజులు తమ పాత్రలను అందులో జొప్పించాలని ఉబలాట పడ్డారు. బ్రాహ్మణ పండితులు వారి కోరికను తీర్చారు. అలా ఆ కథ ఇంతింతై పెద్ద ఇతిహాసంగా మారింది. పల్లె జనం నుండి ప్రారంభమైన జానపదం బ్రాహ్మణ క్షత్రియుల బందీ అయింది. చిలవలు పలవలుగా చేసి బ్రాహ్మణులు వర్ణాశ్రమ ధర్మాల్ని, స్త్రీ పాతివ్రత్య మహిమలను, పితృస్వామ్యాన్ని, సొంత ఆస్తి పవిత్రతను, రాజ్యవ్యవస్థ రూపురేఖలను సందర్భానుసారంగా రామాయణ, భారతాలలో జేర్చి తమదైన సంస్కృతిని జనం నరనరాన ఎక్కించారు.

ఒకానొక కాలంలో బహుభర్తృత్వం అంగీకారమే. ద్రౌపదికి ఐదుగురు భర్తలు. గుప్తులు కాలంనాటికి అది అనాచారమేకాదు, అసహ్యం కూడ. ఈ చిక్కుముడిని విప్పటానికి ఒక కొత్త కథ అల్లారు. ధనుర్విద్యలో ప్రవీణుడైన అర్జునుడు మత్స్యాన్ని ఛేదించి ద్రౌపదిని గెలిచి అన్నదమ్ములతో ఇంటికొస్తాడు. తల్లి కుంతితో ఒక పండు పట్టుకొచ్చానని చెబుతాడు. విషయం తెలియని ఆమె ఐదుగురూ సమానంగా పంచుకోండి అంటుంది. తల్లి మాట జవదాటలేక ద్రౌపదిని పంచ భర్తృకని చేశారు. శివుడ్ని ద్రౌపది 5 గుణాలున్న భర్త కావాలని కోరుకుంటుంది. అవన్నీ ఒకరిలోనే వుండవు గనుక 5గురు భర్తల్ని యిచ్చినాడని శ్రీకృష్ణుడు సమర్థిస్తాడు. పాతకాలంనాటి ధర్మాలకి కొత్త విలువలను ఆపాదించే ప్రయత్నం ఇది.

కురుక్షేత్ర యుద్ధానికి దాఖలాలు లేవు. ఆ కాలానికి విలువిద్యే గొప్పది. యుద్ధాలలో పెద్దయెత్తున్న అశ్విక దళాలను వుపయోగించటం, లక్షల సంఖ్యలో సైనికులు పాల్గొనటం మనకు తెలిసినంతవరకు పకార్యుల కాలంలోనే జరిగింది. మహాభారతంలోని కురుక్షేత్ర యుద్ధంలో సుమారు 50 లక్షల మంది చనిపోయారని రాశారు. ఒక లక్షా ముప్పైవేల రథాలు, అంతే సంఖ్య గల ఏనుగులు, అంతకు మూడింతల ఎక్కువగా యుద్ధ గుర్రాలు పాల్గొన్నాయని చెప్పారు. అంటే మొత్తం సైన్యం ఎంత వుంటుందో ఊహించండి. ఇంతమందితో యుద్ధం జరిగిందంటే అప్పటి జనాభా 20 కోట్ల పైనే వుండి వుండాలని ప్రఖ్యాత చరిత్రకారుడు కొశాంబి అంచనా వేశాడు. బ్రిటిష్ రాజ్యానికి ముందు అంత జనాభా మనకు ఖచ్చితంగా లేదు. అతిశయోక్తులకు ఆకాశమే హద్దు.

పురాణాలు, ఇతిహాసాలలోని సంఘటనలు, న్యాయ, ధర్మాలు, నీతి నియమాలు, కాలానుగుణంగా సామాజిక పరిణామంలో ఎలా రూపుదిద్దుకుంటాయో, మతం, భావజాలం కూడ అదే బాటలో నడుస్తాయి. ఇనుము రాకతో వ్యవసాయం, వ్యాపారం, చేతివృత్తులు అభివృద్ధి చెందాయి. వైదిక ఆచారాలు, సంప్రదాయాలు ఈ కొత్త ఉత్పత్తిశక్తులు ముందడుగు వేయటానికి ఆటంకంగా వున్నాయి. ఈ అడ్డుగోడలను తొలగించాలి. అందుకు నూతన మతం, భావజాలం రావాలి. జైన, బౌద్ధమతాలు ఉద్భవించాయి. వ్యవసాయంలో, వ్యాపారంలో రాబడి పన్నుల రూపంలో ఖజానాలు నిండటంతో, పాలకులైన క్షత్రియులు ఈ కొత్త మతాల్ని స్వాగతించారు. మగధ, మౌర్య సామ్రాజ్యంలో క్షత్రియులకు అధికారం బలపడింది. యజ్ఞయాగాదులు, బలులు నిషేధించటంతో బ్రాహ్మణుల ఆదాయం, గౌరవం తగ్గాయి. ఇది వారికి కోపకారణమైంది. అశోకుడి తర్వాత శుంగవంశీయులు, శాతవాహనులు, గుప్తులు, దక్షిణాదిన చోళులు, పాండ్యులు రాజ్యమేలారు. ఈ కాలంలో బ్రాహ్మణులు తమ ఆధిపత్యాన్ని పునఃప్రతిష్టించుకున్నారు.

బుద్ధుడి పునర్జన్మ, కర్మసిద్ధాంతం బ్రాహ్మణులకు కలిసి వచ్చింది. దుఃఖానికి మూలం గత జన్మల పాపఫలితమని, ఈ జన్మలో మంచి కర్మలను చేయటం ద్వారా నిర్వాణం పొందవచ్చని బుద్ధుడు అన్నాడు. నిర్వాణం అంటే జన్మరాహిత్యం. జన్మరాహిత్యం అంటే మోక్షం. ఇది వైదికులకి వజ్రాయుధమైంది. ఆత్మ పరమాత్మలో లీనమవ్వటమే అంతిమ లక్ష్యం. అందుకు కర్మలను ఆచరించాలని అప్పటికే ఉపనిషత్తులు కూడా చెప్పాయి. వైదికమతం పాము కుబుసం విడిచినట్లు కొత్తరూపం దాల్చింది. హిందూమతంగా మారింది.

కొత్త దేవుళ్లు వచ్చారు. వైదిక యుగంలో ఇంద్రుడు తిరుగులేని దేవుడు. కాని ఆ యుగం యజ్ఞయాగాదులు, జంతుబలులకు పరిమితం. ఇబ్బడిముబ్బడిగా ఆదాయాన్నిచ్చే వ్యవసాయం అభివృద్ధి చెందాలి. అది అందించే అదనపు ఉత్పత్తి పాలకవర్గాలకి జేరాలి. కొత్తమతం అందుకనువైన కొత్త దేవుళ్ని సృష్టించింది.

వైదిక యుగంలో కృష్ణుడెవరో తెలియదు. భారత, భాగవతాలలో వైష్ణవ అవతారం విశ్వరూపం దాల్చింది. క్రీ.పూ. 2వ శతాబ్దంలో విష్ణువును నారాయణుడనే అవైదిక దేవుడితో కలిపేశారు. అతడిని ‘భగవత్’ అని, అతని అనుచరులను ‘భాగవతులు’ అని పిలిచారు. పశ్చిమ భారతదేశంలో వుండే ‘వృష్టి’ తెగ నాయకుడైన కృష్ణ – వాసుదేవుడిని విష్ణువులో ఐక్యం చేశారు. (ఆర్.ఎస్. శర్మ)

మహాభారతాన్ని కృష్ణుడు ప్రధానంగా తిరగరాశారు.

కృష్ణుడు పశుపాలకుడు. పశుపాలక తెగల్ని కృష్ణుడి పేరుతో వ్యవసాయంలోకి దింపారు. బలరాముడికి ‘నాగలి’నిచ్చారు. ఇనుప యుగంలో అడవుల్ని నరికి వ్యవసాయ భూములుగా మార్చాలి. ఇందుకు అడవులలో నివసించే గిరిజన తెగలు అడ్డొచ్చాయి. రెండే మార్గాలు. ఒకటి : గ్రీస్, మెసపొటేమియా, రోమ్‌లలో లాగ సమూలంగా వారిని నిర్మూలించటం. రెండు : వారిని సాంస్కృతికంగా మార్చి తమవైపు త్రిప్పుకొని వ్యవసాయానికి మళ్లించటం. ఇది రక్తం పారించే యుద్ధంగాదు. మానసికంగా బానిసలను చేసే సాంస్కృతిక దాడి.

కృష్ణుడికి మరిన్ని రూపాలనిచ్చారు. ఆటవిక తెగలకి కూడ దేవుడ్ని చేశారు. అగ్రవర్ణాల దేవుళ్లకి గిరిజన దేవతలనిచ్చి పెళ్లిళ్లు చేశారు. కృష్ణుడికి వేలాది భార్యలను కట్టబెట్టారు. మన నర్సింహస్వామికి చెంచులక్ష్మి, భీముడికి హిడింబను యిచ్చారు. రామాయణంలో వాలి, సుగ్రీవులు, హనుమంతుడు, భారతంలోని ఘటోత్కజుడు ఆటవిక తెగలకి చెందినవారే. వారిని తమ బంట్లుగా త్రిప్పుకున్నారు. శబరి కథ వాల్మీకి రామాయణంలో లేదు. తర్వాత చేర్చబడిన ఒక ఉపకథ. ఆటవిక తెగలన్నిటికి నాగుపాము దేవుడు. వారిని ‘నాగులు’ అని

కూడ అంటారు. ఆ నాగుపాము విష్ణువుకి పాన్పు అయింది. శివుడి మెడలో హారమైంది.

గుప్తుల కాలంలో బ్రాహ్మణుల నూతన మత భావజాలం సేవలకి పరవశులైన గుప్తులు భూదానాలు చేశారు. అవి ఎక్కువగా అటవీ భూములు, బంజర్లు. ఆ భూములను సాగుచేయటానికి ఆటవికులను వ్యవసాయంలోకి దింపారు. వారికి బ్రాహ్మణులు పంచాంగం చెప్పారు. ఋతువుల ప్రాముఖ్యతను బోధించారు. తిథి, నక్షత్రాలు చూసి భూములను దున్నించారు. పంటలను తమ ఇళ్లకు తోలించారు. గిరిజన పండుగలను వ్యవసాయ పండుగలుగా మార్చి శాస్త్రోక్తంగా చేయించారు. దానాలు పొందారు. గిరిజన తెగలను వర్ణవ్యవస్థలోకి తీసుకురావాలి. నాలుగు వర్ణాల వ్యవస్థ ఇందుకు సరిపోదు. వర్ణం కులవ్యవస్థగా మారింది. వేలాది ఆటవిక తెగలు కులాలుగా రూపొందాయి.

ఈ సమాజం ఇలాగే సజావుగా సాగాలంటే దీనికో తార్కిక ముగింపునివ్వాలి. ఇది అందరి సమాజంగా గుర్తింపు పొందాలి. దీనిలో రాజ్యవ్యవస్థ, వర్ణవ్యవస్థ కీలకం.

రాజ్యవ్యవస్థ ఎలా వుండాలో కౌటిల్యుడు అర్ధశాస్త్రంలో చెప్పాడు. వర్ణవ్యవస్థను ఎలా కాపాడుకోవాలో మనువు మనుస్మృతిలో చెప్పాడు. దీనికి ఒక తాత్విక ముసుగు వేయాలి. భగవద్గీత పుట్టింది. ఎవరి ధర్మాన్ని వారు ప్రతిఫలాక్ష లేకుండా ఆచరించాలి. ఈ జన్మలో నీవు చేసిన కర్మఫలాన్ని వచ్చే జన్మలో అనుభవిస్తావు. అంటే ఈనాటి కన్నీళ్లు, కష్టాలకు తలొగ్గితే, వచ్చే జన్మలో సుఖాలు దక్కుతాయి. క్షత్రియుడి రక్తసంబంధం కంటె రాజ్యమే ముఖ్యం. అందుకు అవసరమైతే యుద్ధం చేయి. రక్తసంబంధాలకు ఇక్కడ తావులేదు. ఇలా కృష్ణుడు అర్జునుడికి చెప్పి ఒకనాటి తెగల రక్తసంబంధాల్ని చావుదెబ్బ కొట్టాడు. రాజ్యవ్యవస్థను, వర్ణవ్యవస్థను అన్నిటికి మూలం చేశాడు. ఈ సందేశం సాధారణ ప్రజలకి చేరాలి. ఎలా? రామాయణ భారతాలను అందరూ వినవచ్చు. శూద్రులతో సహా. వేదాలకున్న నిషేధం లేదు. పనిలోపనిగా పాతివ్రత్యం మహిమలు తెలుసుకోవాలనేమో, స్త్రీలు కూడా వాటిని పారాయణం చేయవచ్చు అన్నారు. ఇంటింటికీ రామాయణం, భారతం చేరాయి. మతం, కులం, రాజ్యం గీచిన గీత ఈనాటికీ పదిలంగా వున్నాయి. ✪

కవిత

# చిలకలు వాలని చెట్టు

- కె. భాను మూర్తి

**తూరుపు** తెల వారక ముందే
సూర్యుడు పొద్దు పొడవక ముందే
ముఖానికి ఇంత పసుపు పులుముకొని
నుదుటన ఇంత సింధూరం అద్దుకొని
రంగురంగుల సీతాకోకచిలుకల కోసం
తనని తాను సింగారించుకుని
సిద్ధ పరుచుకుంటుంది మా ఊరి బడితల్లి

గుంపులు గుంపులుగా
వచ్చే నును వెచ్చని కిరణాల కోసం
భుజాలకతుక్కొని జట్లు జట్లుగా
వచ్చే పూల గుత్తుల గుబాళింపుల కోసం
ఎదురుచూస్తోంది మా ఊరి చదువులమ్మ

ఏ శిశిరం కాటేసిం దొ
ఏ వేరు పురుగు తొలిచేసిందో
ఇప్పుడు మా ఊరి బడి
చిలకలు వాలని చెట్టయ్యింది.

నాలుగు నెలలయ్యింది.
నాబడి ముఖాన నవ్వు లేదు
నోట మాట లేదు
నల్లబల్లపై వెలుగుపూల పూత లేదు
ప్రపంచానికి ప్రభాత భేరిలా
గణ గణ గణ గణ మోత లేదు
వంద గొంతులు ఒక్కటై పలికే
ఏక కేంద్రక నాదం
జనగణమన గీత లేదు.


ఇప్పుడు నా చదువుల తల్లి
సీతాకోక చిలుకలు ఎగరని తోటయింది.

ఏ కుబుసం కప్పేసిందో
ఏ గ్రహణం కమ్మేసిందో
ఇప్పుడు నాబడి
అనకొండ నోట చిక్కిన కుందేలు అయ్యింది.

తల్లి నుండి తప్పిపోయిన లేగదూడలు
ఎక్కడున్నాయో!,ఎలా తల్లడిల్లుతున్నయో
ఆ తప్పటడుగులు మళ్ళీ ఎప్పుడు
ఈ తల్లి గుండెలపై నాట్యం చేస్తాయో!
ఆ లేత పెదవులు మళ్ళీ ఎప్పుడు
ఈ తల్లి పాదుగు పాడుస్తూ కుడుస్తాయో!

కాసుల వేటలో
ఏ కార్పోరేటు
కుట్ర ఇది
ఆధిపత్య పోరులో
ఏ పెట్టుబడి సృష్టించిన మహమ్మారి ఇది
సమస్త మానవ జాతిని
కలుగులో కుక్కేసిన
ఏ వికృత క్రీడ ఇది.

ఈ ప్రశ్నల జవాబుల కోసమయినా
నా బడి తల్లి తెరుచుకోవాలి.
నల్లబల్లపై జవాబుల
వెలుగుపూలు పూయించాలి ✪



# కరోనా

- డా॥ జశ్వంతరావు

**పెట్టుబడిదారీవిధానం,** సామ్రాజ్యవాదం కరోనా వంటి అంటువ్యాధులు పుట్టడానికీ, విస్తరించడానికీ మూలకారణం. లాభాపేక్షే ఏకైక లక్ష్యంగా అది సాగిస్తున్న విధ్వంసం – జల, వాయు కాలుష్యం, ప్రకృతిలోని సమతుల్యతను దెబ్బతీయటం, జీవజాలం నశించిపోవటం, కొన్ని విపత్కర పరిస్థితుల్లో జీవం రూపాంతం చెందటం – ఈ ప్రక్రియలో భాగమే కరోనా వైరస్ పుట్టుక.

కరోనా వంటి అంటువ్యాధులు ప్రబలకుండా నిరోధించడానికి కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ ఆటంకంగా వుంది. కరోనా వైరస్‌ను చైనా వైరస్‌గా పేర్కొంటూ అమెరికాకేమీ కాదంటూ ట్రంపు చూపిన నిర్లక్ష్యం వ్యవస్థాగతమైనది. కరోనా వల్ల దెబ్బతినే పరిశ్రమల నుండి వేల కోట్ల డాలర్ల లాభాలను రాబోయే పరిశ్రమల్లోకి తరలించుకునేందుకు వీలుగా ట్రంపు ప్రజలను తప్పుదారి పట్టించాడు. ఇలా పెట్టుబడి తరలింపులో సెనెటు సభ్యులే వున్నారంటే ప్రజారోగ్యంకన్నా లాభాలే ముఖ్యం.

మధ్య ఆసియాలో మొదటిగా, ఆ మాటకొస్తే చైనా బయటి దేశాలలో కరోనా వచ్చిన దేశంగా ఇరాన్ వుంది. ఇరాన్‌పై ఆంక్షలు విధించటంతో కనీస ఔషధాలను దిగుమతి చేసుకోలేక 5 లక్షల మంది పిల్లలు ఇంతకు ముందే మరణించారు. ఈ దుస్థితిలో కరోనా వచ్చి, ఇరాన్‌లో ప్రజలు వైద్యం కూడా అందక చనిపోయారు. అక్కడి నుండి మధ్య ఆసియా, ఉత్తర ఆఫ్రికా దేశాలకు కరోనా విస్తరించింది. అమెరికా గత 20 ఏళ్లుగా ఈ ప్రాంతంలో సాగిస్తున్న దురాక్రమణల ఫలితంగా ఈ దేశాలు ప్రజలకు తగినంతగా వైద్య సౌకర్యాలు అందించలేని స్థితిలో వున్నాయి.

సామ్రాజ్యవాద అమెరికాలోని 50 రాష్ట్రాలలో కరోనా వచ్చిన తర్వాత యూరపు దేశాలన్నిటా వ్యాప్తి చెందిన తర్వాత మాత్రమే మొదట ఆసియా నుండీ తర్వాత యూరపు నుండి విమానాల రాకను ట్రంపు నిషేధించాడు. చైనా, ఆసియా దేశాల వ్యతిరేకంగా వదరుబోతుతనం చూపాడు. ఫలితంగా అక్కడ స్థిరపడిన ఆసియా దేశీయులపై ద్వేషం పెరిగింది; దాడులు సాగుతున్నాయి. తన తిరోగమన కాందిశీక విధానానికి అనువుగా పరిస్థితిని వినియోగించుకుంటున్నాడు.

వ్యాధి నిరోధక చర్యగా సోషల్ డిస్టెన్స్‌ని సూచిస్తున్నారు. కరోనా వ్యాప్తిని ఆపటానికది అవసరమే. అయితే దానినమలు జరపడానికి పెట్టుబడి వ్యవస్థే ప్రధాన, మొదటి ఆటంకం. అమెరికాలో 78 శాతం మంది వారం, వారం అందే వేతనంతోనే జీవిస్తారు. వారం చివర జీతం అందకపోతే, తినడానికుండదు; ఇంటినుంచి గెంటివేయబడతారు. 404 కోట్ల అమెరికా ప్రజలకు ఆరోగ్యభీమా లేదు. ఈ అంటువ్యాధి ట్రీట్‌మెంట్ ఖర్చు మీరంటే మీరు భరించాలన్న వివాదం ఇంకా అమెరికాలో తెగలేదు. పశ్చిమ యూరపు దేశాలలో ప్రజల పరిస్థితీ యిదే.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని పేద దేశాల పరిస్థితి మరింత దుర్భరంగా వుంది. నయా ఉదారవాద విధానాలతో ఈ దేశాలన్నిటా వైద్య, ఆరోగ్యరంగాలను సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థలు ప్రైవేటీకరింపజేశాయి. వైద్య, ఆరోగ్యరంగాలు ఇంకా ప్రభుత్వరంగంలో వున్న దేశాల్లోనే ప్రజలకు తగిన వైద్య సహాయం అందుతున్నది. చైనా, ఉత్తర కొరియా, మధ్య ఆసియా దేశాలు, సామ్రాజ్యవాద దోపిడీ ఆధిపత్య విధానాలే పేద దేశాల ప్రజల మరణాలకు కారణం.

భారతదేశపు పరిస్థితి దీనికి భిన్నంగా లేదు. అసంఘటిత రంగంలోని 84 శాతం శ్రామికులు ప్రతిరోజూ పనిచేయకపోతే ఆకలితో పడుకోవాల్సిన స్థితి. సోషల్ డిస్టెన్స్ అన్నది గ్రామాలలో అమలు కావచ్చును గానీ, విదేశాల నుండి వ్యాధి దిగుమతికి కేంద్రాలుగా వున్న దాదాపు 10 మహానగరాలలో అమలుజరపడం దాదాపు అసాధ్యం. ఈ నగరాలలో దాదాపు సగం జనాభా మురికివాడలుగా గుర్తించినా, గుర్తించకపోయినా అదే స్థితిలో వున్న బస్తీలలో బ్రతుకు లీడుస్తున్నారు. నాలుగు మహానగరాల్లో 10×10 అడుగుల గదిలో ఒక కుటుంబం నివశించే స్థితిలో సెల్ఫ్ ఐసొలేషన్ అన్నది అసాధ్యం. ఈ స్థితిలో వ్యాధి వ్యాప్తి నిరోధానికి సోషల్ డిస్టెన్స్, సెల్ఫ్ ఐసొలేషన్ వంటి విధానాలను ప్రతిపాదించి అమలుచేయమని పిలుపునివ్వటం తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకుని ప్రజలపై నెపాన్ని మోపే ప్రయత్నమే.

కరోనా వ్యాప్తి నిరోధానికి సోషల్ డిస్టెన్స్ తప్పనిసరి అయినప్పుడు దానికి తగిన చర్యలు తీసుకోవాలి. లాక్‌డౌన్‌కు ప్రధానంగా గురయ్యేది పేదవర్గాలే. వారి రోజువారీ అవసరాలను తీర్చేందుకు తగిన ఏర్పాట్లను చేయాలి. అది లేకుండా సెల్ఫ్ ఐసొలేషన్ పాటించమంటే పస్తులతో గడపమని చెప్పటమే. తాము వాగ్దానం చేసిన ప్రజాకర్షక పథకాలనే సంపూర్ణంగా అమలుచేయలేని పాలకులపై నమ్మకంలేని ప్రజలు తమ ప్రయత్నాలలో తామున్నారు. దీనిని పాలకులు సీరియస్‌గా తీసుకున్నారు. ప్రజలు పట్టించుకోవటంలేదు అన్నట్లుగా మీడియా చిత్రిస్తున్నది.

ఈ విపత్కర పరిస్థితినెదుర్కోవటానికి మనకున్న మార్గం ఒక్కటే, ప్రజల సమైక్యశక్తి. దీనిని వెలికితీస్తే ప్రజలు ఆ విపత్కర పరిస్థితిని అధిగమిస్తారు. మానవ చరిత్ర దీనినే నిరూపించింది.

అయితే దోపిడీవ్యవస్థకు, దోపిడీదారులకు, పాలకవర్గాల నేతలకు ప్రజల సంఘటితశక్తంటే వణుకు పుడుతుంది. తామే రక్షకులమన్న తీరులో విధానాలు తయారుచేస్తారు. ప్రజల చొరవకు అవకాశం లేకుండా చేస్తారు.

**(మార్చి 2020లో రాసిన వ్యాసం)** ❂

# వలస 'దుఃఖ' భారతం

## (డా॥ జి. వి. కృష్ణయ్య 'వలస భారతం' దీర్ఘ కవితపై సమీక్షా ప్రసంగం)

– డా॥ ఎ. కె. ప్రభాకర్

**డా॥ జి. వి. కృష్ణయ్య** 'వలస భారతం' దీర్ఘ కవిత చదువుతుంటే నాకు పిల్లలు పాడుకునే రెండు పాటలు గుర్తొచ్చాయి.

ఒకటి : 'రింగా రింగా రోజెస్ … … … వి ఆల్ ఫాల్ డౌన్'

రెండు : 'ఎంతెంత దూరం … కోసెడు కోసెడు దూరం …'

ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ 19 కారణంగా చనిపోతున్నవాళ్ళని చూసినపుడు మొదటి పాట, దేశంలో అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కోట్లాది మంది కార్మికులు రోడ్డున పడ్డప్పుడు రెండో పాట గుర్తుకు రావడం సహజమేనేమో! సాధారణంగా రహదారులు 'నాగరికత'కు ప్రతీకలు అంటారు. కానీ కరోనా కాలంలో రోడ్లు అనాగరికతకూ, అమానవీయతకూ పాదులుగా తయారయ్యాయి.

దూరదృష్టి లేని  పాలకుల నిర్వాకం వల్ల దేశమంతటా అకస్మాత్తుగా లాక్‌డౌన్ విధించడంతో కోట్లాది కార్మికులు ప్రాణభయంతో యింటి ముఖం పట్టారు. మట్టికాళ్ళతో, వొట్టికాళ్ళతో, ఆకలిదప్పులతో, గమ్యం లేని దారుల్లో మండుటెండలో కరిగిన తార్రోడ్ల మీద రైలు పట్టాల మీద వందల వేలు మైళ్ళు నడవటానికి సిద్ధపడ్డారు. భద్రజీవులు విశ్రాంతివర్గం యిళ్ళల్లో నీడపట్టున సురక్షణ సూత్రాలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటుంటే శ్రమజీవులు బజారు పాలయ్యారు. 70 ఏళ్ళకి పైగా స్వాతంత్ర్య ఫలాలివి. పెట్టుబడి సమాజపు క్రూర పరిహాసానికి తార్కాణం యిది.

పసిబిడ్డలు, బిడ్డల తల్లులు, వృద్ధులు నెత్తిన తట్టా బుట్టా పెట్టుకుని వేసిన నెత్తుటి పాదముద్రలతో రోడ్లు రక్తనదులయ్యాయి. నెలలు నిండిన స్త్రీలు రహదారుల్లోనే ప్రసవించారు. మరణించిన తల్లి శవంపై పడి శిశువులు స్తన్యం కోసం రోదించారు. ఈ వలస విషాద పాపం పాలకులదే. పాలకుల అభివృద్ధి మంత్రం ఎన్ని అపస్వరాల వూకదంపుడు పాటో తెలిసిపోయింది.

కోట్లాదిమంది శ్రమజీవులు రోడ్లమీదికి రావడంతో దేశం యావత్తూ నిలిచిపోయింది. సమస్తం స్తంభించిపోయింది. అన్ని పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. రవాణా సౌకర్యం లేదు. వారు గమ్యస్థానాలకు చేరేందుకు ఖర్చు ఎవరో వొకరు భరించాలి కదా! ప్రభుత్వాలు పట్టించుకోలేదు, పనికి పెట్టుకున్న యజమానులు పట్టించుకోలేదు. కాంట్రాక్టర్లు కనపడకుండా పోయారు. జీతభత్యాల్లేవు. రోజు గడవదు. పొయ్యిలో పిల్లి లేవదు. పుట్టిన వూరు పిలుస్తోంది. కాబట్టే అక్కడ్నుంచి బయలుదేరాల్సి వచ్చింది. కరోనాకు చచ్చిపోతావు తండ్రీ అంటే, కరోనాకు కాదు ఆకలికి చచ్చిపోతామన్నారు. ఆకలి చావుకంటే ఈ కరోనా గొప్పదేంకాదు. ఇటువంటి చావులు అనేకం చూశామని చెప్పి వాళ్ళు కదులుతూనే వున్నారు. ఎవరూ వీరి బాధ పట్టించుకోలేదు, ఎవరు పట్టించుకున్నారంటే – 'ఒక నీటిపంపు దాహం తీర్చింది / ఒక చెట్టుకొమ్మ నీడనిచ్చి సేదతీర్చింది…. చాకిరితో ఆకలి తీర్చుకున్న చేతులు / చేతులు చాపి ఆర్ద్రంగా అర్థించాయి'.

వర్తమాన సమాజంలో వలసల సమస్య అసమాన అభివృద్ధి వికృత ఫలితమే అని డాక్టర్ జి.వి.కృష్ణయ్య భావించాడు. దేశంలో గిడసబారిన అభివృద్ధి, సంపద పంపిణీలో అసమత్వం ఆయన్ని కలచి వేశాయి. 'జీవిత గమనంలో తారసపడి హృదయాన్ని స్పృశించి ఘర్షణ రేపిన ఘటనలూ, మనసులో చెరిగిపోని సన్నివేశాలూ, పత్రికల్లో వార్తలూ, దూరవాణిలో దృశ్యాలు, ఆర్థిక అసమానతలూ, అశాంతి, మరెన్నో అనుభూతులు మనసులో గుచ్చుకున్నపుడు మనిషిగా స్పందించాను, రచయితగా అక్షరీకరించాను' అంటాడు. వలస భారతం దీర్ఘకావ్యం ఆ క్రమంలోనే వెలువడింది. కావ్యం పొడవునా యీ మానవీయ స్పందనే కనబడుతుంది.

మనిషిమీద నమ్మకాన్ని వదిలేస్తున్న తరుణంలో …
మనిషికోసం మనిషి గాక
మనిషికి మనిషే పోటీగా మసలుతున్న సమాజంలో
ఒక్కరికోసం పదుగురు
పదుగురికోసం ప్రతిఒక్కరు

అంటూ కష్టకాలంలో కవి కష్టజీవికి రెండు వైపులా నిలబడితే – ఆకలితీర్చిన ఆశ్రయమిచ్చిన చెప్పులు తొడిగిన దయామయులు కొందరు అండగా నిలిచారు!

ఇటువంటి దీర్ఘ కవితల్లో ప్రతి ఖండికలో / అధ్యాయంలో రచయిత తన దృక్పథాన్ని చెప్పాలి. దృక్పథపరమైన కంటెన్యుటీ లేకపోతే, ఆ ఏకసూత్రత, ఆ అంతస్సూత్రం లేకపోతే దీర్ఘకవిత ఏ ముక్కకాముక్క విడిపోతుంది. నగ్నముని కొయ్యగుర్రంలో తుఫాను నెపంమీద రాజ్య స్వభావం, వరవరరావు సముద్రంలో సముద్రం ప్రతీకగా విప్లవోద్యమం, ఛాయారాజ్ శ్రీకాకుళంలో శ్రీకాకుళోద్యమ స్ఫూర్తి … యిలా కవిత మొత్తం వొక యితివృత్తాన్ని అల్లుకుని ఆ కీలకాంశం చుట్టూ తిరుగుతుంది. అందులోనే కవి దృక్పథం వుంటుంది. భావజాలం వుంటుంది. అది కేంద్ర స్థానంలో వుంటుంది. అందుకే దాన్ని నేను గడియారంలోని స్ప్రింగుతో పోల్చాను. కేంద్రం నుంచి ఆ ప్రకంపనల కారణంగా గడియారం స్ప్రింగుద్వారా గడియారం ముళ్ళు తిరుగుతూ వుంటుంది. గడియారం ముళ్ళు తిరగాలంటే, కావ్యం నడవాలంటే ఈ అంతస్సూత్రం వుండాల్సిందే! వలస భారతం కూడా కరోనా నెపంగా కార్మిక శక్తితో

నడిచే సంపద చుట్టూ దేశ దళారీ ఆర్థిక వ్యవస్థ చుట్టూ ప్రపంచ పెట్టుబడీదారి దుర్మార్గాల చుట్టూ నడిచింది. కృష్ణయ్య వలస భారతం వచ్చిన సందర్భంలోనే నల్లెల రాజయ్య సంకలనం చేసిన 'దుఃఖ పాదం', బిల్లా మహేందర్ సంపాదకత్వంలో 'వలస దుఃఖం' వెలువడ్డాయి. వీటన్నిటినీ ఒక దగ్గర చేర్చి చూసినప్పుడు వలస భారతం సమగ్ర చిత్రం రూపుకడుతుంది.

సరే, యింతకీ ...
రవాణాకూడా కల్పించలేని రాజ్యం ... ఉన్నట్టా లేనట్టా!?.
దరిద్రాన్ని మూటకట్టుకుని దారెమ్మట పోతుంటే ...
దారిదోపిడీ దొంగలన్నారు! బందిపోట్ల గుంపన్నారు!

ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'శ్రామిక రైళ్ళు' పెద్ద అభాస. ఘరానా మోసం. పాదాలు పుండైన బడుగు జీవుల దగ్గర డబుల్ చార్జీలు వసూలు చేశారు. ఆహా, ఏమి ఔదార్యం!? అలా 430 కోట్ల ఆదాయం వచ్చిందని సిగ్గులేని ప్రకటనలు చేసుకున్నారు.

నిన్న అయోధ్యలో రామాలయాన్ని కట్టించడానికి శంకుస్థాపన చేసిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆధిత్యనాథ్ (ఆయన 'యోగి' అట) వలస కార్మికులమీద, వస్తువులమీద స్ప్రే చేసినట్లు, క్రిమిసంహారక మందు చల్లించాడు. వాళ్ళని ఎక్కడా మనుషుల్లాగా గుర్తించలేదు. కేవలం దాతల సాయంతో కొందరయినా బయటపడ్డారు. 'కన్నీళ్ళతో కరచాలనం చేద్దామన్నా / కరోనా అనుమతించని కాలంలో.... వాళ్ళకు కరోనా పరీక్షలు చేశారు. ఇళ్ళకు పోకుండా వాళ్ళనసలు కదలకుండా చేయాలనే కుట్ర జరిగింది.

డచ్ దేశపు ఆర్థికవేత్త జాన్ బ్రెమన్ వలస కార్మికుల్ని foot loose labor (ఫుట్ లూజ్ లేబర్) అంటాడు. స్థాన బలం లేని వలస కార్మికుల్ని ఏ హక్కులూ లేని బానిసలుగా దోచుకోవచ్చనే అతి పెద్ద కుట్ర ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారుడు అమలుచేస్తున్నాడు. ఇక్కడ కూడా కార్మికులు వాళ్ళ ప్రాంతాలకు వెళ్ళిపోయిన తర్వాత లాక్డౌన్ ఎత్తేస్తే వారి ప్రాజెక్టులన్నీ ఏమవుతాయి. గోడ కట్టే ట్రంప్ ఫిలాసఫీ ఒకటుందికదా! మెక్సికోకు అమెరికాకు మధ్య ట్రంపు గోడ కడదామనుకున్నాడు కదా!

నిజానికి అమెరికాలో వలస కార్మికులు లేకపోతే అమెరికా ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోతది. కుదేలయిపోతది. భారతదేశంలో కూడా వలస కార్మికులు వారి గమ్యస్థానాలకు చేరిపోతే ఆర్థికవ్యవస్థ ఛిన్నాభిన్నమై పోతదని ఎక్కడికక్కడ ఆపేశారు (దేశ ఆర్థిక వ్యవస్థ కాదు ధనస్వాముల ఆర్థిక వ్యవస్థ). ఇది "ఒకకుట్ర" అని గ్రహించాడు ఈ రచయిత. ఆ కుట్రని కవితాత్మకంగా బహిర్గతం చేశాడు అయితే, వీళ్ళెవరు – ఎక్కడినుంచి వస్తున్నారు అంటే ఇక్కడ అద్భుతమైన కవితా పంక్తులున్నాయి. ఎక్కడివారు ఈ వలస కార్మికులు?

'పైరుపచ్చ విప్లవంలో/ రాలిపడిన తాలు గింజలా?'

నికార్సయిన రాజకీయ ఆర్థిక ప్రకటన యిది. రచయిత ఎంత హాయిగా, స్పష్టంగా కవితాత్మక వ్యక్తీకరణతో యీ మాటన్నాడు!! హరిత విప్లవాలు, నీలి విప్లవాలు, క్షీర విప్లవాలుంటాయి. కానీ, ఇవన్నీ మనిషి బతకలేని విప్లవాలు. బ్రతుకునిచ్చే విప్లవాలను మరిచిపోయి మనవాళ్ళు ఈ విప్లవాల గురించి మాట్లాడుతున్నారు. హరిత విప్లవం ఏంచేసింది? నోటికాడ కూడు ఎలా తీసేసింది! సంప్రదాయ పంటల్ని, తృణధాన్యాల్ని ఎన్నింటిని నాశనం చేసింది? ఈ విప్లవాలన్నీ ఏం సాధించాయి? అందుకే, రాలిపడిన తాలుగింజలా అన్నారాయన. హరిత విప్లవంలో గట్టిగింజలు ఎవరికి పోయాయి? తాలుగింజలుగా ఎవరు మిగిలి పోయారు ? ఇదీ కవి లేవనెత్తిన ప్రధానమైన ప్రశ్న.

'నీలి విప్లవ అలల తాకిడికి/ ఊపిరాడక ఒడ్డున పడ్డ చేపపిల్లలా?'

రచయిత దృక్పథం పద్నాలుగు అధ్యాయాల్లో నిండుగా కనపడుతుంది, కానీ కొన్నిచోట్ల కవితాత్మకంగా కనపడుతుందన్నపుడు నాకీ అద్భుతమైన పంక్తులు కనపడ్డాయి. అక్కడే

'క్షీర విప్లవ మథనానికి/ వట్టిపోయిన పాడెగేదెలాంటి రైతులా?'

అంటాడు. క్షీర విప్లవ మథనమన్నది కొత్తగావుంది! కార్పొరేట్ మార్కెట్లో దళారుల లాభాల మండీలో విశ్వ విపణిలో ఆ రైతులు కూలీలుగా ఎలా అయ్యారు.

'సేద్యం పనులు కరువయ్యాయి / కులవృత్తులు కూలిపోయాయి / కమతాలు తరిగిపోయాయి / గ్రామీణ జీవితం విధ్వంసమైంది / పల్లెజీవితం పరాయిదైపోయింది / పట్నంనిండా అల్లుకున్న పల్లెతీగ!!'

మొదటి అధ్యాయంలో చెప్పినదానికి కొనసాగింపిది. వ్యవసాయాన్నీ – తదనుబంధ వృత్తుల్నీ ఆశ్రయించినవాళ్ళే వలస కార్మికులుగా మారారు. గ్రామీణ కూలీలు అర్బన్ లేబర్‌గా మారారు. వీళ్ళకు ఒక ప్రాంతం ఉందా, ఒక కులం ఉందా, ఒక మతం వుందా? ఉంటాయి కానీ వీటన్నింటికంటే దోపిడీకి గురవడం అన్న ఒక సామాన్య సూత్రం వుంది. అది వర్గం అని కవి సూచన.

తెలంగాణలో బిల్డింగ్ కట్టే ఆంధ్రామేస్త్రీ
ఆంధ్రాలో కాలువ తవ్వే పాలమూరు కూలీ
హార్డువేర్ షాపులో గుమస్తాలుగా గుజరాతీలు

ఇక్కడ ఒక గమ్మత్తయిన మాటవుంది. 'మార్వాడీ మిఠాయి కొట్లో బందరు కూలీ'. మనకందరకూ బందరు మిఠాయి ఫేమస్. కానీ ఆ బందరు మిఠాయి చేసే ఆయన ఏమయ్యాడు. మార్వాడీ మిఠాయి కొట్లో కూలీగా మారాడు. ఇదీ గ్రహించాల్సిన విషయం. రచయిత భావజాలం మొత్తం కావ్యంలో ఎక్కడా మిస్సవలేదు. అలా మిస్సయి వుంటే, దీర్ఘకావ్యానికుండాల్సిన బిగువు, నిర్మాణం, శిల్పం దెబ్బతినేవి. అలా దెబ్బతినకుండా చాలా జాగ్రత్తగా అల్లుకుంటూ వచ్చాడు. పొలిటికల్ ఎకానమీకి సంబంధించిన ఎన్నో అంశాల్ని సూక్ష్మంగా పరిశీలించాడు. నిర్దుష్టంగా వ్యాఖ్యానించాడు.

వీళ్ళంతా గూటికి చేరడానికి ఇంకా నడుస్తూనే వున్నారు. వీరు మరలా వస్తారు అంటాడు ప్రసాదమూర్తి ఒక కవితలో...

'నా రెక్కతో దుమ్ముదులిపి
పట్టాలెక్కించడానికి మళ్ళీ వస్తా'

ఇందాక సూర్యసాగర్‌గారు ఈ పద్నాలుగు అధ్యాయాల తర్వాత ఇంకా నాలుగు అధ్యాయాలు వున్నాయన్నారుగదా! బహుశా ఆ నాలుగు అధ్యాయాల్లో వీరు మళ్ళీ రావాలని ఆశించివుండొచ్చు. ఇళ్ళకి చేరుకున్న వాళ్ళ పరిస్థితి ఏంటి? వారి బతుకు తెరువు ఎలా? మళ్ళీ ఉపాధి కోసం క్యూ కట్టినపుడు దోపిడీ రూపం ఎలా వుండబోతుంది? దానికి అంతం ఎక్కడ?

మహాభారతం పద్దెనిమిది పర్వాలతో మహాప్రస్థానం దగ్గర ఆగిపోయింది. కానీ, ఈ వలస మహాప్రస్థానం సమసమాజం ఏర్పడేవరకూ ఆగదు.

గేదెలు కాచే బీహారోళ్ళు / గ్రానైట్ గనిలో ఝార్ఖండ్ మనిషి / ఆక్వా లేబరు తమిళతంబి / యుపి యంపి బెంగాల్ బస్తర్ నుండి వచ్చిన సెంట్రింగ్ మేస్త్రీ, ప్లంబర్, ప్లైవుడ్ వర్కర్.... వీళ్ళంతా ఏమౌతారు? రచయిత ఇక్కడొక మాట అంటాడు.

'అభివృద్ధొక తారకమంత్రం
రాజకీయ నాయకుల కుతంత్రం
ఆర్థిక ప్యాకేజి ఒక దేవతావస్త్రం
కార్పొరేట్ వర్గాలకు అమృతభాండం'

కార్పొరేట్ వర్గాలకు అది అమృతభాండంగా ఎలా మారింది. ప్రొ. జ్యోతి రాణిగారు రాసిన కరపత్రంలో ఆత్మ నిర్భర భారత్ కాదిది అన్నారు. మన పాలకులకు 'ఆత్మ' కార్పొరేట్. సామాన్యులకు యిది ఆత్మ దుర్భర భారత్.

మన ప్రధానమంత్రి మోడీ చాలా గమ్మత్తయిన వాక్యాలు మాట్లాడుతూ వుంటారు. ఆయన ఉపయోగించే ప్రధానమైన వాక్యాల్లో... 'మనం సంక్షోభంలో వున్నాం, నిజమేకానీ, సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకోవాలి' అనేది వొకటి. ఈమాట అందరూ వాడతారు. చంద్రబాబునాయుడు, జగన్మోహన్ రెడ్డి, కెసిఆర్ కూడా వాడతారు. సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకుందామనేవాళ్ళే అందరూ. అయితే ఎవరి సంక్షోభం, ఎవరికి అవకాశంగా మారుతుంది. కరోనా సంక్షోభం కార్పొరేట్ వర్గాలకు అవకాశంగా మారుతుంది. అలాగే పాలక వర్గాలకు అవకాశంగా మారింది. తొంభైశాతం అంగవైకల్యం వున్న సాయిబాబాను పెరోల్ మీద విడుదల చేయాలన్నా, ఎనభైయేళ్ళ వరవరరావుని బెయిల్ పై విడుదల చేయాలన్నా కరోనా వుంది, లాక్డౌన్ వుంది కాబట్టి విడుదల చేయడానికి వీలుకాదు.

సి.ఎ.ఎ.కి వ్యతిరేకంగా షాహిన్బాగ్లో జరిగిన ఉద్యమం ఏమైంది? అది కరోనా కారణంగా ఆగలేదు. కరోనా సంక్షోభాన్ని పాలకవర్గాలు అవకాశంగా మార్చుకుని అణచివేశారు. కాశ్మీర్లో ఏం జరిగింది. ఏం జరుగుతోంది? కరోనా సంక్షోభాన్ని ప్రభుత్వం అవకాశంగా తీసుకుంది. ప్రజా వ్యతిరేక విధానాలన్నీ కరోనా కార్పెట్ కింద అమలు పరుస్తున్నారు. కార్పొరేట్ ఎలా తయారయ్యిందంటే, కరోనా కార్పెట్ కింద పాములా తయారయ్యింది. రూరల్ జర్నలిస్టు సాయినాథ్ 'కరువుని అందరూ ప్రేమిస్తారు' అంటారు. అలాగే కరోనాని కూడా అందరూ ప్రేమిస్తారు. పాలకులు, వాళ్ళ తాబేదార్లు అవినీతి అధికారులు అందరూ ప్రేమిస్తారు. కరోనా వారికలా వుపయోగపడుతుంది మరి!

విద్యాలయాల్లో వున్న టీచర్స్ అందరూ ఏమయ్యారు. తరగతి గదిలో 40 – 60 మందికి చెప్పాల్సిన ఉపాధ్యాయుడు ఆన్లైన్లో 100 – 200 మందికి ఒకేసారి పాఠం చెప్పడం ద్వారా టీచర్స్ ఉపాధి కోల్పోయారు. జీతాల్లేవు. మామూలుగానే టీచర్లకు వేసవి సెలవులకు జీతాలివ్వరు. అసంఘటిత రంగమేకాదు సంఘటిత రంగంలోకూడా ఇలాంటి పరిస్థితి వుంది. కొందరు టీచర్లు కూరగాయలు అమ్ముతున్నారు. డాక్టరేట్ చేసినాయన తాపీపని చేస్తున్నాడు. అమెరికా వెళ్ళిన మన సాఫ్ట్వేర్స్ ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. అమెరికా అధ్యక్షుడు శాసనాలు చేస్తుంటాడు. హెచ్1 వీసాలు రద్దుచేస్తానంటాడు. ప్రపంచ వ్యాప్తంగా పాలకులు ప్రజావ్యతిరేకమైన చట్టాల్ని తీసుకరావడానికి, చర్యలు చేపట్టడానికి ఈ కరోనా ఒక అవకాశంగా ఉపయోగపడింది. ఈ కుతంత్రాన్నే రచయిత బహిర్గతం చేశాడు.

'ఈ పాలకులు కోళ్ళ కోసుపందాల నిర్వాహకులు
మార్కెట్ బేరగాళ్ళ తైనాతీలు
కార్పొరేట్ కోటీశ్వరుల దళారీలు!'

తర్వాతి ఖండికలో రచయిత ఒక మాటంటాడు. 'వైరసుక్కూడా వర్గస్వభావమున్నట్లుంది' అంటాడు. సహజంగా వైరస్కు వర్గ స్వభావ ముండదు. అది అందరినీ తాకుతుంది. జైల్లో ఖైదీని తాకుతుంది. ఇంట్లోవుండే సెలెబ్రిటీకి తాకుతుంది. అలాగే ఢిల్లీ మర్కజ్ నుంచి వచ్చిన ముస్లీమును తాకుతుంది, రోడ్డుమీద నడుస్తున్నవలస కార్మికుడ్ని తాకుతుంది. 'విశ్రాంతి తీసుకోండి, మంచి ఆహారం తీసుకోండి, విటమిన్స్ వేసుకోండి, ఆ వైద్యం చేయించుకోండి, ఈ వైద్యం చేయించుకోండి' అంటారు. ఐసోలేషన్లో ఉండమంటారు. అసలు ఉండటానికి ఇల్లెక్కడుంది? ఇంట్లో వొంటరి గదులు ఎక్కడున్నాయి.

'ఊరిచివర నివాసాలు ఊపిరాడని ఉద్గారాలు
దుర్గంధం నిత్యజీవన నేస్తమై సాగుతోంది
చీకటి గదులు చిరుగుల గుడిసెలు
తడికె చాటున స్నానపు గదులు
మురికివాడలో బెత్తెడు రూములో
గంపెడు పిల్లలతో ఆలుమగలు
అందరు వాడేదొకటే ఉమ్మడి టాయిలెట్!

మరి ఐసొలేషన్ కుదురుతుందా? అంటే, వైరస్కు వర్గస్వభావం లేదుగానీ, పేదరికానికి వుంది. కరోనాకు వర్గం లేదు. కులం లేదు. మతం లేదు. కానీ పాలకులకు వర్గం వుంది. కులం వుంది. మతం వుంది. అందుకనే భౌతిక దూరం సామాజిక దూరమై 'ధర్మ' బద్ధతని సాధించటానికి పూనుకుంది. సందులో సడేమియా లా తరతరాల అంటరానితనం ఆదర్శమైంది.

భౌతిక దూరం పాటించండి. బయటకు రాకుండా క్వారంటైన్లో వుండండి. బయటకు రాకుండా మనకు కడుపు నిండతదా? సంక్షేమం ద్వారా, సబ్సిడీ ద్వారా ఇచ్చే ఆహార ధాన్యాలు ఎక్కడికి పోయాయి?

ఎలుకలు తిన్నా ముక్కిపోతున్నా / ధాన్యం నిల్వలు బయటకు రావు!

.... .... ..... .....

ఆకలి తీరితే దొరకరు పనికని / ఆధారం తుంచి క్షుద్భాధను చూపి ఆశలు పెంచీ /

అటు కదలక ఇటు కదలక ఎటూ మెదలక / గుదిబండను మెడలో తగిలిస్తారు!

ఇందువలన రచయిత వైరస్కి వర్గస్వభావముందని చెబుతున్నాడు. పాలకులకు, పాలక విధానాలకు వర్గస్వభావం వుంటుంది. అందుకే వలస కార్మికుడికి బతుకుదెరువుండదు.

‘స్వేదబిందువు తత్వం బోధపడని చోట చాకిరీ చెమట కేకలు వినపడవు!’. కరోనా వ్యాపించడానికి మతం రంగు పులమడానికి ప్రయత్నించారు.

మర్కజ్‌తో విజృంభించిందని మతలబు
మతం రంగు పులమాలని ఉన్మాదపు తహతహలు!

కవి దృష్టి నుంచి యే సామాజికాంశమూ తప్పిపోలేదు. అందుకే, పాలకులకు, పాలక విధానాలకు మతం వుంటుందని తీర్మానించాడు.

రాత్రి తొమ్మిది గంటలకు, తొమ్మిది దీపాలు వెలిగించాలట! 9×130 కోట్లమంది దీపాలు వెలిగిస్తే ఆ దీపకాంతిలో కరోనా వైరస్ పారిపోతుందట! ఆ కాంతిలో చప్పట్లు కొడితే ఆ శబ్దం కరోనాను చంపేస్తదంట! నవగ్రహాలు శాంతిస్తాయంట. శంఖాలు వూదారు, గంటలు కొట్టారు... మరి పారిపోలేదేం? భారతదేశంలో కరోనా వైరస్‌కు దీపాలు వెలిగించడమే వాక్సిన్ అనుకుందామా? మరి లాక్డౌన్ మరలా మరలా కొనసాగుతుంది... కరోనా ఇంకా విజృంభిస్తుంది. వేలాది మరణాలు సంభవిస్తున్నాయి. ఇదంతా యేంటి? ఎంత వంచన?!

ఇవాళ పొద్దుట్నుంచి ఒక ప్రచారం జరుగుతోంది. రష్యాదేశం వ్యాక్సిన్ కనిపెట్టిందని, వ్యాక్సిన్ ఒక మాఫియా! ప్రపంచ వ్యాప్తంగా 230 దేశాల్లో వ్యాక్సిన్ కోసం ప్రయోగాలు జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరు తామే ముందు కనిపెట్టాలని ఆరాటం. ఎవడు ముందు కనిపెడతాడో వాడు మార్కెట్ని తమ గుప్పిట్లో పెట్టుకోవచ్చుని. ప్రపంచ వ్యాప్తంగా ఒక థియరీ కూడా వుంది – ఫార్మా కంపెనీవాళ్ళే కరోనాపట్ల భయాన్ని వ్యాపింపజేసి మార్కెట్ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని.

‘నేడు కరోనా వాక్సిన్‌కై ఎదురు చూస్తున్నారు
సైన్స్ పట్ల మక్కువ పెరిగింది
మనిషి ఆలోచనా దృక్పథంలో మార్పు వచ్చింది’
అంటాడు కవి.

నిజానికి అదే సమయంలో మూఢవిశ్వాసాలు కూడా పెరిగాయి. గోమూత్రం కోవిడ్‌ని పారదోలుతుందనీ, హనుమాన్ చాలీసా పారాయణం చేస్తే కరోనా పరారవుతుందనీ, బాబాజీ పాపడ్ తింటే రోగం దరిచేరదనీ, రామమందిర నిర్మాణమే సర్వ జగద్రక్ష అనీ ప్రచారం చేశారు. నేరం శత్రు దేశంపై మోపారు. కరోనా ఎక్కడ పుట్టిందో / ఎలా పుట్టిందో కంటే అది నేర్పిన గుణపాఠమే అత్యవసరం!

దీర్ఘకావ్యం పొడవునా దృక్పథానికి తగిన శిల్పాన్ని ఉపయోగించినా –

‘మానవ సంబంధాలన్నీ / ఆర్థిక సంబంధాలేనని మార్క్స్ చెప్పాడు. / మనిషీ ఒక సరుకే, లాభమే సర్వస్వమని క్యాపిటలిజం ఉద్ఘాటిస్తుంది!’

ఇలా కొన్ని చోట్ల కవి శుద్ధవచనమై పోతాడు. దీర్ఘకవితలో యీ ప్రమాదం ఎప్పుడూ వుంటుంది. అయితే దృక్పథబలమే కావ్యాన్ని నడిపింది.

ఆ క్రమంలో ఈ వలసలు దినసరి కూలీలతో ఆగవంటూ వివిధ రంగాలపై, ఉపాధిపై దాని ప్రభావం ఎలా వుంటుందో కూడా చెప్పాడు. రోడ్డుమార్జిన్ వ్యాపారులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికులు, సాఫ్ట్వేర్ ఉద్యోగులు ఇలా అందరూ ఒక అభద్రతలో వున్నారు. వీరందర్నీ ఐక్యం చేయవలసిన రాజకీయ శక్తులు సైతం ముక్కలైపోయి వున్నాయి. శ్రామిక శక్తులన్నిటినీ వొక తాటిపైకి తెచ్చి నాయకత్వం వహించాల్సిన కార్మిక వర్గం ఆ బాధ్యత నుంచి పక్కకి తొలగిపోయి ‘ట్రేడ్ యూనియనిజానికి’ పరిమితమైపోయింది. అనేక జాతీయ కార్మిక సంఘాలు కార్మిక వర్గ స్వభావం కోల్పోయాయి. అందుకే కవి ప్రజా రాజకీయాల అవసరాన్ని గుర్తించి యిలా అంటాడు:

‘నాటి జన రాజకీయం మసకబారి పోయింది
వ్యక్తిపూజను నినదించే భజన రాజకీయంగా మారింది
నేడు కుదుళ్ళు తెగిన విభజన రాజకీయం కొనసాగుతుంది’

అయినప్పటికీ దోపిడికీ అణచివేతకూ గురయ్యే ప్రజా సమూహాలన్నీ వొకటై శ్రమజీవులపై అమలవుతున్న దుర్మార్గానికి వ్యతిరేకంగా నిలబడతారనీ, నిలబడి కలబడతారనీ రచయిత డాక్టర్ కృష్ణయ్య ఒక ఆశావహదృక్పథంతో వలస భారతానికి భరతవాక్యం పలికాడు.

‘ఎప్పటికైనా ఈ వలస దుఃఖం
పిడికిళ్ళెత్తి ఎరుపెక్కిన ఎర్రెర్రని ఆగ్రహంగా
మారకుంటుందా? మార్చుకుంటుందా?
మారాకు తొడగకుంటుందా?!

‘మన ఫిర్యాదుల్ని అందుకోడానికి ఇప్పుడు ఇక్కడ ఎవరూ లేరు. ఏనాడో చచ్చిపోయిన వ్యక్తులు మనల్ని పరిపాలిస్తున్నారు. వారి కోరలు మనలోకి చాలా లోతుగా దిగి ఉన్నాయి. ఈ తరుణంలో మన ముందున్న ఏకైక మార్గం పోరాటం ఒక్కటే. బతకడానికి పోరాటం. కాస్త ఊపిరి తీసుకోడానికి పోరాటం. కనీస హక్కుల కోసం పోరాటం.’ (అరుంధతీ రాయ్)

ఇది ఫిర్యాదుల యుగం కాదని యీ కవికి తెలుసు. పోరాడక తప్పదనీ తెలుసు. కార్పోరేట్, మతం రెండూ కరోనాగా మిలాఖతైన వికృత రాజకీయ సందర్భంలో పోరాడే శక్తులు వొకటై నిలవాలని చెప్పిన ‘వలస భారతం’ కవి డా॥ కృష్ణయ్యకు అభినందందనలతో ... సెలవ్.

(కాలంకాని కాలం కరోనా కాలంలో
ఆగస్టు 9, 2020న జనసాహితి తొలి ‘జూమ్’ మీటింగ్‌లో చేసిన
ప్రసంగం ఆధారంగా...)

## వెలిగిపోతున్నారు

సినిమాల్లో విలన్లు చివరకు పట్టుబడతారు. వారికి శిక్ష పడుతుంది. కానీ నిజ జీవితంలో అలా కాదు. వాళ్ళలా శిక్ష పడకుండా వర్ధిల్లుతూనే ఉంటారు. ఉదాహరణకు మోదీని తీసుకోండి. గోధ్రా అల్లర్ల కేసులో అతను నిందితుడు. అయినా ప్రధానిగా వర్ధిల్లడంలేదూ? జగన్ క్విడ్‌ప్రోకో ఒప్పందాలలో వేల కోట్లు కూడబెట్టిన ఆర్థిక నేరగాడు. అయినా ముఖ్యమంత్రిగా వర్ధిల్లడంలేదా? భారత్ వెలిగిపోతోందంటే ఇదే మరి!

**- కొత్తపల్లి హరిబాబు, గుంటూరు**

**2-7-2020**

# భగత్‌సింగ్ అంటే అధ్యయనం!
# భగత్‌సింగ్ అంటే ఆచరణ!!

- దివికుమార్

**షహీద్** భగత్‌సింగ్‌కు మేమే వారసులమంటూ భారత దేశంలో ఉన్న అన్ని విద్యార్థిసంఘాలు ప్రకటించుకుంటాయి. గడిచిన 84 సంవత్సరాల నుండీ విద్యార్థి, యువజనుల హృదయాలలో గొప్ప దేశభక్తి పరునిగా, అసమాన త్యాగ ధనునిగా తిరుగులేని విప్లవ ప్రతీకగా నిలిచి, ఉపఖండపు ఉమ్మడి విప్లవ వీరునిగా చెరగని ముద్ర వేసుకొన్నందువల్ల భగత్‌సింగ్ మనకు ఆత్మీయుడయ్యాడు. ఆదర్శనీయుడయ్యాడు, విప్లవ దీక్షకు స్ఫూర్తిగా మన మనస్సులలో శాశ్వత స్థానాన్ని పొందాడు.

పదుల సంఖ్యలో ఉన్న విద్యార్థి సంఘాలందరికీ ఒకే భగత్‌సింగ్ ఆదర్శనీయుడు, స్ఫూర్తి ప్రదాత కావటంలో కొంత అసంబద్ధత ఏదో ఉందని మనకు అనుమానం రాక మానదు. భగత్‌సింగ్ పేరుని, ఆయన కీర్తిని దొంగచాటుగా కొల్లగొడదామనే అవకాశవాదమేదో వుందనే వాస్తవాన్ని కూడా తెలుసుకోవాలి. భగత్‌సింగ్ ఆదర్శాల పట్ల మనకు నిజంగా సానుకూలత వుందో లేదో తేలాలంటే భగత్‌సింగ్ రచనలను పట్టుదలగా చదివి అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి. 23 ఏళ్ళ వయసులోనే ఉరికంబాన్ని ముద్దాడిన భగత్‌సింగ్, ఆ వయసుకే నాలుగు భాషలలో చదవనూ, రాయనూ నేర్చిన వాడనీ, నిరంతర కార్య కలాపాల నడుమ కూడా విపరీతంగా పుస్తకాలు చదివిన వాడనీ, ఆ విధంగా వివిధ గ్రంధాలను నిశితంగా అధ్యయనం చేయటంలో భగత్‌సింగ్ స్ఫూర్తిని స్వీకరించాల్సి ఉంటుందనీ మనకు అర్థమవ్వాలి. తాను ఉరికంబానికి బయలుదేరవలసిన సమయంలో కూడా భగత్‌సింగ్ లెనిన్ జీవిత చరిత్రను అధ్యయనం చేస్తున్నాడు. మనల్ని కూడా లెనిన్ జీవితాన్ని అధ్యయనం చేయవలసిందిగా ఆదేశించాడా అన్నట్లు, లెనిన్ జీవిత గ్రంధాన్ని సగంలోనే తెరచి, మిగతా కర్తవ్యాన్ని మనకు విడిచి వెళ్ళాడని కూడా మనం గుర్తు పెట్టుకోవాలి.



భగత్‌సింగ్ జైలులో వుండగా చేసిన రచనలన్నీ దొరకలేదు. 'నేనెందుకు నాస్తికుడను?', 'పంజాబ్ విద్యార్థులకు సందేశం' అన్నవి మినహా మిగిలిన 5 రచనలూ భగత్‌సింగ్ జైలుకు వెళ్ళటానికి ముందు రాసినవి. అన్నీ విలువైనవే. వాటిలో 'విద్యార్థులు రాజకీయాలు', 'యువత', 'అస్పృశ్యతా సమస్య', 'దేవుడు–మతం' వున్నాయి. 72 ఏళ్ళ 'స్వతంత్ర' పాలన తర్వాత కూడా అస్పృశ్యతా సమస్య కొత్త రూపాల్లో కొనసాగు తుండటాన్ని అసహ్యించుకోనివారూ, దళిత సమస్యకొక పరిష్కారాన్ని నిజాయితీగా చూపనివారూ భగత్‌సింగ్ వారసులు కాలేరు. 'మతకలహాలూ – నివారణోపాయాలు' అనే వ్యాసంలో లౌకికవాదపు మౌలిక అవగాహనను భగత్‌సింగ్ మనకు అందిస్తాడు.

"1914–15 నాటి అమరవీరులు మతం నుంచి రాజకీయాన్ని వేరు చేశారు. మతం మనిషి వ్యక్తిగత విషయమనీ, అందులో మరొకరు జోక్యం చేసుకోరాదనీ చెప్పాలి. రాజకీయాల్లోకి మతం ఎంతమాత్రం దూరరాదు. ఎందుకంటే యిది మనలను స్థిమితంగ కలిసికట్టుగా కూచొని పనిచేయనివ్వదు"

ఆధునిక భారత చరిత్రలో రాజకీయాలనుండి మతాన్ని దూరంగా పెట్టిన తొలి ఉద్యమకారులు 1914–15 కాలం నాటి గదర్ వీరులు. వీరిలో మన తెలుగువాడు దర్శి చెంచయ్యగారు కూడా వొకరు కావటం మనకు గర్వ కారణం.

భగత్‌సింగ్ బృందపు ముందుతరాల విప్లవకారులంతా మతాన్ని గాఢంగా నమ్మినవారు. భగవద్గీత, ఖురాను, గురుగ్రంథ సాహెబ్ లాంటి మత గ్రంధాలను తమ చేతిలో వుంచుకుని ఉరికంబాలెక్కినవాళ్ళు. ఆ కాలానికి 'నేను నాస్తికుడను' అంటూ అంత స్పష్టంగా ప్రకటించిన మరొక రాజకీయవేత్త లేరు. తన నాస్తికత్వం మానవ వైజ్ఞానిక ప్రగతిపై, శాస్త్రీయ చింతనపై రూపొందినది కనుక, అది తన ఆశయ బలానికి తోడుగా నిలిచి, స్పష్టమైన అవగాహనతో కూడిన ఆత్మ విశ్వాసాన్ని కలిగిస్తోందని భగత్‌సింగ్ చెప్పాడు.

మన తెలుగునాట విప్లవమంటే చంపుడు పందెపు ఆటలాగా ప్రచారంలో వుంది. అందుకు ఉదాహరణగా భగత్‌సింగ్ సాండర్స్ అనే పోలీసు అధికారిని లాహోరు నగరం నడిబొడ్డున పట్టపగలు చంపటాన్నీ, నాటి కేంద్ర అసెంబ్లీ (నేటి పార్లమెంటు)లో బాంబులు విసరటాన్ని ఉదాహరణగా చూపే వారనేకులున్నారు. అయితే విప్లవమంటే బాంబులూ, పిస్తోళ్ళూ కాదనీ, అమలులో వున్న అసమానతలతో కూడిన దోపిడీ పీడనల వ్యవస్థను సమూలంగా మార్చటానికి కృషి సల్పటమే విప్లవమని చెబుతూ, తాను తన కార్యకలాపాల తొలి రోజులలో మాత్రమే టెర్రరిస్టుననీ భగత్‌సింగ్ స్పష్టం చేశాడు. అంతే కాదు అరక్షణంలో ఉరికంబంపై వేలాడటమో, ఎదురుకాల్పులలో హతమవటమో చాలా తేలికనీ, జీవితకాలం ప్రజలకొరకు కష్టాలకోర్చి నిరంతరాయంగా కృషి సల్పటమే నిజమైన విప్లవ కర్తవ్యమనీ మనకు బోధించినవాడు భగత్‌సింగ్. నిజమైన విప్లవకారులు గ్రామాలలో

రైతులూ కూలీలుగానూ, పట్టణాలలో కార్మికులుగానూ వున్నారనీ, వారిని సంఘటితపరచటమే అతి ముఖ్య విప్లవ బాధ్యతనీ కూడా చెప్పినవాడు భగత్‌సింగ్.

"సోషలిజం స్వప్న సీమ కానెకాదు నిజం సుమీ
ఆకలంత సహజమదీ అన్నమంత అవసరమదీ"

అని విద్యార్థి - యువజనులకు ఆశయాన్ని అందించి వెళ్ళిన భగత్‌సింగ్‌ను లోతుగా అధ్యయనం చేద్దాం. మనకాలపు పరాధీన ఆర్థిక రాజకీయ పరిస్థితులకూ, మతోన్మాద పూరితమైన, కుల వ్యవస్థతో కుళ్ళి కంపు కొడుతున్న సామాజిక పరిస్థితులకూ, మహిళల పాలిట నాగులకోనగా మారిన నేటి పతన సాంస్కృతిక సమాజానికీ మన అవగాహనను అన్వయించుకుని..... సామాజిక ఉద్యమకారులుగా మనల్ని మనం మలుచుకోవటానికి భగత్‌సింగ్ నుండి స్ఫూర్తిని పొందుదాం.

భగత్‌సింగ్ అర్థంలో దేశభక్తి అంటే సామ్రాజ్యవాదాన్నుండి దేశాన్ని విముక్తి చేసే కృషి సల్పటం! సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు లొంగటమంటే - దేశ ద్రోహమే !!

భగత్‌సింగ్ అర్థంలో... గాలిలో దీపంలా మారిన నేటి సామాజిక జీవితాన్ని సమూలంగా మార్చటానికి మన మన ప్రజా ఉద్యమ రంగాలలో నిబద్ధతతో కృషి సల్పటమే విప్లవం. విద్యార్థి యువజనులు, తాము చైతన్యవంతులై కార్మిక - కర్షకులలో విప్లవ చైతన్యాన్ని నింపటానికి అంకితం కావటమే నిజమైన త్యాగం.

భగత్‌సింగ్ బోధనలను అధ్యయనం చేద్దాం!

భగత్‌సింగ్ ఆశయాలను అవగాహన చేసుకుందాం!

భగత్‌సింగ్ మిగిల్చి వెళ్ళిన విప్లవ కర్తవ్యాలను పరిపూర్తి చేద్దాం!

అందుకు అంకితమయినవారే భగత్‌సింగ్‌కు నిజమైన వారసులుగా గుర్తిద్దాం!!

**12-11-2015** ❂

కవిత

# దగ్ధగీతం

- డా॥ జి.వి. కృష్ణయ్య

**మనీషా...** మన్నించమ్మా...
నీ దేహం చితిపై కాలిపోతున్నా
మా గుండెల్లో మంటలు చెలరేగుతున్నా
తనివితీరా ఏడ్వలేని పిరికితనం
కడసారి చూపులకీ నోచుకోలేని
కడుబీద దళితబిడ్డా..నీకు కన్నీటి వీడ్కోలు!
నీ మానప్రాణాలకు రక్షణలేదు కానీ...
నీ చితిమంటలచుట్టూ లాఠీల పహారా
రాజ్యంగీచిన లక్ష్మణరేఖకవతల
భద్రతావలయంలో దిక్కుమాలిన
దీనాలాపన!

కామాంధుల కర్కశత్వానికీ
ధనమధాంధుల రాక్షసత్వానికీ
చిత్తకార్తె కుక్కల పైశాచికత్వానికీ
మూకుమ్మడి దాష్టీకానికి
దేహం చిద్రమై హృదయం బద్దలై
నాలుక తెగిన మాటలమౌనం
వినిపించని శోకసంద్రమై
ఆసుపత్రి నాలుగు గోడల మధ్య
మూగవేదనతో రోదనతో
ప్రాణవాయువుతో మృత్యుగవాక్షంలో
పెనుగులాడి పెనుగులాడి అలసిపోయి
నిస్సహాయంగా నిశ్శబ్దంగా ప్రశ్నిస్తూ...
ప్రాణం వదిలావా మనీషా!
చిదిమేసిన పువ్వుని వదిలేసి నా
కొడుకులు
బరితెగించిన ఆంబోతుల్లా
తిరుగుతున్నారు!
ఆడమనిషి కంటపడితే చాలు
తల్లిలేదు చెల్లిలేదు సాటిమనిషన్న
జాలిలేదు
ఆఫీసు రూముల్లో, కార్ఖానా షెడ్డుల్లో
నడిరోడ్లో బస్‌రూట్లో రైలుబోగీల్లో
పశువుల కాసేకాడ పంటలు కోసేకాడ
విషపుచూపులు ఎంగిలికూతలు
భయం గుప్పిట్లో బతుకు చీకట్లో
అనునిత్యం వేధింపులు సాధింపులు
ఎక్కడమ్మా నీకు రక్షణ?

రాకాసి మూకలు రాజ్యమేలేచోట
ముక్కు చెవులు కోసి మురిసిపోయే నీతి
ఆధిపత్యపు మధపుటేనుగులు
అధికార పీఠాలపైకెక్కి హూంకరిస్తున్నారు
బలుపెక్కిన ధనస్వామ్యం, పేదరికాన్ని
ఎక్కిరిస్తోందీ
ప్రాణ భయంతో పరుగులు పెట్టిస్తోంది!

స్త్రీలను పూజించే దేశంలో స్త్రీజాతికి
రక్షణ లేదు
కడజాతిపై కనికరం లేదు
అవమానాలూ అణచివేతలూ అతి
సాధారణం
యోగిపుంగవుల ప్రవచనాలకు కొదువేలేదు
దేశభక్తి ముసుగులో జాగీరుపాలన
ఫాసిస్టుపోకడ
హింసోన్మాదం విచ్చలవిడిగా
కొనసాగుతోంది!

కళ్ళుతెరిచి చూడాలి కసితో రగలాలి
కాలానికి ఎదురీదాలి సంకెళ్ళని తెంచాలి
వ్యూహానికి ప్రతివ్యూహం కావాలి
గుండెల్లో ఆవేశం రావాలి
చరిత్రగతిని మలుపులు తిప్పి
సమష్టి నారీశక్తిగ ఎదగాలి
వేగుచుక్కలై వెలుగుదివ్వెలై కదలాలి!!

(ఉత్తరప్రదేశ్‌లో దళితయువతి మనీషా వాల్మీకి వెన్ను విరిచి, నాలుక కోసి అమానుషంగా మూకుమ్మడి అత్యాచారంచేశారు. హాస్పిటల్లో మృత్యువుతో పోరాడి మరణించింది. ఆమె శవాన్ని కుటుంబసభ్యులకు కూడా అప్పగించకుండా అర్ధరాత్రి పోలీసులే దహనం చేశారు.) ❂

గల్పిక

# సందట్లో సడేమియా

శంకరం

**'ఇదేం** బాగునేదురా సుబ్బారావ్!'

'ఏది, కరోనానా? ఎట్టా బాగుంటాదిరా?'

'మాట మార్సేకు.... జనాలంతా ఓనల్లేక గగ్గోలెడతావుంటే గెడ్డలోకి ఇంజనెట్టేసి నీ మళ్ళకి నీల్లు తోడేసుకుంతావా? మోతుబరివి కదా!'

'ఓరెల్లరా.... అక్కడికి నానొక్కన్నే ఇట్టా సేత్తున్నట్టు ఇద్దూరంగా సెప్తావేందిరా? అయినా ఈ నీరంతా నానేటి సేసుకుంతాను? నా మళ్ళన్నీ తడిసినాక ఊరోల్లకి ఒగ్గీనా?'

'అబ్బా, యేం తెలివిరా నీది, నీ మళ్ళన్నీ తడిసినాక గెడ్డలో నీరు మిగులుద్దా అసలు? ఆ చంగతి నీకూ దెల్సు....'

"అవుకాశవొచ్చినప్పుడు వాడేసుకోడవే తెలివైనోడి పని.... అయినా దేశింల పెద్ద పెద్ద మారాజులే టైం జూసుకొని పెజలకి రకరకాల వాతలెట్టెత్తన్నారు.... సడీసప్పుడూ నేకండా సెయ్యాల్సినియన్నీ సేసీసుకుంతన్నారు..... మనవనగా ఎంతరా....?"

"అబ్బా! నీతాన సానా ఇసయవుందరా.... సెప్పరా సీకుష్ణుడు అజ్జునికి సెప్పినట్టు.... నేర్సుకుంతాను.... నానూ తెలివైనోన్ననిపించు కుంతాను.... సెప్పరా....!"

"అయితిను.... పెపంచకవంతా ఇప్పుడల్లకల్లోల్లైపోతుంది, ఔనా? ఔను, మాయదారి కరోనా దేశదేశాల్ని సుట్టిపారీసింది గదా, ఎప్పుడు ఎవుడ్ని కాటేసిద్దోనని జనం గుండికాయల్ని గుప్పిట్లో ఎట్టుకొని తిరుగుతన్నారు.... ఇంగోపక్క మన్దేశింల కోట్లకొద్దీ పెజలు ఉండనీకి సోటు నేక, సెయ్యనీకి పన్లేక, తిననీకి తిండి లేక రోడ్లట్టుకొని వందల మైళ్ళు నడుసుకోని సొంతూళ్ళకి పోతున్నారు. ఏటి తింటన్నారో, ఎక్కడ తొంగుంటన్నారో ఆ పయ్యోడికే తెలియాలి....."

"ఓరియ్యన్నీ రోజూ టీవీలో సూత్తన్నం కదేట్రా యేటో సెప్తానని ఇంకేటో సెప్తావేందిరా...."

"నువ్వలగాగు.... ఇదంతా సెప్పనీకి కారనవుంది. గవుర్మెంటు కొలువులు, పెద్ద పెద్ద కంపెనీ కొలువులు సేసీవోల్లకి దప్ప మిగిలిన కోట్లాదిమంది జనాలకి సెయ్యనీకి పనుల్లేకుండా పోనాయ్.... వంట్లో బాగునేక ఆస్పత్రిల్లకెల్తే పట్టించుకునే నాధుడు నేడు.... అవునా?"

"అవును బాబూ. అవును. అయితేతంతావు? నానడిగింది సెప్పవేంరా....?"

"దేశింల జనాలు దిక్కు మొక్కూ నేక గగ్గోలెడతావుంటే మన పెద్దోల్లు గుట్టుసప్పుడు నేకుండా మంచి నాబాలొత్తున్న పెబుత్వ కంపెనీల్ని పైవేటోల్లకప్పజెప్పీసినారు. కరెంటు యవ్వారాలన్నీ మావే సూస్కుంతావని మన రాస్టరాల సేతుల్లోంచి గుంజేసుకుంతన్నారు. యవుసాయ మార్కెట్లమీన కూడా అతికారాలు లాగేసుకుంతన్నారు."

'మరలగైతే ఇంగ మన్రాస్టరాల్కి సొమ్ములెక్కడ్నుంచొత్తాయిరా?'

"అదే గందా నానూ అంతన్నాను, సరే ఇయ్యన్నీ ఓ పక్కనెడదాం. అతికారం కేంద్రం సేతిలోనో, పైవోటోడి సేతుల్లోనో ఉంటది.... పర్వానేదనుకుందాం. కానీ ఆ మజ్జిని ఇజియి మాల్యా, మిగతావోల్ల పేర్లు మన్నోటికి రావు.... ఇట్టాంటి ధర్మపెబువులు బేంకీలకాడ సేసిన అప్పులు డెబ్బై ఏల కోట్లు మాపీ జేస్సినారు.... ఏది.... ఈ కరోనా గందరగోలంలోనే...."

"అమ్మ దీనమ్మ.... అంత పన్జేసినార్రా.... కడుపు కట్టుకోని నానూ, నువ్వూ, ఆడూ, ఈడూ, సిన్నా, సితకోల్లందరివీ పైసా పైసా బేంకీల దాస్కుంటే ఈల్లబ్బగారి సొమ్మునాగ కోట్లు కోట్లు అప్పులిచ్చీడవే గాకుండా మాపీ గూడా సేస్సినారన్నమాట.... కోతి గెంతడం, సాయిబు దొబ్బడం అంటే ఇదే మరి!"

"ఇంకా ఇను.... ఇంత సంది కాలంలో మన పెబువులు.... అంటే పెతానమంతిరీ, మిగిలిన మంతుర్లూ, ఆల్ల పియ్యేలూ.... ఈల్లంతా రెక్కలు ముక్కలేసుకొని పన్జేత్తన్నారనీ, ఈల్లందరూ విప్పుడున్న పారలమెంటు బిల్డింగు పాతదైపోయిందనీ, ఆల్లు బాగా పన్జెయ్యనీకి కొత్త బిల్డింగులు కట్టుకుంటారట.... బానే వుంది దాని కర్సెంతో దెల్సా? 12,450 కోట్లట....."

"ఓహోహో! అంటే మన్సొమ్ముల్తో ఇందర బవనాలు కట్టుకోని, ఏసీలెట్టుకోని ఆయిగ రెస్టు దీస్కుంటరన్నమాట.... జనాలేమో రోడ్లట్టి దిక్కులేనోల్నాగా పరిగెడతంటే.... బాగుంద్రా!"

"ఇంకా ఇసిత్రం ఇనుకో.... పిట్రోలు అమ్మీ దేశాల్లో కరోనా వల్ల మదుసులు ఎక్కువగా తిరగడం మానీడంతో దరలు పడిపోనాయ్. కానీ మన్దేశింల ఎవ్వరికీ అనుమానం రాకండా సాయిబాబాకీ కొంచెం కొంచెం ఇసవిచ్చి సంపేసినట్టు ఒకరోజు అర్ధరూపాయి, ఇంకో రోజు రూపాయి.... ఇట్టా పెంచీసుకుంతా పోత్తన్రు...."

"అమ్మడియమ్మ.... అందుకేనేట్రా పిట్రోలేయించుకోనీకి ఎప్పుడెల్నా రేటు పెరగతా ఉందే తప్ప దిగింది నేదు.... సేతిల సొమ్ముల్నేక పెజానీకం అలో లచ్చనా అంతుంటే ఈల్లేమో రేట్లు పెంచుకపోత్తన్నన్నమాట.... మూలిగే నక్క మీన తాటిపండడేసినట్టు...."

"అక్కడేమో అలగుంది.... ఇంగ మనకాడికొత్తే మనం మాత్తరం తక్కువ దిన్నామా అని అయిదరాబాదు నవాబుగోరు అసింబిలీ బిల్డింగులు తిరగొట్టీడం మొదలెట్టేసినారు. ఆటిలికింకా టైముందట.... రాస్టరం అప్పులేవోఁ పెరిగిపోత్తన్నై.... అయినా చరే నా పరిపాలన్లో సూసుకొండ్రా ఎట్టాంటి బిల్డింగులు కట్టినో అని గొప్పలు సెప్పుకోనీకి ప్రస్తుతానికి ఆరొందల కోట్లట యవ్వారం.... తర్వాతర్వాత ఎంతౌతాదో తెల్దుగానీ...."

"మన్లో మన మాట్రా.... ఈ యవ్వారాల్లో సానామందిరి తలకింతని అంకించుకుంటారు గదరా....?"

"యెర్రోడ్లా అడుగుతావేట్రా! గవుర్మెంటు పన్లంటేనే శానామందిరికి పండగ, సిన్నగంటావేటి....? ఎర్లోల్లై కడతన్రా ఏటి....?"

"విప్పుడు మన్రాస్టరం సంగత్చూద్దాం.... ఇక్కడంతా రంగు పడతంది. ఏసుడు.... మార్సుడు, ఏసుడు.... మార్సుడు. మొత్తానికి పెజల సొమ్ముతో హోలీ సేసుకుంతన్నారు. రాజిదాని పని మూడు ముక్కలాటలాగుంది. కమిటీలకీ, గవుర్మెంటు తరుపున వాదించీ లాయర్లికీ సొమ్ములు బాగా ముడతన్నై.... ఇయ్యి కూడా పెజల సొమ్మూలే అనుకో. విప్పుడు కొత్తగా ఇజీవాడ గ్రౌండులో అంబేత్కరుగారి ఇగ్రహం 125 అడుగులు కడతారంట. దీనికెంత కర్సవుద్దో తెలవదు. అసలు ఈ ఇగ్రహాలు కట్టడవెందుకో అరదం గాదు. మన్దేశింల కట్టినన్ని ఇగ్రహాలు పెపంచకంలో ఇంకెక్కడా వుండవేమోన్రా...."

"రాజుల సొమ్ము రాల్ల పాలని ఊరికే అన్నారేట్రా? సొమ్మొకడి.... సోకొకడిదీ!"

'ఇక్కడో మంచి పన్జేసినార్రోయ్!'

'ఏంటో?'

"మందు సాపులు తగ్గించీసి, మందు రేటు బాగా పెంచీసినారు గదా.... మా గొప్ప పన్జేసినార్రా.... మూడు నెల్లు తాక్కుండా ఎలాగో నెట్టుకొచ్చినారు జనాలు.... ఇంగో నెలా, రెండు నెల్లు ఇలగే వుంటే సానామట్టుకు తాగుడు బందయ్యాది. తగుదునమ్మా అని మందు సాపులు తెరిసీసినారు.... సీపు సరుకమ్మెత్తన్నారట.... రేటెక్కువైపోడంతో ఎక్కడ పడితే అక్కడ నాటు సారా సేసీసుకుంతన్నారు. అదీ దొరక్కపోతే మొన్న కసింకోటల్లో స్పిరిటు తాగేసి సచ్చినారు సూసేవా.... అదన్నమాట చంగతి!"

"అల్ల పని బాగానే వుంది.... మన్సంగతే అద్దానవైపోనాది. ఓ పక్క బళ్ళమీన ఇసక తోలుకొండి అంతన్నారు.... తోలుకుంటే బళ్ళన్నీసికెల్లి టేసన్లలెట్టెత్తన్నారు. గవుర్మెంటు మాత్తరం ఇసకని బోల్డు రేటుకమ్ముకుంటంది. నాయంగా ఇల్లు కట్టీవోల్లకి సుక్కలు కనబడతన్నై!"

'అదేరా కాకుల్ని కొట్టి గెద్దలకెయ్యడం అంటే!'

"మొత్తం మీన సందు సూసుకొని ఎవులి పనాల్లు సక్కబెట్టీసుకుంతన్నారు.... అన్నిదిలా సెడిపోతంది మనవేరా సామ్మాన్నుల్ని పట్టించుకునీవోడు ఒక్కడూ నేడేంటి?....!!!" ✪

ఈ నెల పుస్తకం

# మైత్రీ బుక్‌హౌస్, విజయవాడ

## అభ్యుదయ, విప్లవ సాహిత్యకేంద్రం

# వలస భారతం



(వచన కవితాకావ్యం)


**- డా॥ జి.వి. కృష్ణయ్య**


**సమాజ** అసమాన అభివృద్ధి వికృత ఫలితమే వర్తమాన సమాజపు వలసల సమస్య. కరోనా నేపథ్యంలో పాలకుల తీవ్ర నిర్లక్ష్యం ఫలితంగా ఏర్పడిన వలస కార్మికుల సమస్య మీద జనసాహితి రచయిత డా॥ జి.వి. కృష్ణయ్య రాసిన వచన కవితాకావ్యం ఇది.


మన దేశంలో 14 కోట్లమంది వలస కార్మికులు ఉన్నారనీ, రోజుకి కోటిమంది కార్మికులు పనుల కోసం వలస ప్రయాణం చేస్తున్నారనీ అంచనా. ఈ లాక్‌డౌన్ సందర్భంలో వలస కార్మికులు కాలినడకన వేలాది మైళ్ళు నడచి, తమ తమ సొంత వూర్లకు చేసిన మహాప్రస్థానం 73 ఏళ్ళ 'స్వతంత్ర' పాలన వైఫల్యాలను ఎత్తిచూపింది. ఈ నేపథ్యంలో నేటి ఆర్థిక, సామాజిక, రాజకీయ, నైతిక విషయాలను వివరిస్తూ డా॥ జి.వి. కృష్ణయ్య ఈ వచన కావ్యాన్ని రచించారు. ప్రజారచయితలు ప్రజలతో మమేకమై వారి సమస్యలనూ, వాటి పరిష్కార మార్గాలనూ, తమ తమ రచనలలో చిత్రించాలని చెప్పిన మాక్సిమ్ గోర్కీ అడుగుజాడల్లో సాగిందీకావ్యం.

1/8 డెమ్మీలో పుటలు 56. వెల : రూ. 50/- ప్రచురణ : జనసాహితి.

ప్రతులకు : **మైత్రీబుక్‌హౌస్, అరండల్‌పేట, కార్ల్‌మార్క్స్‌రోడ్డు, విజయవాడ - 520002. ఫోన్ : 91779 79622** ✪





# బాల సాహితి

## కరోనా వైరస్ (కోవిడ్ - 19)

**- ఓ.హెచ్. మిత్ర,** 8వ తరగతి

**బయట** ఎండ మండిపోతుంటే ఇంట్లోకి వచ్చాను. నా 15 ఏళ్ల కూతురు మంచినీళ్ళు ఇస్తూ "నాన్నా దొరికాయా?" అని అడిగింది. "లేదమ్మా 7 షాపులు వెతికాను. ఎక్కడా లేవు కాని మాస్కులు మాత్రం దొరికాయి." అంటూ నా కూతురికి మాస్కులు ఇచ్చి కుర్చీలో కూలబడ్డాను.

కొంతసేపటికి మా ఆవిడ వచ్చి "హేండ్‌వాష్లు దొరకలేదా?.... మాస్కులింకో నాలుగైదు తేలేకపోయారా?. అయినా ఇంతసేపేంటి?" జవాబు ఇవ్వటానికి గ్యాపు లేకుండా ప్రశ్నలడిగేస్తుంది.

"హేండ్ వాష్ల కోసం 7 షాపులు వెతికానే ఎక్కడా లేవు. అయినా మాస్కులేమయినా తక్కువనుకున్నావా ఒక్కోటి 20 రూపాయలు. 7 షాపులు వెతికితే ఇంతసేపవ్వదా మరి". ఓపిగ్గా సమాధానాలు చెప్పుకొచ్చాను. "చల్లబడ్డాక మళ్ళీ వెలతానులే మన సిటీలో షాపులకు కరువా అంటూ" అన్నానికి కూర్చున్నాను.

అన్నం తింటుంటే నా కూతురు "నాన్నా చికెన్ తినకూడదని మనం వాట్సాప్‌లో చూసాం కదా! కానీ ఈవేళ ప్రైవేట్ క్లాస్‌లో కొంతమంది డాక్టర్లు వచ్చి 'చికెన్ తినడం వలన ఎలాంటి నష్టంలేదు. ఎలాగూ రేట్లు తగ్గాయి గనుక లాగించేయండి' అన్నారు. ఇంతకీ చికెన్ రేట్లు ఎంత?" అని అడిగింది నారాయణలో చదువుతున్న నా బంగారుతల్లి. "కేజీ 30" కల్పించుకుని చెప్పింది నా ఆవిడ. "మరి అంతకుముందో అడిగింది నా కూతురు" ఈసారి నేను త్వరగా చెప్పేసాను. "120" అని. నా కూతురు ఒక్క క్షణం షాక్ తిన్నట్లు ముఖం పెట్టి మళ్ళా తినసాగింది. "అవునూ మాస్కుల రేట్లు పెరిగాయి కదా మరి చికెన్ రేట్లు ఎందుకు తగ్గిపోయాయి" నా ఆవిడ యథాలాపంగా అడిగింది. "ఒక్క చికెన్ ఏంటి మొత్తం నాన్‌వెజ్ రేట్లన్నీ పడిపోయాయి" అన్నాను నేను.

"కాని పాపం ఆ అమ్ముకునేవారి పరిస్థితి 120 రూపాయల్ని ఇచ్చి 30 రూపాయల్ని తీసుకున్నట్లు ఉంది. కాని ఇంకెంత కాలంలే ఎండలు ముదిరితే మళ్ళీ మామూలు అయిపోతుంది" అన్నాను. "అవున్నాన్న నిన్న పేపర్లో చదివాను. మాస్కులని నిత్యావసర వస్తువుల్లోకి చేర్చారటగా". తానన్న మాటకి ఇప్పుడు మేము మాట్లాడుకుంటున్న మాటలకి సంబంధం లేదనిపించినా తర్వాత అర్థమైంది.

అర్థమైయ్యాక నాకూ ఒకటి గుర్తు వచ్చింది. అప్పుడు నేనన్నాను. "నేనూ వాట్సాప్‌లో చూసాను. విదేశాల్లో కూడా మనకిచ్చినట్లే సెలవులు ఇచ్చారు. కాని ఫ్లయిట్లు లేకపోవడంతో అక్కడ చదువుతున్న మన పిలలు చిక్కడిపోయారు. పాపం అక్కడ తిండి తిపారం లేకుండా ఉన్నారట" అన్నాను. ఇంతలో మా ఆవిడ "అంతదూరం పంపి చదివించాల్సిన అవసరం ఏంటంట. ఇక్కడ చదివిస్తే కొంపలంటుకుంటాయా?" అంటూ అంతెత్తు లేచింది. తన కోపం చూసి నవ్వు వచ్చినా తన మాటల్లో నిజముంది అనిపించింది.

అన్నీ సర్దేసి కొంచెంసేపు న్యూస్ చూద్దామని కూర్చున్నాను. లేకపోతే మా ఆవిడ తన సీరియల్స్ కోసం నేను రిమోట్ ఇచ్చేయాలి మరి. కానీ ఈ మధ్య ఏ ఛానల్ పెట్టినా దాని గురించే వస్తుంది. నేను పెట్టిన ఛానల్లో భారతదేశం పటం చూపించి వ్యాధి సోకినవారి సంఖ్యను రాష్ట్రాల వారీగా చెప్తుతూంది. అన్ని రాష్ట్రాలు అయిపోయాక న్యూస్ రిపోర్టర్ హాలీవుడ్ హర్రర్ సినిమాలలో దయ్యాన్ని చంపే మంత్రం చదువుతున్నట్టు వార్తలు చెప్తుతున్నాడు. అతను చెప్పేవాటిలో నాకు ఒకటి బాగా నవ్వు తెప్పించింది. అదేమిటంటే ట్రాఫిక్ పోలీసులు రోడ్డుకు అడ్డంగా నిలబడి చేతులెలా కడుక్కోవాలో చెబుతున్నారు. తర్వాత నరేంద్రమోదీ జనతా కర్ఫ్యూలో చప్పట్లెందుకు కొట్టాలో చెప్తుతుంటే నేను తట్టుకోలేకపోయాను. చప్పట్లు కొడితే వచ్చే శబ్దానికి వైరస్‌లు చనిపోతాయని వేదాల్లో రాసారట. ఈ దేశంలో ఉన్నందుకు తలెక్కడ పెట్టుకోవాలో అర్థంకాలేదు నాకు. ఎన్నికలు ఎగ్జాములు పోష్టుపోను ఔతాయనే అంశంపై చర్చలు అవుతున్నాయని న్యూస్ రిపోర్టర్ చెప్పడం. మా ఆవిడ రిమోట్ లాక్కోవటం ఒకేసారి జరగడంతో అక్కడి నుండి వచ్చేసాను.

ఇలాంటి సమస్యలు వచ్చినపుడు మనదేశం ఎప్పుడు శాస్త్రీయమైన నిర్ణయాలు తీసుకుంటుందా అని అనుకుంటూ హేండ్ వాష్లు కొనడానికి బయటికి వెళ్ళాను. ✪

# నేనెవరిని?

- 'బాలబంధు' అలపర్తి వెంకట సుబ్బారావు

**చిట్టి** చిట్టి పాపలార
చెప్పండీ నేనెవరిని? ॥

మురికి అయితే తెల్లగాను
మురికి పోతే నల్లగాను
రూపు దాల్చుచుండు నేను
చూపరులకు చోద్యముగను ॥

మూడు అక్షరాలు వున్న
ముచ్చటైన మాట నేను!
తిప్పి చదువ, ఇల్లు గట్ట
ఒప్పిదమగు కొయ్యనగుదు ॥

ఆ కాలంలో దిద్దిరి
అక్షరాలు ఇసుకలోన!
అక్షరాలు దిద్ద నేడు
అవసరమయ్యాను నేను ॥

'మాట్లాడను' అనే మాట
మరోలాగ అని చూడుడు!
నే నెవరినో వివరంగా
నేనే చెప్పినట్లుండును ॥

తెలియలేద ఇప్పటికీ?
తెలిపెద నేనే 'పలకను' ॥

# జై జవాన్ జై కిసాన్

- జ్యోత్స్న

**రైతు** దేశానికి వెన్నుముక
కాని ఇప్పుడు కర్రెముక
అలాంటి వెన్నుముకను కర్రెముక చేస్తున్నారు
కర్రెముకలను తొక్కి, నలిపేసి,
పిండి, పక్కకు పడేస్తున్నారు
రైతు ఎవరికోసం కష్టపడుచున్నాడు
మనకోసం, దేశంకోసం, ప్రపంచం కోసం
ఎండనక, వాననక కష్టపడి
నానా తిప్పలు పడేవాడు రైతు
పంట చేతికి వస్తే ఆనందం లేక
అది అమ్ముడౌతుందో లేదో అనే భయంతో
పంట పండిస్తున్నాడు
రైతుకు ఏంటి కర్మ
కరోనా మహమ్మారి వచ్చింది
ఎక్కడి పనులు అక్కడే ఆగాయి
కాని రైతు కష్టం ఆగలేదు
ఎలాంటి మహమ్మారి వచ్చిన
రైతు కష్టం ఆగదు
జై కిసాన్

# గోరంట్ల (కొత్తపల్లి) వాణీదేవి 2వ వర్ధంతి



**గోరంట్ల** (కొత్తపల్లి) వాణీదేవి వెంకటకృష్ణవర్మ, సరళాదేవి దంపతులకు తొలి సంతానంగా 16-12-1936న జన్మించారు. తల్లిదండ్రులిద్దరూ హిందీ పండితులు, స్వాతంత్ర్య సమరయోధులు. వాణీదేవి విద్యావనం (కృష్ణాజిల్లా)లో హిందీ చదివారు. అక్కడే చదివిన గోరంట్ల వెంకటేశ్వరరావును వివాహం చేసుకున్నారు. కొన్నేళ్ళపాటు మహిళా సంక్షేమశాఖలో అధికారిగా, అరకువ్యాలీలో, స్టువర్టుపురం సెటిల్‌మెంట్‌లో పనిచేసి, చీరాల పురపాలక ఉన్నత పాఠశాలలో భర్తతోపాటు హిందీ పండితులుగా స్థిరపడ్డారు. హిందీ నుండి వీరు అనువదించిన ఎన్నో కథలను 'విపుల' మాసపత్రిక ప్రచురించింది.

వీరి భర్త వెంకటేశ్వరరావు తన 86వ ఏట 2013 జనవరి 1న మరణించారు. వీరి జ్యేష్టకుమారుడు మధుబాబు 2003 జూన్ 30న బొంబాయిలో ఒక ప్రమాదంలో మరణించారు. వాణీదేవి తన 82వ ఏట చీరాలలో 27 జులై 2018న మరణించారు.

మొదటి వర్ధంతి సందర్భంగా వారిని జ్ఞాపకం చేసుకుంటూ వారి కుమార్తె కొత్తపల్లి సుధ, కొడుకు లోకేశ్, కోడళ్ళు కల్యాణి, శైలజలు 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి 27 జులై 2019న నలభై వేలు విరాళంగా ఇచ్చారు. వారికి కృతజ్ఞతలు.

ప్రజాసాహితి

పుస్తక పరిచయం :

# సంపన్నులైన విజేతలే సమస్తం హస్తగతం చేసుకుంటారు

## ప్రపంచాన్ని మార్చుతామంటున్న శిష్టవర్గపు కపటత్వం

పరిచయం : **జి.వి. భద్రం**

**ఆనంద్ గిరిధర్‌దాస్** ఆంగ్లంలో రాసిన **"Winners Take All"** పుస్తక పరిచయం

**ప్రపంచమంతటిలోనూ** అత్యంత సంపన్నులుగా వున్న పిడికెడుమంది వ్యక్తులు తమ దాతృత్వం ద్వారా ప్రపంచాన్ని మార్చివేసే కృషిని కొనసాగిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారు. వివిధ ఫౌండేషన్లను, ట్రస్టులను, ఆలోచనాపరుల – మేధావుల ఆలోచనా సమ్మేళనాలను, వేదికలను ఏర్పాటు చేసి వాటి ద్వారా తాము ప్రపంచాన్ని మార్చివేస్తున్నట్లుగా ప్రచారం చేస్తున్నారు. తాము చేబడుతున్న కార్యకలాపాల ద్వారా ప్రపంచమంతటా మిలియన్ల మంది ప్రజలు మేలు పొందుతున్నారనీ, ఆర్థికంగా, ఉద్యోగపరంగా ఉన్నతస్థాయికి చేరుకొంటున్నారనీ నొక్కి చెబుతున్నారు. తమ దాతృత్వ కార్యకలాపాల ద్వారా ప్రపంచంలోని ప్రజలందరికీ సుఖసంతోషాలని అందించగలమని పదేపదే ప్రచారం చేస్తున్నారు.

ప్రపంచంలో అత్యంత సంపన్నులుగా వున్న వీరు, తమ దాతృత్వం ద్వారా, దాతృత్వ కార్యకలాపాల ద్వారా తీసుకువచ్చే మార్పు యొక్క స్వభావ, స్వరూపాలు ఏమిటి? వీరు ప్రచారం చేసే భావాలు, అభిప్రాయాల యొక్క లోతైన అర్థం ఏమిటి? వీరు తమ కార్యకలాపాల ద్వారా, ప్రచారం ద్వారా కోరుకొంటున్న – తీసుకువస్తున్న 'ప్రాపంచిక మార్పు' యొక్క మర్మం, అంతరార్థం ఏమిటి అన్న విషయాలను, వివరంగా, సోదాహరణంగా ఆనంద్ గిరిధర్‌దాస్ తన పుస్తకం "విజేతలే సమస్తం హస్తగతం చేసుకుంటారు" (Winners Take All)లో కళ్ళకు కట్టేటట్లు వివరించారు.

ఆనంద్ గిరిధరదాస్ గతంలో "నిజమైన అమెరికన్" – "భారతదేశం పిలుస్తోంది" ("The True American" and "India Calling") అనే పుస్తకాలను రచించారు. వీరు 'ది న్యూయార్కు టైమ్స్' పత్రికకు విదేశీ విలేఖరిగానూ, కాలమిష్టుగాను 2015 నుండి 2016 దాకా పని చేసి ఇటలీ, ఇండియా, చైనా, దుబాయి, నార్వే, జపాన్, హైతి, బ్రెజిల్, కొలంబియా, నైజీరియా, ఉరుగ్వే, అమెరికాదేశాల నుండి ఆ పత్రికకు రిపోర్టులు పంపించారు. ఆయన 'అట్లాంటిక్' 'ది న్యూయార్కు' 'ది న్యూ రిపబ్లిక్' పత్రికలకు కూడా వ్రాశారు. ఆయన న్యూయార్కు యూనివర్శిటీలో విజిటింగ్ స్కాలర్. ఎమ్.ఎస్.ఎన్. బి.సి. సంస్థ ప్రసారాలకు రాజకీయ విశ్లేషకులు. ఆయన రచనలను సొసైటీ ఆఫ్ పబ్లిషర్స్ ఇన్ ఆసియా అనే సంస్థ గౌరవించింది. యేల్ యూనివర్శిటీ ఆయనకు ఫెలోషిప్ యిచ్చింది. ఆయన న్యూయార్కు పబ్లిక్ లైబ్రరీ యిచ్చే హెలెన్ బెర్న్‌స్టీన్ అవార్డు గ్రహీత.

ఆయన కొంతకాలం పాటు మెక్కిన్సే సంస్థలో విశ్లేషకుడిగా పని చేశారు. ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాకరమైన టెడ్ (TED) అనే ప్రపంచంలోనే అత్యంత సంపన్నుల మీడియా సంస్థవారి ప్రధాన ఉపన్యాస వేదికలో రెండుసార్లు ఉపన్యసించారు. వీరు 'ప్రపంచాన్ని మార్చాలి' అని జరిపిన పలు సమాలోచనాసదస్సుల్లో పాల్గొని, ఉపన్యాసాలు యివ్వటం ద్వారా ఎంతో పేరు పొందారు. ఆ క్రమంలో ఆయన యీ "అత్యంత సంపన్నులు ప్రపంచాన్ని మార్చటం" అన్నదాన్ని ఒక కపట నటనగా అర్థం చేసుకున్నారు. తాను కూడా భాగస్తునిగా వున్న, తన మిత్రులెందరితోనో కూడిన అత్యంత సంపన్నుల బృందం యొక్క నమ్మకాలను, ఆచరణలను, వ్యవస్థను, విమర్శనాయుతంగా పరిశీలించి విశ్లేషణాపూర్వకంగా వ్రాసినదే యీ 'విజేతలే సమస్తం హస్తగతం చేసుకుంటారు !' అన్న పుస్తకం.

'ప్రపంచాన్ని మార్చటం' అన్నదాన్ని అత్యధిక సంపన్నులు తమ బాధ్యతగా తమకుతామే నిర్ణయించుకున్నారు. అయితే యిది ప్రజలకు సంబంధించిన విషయం కనుక ప్రజలుగా మేమే యీ బాధ్యతను చేపడ్తాం అంటూ ప్రపంచ ప్రజానీకం అందుకు ఉద్యుక్తులు కావాలనే ఉద్దేశ్యంతో తాను యీ పుస్తకాన్ని రాసానని ఆనంద్ గిరిధర్‌దాస్ తెలియజేశాడు.

ఈ రోజున అమెరికా అంతటా ఒక రకమైన 'నూతనత్వం' ఆవహించి కంపెనీలలో, ఆర్థికవ్యవస్థలో వివిధ ప్రాంతాలలో, పాఠశాలల్లో, సాంకేతికతల్లో, సామాజిక నిర్మాణాల్లో – జేగంటలు మోగిస్తోంది. కానీ యీ నూతనత్వం అన్నది అమెరికన్ సమాజంలోకి అభివృద్ధిని తీసుకురాలేకపోయింది. మొత్తం అమెరికన్ నాగరికతలో మెరుగుదల తీసుకురావటంలో విఫలమయింది. అమెరికన్ శాస్త్రజ్ఞులు వైద్యరంగంలో ఎన్నో ముఖ్యమైన ఆవిష్కరణలు చేస్తూవుంటారు. కానీ సగటు అమెరికన్ యొక్క ఆరోగ్యం నానాటికీ క్షీణిస్తూనే వుంటుంది. ఇతర సంపన్న దేశాలలోని ప్రజల ఆరోగ్యస్థాయి కన్నా ఇతడి ఆరోగ్యస్థాయి తక్కువగానే వుంటుంది. అలాగే అమెరికాలో శక్తిమంతమైన వీడియోలు, ఇంటర్‌నెట్ల ద్వారా ఉచిత బోధనాపద్ధతులు గణనీయంగా పెరిగినా, 12వ తరగతి చదివే విద్యార్థుల, విద్యాస్థాయి 1992 నాటికన్నా తక్కువ స్థాయిలోనే వుంది. అమెరికాదేశంలో 'పాకశాస్త్రకళ' పునరుజ్జీవనం పొందిందని చెబుతున్నా, రైతుల మార్కెట్లు, సంపూర్ణ ఆహారాలు లభ్యమవుతున్నాయని చెబుతున్నా – ప్రజలకు పౌష్టికాహారం అందని పరిస్థితి వుంది. ఊబకాయం, అందుకు సంబంధించిన వ్యాధులవాత పడేవారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. గతంలో కన్నా యిప్పుడు ఒక ఔత్సాహిక

పారిశ్రామికవేత్త కావటానికి వీలైన సాధనాలు విపరీతంగా అందుబాటులోకి వచ్చినాకూడా, ఆన్‌లైన్ ద్వారా కోడింగ్ నేర్చుకోడానికి లేదా ఉబర్ డ్రైవరుగా మారే అవకాశాలు విద్యార్థుల ముందు కోకొల్లలుగా వున్నాకూడా, అమెరికాలో స్వంత వ్యాపారాలు కలిగివున్న యువజనుల సంఖ్య 1980 నాటి సంఖ్యలో మూడింట రెండొంతుల స్థాయికి పడిపోయింది. ప్రపంచమంతటా విజయవంతమైన, అమెజాన్ ఆన్‌లైన్ బడా పుస్తక విక్రయ సంస్థ అమెరికాలోనే పుట్టినా, ప్రజల వినియోగార్థం గూగుల్ సంస్థ 25 మిలియన్ల పుస్తకాలను స్కాన్ చేసినా, అమెరికాలో నిరక్షరాస్యత గతంలో మాదిరిగానే మిగిలిపోయింది. సంవత్సరానికి ఒకసారైనా ఒక సాహిత్యగ్రంథాన్ని చదివే అమెరికన్ పాఠకుల సంఖ్య, యిటీవలి దశాబ్దాలలో నాలుగవవంతుకు పడిపోయింది. అమెరికా సమాజంలోనే పైనున్న 10 శాతం మంది ప్రజలకు పన్నులు చెల్లించటానికి ముందు వుండే సంపద 1980 నుండి సగటున రెట్టింపయింది. పైనున్న 0.001 శాతం మంది సంపద ఏడురెట్లకు మించి పెరిగింది. కానీ సగటు అమెరికన్ యొక్క ఆదాయం 1980 నుండీ ఎటువంటి ఎదుగుదల లేకుండా అదే స్థాయిలో వుంది. అంటే యీ నాల్గు దశాబ్దాలు పాటుగా బ్రహ్మాండమయిన ఆర్థిక అభివృద్ధి జరిగినా ఆ అభివృద్ధి అనేది 117 మిలియన్లమంది అమెరికన్ల యొక్క ఆదాయం పెరగటంలో కనీస మాత్రమైన ప్రభావాన్ని కూడా కలుగజేయ లేకపోయింది. వివిధ ఆవిష్కరణల ద్వారా, పోటీ యొక్క లాభాలను పీల్చుకోవటానికి వీలుగా ప్రపంచంలోనే బిలియనీర్లు మరింతగా సంపదను కూడబెట్టుకోవటానికి వీలుగా, ఆర్థికవ్యవస్థ రూపొందింప బడింది. ప్రపంచ జనాభాలో పైస్థాయిలోవున్న 10 శాతం మంది, మొత్తం భూగోళంలోగల సంపదలో 90 శాతం సంపదకు స్వంతదారులయ్యారు.

ఈ రకంగా అమెరికాలోని సంపన్నులు కేవలం డబ్బు మీద, అభివృద్ధి మీద మాత్రమే గుత్తాధిపత్యాన్ని సాధించలేదు. వీరు ప్రపంచంలోని సగటు మానవుని ఆయుఃప్రమాణం కన్నా, 15 సంవత్సరాల అధిక ఆయుఃప్రమాణాన్ని కూడా పొందారు.

ఈ పరిస్థితులు సాధారణ అమెరికన్ ప్రజలు తాము మోసానికి గురయ్యినట్లు అభిప్రాయపడటానికి దారితీసాయి. ఇటీవలి సంవత్సరాలలో అమెరికన్ ఓటర్లు తమ వ్యవస్థ పట్ల అనుమాన పడేటట్లుగానూ, నిరసన తెలిపేటట్లుగానూ చేయడానికి యీ పరిస్థితులు కారకమయ్యాయి. తమ సామాజిక, ఆర్థిక, రాజకీయ పాలనావ్యవస్థ ఛిద్రమై పగిలిపోయినట్లుగాను, దాన్ని పునర్నిర్మించాల్సిన అవసర మున్నట్లుగానూ ప్రజల్లో గుర్తింపు పెరుగుతోంది. ప్రజలు పదేపదే వ్యవస్థను గర్హించటం, ఖండించటం, నిరసించటం అన్నది జరుగుతోంది.

పెరుగుతున్న ప్రజల ఆగ్రహం నుండి తమను తాము కాపాడు కోవటానికి తమ ఎస్టేట్లలో, భవంతుల్లో దాక్కొని వుంటూనే ఈ 'మూకలకు' వ్యతిరేకంగా, మరింత రాజకీయ అధికారం కోసం కొంతమంది సంపన్నులు బయటికి వస్తున్నారు. మరోవైపు అనుమానంతోనూ, నిరసనతోనూ కుతకుత లాడుతున్న అమెరికన్ ఓటర్లు, జనాకర్షక ఉద్యమాలపట్ల ఆకర్షితులవుతూ, రాజకీయ జీవితంలోకి సోషలిజాన్నీ, జాతీయవాదాన్నీ కేంద్రస్థానంలోకి తీసుకువస్తున్నా అన్నిరకాల కుట్రపూరితమైన సిద్ధాంతాలకు, తప్పుడు వార్తలకు బలయిపోతున్నారు.

కానీ యిటీవలి సంవత్సరాలలో చాల మంది సంపన్నులు తమ ప్రయోజనాలను పెంపొందించుకునే మరోరకమైన ప్రయత్నానికి పూనుకున్నారు. వాళ్ళు యీ సమస్యను, తమ చేతిలోకి తీసుకొని ప్రజలకు మేలు చేసే ప్రయత్నాలంటూ కొన్ని కార్యక్రమాలు ప్రారంభించారు. అత్యంతదారుణమైన, అక్రమమైన అసమానవ్యవస్థలో అత్యుత్తమ సంపన్నులస్థాయిలోవున్న విజేతలైన వీరు తాము మార్పునుకోరేపక్షాల వారి సమర్థకులన్నట్లుగా ప్రకటించుకుంటున్నారు. తమకు సమస్య ఏవిటో తెలుసు కాబట్టి తాము ఈ సమస్యను పరిష్కరించటంలో భాగస్తులుగా వుండాలని కోరుకొంటున్నారు. వాస్తవానికి యీ సమస్య పరిష్కారం కనుగొనటం కోసం జరిగే వెతుకులాటకు వారు నాయకత్వం వహించాలనుకుంటున్నారు. తాము చూపించే పరిష్కారాలకు, సామాజిక మార్పుకు తామే ముందు భాగాన వుండాలని వారు నమ్ముతున్నారు. ఈ అత్యంత సంపన్నులు తమకు తాము స్వంతంగానే చొరవతో ఈ ప్రయత్నాలు చేబట్టారు. సామాజికమార్పు అన్నది మరొకరకమైన స్టాకులు (షేర్లు) యజమాన్యమో, లేదా కార్పోరేట్ కంపెనీల పునర్నిర్మాణమో అన్నట్లుగా వారు యీ సామాజిక మార్పుకై ప్రయత్నం చేస్తున్నారు.

వీరు చొరవగా చేబట్టే ప్రయత్నాలలో ఎక్కువ భాగం అప్రజాస్వామికమైనట్టివి. ఆ ప్రయత్నాలు సమస్యను పరిష్కరించవు లేదా సార్వత్రికమైన పరిష్కారాలను చూపవు. అందుకు బదులు సమస్యను మార్కెట్టు నిర్వహణావిధాన పద్ధతుల్లో ఆలోచించి, సమస్యను పరిష్కరించటం కోసం ప్రైవేటురంగాన్ని ఉపయోగించాలనీ, ప్రైవేటురంగం కొల్లగొట్టిన సంపదలోనుంచి ఎంగిలి మెతుకులను ముష్టివేసే దాతృత్వం ద్వారా పరిష్కరించాలనీ, ప్రభుత్వం అన్నదానితో నిమిత్తం లేకుండా పరిష్కరించాలనీ వారు కోరుకొంటారు. అన్యాయాలను, అసమానతలను పరిష్కరించగల రహస్యం తెలిసినవారు, అత్యంత సంపద్వంతపు స్థాయిని పొందిన తమ వర్గానికి చెందిన విజేతలేనన్న భావాన్ని ప్రభావవంతంగా ప్రచారం చేస్తారు. తమను విజేతలుగా చేసిన సాధనాలే, దృక్పథాలే, వైఖరులే యీ సమస్యకు కూడా పరిష్కారాలని వారు భావిస్తారు.

ఆ రకంగా ప్రజలచేత తీవ్రంగా నిరసించబడే ప్రమాదమున్నవారే మనను అసమానత్వయుగం నుండి రక్షించే రక్షకులుగా తమను తాము తిరిగి తీర్చిదిద్దుకొంటున్నారు. గోల్డ్‌మన్ సాక్స్ కంపెనీలో (దీనిని 1869 మార్కస్ గోల్డ్‌మెన్, అతని అల్లుడు సామ్యూల్ సాక్స్ స్థాపించారు. ఇది అమెరికాకు చెందిన బహుళజాతి మదుపు బ్యాంకుగా, ఆర్థిక సేవలు అందించే సంస్థ. దీనిలో 38,300 ఉద్యోగులున్నారు. 2008 నుండీ 1.6 బిలియన్ల డాలర్లు దానధర్మాలకు వెచ్చించింది.) సామాజిక ఆలోచన గల ఫైనాన్సియర్లు తమ ప్రయత్నాన్ని "కొంత మీరు లాభపడే

– కొంత మేము లాభపడే" (Win-Win) పద్ధతిలోవున్న 'గ్రీన్‌బాండ్ల'కు మరియు 'ప్రభావపూరిత పెట్టుబడి' ద్వారా చేబట్టారు. సాంకేతిక కంపెనీలైన ఉబర్, ఎయిర్‌బర్డ్ లాంటి కంపెనీలు, పేద ప్రయాణీకులను బాడుగకు కార్లలో త్రిప్పే డ్రైవర్లుగా అనుమతించే రూపంలోనూ, లేదా తమ యిళ్ళలో గల విడి గదులను యితరులకు అద్దెకు యివ్వడానికి అనుమతించిన రూపంలో, ఆ పేదలకు సాధికారితను కల్పిస్తున్నవారిగా రూపుదిద్దుకొన్నారు. తాము బోర్డు సభ్యుల స్థానాలను చేపట్టడం ద్వారా నాయకత్వ స్థానాలను చేపట్టడం ద్వారా మరింత ఎక్కువ సమానత్వాన్ని సాధించే పనిని నిర్దేశించే పాత్రను తాము విధిగా చేపట్టనీయాలని సామాజికరంగాన్ని ఒప్పించేందుకు మేనేజిమెంట్ కన్సల్టెంట్లు, వాల్‌స్ట్రీట్ మేధావులూ శతవిధాల ప్రయత్నిస్తున్నారు. సంపన్న వర్గాధిపతులు సదస్సులను, పథకాలను చేపట్టి కొత్త ఐడియాలను యిచ్చే ఫెస్టివల్సు (ఉత్సవాలను)ను తమ సంస్థల ప్రాయోజకత్వాన నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం అమలులోవున్న భ్రష్టమైన వ్యవస్థలోని తప్పులను, దోషాలను సవరించటానికి బదులుగా, ఆ తప్పుడు వ్యవస్థ పరిధికే కట్టుబడి, ప్రజల జీవితాలను మెరుగుపరచటం కోసం ఆలోచించటం కోసం, అంగీకరించే "ఆలోచనాపరులైన నాయకుల" (thought - leaders)ను పెంపొందించటం కోసం, బడా వాణిజ్య వ్యాపారవర్గాలవారు "అన్యాయం" పై ఆలోచనాపరులైన నాయకుల పేనల్సుకు (వ్యక్తుల సమూహాలకు) ఆతిధ్యాన్నిస్తున్నాయి. లాభాలను ఆర్జిస్తున్న కంపెనీలు ప్రశ్నార్థకమయిన 'కార్పోరేటు సామాజిక బాధ్యత' కార్యక్రమాలను, నిర్లక్ష్యాపూరితమైన పద్ధతుల ద్వారా చేబడుతున్నాయి. తీవ్రమయిన సామాజిక సమస్యలకు కారకులై, తమ సంపద సామ్రాజ్యాలను నిర్మించుకొన్న కొందరు సంపన్నులు, తమ సంపదను "వెనక్కి యిచ్చేస్తున్నామంటూ" గందరగోళం సృష్టిస్తున్నారు. ఏస్టెన్ ఇనిస్టిట్యూట్, క్లింటన్ ఇన్షియేటివ్ లాంటి అత్యంత సంపన్నుల నెట్‌వర్కు వేదికలు, సమస్యలు సృష్టింపబడటానికి ఏ సంపన్నులు కారకులో, ఆ సమస్యలను వారే తమ చేతుల్లోకి తీసుకొని, వాటిని పరిష్కరించటానికి తామే స్వయంనియమిత నాయకత్వాలుగా వుండేందుకు వీలుగా శిక్షణ యిస్తున్నాయి. సమాజం గురించి పట్టించుకొనే ఆలోచనగల ఒక క్రొత్త రకం జాతి కంపెనీలు, "బి.కార్పోరేషన్లు" అనేవి జన్మించాయి. ఇవి కార్పోరేట్ల యొక్క మరింత స్వప్రయోజనాల కోసం పుట్టుకొచ్చినవి. కార్పోరేషన్లను ప్రభుత్వాల ద్వారా నియంత్రించటం కన్నా వాటిని ఎటువంటి నియంత్రణలు లేకుండా వ్యాపారం చేయనీయాలనేది వీటి డిమాండు. కార్పోరేషన్ల ప్రయోజనాలే ప్రజల సంక్షేమానికి నిశ్చయమైన గ్యారంటీ అని యీ బి.కార్పోరేషన్లు విశ్వసిస్తున్నాయి. సిలికాన్ వ్యాలీలో గల యిద్దరు బిలియనీర్లు డెమాక్రిటిక్ పార్టీకి తమ ఫండు యిన్షియేటివ్ ద్వారా నిధులు సమకూర్చారు. వారిలో ఒకరు తాము నిధులివ్వడం వలన అధికారం లేని ప్రజల గళం మరింతగా విస్తరించబడుతుందనీ, తమలాంటి సంపన్నుల రాజకీయ పలుకుబడి తరిగిపోతుందనీ కూడా ప్రకటించవచ్చు.

ఈ అత్యంత సంపన్నులవర్గం "ప్రపంచాన్ని మార్చటం", "ప్రపంచాన్ని మరింత మెరుగైన ప్రదేశంగా మార్చటం" వంటి క్రొత్త భాషను మాట్లాడుతున్నారు. వారు చేపడుతున్న దాతృత్వ కార్యకలాపాల ద్వారా సహాయపడుతున్నప్పటికి వారు మరింతగా సంపదను కూడబెట్టుకొని దాచుకుంటున్నారన్నదే యథార్థం. వీరి కార్యకలాపాల వలన సగటు అమెరికన్ యొక్క జీవితం నామమాత్రంగా కూడా మెరుగుపడలేదన్నదే వాస్తవం.

ఈ అత్యంత సంపన్నవర్గం అభివృద్ధి పై తమకే గుత్తాధిపత్యం వుండే విధంగా సామాజిక పొందిక వుండాలన్న అభిప్రాయాన్ని గట్టిగా పట్టుకువ్రేళ్ళాడుతోంది. అలా గుత్తాధిపత్యం గల తన వర్గం తాను కొల్లగొట్టిన దాంట్లోనుంచి కొంతభాగాన్ని దగా చేయబడ్డ జనాలకు విసిరేయాలనుకొంటోంది. ఈ అత్యంత సంపన్నవర్గం వారికి సమాజం పట్ల గల శ్రద్ధ మరియు వారి దోపిడీలకు మధ్యగల సంబంధాన్నీ, ఈ వర్గంవారు చేస్తున్న అసాధారణ సహాయానికీ – అసాధారణ సంపద దాపరికానికీ మధ్యగల సంబంధాన్నీ, ఈ వర్గం అక్రమ, అసమాన స్థాయి (సామాజిక అర్థిక–రాజకీయ అంతస్తు) కి చేరిన విషయాన్నీ, యీ అత్యంత సంపన్న వర్గం తామే చెడగొట్టిన సామాజిక వ్యవస్థలో చిన్నపాటి మార్పుకోసం చేసే ప్రయత్నాలను, లోతుగా అర్థం చేసుకోవటం కోసమే తాను యీ పుస్తకాన్ని రాసినట్లు ఆనంద్ గిరిధర్‌దాస్ ప్రకటించారు.

అత్యంత సంపన్నులు చేపడుతున్న 'ప్రపంచాన్ని మార్చివేసే' యీ దాతృత్వ చొరవల ద్వారా వారు చేయగల్గినంత మేరకు మంచి చేస్తున్నారనే ఒక అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రపంచం యధాతథంగానే, ఎప్పటిలాగే వుందనీ, కాలం యొక్క శక్తులు, ఎవ్వరిచేతా ప్రతిఘటింప వీలులేని బలమైనవనీ, అందువల్లనే అత్యంత అదృష్టవంతులు పేదలకు సహాయం చేస్తున్నారన్నది యీ భావన యొక్క సారం. ఈ సహాయం సముద్రంలో ఒక నీటి బొట్టు లాంటిదే అయినప్పటికీ యిదికూడా ఎంతో కొంత సహాయమేనన్నది ఈ భావన యొక్క అవగాహన.

అత్యంత సంపన్నుల నాయకత్వాన జరుగుతున్న మార్పు సద్బుద్ధితో సాగుతున్నదే కాని ఇది తగినంతగా లేదు అన్నది విమర్శనాయుతమైన మరొక అభిప్రాయంగా వుంది. సంపన్నులు చేబట్టిన యీ ప్రపంచాన్ని మార్చే కృషి కేవలం రోగ లక్షణాలకే చికిత్స చేస్తుంది తప్ప మూలకారణాలకు చికిత్స చేయదు. మనను బాధపెట్టే మౌలిక విషయాలకు యిది చికిత్స చేయదు అన్నది దీని అర్థం. మరింత అర్థవంతమయిన సంస్కరణలను చేబట్టే కర్తవ్యం నుంచి యీ అత్యంత సంపన్నవర్గం మరింత కుంచించుకుపోతోందన్నది యీ అభిప్రాయం యొక్క సారాంశం :

అయితే అత్యంత సంపన్నవర్గాలు చేపట్టిన ప్రపంచాన్ని మార్చివేసే యీ చర్యలను గురించి మరో విమర్శనాత్మక అభిప్రాయం కూడా వుంది. దీని ప్రకారం అత్యంత సంపన్నులు సామాజిక మార్పుకు అగ్రగామిపాత్ర వహిస్తే మెరుగైన సామాజిక మార్పు జరగటంలో వైఫల్యం జరగటం మాత్రమే కాకుండా అది సమాజాన్ని యిప్పుడున్న స్థానంలోనే

యథాతథంగా వుంచివేస్తుంది. అంతేకాకుండా అభివృద్ధి నుండి మినహాయింపబడ్డ (తొలగింపబడ్డ) ప్రజల ఆగ్రహాన్ని మొద్దుబార్చుతుంది. అందువలన అత్యంత సంపన్నవర్గాల చర్యలు, సహాయాలు ఎంతమాత్రమూ సమస్యకు పరిష్కారం కావు. అవి సమస్యను మరింత తీవ్రతరం చేసేవిగా వుంటాయి.

జరుగుతున్న మార్పు ద్వారా వచ్చే లాభాల పంటను కోసుకోవటం ద్వారా కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరింపబడిన సంపద, అధికారాలే, నేటి యుగంలో జరిగిన గొప్ప హాని. ఇప్పుడు అత్యంత సంపన్నులు చేపట్టిన ఈ దాతృత్వ చర్యలు, కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరింపబడిన సంపద, అధికారాల అంచులనైనా తాకవు. వాస్తవంగా అవి సంపద కేంద్రీకరణకు మరింత మద్దతును యిస్తాయి.

ఇటువంటి ధోరణులే అమెరికాలో డోనాల్డు ట్రంపును అధ్యక్షుడిగా ఎన్నికచేసుకొనే చరమస్థాయికి తీసుకొచ్చాయి. డోనాల్డు ట్రంపు ఒక వైపు దోపిడీదారుడు, మరోవైపు సమస్యలను బహిరంగపరిచే వ్యక్తి. ఇతడు అత్యంత సంపన్నవర్గాల నాయకత్వంలో సామాజిక మార్పు సాగాలన్న గాఢ విశ్వాసానికి, ఆచరణకు చెందిన వ్యక్తి ! ఇతడు అత్యంత సంపన్నవర్గానికి వ్యతిరేకంగా ప్రజల ఆగ్రహాన్ని తీవ్రమైన రీతిలో రెచ్చగొట్టి, దానిని అత్యంత సంపన్నవర్గం వైపు మరల్చకుండా, అమెరికాలో అట్టడుగుస్థాయిలో వుండి, దుర్బలులై దాడికి గురవటానికి అనుగుణంగా వుండే ప్రజలవైపుకు చాకచక్యంగా మరల్చి అమెరికన్ ప్రజల ఆకాంక్షలను దోపిడీ చేసిన ప్రబుద్ధుడు. వాస్తవానికి ఏ మోసానికీ, దగాకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టాడో ఆ మోసానికి, దగాకు, దుర్మార్గానికి మూర్తీభవించిన అవతారమే డోనాల్డు ట్రంప్. విద్యావంతుడు, సంపన్నవంతుడూ అయిన ట్రంప్ నేడు తనను తాను పేదల, అవిద్యావంతుల సంరక్షకునిగా చెప్పుకొంటున్నాడు. సంపన్నులను మరింత సంపన్నులుగా చేసి, యితరులను మట్టి కరిపించే సంపన్నులకు, వారిచేత అలా మట్టికరిపించబడ్డ వారిని ఆదుకొని, సంస్కరణలను చేబట్టే కర్తవ్యాన్ని యిచ్చిన వ్యవస్థ యొక్క విషఫలమే ట్రంప్.

అత్యంత సంపన్నులతో నిర్వహింపబడే మార్కెట్టుకు అనుకూలంగా వుండే సామాజిక మార్పు గురించి గాఢంగా విశ్వసించే పలువురు వ్యక్తుల గురించి ఈ పుస్తకంలో రచయిత వివరాలు యిచ్చారు. ఈ వ్యక్తులందరు బలమైన కట్టుకథల భావాలలో మునిగి తేలుతున్నారు. ఈ కట్టుకథల భావాలే అసాధారణ అధికార కేంద్రీకరణకు చెందిన ఒక యుగాన్ని పెంచి పోషించాయి. అత్యంత సంపన్నవర్గాలు చేపట్టిన తమ పక్షపాత పూరితమైన స్వీయ రక్షణ చర్యలను వాస్తవమైన మార్పుగా చలామణీ చేయటానికి ఈ కట్టుకథలు పనికి వచ్చాయి. ఈ కట్టుకథల మోసాన్ని బట్టబయలు చేయడం కోసం రాసినదే యీ పుస్తకం.

"సంపన్నులే 'ప్రపంచాన్ని మార్చటానికీ' 'సామాజిక మార్పు' తీసుకురావటానికీ నాయకత్వం వహించాలి, వారే నిజమైన మార్పును తీసుకురాగల్గుతారు", అన్న వాదనను బలంగా నొక్కి చెబుతున్న అత్యంత సంపన్నవర్గానికి చెందిన కొందరు వ్యక్తులూ, మేధావులూ, ఆలోచనా పరులైన నాయకులూ, సంస్థలూ చేబడుతున్న కొన్ని కార్యకలాపాలను, వారి ఉద్దేశ్యాలను రచయిత యీ పుస్తకంలో మన ముందుంచారు. వీటన్నిటినీ సక్రమంగా అర్థం చేసుకోగలిగితే సామ్రాజ్యవాదంగావున్న అత్యున్నతదశకు చేరిన ప్రపంచ పెట్టుబడిదారీవిధానం, రెండవ ప్రపంచ యుద్ధానంతరకాలంలో ఆ సామ్రాజ్యవాద దశ మరింత ఉధృతమైన రూపంలోకి ఏ విధంగా పరిణామం చెందిందో, సామ్రాజ్య వాదానికి నాయకత్వం వహిస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాదమూ దానిని పెంచి పోషిస్తున్న ప్రపంచంలోని అత్యంత సంపన్నవర్గంగా వున్న పెట్టుబడిదారులూ యీ ప్రపంచమంతటా ప్రస్తుతపు దోపిడీవ్యవస్థనే కొనసాగిస్తూ ఈ వ్యవస్థను కూలద్రోసి మరో ప్రత్యామ్నాయ వ్యవస్థ నిర్మించనవసరం లేకుండా, ప్రపంచంలో సామాజిక మార్పు తీసుకు రావటానికి అంటూ చేపడుతున్న 'చొరవల' కపటత్వాన్నీ, బూటకత్వాన్నీ మనం మరింత స్పష్టంగా అర్థం చేసుకోవటానికీ, నిజమైన పరివర్తనతో ప్రపంచ ప్రజలందరికీ సమానత్వం అందించే వ్యవస్థ నిర్మించటం కోసం చేబట్టాల్సిన కర్తవ్యం నిర్దేశించుకోవటానికీ యీ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుంది.

1970 వరకూ అమెరికాలోనూ ప్రపంచంలోని యితర దేశాల్లోనూ ప్రపంచాన్ని మార్చటం అంటే అర్థిక, రాజకీయ, సామాజిక పాలనా వ్యవస్థలను మార్చటం, సమస్యలకు గల మూలకారణాన్ని నిర్మూలించటం అనే అభిప్రాయం వుండేది. కానీ ఆ తర్వాతి సంవత్సరాల్లో ప్రపంచ మంతటా ప్రత్యేకించి అమెరికాలో ప్రపంచాన్ని మార్చాలంటే ఏది మంచి విధానం అనే సిద్ధాంతం ముందుకొచ్చి, పాత అభిప్రాయాన్ని అధిగమించి ఒక కొత్త సిద్ధాంతం బాగా ప్రచారంలోకి వచ్చింది. దీనినే నయా ఉదారవాద సిద్ధాంతంగా పిలుస్తారు. ఇది ఆర్థిక, రాజకీయ ఆచరణకు సంబంధించిన సిద్ధాంతం. ఈ సిద్ధాంతం "ఒక సంస్థాగత చట్రంలోగల వ్యక్తుల చేతుల్లో వున్న వ్యాపార – వాణిజ్య పరిశ్రమల స్థాపనాస్వేచ్ఛలను, నైపుణ్యాలను వారి నుండి విముక్తం చేయటం ద్వారా, మానవజాతి యొక్క శ్రేయస్సును అత్యుత్తమంగా పెంపొందింపవచ్చును" అని ప్రతిపాదిస్తోంది. నియంత్రణల సడలింపు, ప్రైవేటీకరణ, పలు సామాజిక వ్యవస్థల నుండి ప్రభుత్వనిష్క్రమణ' ద్వారా యిది సాధ్యమవు తుందని యీ సిద్ధాంతం చెబుతుంది. ఈ సిద్ధాంతం మార్కెట్టు ప్రాంతంలో వ్యక్తుల, వ్యక్తిగత స్వేచ్ఛలకు గ్యారంటీయిస్తూనే, ప్రతి వ్యక్తి యొక్క చర్యలకు, శ్రేయస్సుకు ఈ వ్యక్తినే బాధ్యునిగా, జవాబుదారునిగా చేస్తుంది. ఈ సైద్ధాంతిక సూత్రమే వ్యక్తుల యొక్క వ్యక్తిగత సంక్షేమం, విద్య, ఆరోగ్యరక్షణ, పెన్షనును పొందటానికి వర్తింపచేయబడుతుంది. అంటే ఒక్క మాటలో చెప్పాలంటే 'ఎవరి కర్మకువారే బాధ్యులు' – వ్యవస్థ మాత్రం బాధ్యురాలు కాదు అని. ఆ రకంగా ప్రతీ వ్యక్తీ తాను స్వయంసమృద్ధిగా వుండటానికి ఆ వ్యక్తే బాధ్యుడు, ఆ రకమైన బాధ్యత ప్రతీ వ్యక్తిదీ ! అని ఈ సిద్ధాంతం నొక్కి చెబ్తుంది. దీన్నే ఒక విప్లవంగా ఈ సిద్ధాంతకర్తలు అభివర్ణిస్తారు. ఈ నూతనతరహా విప్లవాన్ని కనుగొన్న ఆద్యులు, మితవాద రాజకీయ నాయకులైన రోనాల్డు రీగన్,

మార్గరేట్ థేచర్‌లు. ప్రభుత్వ యొక్క పాత్రను తక్కువచేసి, దానిని నిందించటం ద్వారా వీరిద్దరు రాజకీయాల్లో పైకి వచ్చారు.

అయితే ఈ విప్లవాన్ని కేవలం రాజకీయ మితవాదులే ముందుకు తీసుకుపోలేరు. అందువలన ఈ పనిచేయటానికి విశ్వసనీయమైన ప్రతిపక్షం అవసరం ఏర్పడింది. ఆ అవసరాన్ని అమెరికాలో బిల్ క్లింటన్ తీర్చాడు. మితవాదానికీ, విపక్షవాదానికి మధ్యస్థంగా వుండే మూడవ విధానవాదుల పేరుతో బిల్ క్లింటన్, అతని సైద్ధాంతిక విధానాన్ని సమర్థిస్తున్న యితరులూ ఒక వర్గంగా ఏర్పడ్డారు. 1996లో "పెద్ద ప్రభుత్వాల శకం అంతరించింది" అనే ప్రకటనతో బిల్ క్లింటన్, అతడి సహచరవర్గంవారు ముందుకొచ్చారు; అప్పటి దాకా అమెరికాలోని విద్యాప్రాంగణాలలో (కాంపస్‌లు)లో వున్న సోషల్ క్లబ్బులు స్థానంలో పెట్టుబడిదారీ విధానం అమలులోకి తెచ్చిన మార్కెట్ పదజాలం, మార్కెట్ విలువలు, అభిప్రాయాలు, కల్పనలతో నిండిన సామాజిక వాణిజ్య నిర్వహణా క్లబ్బులు ఉనికిలోకివచ్చి అవి పెంపొందటానికి సహకరించాయి. అప్పటికే "మిలియన్ల మందికి మేలు చేయటం", 'ప్రపంచాన్ని మార్చటం' అన్న భావనలు వ్యాప్తిలోకి వచ్చి అమెరికన్ యువజనుల మెదళ్ళను ఆక్రమించాయి. యువజనులు, విద్యార్థుల్లో ఎక్కువమంది "మంచిని నిర్మించటంలోనే ఎక్కువ శక్తి వుంది తప్ప ఏ చెడును సవాలు చేయటంవల్ల మేలు జరగదు" అనే అభిప్రాయాన్ని నమ్మారు. అటువంటి నేపథ్యం నుండి వచ్చినదే హిల్లరీ కోహెన్. అమె ప్రపంచాన్ని మార్చాలని కోరుకొంది. ఆమె ఒక యూదు కుటుంబం నుండి వచ్చిన యువతి. ఆమె తండ్రి ఫైనాన్సురంగమైన మున్సిపల్ బాండ్లు, రియల్ ఎస్టేట్ రంగాల్లో పనిచేశాడు. ఆమె తల్లి మానసిక ఆరోగ్యరంగంలోనూ, యూదు సమాజంలోనూ వాలంటీర్‌గా పనిచేసింది. కోహెన్ తండ్రి నుండి పెట్టుబడుల విశ్లేషణ (స్టాక్ మార్కెట్లలో పెట్టుబడుల) నైపుణ్యాన్ని నేర్చుకొంది. అరిస్టాటిల్ నైతిక విలువలపై వ్రాసిన గ్రంథపు ప్రభావంలో పడ్డ ఆమె ప్రపంచాన్ని మార్చే సకారాత్మక ఏజెంటుగా వుండాలని కోరుకొంది. అమె తన చదువును ముగించేనాటికి 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమం జరిగింది. ఆ ఉద్యమ ప్రభావం కూడా ఆమె మీద పడింది. అప్పటికే 'కెరీరిస్టు సంస్కృతి' అమెరికన్ యూనివర్సిటీలన్నంటినీ ఆక్రమించినది. ఆ ప్రభావంతో ఆమె గోల్డ్‌మన్ సాక్స్ కంపెనీలో విశ్లేషకురాలిగా జేరింది. అప్పటికే వాల్‌స్ట్రీట్‌లో ఆర్థికసంస్థలు "నువ్వు ప్రపంచంలో నాయకుడివి కాదల్చుకొంటే నీకు ఆ నైపుణ్యాలను అందిస్తాం" అంటూ పలుకార్యక్రమాలు చేపట్టాయి. గోల్డ్‌మన్ సాక్స్ "10,000 మంది మహిళలు" అనే ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. దాని ద్వారా ఆమె మహిళా వాణిజ్య వ్యాపార పెట్టుబడిదార్లను తయారు చేసేందుకు పెట్టుబడి పెట్టింది. వారికి సలహాదారుగా, గురువుగా వ్యవహరించింది. అసమానతను తగ్గించేందుకు అవసరమైన ముఖ్యసాధనమైన, ఆర్థికాభివృద్ధిని అందరూ పంచుకోవటమే – తాను తీసుకొన్న కార్యక్రమం అంటూ ప్రచారం చేసింది. అంతేకాదు గోల్డ్‌మన్ సాక్స్ కంపెనీ మరో ప్రయోగాత్మక కార్యక్రమంలో కూడా 10 మిలియన్ల డాలర్లను న్యూయార్కులో ఒక జైలుకు సంబంధించిన కార్యక్రమంలో పెట్టుబడి పెట్టింది. అందుకోసం ఆ సంస్థ విడుదల చేసిన "సామాజిక ప్రభావబాండు", జైలులో విద్యగరిపే కార్యక్రమంలో పెట్టుబడిపెట్టిన ప్రతీ ఒక్కరికీ లాభాన్ని చేకూర్చిపెట్టడమే కాకుండా, పదేపదే నేరాలు చేసే ప్రవృత్తిపై నేరస్థుల రేటు తగ్గిస్తుందంటూ, 'పుణ్యం–పురుషార్థం' ఒకే దెబ్బతో కలసివస్తుందని ప్రకటించింది.

మరోవైపు కార్పోరేట్లు క్లైంట్లుగా వున్న మెక్కిన్సీ సంస్థ కూడా యువతను ఆకర్షిస్తూ వారిని సంస్థలోకి రిక్రూట్ చేసుకొంటోంది. ఆ సంస్థ కూడా తన సంస్థలో పనిచేస్తే ప్రపంచాన్ని మార్చటం సాధ్యమవుతుంది అంటూ ప్రచారం చేస్తోంది. అప్పుడే కాలేజీ నుండి బయటకు వచ్చిన వాణిజ్య విశ్లేషకులు తమ సంస్థలో గనుక జేరితే వారు యీ క్రింది వాటిని సాధిస్తారు అంటూ ఒక కరపత్రం విడుదల చేసింది. అవి ఏమిటంటే ప్రపంచాన్ని మార్చటం, జీవితాలను మెరుగు పరచటం, క్రొత్త విషయాలను ఆవిష్కరించటం, క్లిష్టమైన సమస్యను పరిష్కరించటం, నైపుణ్యాలను విస్తరించుకోవటం, సహనశీలతతో కూడిన దీర్ఘకాలిక సంబంధాలను నిర్మించటం. ఇటువంటి ఘనమైన వాగ్దానాలు చేసిన మెక్కిన్సీ కంపెనీ 'సామాజిక రంగపు ఆచరణ' (Social Sector Practice) అనే ఒక సంస్థను స్థాపించి దాని ద్వారా 'మొబైల్‌ఫోన్‌తో ఆర్థిక సేవలు అందించి మిలియన్ల కొద్దీ మంది ప్రజలకు ప్రయోజనం చేకూర్చటంతోపాటు అందరినీ యిముడ్చుకొనే సమ్మిళిత అభివృద్ధిని సాధించవచ్చు" అనే అంశం మీద పుస్తకాలను ప్రచురించింది. మరోవైపు ఆ సంస్థ యొక్క పోటీ సలహాదారు కంపెనీ అయిన బోస్టన్ కన్సల్టింగ్ గ్రూపు కూడా "మన సామాజికరంగం కోసమూ, మా వ్యాపార వర్గ క్లైంట్లు కోసము ప్రపంచాన్ని మార్చివేస్తానంటూ" ప్రతిజ్ఞ చేసింది. బైన్ అండ్ కంపెనీ అయితే "మేము మొత్తం సామాజికరంగాన్నే మార్చే లక్ష్యంతో వున్నాం" అంటూ ప్రకటించింది. మోర్గన్ స్టాన్లీ అయితే "పెట్టుబడి మార్పును సృష్టిస్తుంది", "పెట్టుబడి యొక్క విలువ కేవలం సంపదను సృష్టించటంకాదు, అవసరమైన వాటిని సృష్టించటం కూడా!", "మోర్గన్ స్టాన్లీ కోసం పనిచేయటమంటే మిలియన్ల మంది ప్రజలకు మంచి జీవితం యివ్వటానికి పూనుకోవటం", "ప్రపంచాన్ని మార్చగలిగే వస్తువులను నిర్మించగలిగే పెట్టుబడిని మనం వృద్ధి చేద్దాం!" అనే ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ఆ రకంగా మార్కెట్టు ప్రపంచం రెండు లక్ష్యాలను – " ప్రపంచాన్ని మార్చటం", మరియు "లాభాలనార్జించటం" – అన్నవాటిని ఒకే లక్ష్యంగా మార్చివేసింది. "వ్యాపారాన్ని, మంచిని కలుగజేసే ఒక శక్తిగానూ", "మనం వాంఛించే మార్పును" పెంపొందించేదిగాను "పరస్పర ఆధార ప్రకటన" అనబడే ఒక నూతన ప్రకటనను బి కార్పొరేషన్లు అనేవి ప్రకటించాయి. ఆ రకంగా 'బహిరంగ ప్రజాసమస్యలకు ప్రైవేటు పరిష్కారం' అనే ఒక సిద్ధాంతం అమెరికాలో వ్రేళ్ళూనుకుపోయింది. ఈ సిద్ధాంతం నేడు ప్రజలు అనుభవిస్తున్న సమస్యలు, సంపన్నులైన దాతల, ఎన్.జి.ఒ.ల, ప్రభుత్వరంగం యొక్క భాగస్వామ్యంలో పరిష్కరింపబడాలని నిర్దేశిస్తోంది. ఈ రకంగా ప్రజల

సమస్యల పరిష్కారానికి సంపన్నులను నాయకత్వ స్థానంలో వుంచటం ద్వారా ఆ సిద్ధాంతం ఆ సంపన్నులకు తమను భయపెట్టే పరిష్కారాలను నిరోధించే అధికారాన్ని యిస్తోంది. మరోవైపు నర్మగర్భమైన కపటత్వంతో "న్యూబీక్ సెంటర్" లాంటి కేంద్రాలు, (New Beck Center for Social Impact and Innovation) "ఆవిష్కరణలను పెంపొందించే అసమానమైన నైపుణ్యాల అమరికను సమకూర్చటం" అనే లక్ష్యం పేరిట ఆ కేంద్రం "పెట్టుబడి యొక్క సాంకేతిక డేటా శక్తిని, సామర్థ్యాన్ని పెంచే జీవితాలను మెరుగు పరిచే విధానాలను పెంపొందిస్తా" నంటూ ప్రచారం చేస్తోంది. ఆ రకంగా "వాణిజ్యమే పురోగతి సాధించటానికీ, ప్రజలకు సహాయపడటానికీ, ప్రపంచాన్ని మార్చటానికి ప్రవేశాన్ని కల్పించే కార్డు (card)" అన్న విశ్వాసం విజయవంతంగా వేళ్ళూనుకు పోయింది. ఆఖరికి వైట్‌హౌస్ కూడా అటు రిపబ్లికన్ల పాలనలోనూ, యిటు డెమోక్రాట్ల పాలనలో కూడా దేశాన్ని ఎలా నడిపించాలి? అన్న విషయంలో ఫైనాన్షియర్ల, మార్కెట్ కన్సల్‌టెంట్ల ప్రత్యేకమైన నైపుణ్యాలపైననే ఆధారపడి నిర్ణయాలు చేసే స్థితికి చేరుకొంది.

అమెరికన్ జీవితాల నిర్ణయంలో కార్పొరేషన్లూ, సంపన్నులూ మరీ ఎక్కువ అధికారాన్ని కలిగివున్నారనీ సామాన్య ప్రజలకు ఆ నిర్ణయాలలో కనీసంగా మాట్లాడే హక్కు కూడా లేదనీ పదేపదే మాట్లాడిన అధ్యక్షుడు ఒబామా కూడా, తన పరిపాలనాకాలం అంతమయే సమయంలో ఒక ఫౌండేషన్‌ను, లైబ్రరీనీ స్థాపించతలపెట్టి, అందుకు మెక్కిన్సీ కంపెనీ సలహాలను తీసుకోవటానికి నిర్ణయించాడు.

ఈ పరిణామాలన్నీ మెకెన్సీ కంపెనీ వదలిపెట్టి ఒబామా ఫౌండేషన్‌లో పూర్తికాలం పనిచేసేందుకు హిలరీ కోహెన్‌ను ప్రేరేపించాయి. తీరా చూస్తే యిప్పుడు ఆమె తాను ఆ మార్కెట్టు ప్రపంచానికి, ఆ మార్కెట్టు ప్రపంచపు తర్కానికి బయట వుండటానికే ప్రాధాన్యతనిస్తానంటోంది. ఈ రకంగా తాను ఏ సమస్యనైతే పరిష్కరించ బూనుకొందో, ఆ సమస్యకు మూలకారణమైన వ్యవస్థను పరిరక్షించటం కోసమే తాను యింత కాలమూ పనిచేసినట్లు కోహెన్ అవగతం చేసుకొంది. ఈ రకంగా కోహెన్‌లాంటి వారు ఎందరో మార్కెట్టు విశ్వాసపు వలలో బందీలయ్యారు. ఇప్పుడు కోహెన్ అందుకు బదులుగా యూదు మత పూజారిణి 'రబ్బి' (rabbi)గా పని చేయటం వైపు మొగ్గుతోంది. ప్రపంచాన్ని మార్పుచేసే అనేక కపట నాటకల్లో ఇది ఒకటి.

పేద ప్రజలకు తాను సహాయం చేస్తున్నానని చెప్పుకొంటున్న స్టేసీ ఏషర్ (Stacey Asher) డల్లాస్ రాష్ట్రంలోని హైలేండ్‌పార్కులో నివసిస్తోంది. ఆమె "పోర్టుఫోలియోస్ విత్ పర్పస్" అనే ఒక దాతృత్వ సంస్థను నిర్వహిస్తోంది. ఈ సంస్థ తనను తాను "ఆరోగ్యవంతమైన పోటీని, దాతృత్వాన్నీ మిళితం చేసే శక్తివంతమైన వేదిక"గా అభివర్ణించుకొంటుంది. ఈ నినాదం సాంకేతిక ఊహాస్వర్గవాదాన్నీ (టెక్నో ఉటోపయనిజం), పెట్టుబడిదారీ విధాన దాతృత్వపు సారాంశాన్నీ ప్రతిబింబిస్తూవుంటుంది. స్టేసీ ఏషర్ యీ సంస్థను స్థాపించటానికి ముందు న్యూయార్కులోని ఆరు లేదా ఏడు హెడ్జిఫండ్ ఫైనాన్సు సంస్థల్లో పనిచేసింది. ఆమె తాను "యితరులకు సహాయపడాలనే" కృషికి అంకితమవటానికి కారణం తాను ఒకనాడు కిలిమాంజిరో పర్వతారోహణ చేయడానికి వెళ్ళినపుడు టాంజానీయా దేశంలోని ఒక అనాధ ఆశ్రమాన్ని చూసిందట. ఆ అనాధాశ్రమానికి ఒక పూట తిండి కోసం బాలలు చంటి పిల్లలను మోసుకొంటూ మైళ్ళదూరం నుండి వస్తారు. కొన్నిసార్లు నిధులు లేక అనాధ ఆశ్రమం పిల్లలకు అన్నం పెట్టలేకపోతోందట!. ఈ విషయం తెల్సుకొన్న స్టేసీ ఏషర్ జీవితం "ఆ క్షణాన్నుండే శాశ్వతంగా మారిపోయిందట!" తాను ఏదో మంచి పనిచేయాలనుకొందట, ఏంచేయగలను అని ఆలోచించి, తాను చేయబోయే పని ప్రపంచంలో యిప్పటికే యితరులు చేసిన పని కాకూడదని అనుకొన్నదట!. సరీగ్గా ఆకాలంలోనే ప్రపంచంలోని అతిపెద్ద బ్యాంకుల్లోని ఒకటైన స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకు, టాంజానీయాలో తానిచ్చిన "తుచ్ఛమైన అప్పులు"ను వసూలు చేసుకోవటానికి కోర్టు ద్వారా ప్రయత్నాలు సాగిస్తోంది. ఆ బ్యాంక్ తన "తుచ్ఛమైన అప్పును'' (Dirty Debts) ఒక విద్యుత్తు ఉత్పాదన చేసే దివాలా తీయబోయే ఎనర్జీ ప్రాజెక్టుకు యిచ్చింది. ఆ ప్రాజెక్టు దివాలా తీసి బ్యాంకు అప్పు ఎగకొట్టింది. అలా జరుగుతుందని తెలిసే స్టాండర్డు బ్యాంకు ఆ అప్పును యిచ్చింది. అలా దివాలా తీస్తారన్న వారికి అప్పిచ్చే నిధులను "రాబందు నిధుల పెట్టుబడి" (Vulture funds) అంటారు. ఇప్పుడు ఆ బ్యాంకు టాంజానీయా ప్రభుత్వం ఆ దివాలా తీసిన ప్రాజెక్టును జాతీయం చేయాలనీ, తన అప్పు తీర్చాలనీ కోర్టుకు వెళ్తోంది. ఆఫ్రికన్ అభివృద్ధి బ్యాంక్ గ్రూపు దీన్ని గురించి యిలా అంటోంది : రాబందు నిధులు పెట్టుబడిని పెట్టే స్టాన్‌ఛార్ట్ లాంటి ఆర్థిక సంస్థలకు యిది మాములు ఆటే!. అవి తెలిసే దివాలా అంచున వున్న ప్రైవేటు ప్రాజెక్టులలో ఎక్కువ డిస్కవుంటు వేసుకొని పెట్టుబడి పెడతాయి. ఆ ప్రాజెక్టులు దివాలా తీసి చేతులేత్తేస్తే, అవి ఆయా దేశాలకు విదేశాల్లో వున్న ఆస్థులను జప్తు చేసుకొంటామని బెదిరిస్తాయి. అందువల్ల ఆ బడుగు దేశాల ప్రభుత్వాలు ప్రజల నుండి బలవంతంగా వసూలు చేసే పన్నులను యీ అప్పులు తీర్చటంకోసం వినియోగిస్తాయి. ఈ రకంగా ఆఫ్రికాలోని అంగోలా, బుర్కినాఫాసో, కేమరూన్, కాంగో, కోట్‌డిఐవోరీ, ఇథియోపియా, లైబీరియా, మడగాస్కర్, మొజాంబిక్, నైగర్, సావోటోమ్ అండ్ ప్రిన్సిపే, సియెర్రా లియోన్, ఉగాండా దేశాలు యిటువంటి రాబందు నిధుల పెట్టుబడి యొక్క తుచ్ఛమైన అప్పులకు బలయినవారే. ఈ రకంగా యీ రాబందు నిధుల పెట్టుబడిదార్లు, బడుగు దేశాల అభివృద్ధిని పట్టించుకోక నిర్లక్ష్యం చేస్తారు. టాంజానీయాలోకి అనాధల, అనాధాశ్రమాల దుస్థితికి కారణం ఇదే.. బడా ఫైనాన్స్ రంగంలో జరిగే యీ వివరాలన్నీ తెలిసిన ఏషర్, రాబందు నిధుల పెట్టుబడి ద్వారా కొల్లగొట్టిన సొమ్ము (సంపద)ను ఆయాదేశాలకు తిరిగి చెల్లింపజేసే కృషి చేపట్టడానికి బదులు, బాధితదేశంలోని అనాధలకు మేలుచేయటానికి

కృషి చేయటాన్ని ఎంచుకోవటంలోనే వుంది మర్మం అంతా. ఇంతకీ ఆవిడ పేదలకు సహాయం చేయటానికి చేపట్టిన కృషి ఏమిటయ్యా అంటే ఫాంటసీ క్రీడలు నిర్వహించి అందులో వచ్చే లాభాలలో కొంత భాగాన్ని అనాథాశ్రమాలకు దానం యివ్వటం!. అటువంటి ఫాంటసీ ఫుట్‌బాల్ సంస్థనొక దాన్ని ఆమె స్థాపించింది. ఆ కంపెనీ 'స్టాకు' (షేర్ పెట్టుబడి)ని అమ్మి, వచ్చిన లాభాల నుండి కొంత భాగం దానం యిస్తుంది. ఆ ఫాంటసీ ఫుట్‌బాల్ క్రీడలో ఆటాడేది వృత్తి ఫుట్‌బాల్ క్రీడాకారులు కాదు. ఫైనాన్సు కంపెనీల ఉద్యోగులు. ఈ రకంగా ఆమె చేపట్టిన యీ "ప్రజలకు మేలు" చేసే కృషి పరస్పర లాభదాయక లక్ష్యంతో కూడినది. మార్కెట్టు ప్రపంచంలోని అత్యంత సంపన్న వర్గాలవారు అనుసరించేది యీ పరస్పరలాభదాయకమైన దాతృత్వ 'వ్యాపారమే'!. ఆ రకంగా ఏషర్ లాంటివాళ్ళు సమస్యకు మూలకారణాన్ని పట్టించుకోకుండా, ఆ మూలకారణంలో తాము కూడా కలసివున్నా, అందుకు తాము కారకులైనా ఆ విషయాన్ని వారు కావాలనే దాచి వుంచుతూ దోపిడీకి గురయిన బాధిత ప్రజలకు సహాయం చేస్తామనే దాతలుగా ముందుకొస్తున్నారు.

జస్టిన్ రోజెన్‌స్టీన్ ఐతే, తాను ప్రజలకు సహాయం చేయటానికి గల మంచి మార్గమేమిటి అని ఏషర్ కన్నా కూడా ఎక్కువ మధన పడిపోయాడు. ఇతడు ప్రపంచమంతటా తెలియకపోయినా, సిలికాన్ వ్యాలీలోని ఒక ఔత్సాహికుడు. అక్కడ భవిష్యత్తులో అభివృద్ధిచెందబోయే సాంకేతిక ఆవిష్కరణలను చేసినవారిలో భాగస్వామి. అతడు గూగుల్ డ్రైవ్‌ను ప్రారంభించటానికి సహాయపడ్డాడు. జి.మెయిల్ చాట్‌ను కనుగొన్నవారిలో ఒకడు. అతడు ఫేస్‌బుక్ కంపెనీలో 'పేజెస్' ను 'లైక్' లు చెప్పే బటన్‌ను కనుగొన్న వారిలో ఒకడు. ముప్ఫై సంవత్సరాల వయస్సులోగానే అతడు పదుల మిలియన్ల డాలర్లు విలువ చేసే స్టాక్‌లు (షేర్లు) బహుమతిగా పొందాడు. మార్కెట్టు ప్రపంచపు విలువలైన "నేనూ బాగుపడతా – నువ్వు బాగుపడుతావు" (Win - Win) అన్న విలువలను జీర్ణం చేసుకొన్న రోజెన్‌స్టీన్, "ఆసనా" (Asana) అనే ఒక కంపెనీని ప్రారంభించటం ద్వారా ప్రపంచాన్ని మెరుగుపరచ నిశ్చయించాడు. ఈ సంస్థ ఉబర్, ఎయిర్ బబ్, డ్రాప్‌బాక్స్‌లాంటి కంపెనీలకు యితరులతో కలసి సహవ్యాపారులుగా వ్యాపారం చేయటానికి అవసరమైన సాఫ్ట్‌వేర్ కార్యక్రమాన్ని అమ్ముతుంది. అతడు ఆ రకంగా తన కంపెనీ సాఫ్ట్‌వేర్‌తో మానవాళి స్థితిగతులను శక్తిమంతంగా మార్చగలనని బలంగా నమ్ముతున్నారు. ఆయన ఉద్దేశ్యం 'ప్రతి ఒక్కరినీ కొంత ఉత్పత్తి చేసేవారిగా మార్చడం వలన ప్రజల జీవితాలను మెరుగుపర్చటం అన్నది ఒక ఉదాత్తమైన విషయం' కానీ వాస్తవ మేమిటంటే : అమెరికాలో ఉత్పాదకత అసాధారణస్థాయికి పెరిగినప్పటికీ, సగం మంది అమెరికన్ల వేతనాలు ఘోరమైన స్థితిలో ఎటువంటి పెరుగుదలా లేకుండా స్థంభించిపోయాయి. వాషింగ్‌టన్‌లోని ఒక మేధావుల వేదిక అయిన ఆర్థిక విధానాల సంస్థ (ఎకనిమిక్ పాలసీ ఇనిస్టిట్యూట్) ప్రకారం : "1973 నుండీ మెజారిటీ అమెరికన్ కార్మికులకు ఒక గంటకు చెల్లించే వేతనాల్లో ఉత్పాదకత పెరుగుదలకు అనుగుణంగా పెంచలేదు. 1973 నుండి 2014 వరకూ గల మధ్యకాలంలో సగటు కార్మికుని యొక్క ఉత్పాదకత 72 శాతం మేరకు పెరిగింది. కానీ ఈ కాలంలో సామాన్య కార్మికుడి వేతనం కేవలం 9 శాతం మేరకే పెరిగింది". ఇటువంటి పరిస్థితికి కొంత బాధ్యత, మరింత లాభాలు పిండుకొనే ఆర్థిక రంగానిదే (ద్రవ్యరంగానిదే)!. అందువలన రోజెన్‌స్టీన్ చేసిన ఈ ప్రయత్నం వల్ల అతడు వాగ్దానం చేస్తున్నటువంటి మార్పు ఎన్నటికీ సాధ్యంకాదు. అతడు సేవలందించిన గూగుల్, ఫేస్‌బుక్‌లు కూడా ఒక స్వేచ్ఛాసమాజంలోని సమాచారంపైనా, ప్రజల వ్యక్తిగత వివరాలపైనా, ప్రజలు ఎక్కడెక్కడ వుంటున్నారనే నిఘాపైనా, వారి సంభాషణల సారాంశంపైనా, వివరాలను సేకరించుకుంటున్నాయి. ఇది ప్రమాదకరమైన పాక్షిక – గుత్తాధిపత్యపు పరిణామం. రోజెన్‌స్టీన్ లాంటివారు తాము శ్రమించి, చేస్తున్న వృత్తిలోని మెళకువలు, నైపుణ్యాలు సాధిస్తున్న అభివృద్ధి నుండి, చింది, జారిపోయే అభివృద్ధి ప్రభావమే గొప్ప గొప్ప నాగరికతా ప్రయోజనాలను కలుగజేస్తాయని భావించటం అన్నది "సమస్య పరిష్కరింపబడాల్సిన ప్రపంచపు అవసరాలకన్నా సమస్యను పరిష్కరించే వర్గంవారి అవసరాలకే ప్రయోజనకరంగా ఈ అభివృద్ధి వుండాలి" అన్న అవగాహనపై ఆధారపడి వుంది. అందువలన వారు ప్రపంచానికి మేలు చేసేకన్నా, కీడే చేస్తారు.

ప్రపంచాన్ని మార్పు (బాగు) చేయాలన్న యీ అభిప్రాయాలు యింతటితోనే ఆగిపోలేదు. అవి మరింత ముందుకుసాగి 'పెట్టుబడిదారులు ఏ ప్రభుత్వంకన్నా కూడా సమర్థులయినవారు. వారు ప్రభుత్వాలకన్నా సమాజపు అట్టడుగు స్థాయిలో వున్నవారి సమస్యలు మరింత సమర్థవంతంగా పరిష్కరిస్తారు' అనే దాకా వెళ్ళింది. ఈ క్రొత్త సిద్ధాంత ప్రకారం : పారిశ్రామిక–వ్యాపార వ్యవస్థ పనాతత్త్వం అన్నది మానవత్వవాదానికి సమానార్థకం. అది పారిశ్రామిక స్థాపనారథపు చక్రాలకు కందెనపూసేది!. ఇటువంటి అభిప్రాయాన్ని, అంటే పారిశ్రామిక–వాణిజ్యస్థాపనను మానవతావాదంగా పరిగణించే అభిప్రాయాన్ని విశ్వసిస్తున్నవారు ఎక్కువ మంది సిలికాన్ వ్యాలీలో వున్నారు. అక్కడ కంపెనీలు స్థాపించినవారు తరచుగా తమను తాము మానవాళి విముక్తిదాతలుగాను తమ యొక్క సాంకేతికతలు మానవాళిని విముక్తి చేయగల అంతర్గతశక్తి కలవిగా చెబుతూవుంటారు.

మార్కెట్టు ప్రపంచం వ్యాప్తిలో పెడుతున్న యీ అభిప్రాయాలు, సమాజంలోను విభిన్న వర్గాలు విభిన్న ప్రయోజనాలను కలిగివున్నాయనీ, అందువలన తమ అవసరాల కోసం హక్కులు కోసం వర్గాల మధ్య పరస్పర సంఘర్షణ, పోరాటాలు జరగాల్సి వుందన్న భావనను తిరస్కరిస్తాయి.

కార్సన్ (Emmett Carson) అనే వ్యక్తి చికాగోలోని దక్షిణ భాగంలో, నల్లవారిపట్ల వుండే ప్రాంతంలో, ఒక మున్సిపల్ కార్మికుని కుమారునిగా పెరిగాడు. తదనంతర కాలంలో అతడు ప్రిన్స్‌టన్

గ్రాడ్యుయేటు కాలేజీలో చదివి, ఫోర్డు మరియు మిన్నెపోలిస్ ఫౌండేషన్‌లో ప్రతిష్ఠాకరమైన పదవుల్లో పనిచేశాడు. ఆ తర్వాత కాలంలో అతడు సిలికాన్ వ్యాలీలో సాంకేతిక పారిశ్రామిక వ్యవస్థాపకులకు సలహాలు యిచ్చే ఒక పేరుగాంచిన సలహాదారుడిగా మారాడు. ఫోర్డు, మిన్నెపోలిస్ ఫౌండేషన్ల యాజమాన్యాలు కోరిన ప్రకారం అతడు "సామాజిక న్యాయం" అన్న పదబంధాన్ని వాడలేదు. సిలికాన్‌వ్యాలీలో పనిచేసిన మొదటి ఇరవై సంవత్సరాల వరకు సామాజిక న్యాయం అన్నపదబంధాన్ని వాడటం ముఖ్యమనిపించింది. సిలికాన్ వ్యాలీలో ఈ పదానిక వేరే భాష్యం చెబుతారు. అంటే లాభమా, నష్టమా అన్న అర్థంలో వాడతారు. కొందరి ప్రకారం సామాజిక న్యాయం అంటే ధనవంతుల వద్ద తీసుకొని పేదవారికి ఇవ్వడం. మరికొందరి ప్రకారం ఏమీ సంపాదించనివారికి సహాయం చేయడం అని కార్సన్ చెప్పారు. కనుక "సామాజిక న్యాయం" అనే పదం స్థానంలో "సామాజిక బాగు" అనే పదాన్ని ఉపయోగించడం ప్రారంభించాడు. పారిశ్రామికవేత్తలను వారికి అంత సంపద ఎలా వచ్చిందని వారు ఉన్నత సామాజికస్థాయి ఎలా అందుకున్నారని ప్రశ్నించకపోతే, వారు ప్రజలకు సహాయం చేయడానికి ఇష్టపడుతున్నారట. దాతలుగా వుండటానికి ఇష్టపడుతున్నారు. ఎందుకంటే ఆ దాత అనే పేరు వారికి ఉపయోగపడ్తోంది గనుక.

జేన్ లీబ్రాక్ అనే యువతి ఫేస్‌బుక్‌లో ఉద్యోగం మానుకొని, ఆదాయాలు చాలక సతమతమవుతున్న మిలియన్ల అమెరికన్ కార్మికుల సమస్యకు ఒక ఫోన్ ఏప్ (APP) ద్వారా పరిష్కారాన్ని అందిస్తున్న ఈవెన్ (Even) అనే కంపెనీలో జేరింది. ఈ సంస్థ యొక్క ఉదాత్తమైన ఆశయాలపట్ల ఆమె ప్రభావితమయింది. పెరిగిపోతున్న తీవ్ర ఆర్థిక అసమానతలను నిరసిస్తూ గూగుల్ ఉద్యోగులను విధులకు, విధుల అనంతరం యిళ్ళకు తీసుకువెళ్తున్న బస్సులపై నిరుపేద శ్రామిక ప్రజలు రాళ్ళు విసిరిన ప్రాంతానికి చెందినట్టిది. అందువలన ఆమె అట్టడుగునున్న అమెరికన్ కార్మికులకు సహాయం చేస్తున్న ఈవెన్ సంస్థను మెచ్చుకొంటూ, దానిలో జేరింది.

ఇంతకీ ఆ ఈవెన్ సంస్థ అట్టడుగు కార్మికులకు చేస్తున్న సహాయం ఏమిటయ్యా అంటే, అది ఎగుడుదిగుడుగా సంపాదిస్తున్న కార్మిక వర్గానికి, వారి సంపాదనను చదునుచేసి సాఫీ చేస్తుందట!. ఈ రకమైన సేవ చేసినందుకుగాను అది సంవత్సరానికి ప్రతీ ఒక్కరి నుండీ 260 డాలర్లు రుసుముగా తీసుకొంటుంది. అది ఏరకంగా వారి ఆదాయాన్ని చదును చేస్తుంది అంటే, సగటు సంపాదన కన్నా ఎక్కువ సంపాదన పొందిన వారాల్లో ఆ కార్మికుడి అదనపు వేతనాన్ని తన వద్ద వుంచుకొని, సగటు సంపాదన కన్నా తక్కువ సంపాదన పొందిన వారాల్లో ఆ కార్మికుడికి సగటు సంపాదన మేరకు అవసరమైన మొత్తాన్ని యిస్తుందట! ఉదాహరణకి ఒక కార్మికుడు వారానికి సగటున 500 డాలర్లు సంపాదిస్తున్నాడనుకొందాం. కానీ సంపాదనలో ఆటుపోట్ల వలన ఒకవారం అతడు 650 డాలర్లు సంపాదిస్తే అతడి బ్యాంకు అకౌంటుకు 500 డాలర్లను ఆ కంపెనీ పంపిస్తుంది మిగిలిన 150 డాలర్లను తన అకౌంటులో వుంచుకొంటుంది. మరోసారి ఆ కార్మికుడు ఒక వారంలో కేవలం 400 డాలర్లే సంపాదిస్తే, సగటు మొత్తం పూడ్చటానికి అవసరమయిన 100 డాలర్లను ఆ కంపెనీ అతడి బ్యాంకు అకౌంటుకు పంపిస్తుంది. ఈ రకంగా ఆ కార్మికుడి ఆదాయాన్ని ఆ ఈవెన్ కంపెనీ చదును చేసి, సాఫు చేయటం ద్వారా, ఆ కార్మికుల నుండి రుసుం తీసుకొని వారికి "సహాయ"పడుతోంది. "నీ జీవితంలో ఏదైనా రక్షణ (భద్రతా) జాలం కావాలని, మొట్టమొదటి సారిగా అనుకుంటే, అందుకు జవాబు ఈవెన్" అంటూ ఆ కంపెనీ ప్రచారం చేసుకొంటోంది. ఈ రకంగా మూలాలను ప్రశ్నించి వాటిని సరిచేయకుండా, రుసుం తీసుకొని కార్మికుల వేతనాలను సాఫీ చేస్తూ సహాయం చేయటమన్నది మార్కెటు ప్రపంచపు మాయాజాలపు రూపాలలో ఒకటి.

ఈవెన్ కంపెనీలో పనిచేసే సమయంలో లీబ్రాక్ కొందరు కార్మికులను యింటర్వ్యూ చేసింది. వారిలో నైక్ స్టోర్సులో పనిచేసే ఉద్యోగిని ఒకరు. అమె భర్తను వదలిన ఒక ఒంటరి తల్లి. తనకు చట్ట ప్రకారం చెల్లించాల్సిన సౌకర్యాలు కల్పించకుండా తప్పించుకోవటం కోసం తన యజమాని తనకు రోజూ తక్కువ గంటల పనియిస్తూ, వారం అంతా తనకు (పనిచేయటానికి) అవసరమైనప్పుడు పనికి రప్పించడానికి వీలుగా నిరంతరం తనను అందుబాటులో వుండే విధంగా ఎలా ఏర్పాటుచేసాడో, అందువలన తనకు పని దొరకని యితర గంటలలో తాను వేరే పనిని చేసుకోవటం ఎలా కుదరటల్లేదో వివరించింది.

ఉర్సులా అనే స్ట్రిప్‌మాల్‌లో పచారీ విభాగంలో పనిచేసే ఆవిడ, తాను వారానికి ముప్ఫై ఆరు గంటలుపాటు పని చేసినా, శాన్‌ఫ్రాన్సిస్కోలో వున్న తన మనవలను ఒక్కసారైనా తెచ్చుకోవటానికి అవసరమైన పెట్రోలు కొనుక్కోవడానికి ఆర్థిక స్థోమత లేకుండా పోయిందని వాపోయింది.

హేదర్ జాకోబు అనే మరో మహిళను స్కైప్ ద్వారా లీబ్రాక్ యింటర్వ్యూ చేసింది. జాకోబ్సు తాను ఒక కార్పొరేట్ మసాజ్ (వళ్ళుపట్టే) చైన్‌లో, అదనపు ఆదాయం కోసం ఫ్రీలాన్సు ఉద్యోగిగా పనిచేస్తున్నాననీ, తనకు అక్కడ వారానికి ఇరవైఆరు గంటల నుండి ముప్ఫైరెండు గంటల మేరకు పనిదొరుకుతుందనీ దీనితోపాటు జిమ్సు లాంటి చోటుకి వెళ్ళి పనిచేస్తాననీ అక్కడ, జిమ్ వాళ్ళకు తనకు ఏమీ యివ్వరనీ, అయితే క్లైంట్లుయిచ్చే టిప్పులు తీసుకోవటానికి అనుమతిస్తారనీ, అయినా ప్రతీనెలా ఇరవైఏడవ తేదీ వచ్చేటప్పటికి బిల్లులు చెల్లించలేక జుట్టు పీక్కోవలసి వస్తుందనీ ఆమె వాపోయింది. తాను మసాజ్ శిక్షణ పొందిన స్కూలు ఫీజు కోసం 3.700 డాలర్ల క్రెడిట్‌కార్డు మీద చేసిన అప్పు తిరిగి చెల్లించటానికే తన సంపాదన అంతా సరిపోతుందని ఆమె బాధపడింది. పైపెచ్చు సరయిన పౌష్టికాహారం కొనుగోలు చేయగల స్థోమత తనకు లేకపోవటంతో,

డాలర్ స్టోర్సులో అమ్మే అనారోగ్యపు ఆహార పదార్థాలు తినటం వలన తానూ, తన భర్తా ఊబకాయరోగం వాత పడ్డామని బాధపడింది.

జాకోబ్స్ జీవితకథ వలన మనకు అర్థమవుతున్నదేమిటంటే, అమెరికా దేశపు పురోగతిలో ఎన్నో వైఫల్యాలున్నాయనీ, అక్కడి ఆరోగ్య – వైద్య వ్యవస్థలో వైఫల్యం, సామాన్య ప్రజలకు మందులు కొనుగోలు చేసుకోగల స్థోమత లేకపోవటం, ప్రజారవాణా వ్యవస్థ వైఫల్యం, వేతన – కార్మికచట్టాల వైఫల్యం, అక్కడి ఆహారవ్యవస్థ యొక్క వైఫల్యం, అక్కడి ఆహారం అందుబాటులో లేని స్థితి, విద్యార్థుల రుణ సంక్షోభం, ఇలా అనేక విపత్కర పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పి వాటి ద్వారా కార్పొరేటు అమెరికా తన ఆదాయాలను స్థిరీకరించుకోగలిగిందనీ, ఒకతరంపాటు కార్పొరేటు అమెరికా తన అనిశ్చయస్థితిని కార్మికులపైకి చాకచక్యంగా నెట్టిందనీ, కంపెనీలలోని వాటాదారులు తమ కంపెనీలను మరింతగా, మరీ ఎక్కువగా తమ కోసమే (తమ లాభాల కోసమే) యితర వాటాదారుల ప్రయోజనాలకు హాని కలిగించటం కోసమే నడిపారనీ అర్థమవుతుంది. ఆర్థికవ్యవస్థలో ఆటోమేషన్ (స్వయం చాలిత యంత్రాలు) వ్యాప్తి చెందటం వలన అప్పటికే అతలాకుతలం చేయబడ్డ కార్మికుల జీవనస్థితిగతులు మరింతగా విధ్వంసం చేయబడుతున్నాయనీ అర్థమవుతుంది. అందుకనే దాతృత్వం పేరుతో, మంచి పనుల పేరుతో అట్టడుగు ప్రజలను, శ్రామిక ప్రజలను అత్యంత సంపన్నవర్గానికి చెందినవారు, దోపిడీవ్యవస్థ మార్పు కోసం పట్టుబట్టి పోరాడకుండా, ప్రక్కదారి పట్టిస్తున్నారని కూడా అర్థమవుతుంది.

"నువ్వు యితరులకు మంచి చేయటం ద్వారా, నీకు నువ్వు బాగుపడు" అన్న సూత్రం నేడు మార్కెట్టు ప్రపంచంలో వేదవాక్కుగా వెలుగొందుతోంది. మార్కెట్టు ప్రపంచపు పౌరులు (అత్యధిక సంపన్నులు) యీ 'సువార్త'ను సదస్సు తర్వాత సదస్సు ద్వారా నిరంతరం ప్రచారం చేస్తున్నారు. డావోస్, టెడ్(TED), సన్‌వేలీ, ఏస్పెన్, బిల్డర్‌బర్గ్, డైయాలాగ్, సౌత్ బై సౌత్ వెస్ట్, బర్నింగ్‌మాన్, టెక్‌క్రంచ్ డిస్రప్ట్, వినియోగదారుల ఎలక్ట్రానిక్ షో, బహామా ద్వీపానికి విహారం చేస్తూసాగే నార్వేకు చెందిన యుద్ధనౌకలో సదస్సు (సముద్రంపై శిఖరాగ్ర సభ) లాంటివి యీ రకానికి చెందిన సదస్సులు. ఇటువంటి సదస్సులకు హజరయ్యే వారంతా ప్రసిద్ధి పొందిన తెగువతో వ్యాపారం చేసే ప్రసిద్ధ పెట్టుబడిదారులు, సిలికాన్ వ్యాలీలోని సాంకేతికత ప్రపంచానికి చెందిన విజేతలు. వీరంతా తమ అధికారం, శక్తివల్లనే ఈ యుగంలోని ప్రజలందరూ దౌర్భాగ్యస్థితికి చేరుకొన్నారన్న వాస్తవానికి చాకచక్యంగా ముసుగువేసి, తామే యీ ప్రపంచాన్ని పురోగతివైపు నడుపుతున్నామని బుకాయిస్తూ దోపిడీ (సంపదను) చేస్తున్నవారు. నేడు సిలికాన్ వ్యాలీకి చెందిన విజేతలే కొత్తగా అవతరించిన శక్తికి, అధికారానికీ భూమధ్య కేంద్రంగా వున్నారు. "వీళ్ళు తిరుగుబాటుదారుల్లా పోట్లాడుతారు. మహారాజుల్లా తమ కార్యకలాపాలను (వాణిజ్య – ఆర్థిక) నిర్వహిస్తారు".

వీరు స్థాపించిన ఎయిర్‌బన్బ్, ఉబర్‌లాంటి సంస్థలు పలు చట్టాలను ఉల్లంఘిస్తూ డ్రైవర్లుగా వున్న కార్మికుల శ్రమను మోసపూరితంగా దోచుకొంటూ, పలు సందర్భాలలో జాత్యహంకార వ్యాపారచర్యలకు పాల్పడుతూ, తాము చట్టపరిధిలోకి రావటానికి నిరాకరిస్తూ, తమది కేవలం "ప్రయాణీకులకూ డ్రైవర్లకూ మధ్యన సంబంధం ఏర్పాటు చేసేందుకు ఏర్పడిన సాంకేతిక వేదికలేనంటూ, లేదా గది అద్దెకు కావల్సినవారికీ, గదె అద్దెకు యివ్వగలిగినవారికీ మధ్య సంబంధాన్ని ఏర్పరిచే సాంకేతిక సంధానకర్తలమేనని" బుకాయిస్తూ ప్రపంచమంతటా ఎటువంటి నియంత్రణకు లొంగకుండా, అంగీకరించకుండా 'లాభాలను' దోపిడీ చేసుకొంటున్న సాంకేతిక యుగపు పెట్టుబడిదారుల సంస్థలే!

1990ల మధ్య కాలంలో ఇంటర్నెట్ (సాంకేతిక ఆధారిత)ను ప్రారంభించారు. ఇది అసమాన ప్రపంచాన్ని, సమాన ప్రపంచంగా మారుస్తుందని నాడు బిల్‌గేట్సు జోశ్యం చెప్పాడు. తీరాచూస్తే ఈరోజున ఇంటర్నెట్ "అది ఎన్ని మహత్తరమైన విషయాలను మన ముందుకు తెచ్చినప్పటికీ, ఈ సంస్థ గుత్తాధిపత్య ఆర్థిక సూత్రాలతోనూ, లాభాలను పిండుకొనే సూత్రంతోనూ, ప్రజలపై నిఘా జరుపుతూ తన వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. ఇంటర్నెట్ వాడే సాధారణ ప్రజలకు తమ వ్యక్తిగత డేటాపై నియంత్రణ పెట్టుకోవటం సాధ్యంకాదు. ప్రతి ఒక్కరి జీవితాల్లోకీ డిజిటల్ పని ప్రదేశాలు ప్రవేశిస్తున్నాయి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాలు తరచుగా దోపిడీ చేస్తూ సమాజంలో వున్న అసమానతలను మరింత పెంచివేస్తున్నాయి. కానీ మరోవైపున అసమానతను సమం చేస్తామంటూ అవి ప్రకటిస్తూ వుంటాయి. ఇదీ యీ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారంల వ్యాపారంలోని అసలు రహస్యం. ఈవిధంగా ఈరోజున సాంకేతిక కంపెనీలైన అమెజాన్, ఆపిల్, ఫేస్‌బుక్, గూగుల్, మైక్రోసాఫ్టులు అన్ని విషయాలను నియంత్రిస్తున్నాయి. "అవి తమ తమ రంగాల్లో పాతుకుపోయి రోజురోజుకూ విస్తరిస్తూ యితర రంగాల్లో మరింత శక్తిమంతంగా తయారయి సమాజగమనాన్ని శాసిస్తున్నాయి".

వీరంతా తాము జరుపుకొంటున్న యీ సదస్సులను "న్యాయం కోసం, పరిశ్రమల స్థాపనాతత్వం కోసం ఏర్పడిన వేదికలుగా" అభివర్ణించుతారు.

సాంకేతికతతో రూపొందింపబడ్డ యీ వేదికల గురించి బ్రూక్లిన్‌లో సామాజిక సేవా కార్యక్రమాలను, సాంకేతికతా ప్రపంచంతో సంబంధం లేకుండా కార్మిక సహకార కేంద్రాన్ని నిర్వహిస్తున్న ఎమ్మాయోరా (Emma Yorra) చెప్పిన అభిప్రాయం తెలుసుకొందాం. పేద వలసదారులైనవారికి గృహాలను శుభ్రపరిచే పనులను, పిల్లల్ని ఆడించే పనులను, పెంపుడు జంతువులను జాగ్రత్తగా చూసే పనులను, ఇటువంటి యితర పనులను ఆ కార్మిక సహకార కేంద్రం నిర్వహిస్తుంది. కార్మికులకు చెల్లించే కూలి డబ్బులను మధ్యవర్తులు దోచుకోకుండా, వీలైనంత ఎక్కువ కూలిని యిచ్చేందుకు తోడ్పడుతుంది. ఒకరోజున ఎమ్మాయొర్రా ఒక సబ్‌వేలో ఒక డిజిటల్ ప్లాట్‌ఫారంపైన, అత్యంత సులభంగా యిళ్ళను శుభ్రపరిచేందుకు యిచ్చే సేవలను గురించిన ప్రకటనను చూసి ఆగ్రహం చెందింది. ఆ ప్రకటనలో యిలా వుంది "ఒక క్లిక్ చేస్తే చాలు మీ అపార్టుమెంటు శుభ్రమవుతుంది" అని వుంది.

దాని ప్రక్కన పసుపు పచ్చ గ్లవ్సు తొడుక్కున్న చేయి, స్పాంజిని పట్టుకొన్న బొమ్మ వుంది. "ఈ రకంగా గృహసేవలను అందించే సాంకేతికత సేవలు మనుష్యులు చేయటల్లేదు, ఏ మాంత్రికురాళ్ళో చేస్తాయి" అన్నట్టుగా ప్రకటిస్తూ, ఆ ఏప్ సేవల వెనుక వున్న మానవశక్తిని దాచిపెట్టి, మానవుల మధ్య పరస్పరచర్యల స్వభావాన్ని మార్చివేస్తున్నాయనీ, ఆ రకంగా బేరసారాలు ఆడగలిగే శక్తి బాగా తగ్గిపోయిన సామాజిక వాస్తవాన్ని కప్పిపెట్టుతున్నాయనీ ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది.

గతంలో మాదిరి సమస్యలకు మూలకారణాలను వెతికి, వ్యవస్థను విమర్శించి, దానిని వ్యతిరేకించి అది మార్పు చేయాలని నిర్ధారించే విమర్శకులను కాదంటూ, మార్కెట్టు ప్రపంచం యిప్పుడు మేథో నాయకులు (Thought Leaders) అన్నవారిని పెంచి పోషిస్తోంది. "ఇప్పుడు ప్రపంచంలో అతిపెద్ద భయంకరమైన సమస్యలుగా పేదరికం, వాతావరణ మార్పులు లాంటివి ఎన్నో వున్నాయి. ఐతే ప్రపంచం యీ సమస్యలను నిర్మూలించటంపై కేంద్రీకరించటంకన్నా, వాటితో సహజీవనం చెయ్యగలగటంపై కేంద్రీకరించాలి.... "బహుశా యీ సమస్యలన్నీ కలకాలం అలాగే వుండిపోవచ్చు. అందువలన ముఖ్యమైన విషయం ఏమిటంటే ఆ సమస్యలతో పోటీపడాలని మనం ప్రజలకు నేర్పాలి".... "దుర్మార్గులైన రాక్షసులకు వ్యతిరేకంగా మనం పవిత్ర యుద్ధం జరుపుతున్నా ఫలితం లేకపోయిందని మనం అంగీకరించాలి. చాలకాలం వరకూ ఆ పవిత్రయుద్ధంలో మనకు విజయం లభించదు." ....."అందువలన మనకు ఆచరణీయమైన (రాజకీయంగా) వైఖరులు అవసరం – అంటే మనం సముద్రపు కెరటాలను ఆపటానికి ప్రయత్నించటానికి బదులు సముద్రకెరటాలతోపాటు దొర్లుకుంటూ పోవాలి" అన్న సైద్ధాంతిక ప్రాతిపదికతో యీ "మేథో నాయకులను" మార్కెట్టు ప్రపంచం ఉత్పత్తి చేస్తోంది.

ఆవిధంగా మార్కెట్టు ప్రపంచం చేత మలచబడి, ఉత్పత్తి చేయబడ్డ "మేథో నాయకుల్లో" అమీ కడ్డీ (Any Cuddy) ఒకరు. ఆమె హార్వార్డు బిజినెస్ స్కూల్లో ఒక సామాజిక మానసిక శాస్త్రవేత్త. ఆవిడ ఒక దశాబ్దకాలంపాటు "మానవుల్లో ఏవిధంగా పక్షపాత భావాలు, వివక్షలు, అధికార వ్యవస్థలు ఏర్పడతాయి" అన్న అంశంపై పలు పరిశోధనా పత్రాలను ప్రచురించింది. ప్రపంచమంతటా పురుషాధిక్యత స్థానిక పరిస్థితుల్లో వ్రేళ్ళూనుకున్న విషయంపైనా, స్వేచ్ఛగా, స్వార్థపూరితంగా వుండటంలాంటివి "సాంస్కృతిక ఆదర్శాలు"గా ఏర్పడటం మొదలైన లాంటి విషయాలపై పరిశోధనలు జరిపి పలు వ్యాసాలు వ్రాసింది. కానీ ఆమెను తమ సదస్సులో ప్రసంగించమని మార్కెట్టు ప్రపంచం ఆహ్వానించగా, ఆమె గతంలో ఏర్పరుచుకొన్న తన అవగాహనకు భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేసింది. పురుషాధిక్యతకు కారణభూతమైన వ్యవస్థను మార్చాలన్న దానికి బదులు, మహిళలు తమ శక్తిని సూచించే భంగిమలను ప్రదర్శించడం, "బాడీలాంగ్వేజ్ ద్వారా అధికారాన్ని (స్త్రీలు) గెలుచుకోవడం" అనే ఐడియాను ముందుకు తెచ్చింది. ఆ రకంగా ఆమె "ఒక సమస్యను పరిష్కరించడానికి అధికారం వున్నవారి నుండి ఆ అధికారాన్ని గుంజుకోకుండా, ఆ అధికారాన్ని లేనివారికి కొద్దికొద్దిగా యివ్వటం" అనే కొత్త సిద్ధాంతాన్ని రూపొందించింది. అడ్డుగా వున్న గోడను కూల్చడం కన్నా, దాన్ని ఎక్కడానికి నిచ్చెన సమకూర్చడం అన్నమాట.

మూడు అంచెల్లో ఈ "మేథో నాయకులు" రూపొందుతున్నారు.

**మొదటిది :** ఒక సమస్య వచ్చినపుడు, అన్యాయం జరిగినప్పుడు ఆ అన్యాయాన్ని చేసినవారి గురించి ఆలోచిస్తే ఆగ్రహం పెరుగుతుంది. అందువలన ఘర్షణ చోటు చేసుకొంటుంది. అందుకు బదులు నీ ఆలోచనను బాధితుడివైపుకు మారిస్తే నీవు అతడి పట్ల సానుభూతి చూపిస్తావు. అందువలన నీ ఆలోచన నిర్మాణాత్మక దిశ వైపు సాగుతుంది. హానిని కలిగించిన వారిని శిక్షించటానికి ప్రయత్నించేబదులు, నువ్వు హానికి గురికాబడ్డవారికి సహాయం చేయగల్గుతావు. మానసిక శాస్త్రవేత్త, మేథో నాయకునిగా ఇటీవల గుర్తింపబడిన ఆడం గ్రాంట్ సూచించిన పద్ధతి ఇది.

**రెండవది :** రాజకీయాన్ని వ్యక్తిగతం చేయటం. ప్రజలకు సహాయ పడేవానిగా నీవు చేయాల్సినది ఏమిటంటే వారు సమస్యలను వ్యవస్థాపరమైనవిగాకాక, వ్యక్తిగతమైనవిగా చూసేటట్లు, సమస్యలను సమష్టిగా కాక వ్యక్తిగతంగా పరిష్కరించుకోవాలని వారికి తెలియ జేయటం. ఇది సమస్యపై మన ఆలోచనలను కేంద్రీకరించడానికి సంబంధించిన అంశం.

వాస్తవానికి వ్యక్తిగత సమస్యలు కూడా రాజకీయ సమస్యలే. వాటికి వ్యక్తిగత పరిష్కారాలన్నవే లేవు. అందువలన సమష్టి పరిష్కారం కోసం, సమష్టి కార్యాచరణే జరగాలి, కానీ యిప్పుడు మార్కెట్టు ప్రపంచం యీ అవగాహనను చాకచక్యంతో మార్చివేసింది.

**మూడవది :** ఆలోచనలను లాభదాయకమైన వ్యాపార వస్తువులుగా మలచగలగటం. ఈ ఆలోచనలను అందరికీ విరివిగా అందుబాటులోకి వచ్చేవిధంగా నిరంతరం (ఉపన్యాసాల ద్వారా) బోధించటం.

ఎవర్నీ సవాలు చేయకుండానే, మనిషిలో ఆశలు కల్పించేవిగా వుండటమన్నది ఈ ఆలోచనల అంతస్సూత్రం. ఈ మేథో సంబంధమైన ఆలోచనలన్నీ క్రింది సైద్ధాంతిక ఊహల పునాదిపై ఆధారపడ్డాయి :– వ్యాపార – వాణిజ్యాలే పురోగతికి చోదక యంత్రాలు. అందువలన రాజ్యాంగయంత్రం (ప్రభుత్వం) సాధ్యమైనంత తక్కువగా పనిచేయాలి. సమస్యలను పరిష్కరించటానికే కాదు, దుర్లభంగా అరుదుగా వున్న వనరులను కేటాయించటానికి కూడా మార్కెట్టు శక్తులే శ్రేష్టమైన మార్గం. సారాంశంలో ప్రజలు హేతుబుద్ధిగలవారే అయినా, స్వార్థ ప్రయోజనాలకోసం మసిలే వ్యక్తులుగా వుంటారు.

వాస్తవానికి అసమానత్వం అన్నది, సంపదను తిరిగి యిచ్చి వేయడానికి సంబంధించిన విషయంకాదు. అసలు అంతటి సంపదను నువ్వు ఏవిధంగా కూడబెట్టావన్నదే ప్రశ్న? ఆ రకంగా సంపదను

కూడబెట్టుకోవటాన్ని సాధ్యం చేసిన వ్యవస్థ యొక్క స్వభావం ఏమిటన్నదే ప్రశ్న.

కానీ యీ మార్కెట్టు ప్రపంచపు మేధావులు "అసమానత అన్నది అవాంఛనీయమే అయినప్పటికీ, అసలైన అభివృద్ధి (పురోగతి) సాధించటానికి అది (అసమానతే) అనివార్యంగా చెల్లించాల్సిన మూల్యం". "నీకు పురోగతి (అభివృద్ధి) కావాల్సివస్తే సంపన్నులు ఎంత సంపాదిస్తారో అంత సంపాదించుకోనివ్వు! దానివలన అసమానత ఎంతగా విస్తరించినా ఫర్వాలేదు" అని వాదిస్తారు. "దాతృత్వం అనేది విజేతలకు అన్ని రకాల ఎదురు ప్రశ్నల నుండీ, నియంత్రణల నుండీ మినహాయింపు పొందే హక్కునిచ్చింది" అంటూ వారు నచ్చజెపుతున్నారు.

దాతృత్వ ప్రపంచం యొక్క పై స్థాయికి చేరుకొంటున్న వారిలో డారెన్ వాకర్ (Darren Walker) ఒకడు. డారెన్ అవివాహితగా వున్న ఒక నల్లజాతి స్త్రీకి పుట్టిన యిద్దరు పిల్లలలో ఒకడు. అతడు లూసియానోలోని, లఫాయెటి ఛారిటీ హాస్పటల్‌లో జన్మించాడు. అతని తల్లి తన బిడ్డలను తీసుకొని టెక్సాస్‌లోని నల్లజాతివారి పట్టణమైన అమేస్ (Ames)కు మారింది. ఆమె ఒక నర్సుకు సహాయకురాలిగా పని చేసేందుకు కావల్సిన చదువు చదివి సర్టిఫికేట్ సంపాదించింది. అయినా ఆమెకొచ్చే సంపాదన ఆమెను పేదరికం నుండి తప్పించలేక పోయింది. 1965లో అధ్యక్షుడు లిండన్ బి జాన్సన్ ప్రభుత్వం చేపట్టిన బాలల విద్యాపథకం క్రింద ఏర్పాటు చేసిన స్కూల్లో జేరిన డారెన్ అక్కడి పనిచేసే ఒక ఉపాధ్యాయురాలి సహాయంతో ప్రత్యేక విద్యను అభ్యసించగలిగాడు. ఆవిడ సహాయం దొరకకపోతే ఎందరో యితర నల్లజాతి బాలుర మాదిరిగానే అతడు కూడా అనివార్యంగానే జైలు పాలయి వుండేవాడు. అతడి తోటివారైన ఆరుగురు మగ దాయాదులు (కజిన్సు) జైలుపాలయ్యారు. అతడు పన్నెండేళ్ళ వయస్సులో, తన తల్లికి ఆసరాగా వుండటం కోసమని ఒక హోటల్‌లో క్లీనర్‌గా చేరాడు. తన దాయాదులు (కజిన్సు) జైళ్ళకూ, బయటకు మధ్య తిరుగుతున్న కాలంలో అతడు టెక్సాస్ యూనివర్సిటీలో చదివాడు. అనంతరం ఏడేళ్ళపాటు ఒక ఫైనాన్సు కంపెనీలోని పెట్టుబడి మార్కెట్ల విభాగంలో పనిచేశాడు. అనంతరం అబిసీనియన్ డెవలప్‌మెంటు కార్పొరేషన్లో పని చేసి, అక్కడి నుండి రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్‌లోకి మారాడు. అంతే ఇక అప్పటి నుండి అతడి సామాజిక స్థాయి పైపైకి పెరిగిపోయింది. అతడిప్పుడు న్యూయార్కు నగర సమాజంలో ఉన్నతస్థాయి (సంపన్న) వారిలో ఒకడయిపోయాడు. అతడు విదేశీసంబంధాల సమితిలో సభ్యుడు. రాక్‌ఫెల్లర్ దాతృత్వ సలహాదారుల బోర్డులో సభ్యుడు. ఫ్రండ్స్ ఆఫ్ ది హైలైన్‌లో సభ్యుడు. అయితే ఒక రోజున అతడు సంపన్నులతో డిన్నర్ చేస్తుండగా అతడి సోదరి అతడికి, వాళ్ళ మేనత్త బెర్తా యొక్క అంతిమక్రియలు జరిపిన ఫోటోలు పంపింది. ఆ ఫోటోలలో ఒకదానిలో వాకర్ తన కజిన్ ఒకరిని గుర్తించాడు. అతడు జైలు దుస్తులు ధరించి వున్నాడు. ఎవరో తెలియని ఒక తెల్లజాతి మనిషి అతడి వెనక నుంచున్నాడు. ఎవరా వ్యక్తి అని అతడు తన సోదరిని ప్రశ్నిస్తే, 'లూసియానలో కొన్ని సమయాల్లో జైల్లోవున్న వారిని బంధువుల అంత్యక్రియలకు పంపిస్తారు. అందుకు కొంత రుసుం చెల్లించాలి. తోడుగా ఒక పోలీసు ఆఫీసరు కూడా వస్తాడు' అని చెప్పింది.

మరో రోజున అతడి కజిన్ (దాయాది) మరొకరు చనిపోయాడు. అతడి కుటుంబం నిరుపేదలు. అందువలన అతడి అంత్యక్రియలకు అయిన ఖర్చునంతటినీ డారెన్ తల్లి డారెన్ తన కిచ్చిన క్రెడిట్‌కార్డు ద్వారా చెల్లించింది. ఈ ఘటనలు అతడ్ని ఆలోచనలకు పురికొల్పాయి. అప్పటికి అతడికి సంవత్సరానికి 789000 డాలర్లు ఆదాయం వస్తుంది. ఖరీదైన బట్టలు ధరిస్తాడు. బిలియనీర్లు స్నేహితులుగా వున్నారు. మాడిసన్ స్క్వేర్ పార్కులో విలాసవంతమైన ఫ్లాట్‌లో నివసిస్తున్నాడు. అతడు బిలియనీర్లు, మిలియనీర్లు అయినవారు తమ అపార్టుమెంట్లకు చెల్లించాల్సిన పన్నులో రాయితీని పొందిన వారి మధ్య జీవిస్తున్నాడు. 'అయితే ఎన్ని ఆదర్శాలుంటే మాత్రం పన్ను రాయితీని వద్దనుకొని విడనాడే వాడు ఎవడుంటాడు?' అనుకొన్నాడు. అప్పటి నుండీ అతడు వ్యవస్థల గురించి మాట్లాడాలనుకొన్నాడట!. "ఇటువంటివి సంభవించే సమాజంలో మనం ఎందుకు జీవించాలి? అనుకొన్న అతడు, "ప్రత్యేక హక్కులు సౌకర్యాలు వున్న మనం యీ సమాజాన్ని మార్చాలి" అనుకొన్నాడట! పూర్తిగా అవినీతిపాలైన యీ వ్యవస్థను ప్రక్షాళన చెయ్యాలనుకొన్నాడట. ఇటువంటి ఆలోచనను సామాజికశాస్త్రవేత్తలు "విపరీత ప్రవర్తనా ప్రతిష్టలు" (Idiosyncerasy Credits) అని పిలుస్తారు. అప్పుడప్పుడు యిటువంటివారు తమ బృందం అనుసరించే నియమాలనే వ్యతిరేకిస్తారు. అదే వాకర్ యిప్పుడు చేస్తున్న పని. ఇంతకీ అతడు చేస్తున్నదేమిటయ్యా అంటే విజేతలను బ్రతిమాలి, ఒక పక్షపాతంలేని సమసమాజాన్ని గురించి ఒక సంభాషణ ప్రారంభించగలగడమట?. ఇదీ ప్రపంచాన్ని మార్చే అత్యంత సంపన్నుల ఆలోచనాసరళి!

అతడు బ్రతిమాలి ఒప్పించాలనుకొంటున్న వారిలో సేక్లర్ సోదరులు ఒకరు. వారు అనేక ప్రతిష్ట గలిగిన దాతృత్వసంస్థలకు భారీ విరాళం ఇచ్చినవారు – యిస్తున్నవారు. ఆ సోదరులు వ్యక్తిగతంగానే కాకుండా, తమ కంపెనీ ఏ ఏ ప్రాంత ప్రజాసమూహాల్లో నిర్వహింపబడుతోందో అక్కడ తమ కంపెనీ ద్వారా స్థానిక బృందాలకు గ్రాంట్లను యిస్తున్నారు. "యువకులలో పెను ప్రమాదపు ప్రవర్తనను (High Risk Behaviour) తగ్గించే" కార్యకలాపాలు నిర్వహించే సంస్థలకు యీ గ్రాంట్లు యిస్తున్నారు. అంతేకాక "మందుల దుర్వినియోగాన్ని తగ్గించే విషయం వైద్యులు గుర్తించేందుకు" సహాయపడే విద్యాసంబంధ కార్యక్రమాలకు నిధులు యిస్తున్నారు. అమెరికాలోనూ, ప్రపంచమంతటా గల అధికార ప్రభావిత ప్రాంగణాల్లో యీ సేక్లర్ సోదరుల ఉదారమైన వితరణను, దాతృత్వాన్ని తప్పించుకోగల వారెవ్వరులేరు. ఇంతకీ వీరు సంపదను కూడబెట్టిన విధమేమిటంటే : 1996లో వీరు నెప్పి నివారణ మందు ఆక్సీకాన్‌టిన్(Oxycontin)ను మార్కెట్లో ప్రవేశపెట్టారు. ఇది ఒక శక్తిమంతమైన మత్తుమందు – మాదకద్రవ్యం. 12 గంటలపాటు నొప్పి నుండి ఉపశమనం

కలుగచేస్తుంది. మొదట యీ మందును విడుదల చేసినప్పుడు యిది దుర్వినియోగపర్చబడనిదనీ, యీ మందు వాడకం ఒక వ్యసనంగా మారకుండా వుంటుందనీ ప్రచారం చేశారు. కానీ 'టైమ్స్' పత్రిక ప్రకారం, "అలా ప్రచారం చేస్తూనే ఆ మందును మార్కెట్లో అమ్మడానికి పలు రకాల కార్యక్రమాలు వారి కంపెనీ 'పర్డ్యూ ఫార్మా' చేపట్టింది. ఆ ప్రచారోద్యమం అంతవరకు ఏ మందుల తయారీ కంపెనీ, నొప్పి నివారణ మందులు మార్కెటింగ్ చేయటానికి చేపట్టనటువంటి తీవ్ర ఉధృతస్థాయిలో సాగింది. ఆ మందును అమ్మే డిస్ట్రిబ్యూటర్ల మధ్య పోటీ పెట్టి బహుమతులిచ్చే సమావేశాలరూపంలోనూ, డిన్నర్ పార్టీ సమావేశాల రూపంలోను, ఆఖరికి ఆ పర్డ్యూ కంపెనీతోపాటు, దాని భాగస్వామ్యమైన ఏబట్ లాబరేటరీలతో కలసి, డాక్టర్లను, ఎముకల – కీళ్ళ వైద్యం చేసే డాక్టర్లను, సర్జన్లను ప్రలోభపెట్టి ఆక్సీకాన్‌ను ఎక్కువగా ప్రిస్క్రైబ్ చేసేటట్లు చేసింది. ఆ రకంగా 1990లలో చిన్న మందుల తయారీ కంపెనీగా వున్న పర్డ్యూ కంపెనీ 2001 నాటికి 3 బిలియన్ల డాలర్లు సంపాదించే స్థాయికి చేరుకొంది. ఈ మందు ఓవర్‌డోస్ వాడకం వల్ల (ఆ మందుకు బానిసైనవారితో సహా) ఈ మత్తు మందు ప్రిస్క్రిప్షన్లు 1999 నుండి 2014 దాకా నాల్గురెట్లు పెరగగా, కేవలం 2014 సంవత్సరంలోనే 14,000 మంది ఈ మందు వాడడం వల్ల చనిపోయారు. ప్రతీరోజూ యీ మందు వ్యసనానికి గురయిన వేలాదిమంది ఎమర్జన్సీ చికిత్సకు లోనవుతున్నారు. ఎట్టకేలకు యీ మందు దుష్పరిణామాలను గుర్తించిన అమెరికన్ మందుల నియంత్రణ సంస్థ ఈ కంపెనీని కోర్టుకీడిస్తే ముందు కాదని బుకాయించిన కంపెనీ ఆఖరుకు 635 మిలియన్ల డాలర్ల అపరాధ రుసుంను చెల్లించటానికి అంగీకరించింది. ఈ పర్డ్యూఫార్మా ద్వారా అనంతమయిన సంపదను అన్యాయంగా కొల్లగొట్టిన సేక్లర్ సోదరులనే ఒప్పిస్తానని వాకర్ చెబుతున్నాడు. ఈ రకంగా మార్కెట్టు ప్రపంచం న్యాయానికి ప్రత్యామ్నాయంగా ఔదార్య, దాతృత్వాలకు అనుమతినిస్తోంది.

వాకర్ మాదిరిగానే ప్రశ్నలు వేస్తూనే, మార్కెట్ ప్రపంచపు భావజాల సిద్ధాంతాలతో రాజీపడుతూ, వాటి ద్వారా ప్రపంచాన్ని మార్చవచ్చునన్న దానిని హేతుబద్ధం చేసుకొన్న వ్యక్తులలో కేట్ కోల్ (Kat Cole) ఒకరు. ఈవిడ ప్రస్తుతం ఫోకస్ బ్రాండ్ అనే సంస్థకు చెందిన ప్రైవేటు ఈక్విటీ కంపెనీకి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్. సిన్నబాన్ అనే ఆహారపదార్థాల కంపెనీతోపాటు, పలుపేర్లతోగల ఆహారపదార్థాల కంపెనీలకు ఫోకస్ బ్రాండ్ సంస్థ స్వంతదారు. కోల్ తల్లిదండ్రులు తెల్లచొక్కా ఉద్యోగాలు (మధ్యస్థాయి గుమాస్తాలు) చేసేవారు. వీరి బంధువులలో ఎక్కువ మంది పేదవారుగా వుంటూ ట్రైలర్ పార్కుల్లో (ట్రక్కుల నివాసాలు నిలిపే పార్కులు) నివసిస్తూన్న పేదవారే!. కోల్ తండ్రి త్రాగుబోతు. అతడు తరచు కుటుంబాన్ని వదలిపెట్టి పోతూవుండేవాడు. అందువలన వాళ్ళు కూడా పేదవారుగా మారిపోయారు. వారికి తాజాగా వుండే ఆహారం తినగలిగే ఆర్థికస్థోమత లేకపోవటంతో, చవకబారు ప్రాసెస్డ్ ఆహారం తింటూ కాలం వెళ్ళబుచ్చాల్సివచ్చేది. కోల్ తల్లి ఒక చోట ఆఫీసు సెక్రటరీ ఉద్యోగం చేస్తూనే రాత్రిపూటల్లో, వారాంతాల్లో యితర పనులు చేసేది. కోల్ తన పదిహేనవఏట మాల్‌లో బట్టలు అమ్మేది. హైస్కూలు జూనియర్ సంవత్సరంలో హూటర్స్ అనే రెస్టారెంటులో వెయిటర్ (సర్వర్) గా చేరింది. బాలికా సర్వర్‌ల వక్షోజాలను తమ అమ్మకపు ఆకర్షణగా హూటర్స్ వ్యాపారం చేస్తుందన్న ప్రతీతి వుంది. అయితే ఆ ఉద్యోగం తనకు సాధికారత నిస్తుందని కోల్ భావించింది. కాలేజీ విద్యార్థినిగా వున్నప్పుడే ఆమె ఒక షిఫ్టులో400 డాలర్లు సంపాదించటం మొదలెట్టింది. ఆ హూటర్స్ రెస్టారెంట్ యొక్క అడ్వర్టయిజ్‌మెంట్లు వెల్లడి చేస్తున్నా కూడా, కోల్ మాత్రం "ఆ సంస్థ వక్షోజాల ఆకర్షణతో వ్యాపారం చెయ్యటల్లేదు. ఓవర్ ఆల్ (మొత్తం) సెక్స్ అప్పీలును అమ్ముతుంది" అంటూ సమర్థిస్తుంది. ఆ రెస్టారెంటులో కొన్నిసార్లు కష్టమర్లు సర్వర్లపై భౌతికదాడులు చేస్తారు కూడా! అయినా అవి అన్నీ మామూలేనంటుంది కోల్. ఆమె తన నైపుణ్యం వలన హూటర్స్ మేనేజిమెంటు స్థాయికి చేరుకొంది. ఆమె "హూటర్స్ మహిళలను దోచుకోదు. మహిళల సెక్స్ అప్పీలును పెంచి ఆ మహిళలకు ఉద్యోగాలనిస్తారు" అంటూ హేతుబద్ధం చేసి సమర్థించింది. కాలక్రమంలో ఆమె ఎం.బి.ఎ చదువుకొని ఫోకస్ బ్రాండుకు చెందిన సిన్నబన్ ఆహార కంపెనీలో చేరింది. ఆ కంపెనీ అమ్మే ఆహార పదార్థాలను ఆరోగ్యం కోరుకొనేవారు తినకుండా తప్పించుకోవాలి! ఆ అనారోగ్యకర ఆహార పదార్థాలన్నీ కోల్ ఆధ్వర్యంలోనే తయారు అవుతున్నాయి. కానీ ఆమె ఏరకంగా దాన్ని సమర్థిస్తుందంటే "మాది శతాబ్దాల కాలంగా సాగుతున్న బేకరీ. ఇప్పుడు మేము భారీ ఎత్తున పంచదార వాడుతున్నాం. ఇది వందల సంవత్సరాలలో జరిగిన అర్థవంతమైన పరిణామం"....."స్వేచ్ఛామార్కెట్టు సమాజంలో డిమాండు వుంటుంది. అది పంచదార ఉత్పత్తులకే కావొచ్చు. ఆల్కహాల్‌కే కావొచ్చు. లేదా అరకొరగా బట్టలు కట్టుకొన్న మహిళా సర్వర్లతో నిర్వహించాల్సిన రెస్టారెంట్లు కావొచ్చు." అవి అలాగే ఉనికిలో వుంటాయి. అప్పుడు మనం పట్టించుకోవల్సిన విషయమేమిటంటే! ఎలాగ ఉనికిలో వున్నాయి అన్నదానినే." నేను (కోల్) నా విధిని సక్రమంగానే నిర్వర్తించాను. సిన్నబన్ రోల్సు తినే వారికి వాటి నిండా పంచదార, క్రొవ్వు వుందని చెప్పాం !. వాటిని మీరు బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్లలో తినవద్దు అని మీడియాలో హెచ్చరిస్తాం! అంటూ, హానికరమైన ఆహారపుటలవాట్లు, పౌష్టికాహారం ఎంచుకోవటానికి గల అవకాశాలు, ఊబకాయం లాంటి వ్యవస్థకు సంబంధించిన నిర్మాణాలను గురించిన ప్రశ్నలను విస్మరించమంటోంది! ఇటువంటి "పారదర్శక" ప్రయత్నాల ద్వారా హానికర ఆహార పదార్థాల గురించి హెచ్చరించటమే 'కార్పొరేటు సుగుణం' అని ఆమె చెబ్తోంది.

లారీ (Laurie Tisch) టిష్ అనే ఆమె లోయాస్ కార్పొరేషన్ స్థాపించిన వ్యక్తి. ఆ కంపెనీ ద్వారా అపారసంపదను కూడబెట్టింది. న్యూయార్కు నగరంలో టిష్ కుటుంబం దాతృత్వానికి పేరొందిన

కుటుంబం. ప్రస్తుతం ఏభై – అరవై సంవత్సరాల మధ్య వయస్సులో వున్న ఆమె 21 బిలియన్ల డాలర్ల ఆస్థికి వారసులు. ఆమె యిప్పుడో బడా దాత. 1968లో లోయిస్ కంపెనీ, పొగత్రాగటంపై ప్రజలకు పెరుగుతున్న ఆరోగ్యపు పట్టింపు (పొగత్రాగటానికి వ్యతిరేకంగా)ను సొమ్ము చేసుకొంది. చవకబేరానికి సిగరెట్లు తయారు చేసే ఒక కంపెనీని కొనుగోలు చేసింది. తాను కొనుగోలు చేసిన సిగరెట్టు కంపెనీ లోరిల్లార్డ్‌లో 'న్యూపోర్టు' బ్రాండు సిగరెట్లును ఉత్పత్తి చేసింది. ఈ సిగరెట్లు ఆఫ్రికన్ అమెరికన్లను లక్ష్యంగా పెట్టుకొని ఉత్పత్తి చేసారు. ఈ వివాదాస్పద సిగరెట్లు యితర వాటికన్న పొగత్రాగే వారిని బాగా ఆకర్షిస్తాయి. కానీ చాలా ప్రాణాంతకమైనవి. వీటిలో సగటు స్థాయి కన్నా ఎక్కువ నికోటిన్ వుంటుంది. కానీ అది తెలియకుండా మెంథాల్ వీటిలో కూర్చబడుతుంది. అందువల్ల ఈ సిగరెట్లు పొగత్రాగే వారిని సునాయాసంగా వలలో వేసుకొంటాయి. 1994లో ఏడు సిగరెట్ల తయారి కంపెనీలతో పాటు లారీ యొక్క పినతండ్రి ఆండ్రూ, సిగరెట్లు త్రాగటం ఆరోగ్యానికి హానికరం కాదు అన్నదానికి వ్యతిరేకిస్తూ, అమెరికన్ కాంగ్రెస్‌లో బలంగా వాదించాడు. తర్వాత ఒక సంవత్సరానికి పొగాకు పరిశ్రమ సృష్టించే హానిపై జాగృతం చేస్తూ తీసిన 60 నిముషాల డాక్యుమెంటరీ చిత్రాన్ని, లారీ కజిన్ లారెన్మో చైర్మన్‌గావున్న సి.బి.ఎస్ టివి. నెట్‌వర్కు నాశనం చేయటం ప్రజల్లో ఆగ్రహాన్ని రేకిత్తించింది. ఈ విషయాలన్నీ లారీ టిష్‌కు తెలుసు. అయినా అమె యీ విషయాలు పట్టించుకోనవసరం లేదన్నట్టుగానే న్యూయార్కు నగరంలో ఆఫ్రికన్ అమెరికన్లు నివసించే హార్లెం మురికివాడలో ఆఫ్రికన్ అమెరికన్ ప్రజాసమూహాలలో కళలను అభివృద్ధి పరిచేందుకు, లేదా యువత జీవితాలను మెరుగు పర్చటం కోసం పెట్టుబడులు పెట్టేందుకు, లేదా ఆ సమాజాల వారికి ఆరోగ్యకరమైన ఆహారం అందించేందుకు చేపట్టే కార్యక్రమాలకు నిధులను దానం చేసింది. ఇంకా గొప్ప వైరుధ్యమైన విషయం ఏమిటంటే ప్రజల ప్రాణాలను రక్షించే ఆస్పత్రులకు భారీ ఎత్తున విరాళాలు యిస్తుంది. ఎవ్వరైనా యీ వైరుధ్యాన్ని ఆమెకు గుర్తుచేస్తే "సిగరెట్లు ఆల్కహాల్ కన్నా ప్రమాదకరమైనదా? ఆల్కహాల్ పంచదార కన్నా ప్రమాదకరమైనదా?" అంటూ తనకు సంపద ప్రోగుపడిన కారకాన్ని సమర్ధించుకొంటుంది. ప్రపంచాన్ని మార్చే దాతృత్వ కపట ప్రహసనం ఇదొకటి.

ఈ రకంగా అత్యధిక సంపన్నులైన వ్యక్తులే కాదు ప్రముఖ రాజకీయ నాయకులు కూడా యిటువంటి పద్ధతుల్లో ప్రపంచాన్ని మార్చవచ్చుననే సిద్ధాంతాన్ని బోధిస్తున్నారు. అటువంటి వారిలో ప్రముఖుడు జనవరి 2001లో అమెరికా అధ్యక్ష పదవిని విడిచి పెట్టిన క్లింటన్. అతడు పలు కుంభకోణాల్లో నిందితుడై వున్నాడు. ప్రతినిధుల సభలో అభిశంసనకు గురికాబోయి బయటపడ్డారు. అతడు వైట్‌హౌస్‌లోని ఫర్నిచర్‌ను దొంగలించాడనే అభియోగాన్ని ఎదుర్కొన్నాడు. అటువంటి క్లింటన్ యిప్పుడు ప్రపంచ దాతృత్వానికి ఒక ఆదర్శవంతమైన ప్రతినిధి (ఐకాన్)గా రూపొందాడు.

ఆయన అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అమ్మే హెచ్.ఐ.వి. / ఎయిడ్స్ మందుల ధరలు తగ్గించే క్లిష్టమైన ఒప్పందాలకు బ్రోకర్‌గా పనిచేశారు. 2005లో కాలానుగుణంగా "నువ్వు నిజంగా యిప్పుడు ప్రపంచాన్ని మార్చాలనుకొంటే నీకు కార్పొరేట్ల, ధనిక వర్గాధిపతుల సహాయం అవసరం" అని నిర్ణయించుకొన్నాడు. అందుకోసం మార్కెట్టు ప్రపంచపు సర్క్యూట్‌లో తన స్వంత సదస్సుల అవసరం అని నిర్ణయించుకొన్నాడు. ఆ ప్రకారం 2005లో దావోస్‌లోని ప్రపంచ ఆర్థిక వేదికపైన తాను స్థాపించిన "క్లింటన్ గ్లోబల్ ఇన్షియేటివ్" వేదికను ప్రకటించాడు. ఐక్యరాజ్యసమితి ప్రతీ సంవత్సరం సెప్టెంబరు నెలలో జరిపే సభల సందర్భంగానే, తన సంస్థ కూడా సదస్సు జరుపుతుంది. ఈ సభకు ప్రపంచమంతటి నుండి రాజకీయ నాయకులనూ అత్యంత సంపన్నులను, పారిశ్రామికవేత్తలనూ, కార్మికసంఘాలను, పౌర సమాజాన్నీ ఆహ్వానిస్తాడు. సామాజిక మెరుగు కోసం చొరవ తీసుకోవటం కోసం కలిసి పనిచేసి, తాము ఏం సాధించాలనుకొని పథకం వేశామో దాన్ని బహిరంగంగా వాగ్దానం చేద్దామన్నాడు. ఈ సదస్సులకు హాజరయే వారందరినీ గ్లోబలిస్టులు అని పిలుస్తారు. క్లింటన్ లెక్క ప్రకారం క్లింటన్ గ్లోబల్ ఇన్షియేటివ్ 3,600 వాగ్దానాలకు (ప్రపంచాని మార్చే చొరవలను బట్టి) స్ఫూర్తినిచ్చిందట! 180 దేశాలలోని 435 మిలియన్లకు మించిన జీవితాలను బాగుచేసిందట! ఈ గ్లోబలిస్టులు చేపడుతున్న ప్రపంచాన్ని రక్షించే విధానాలు ప్రైవేటువి. ఐచ్ఛికమైనవి. ఎవరికీ జవాబుదారీతనం వహించనివి. "ప్రధానమైన పెద్ద కార్పొరేషన్లతో సౌభాగ్యాన్ని సృష్టించటం" అన్న పేదరిక వ్యతిరేక సలహా సంస్థ టెక్నో సర్వీసు సంస్థతో ముందుకు తీసుకువచ్చిన ఒక వాగ్దానంలో వాల్‌మార్ట్, కోకా–కోలా, కార్గిల్, మెక్‌డొనాల్డు, ఎస్.ఎ.బి. సంస్థలు భాగస్వాములు. ఆ సంస్థ యొక్క పురోగతి రిపోర్టులో తాము "పిరమిడ్‌కు అడుగుభాగంలో పారిశ్రామిక స్థాపనావేత్తల మధ్య పోటీ కార్యక్రమం వుండే వాణిజ్య పథకాన్ని" అమలుపరిచాము అంటూ చెప్పుకొన్నారు. ఈ సదస్సుకు హాజరయ్యేవారందరూ, పదిమంది యితర సంపన్నులతో పరిచయం చేసుకోవటానికి, వ్యాపార అభివృద్ధి అవకాశాలు కల్పించుకోవటానికీ, పరస్పరం లాభం పొందటానికీ వస్తారు. ఈ సదస్సులో ప్రవేశానికి భారీ ఎత్తు రుసుం చెల్లిస్తారు. వీరు చేపట్టే కార్యకలాపాలు ఎలా వుంటాయంటే వీరు నైగర్ నదీ డెల్టా ప్రాంతంలో కాలుష్యకారకమైన పరిశ్రమల్లో పెట్టుబడి పెట్టి లాభాలు సంపాదిస్తారు. మరోవైపు నైజీరియా డెల్టా ప్రాంతంలో వ్యాధులు, డయేరియా లాంటి రోగాలు తగ్గించటానికి చేపట్టే చొరవలకు మద్దతునిస్తారు. గ్లోబలిస్టుల అభిప్రాయం ప్రకారం "మంచి సమాజం అంటే పరిశ్రమలను స్థాపించే వాళ్ళ సమాజం. వీళ్ళ విజయం అంటే సమాజం యొక్క విజయమే! ఇందుకోసం ప్రభుత్వాలు ప్రైవేటురంగంతో భాగస్తులుగా పనిచేయాలి తప్ప ప్రైవేటురంగానికి వ్యతిరేకశక్తిగా వుండకూడదు."

క్లింటన్ ఏర్పాటు చేసే సదస్సులో నైజీరియాలో మంత్రిగా ప్రపంచబ్యాంకు అధికారిణిగా పనిచేసిన ఒకిన్జో – ఇవియేలా (Okonjo

- Iweala, Ngozi) అనే ఆమె ప్రపంచాన్ని మెరుగు పరచే ఒక ఆలోచన చెప్పింది. ఆమె గ్లోబల్ వేక్సిన్ అలయన్స్ అనే సంస్థలో న్యాయ వ్యవహారాల నిపుణురాలుగా పనిజేస్తోంది. బ్యాంకులకు కష్టకాలంలో (దివాలా తీసిన సమయంలో) వాటిని ప్రభుత్వం ఆదుకొనేందుకోసం ఆమె పనిచేస్తుంది. ఆవిడ చెప్పిన 'ఐడియా' ఏమిటంటే "సంఘర్షణ నమూనా"లో ఆర్థికసంక్షోభ కాలంలో మెరుగ్గా మేలు చేయవచ్చునట! అంటే వాక్సిన్లు మరింత అందుబాటులోకి ముమ్మరంగా తీసుకురాగలిగితే ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చునట. అంటే వాస్తవంలో వాక్సిన్లు ఉత్పత్తి చేసే కంపెనీల అమ్మకాలు ముమ్మరంగా పెరిగి లాభాలు వస్తాయి. ప్రజల ప్రాణాలు నిజంగా కాపాడబడుతున్నాయా, లేదా, అన్నది సందేహాస్పదమే! సరీగ్గా యీ రకమైన దాతృత్వ పద్ధతుల్లోనే మనదేశంలో మిలిందా గేట్సు ఫౌండేషన్ ద్వారా బిల్ గేట్స్ కుమార్తె మిలిందా బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం అనే వ్యాక్సిన్లు అందజేస్తోంది; ఈ రూపంలో ఆ క్యాన్సర్ నివారణ మందు యీ బాలికలపై ప్రయోగం చేయటంతోపాటు, ఆ వాక్సిన్ల అమ్మకానికి, విస్తృతమైన మార్కెట్టు అందుబాటులోకి తీసుకు వచ్చింది. 'కూటి కోసం కోటి విద్యలు' అన్నది ఒకనాటి మాటైతే, 'లాభార్జన కోసం లక్షలాది బూటకాలు' అనే మార్గాన్ని చేబట్టారు నేటి గ్లోబలిష్టులైన అత్యంత సంపన్నవర్గ పెట్టుబడిదారులు! ఇదీ ప్రపంచాన్ని మార్చే కపట ప్రహసనం!

ఈ సదస్సులో "మహిళల సమానత్వం" అన్న విషయంపై జరిగిన చర్చలో జేన్ వుర్వేండ్ (Jane Wurwand) అనే ఆమె ప్రసంగించింది. ఆమె డెర్మాలోజికా అనే చర్మ సౌందర్య సాధనాలు, క్రీంలు ఉత్పత్తి చేసే కంపెనీ స్థాపకురాలు. "మహిళ సమానత్వ సమస్యకు పరిష్కారం స్త్రీలు పారిశ్రామిక వ్యవస్థాపకులుగా రూపొందటం", "నాకు దానర్థం అంతా స్త్రీలకు ఉద్యోగాలు కల్పించటమన్నదే!" అంటూ ఆమె నొక్కి చెప్పింది. ఆ రకంగా ఆమె చర్చిస్తున్న అంశాన్ని ఉద్యోగులకూ, తమ రంగాల అభివృద్ధికీ పరిమితం చేసింది. నిజంగా జండర్ సమానత్వం వస్తే సౌందర్య సాధనాల పరిశ్రమ కుంచించుకుపోదూ? అందువలన ప్రధానంగా స్త్రీత్వాన్ని ఒక స్త్రీ జీవితంలోని భావవ్యక్తీకరణగా ఆమె శరీరం యొక్క మృదుత్వ స్థితిగా, ప్రసవానంతరం ఆమె యొక్క చర్మపు స్థితిగా ఆమె వక్షోజాల యొక్క ఆకారాల స్థితిగా పునర్ వ్యవస్థీకరిస్తూ, అందవిహీనం అన్నదానిని ఒక జబ్బుగా చూపెట్టడం, ఈ అంద విహీనత్వం అన్నదానిపై రిటైల్ వాణిజ్యం, అడ్వర్‌టయిజ్‌మెంటు వ్యాపారులు సొమ్ము చేసుకొంటూ, సెలూన్‌లూ, ప్లాస్టిక్ సర్జన్లూ, పార్లర్లూ లాభాలు దండుకొంటున్నాయి. అందువలన డెర్మలాజికా సంస్థ కూడా సౌందర్య సాధనాల, సౌందర్య క్రీంల వ్యాపారంలో లాభం చేసుకోవాలంటే ఆ కంపెనీ స్త్రీలు ఉద్యోగాలు చేస్తూ తమ పరిశ్రమను విస్తరించాలి. అందుకే, జేన్ వుర్వేండ్‌కు స్త్రీలకు ఉద్యోగాలు అన్నది స్త్రీల సమానత్వ సాధనాపరిష్కారం అయింది. ఇది ప్రపంచాన్ని మార్చే మరొక కపట ప్రహసనం.

అమెరికాలో టైపు 2 చక్కెర వ్యాధి పిల్లల్లో వ్యాపించటం అన్నది ప్రబలింది. ఇందువలన గుండెజబ్బులు కూడా వస్తాయి. విపరీతంగా కూల్‌డ్రింక్స్ త్రాగటం వలన పిల్లల్లో యీ చక్కెర వ్యాధి వస్తోందని తేలింది. ఇందుకు క్లింటన్ చూపిన పరిష్కారమేమిటంటే, ఆ కూల్‌డ్రింక్‌లను నిషేధించటం కాదు. ఆ కంపెనీల వారిని బ్రతిమాలి తక్కువ కేలరీలు పానీయాలను ఉత్పత్తి చేసేలా చూడటం. ఈ రకంగా క్లింటన్ ప్రకారం అటు కూల్‌డ్రింక్ పరిశ్రమలవారూ నష్టపోరు. ఇటు కూల్‌డ్రింకులు తాగేవారూ (బాలలూ) చక్కెరవ్యాధి బారిన పడరట! ఇదీ క్లింటన్ మార్కు గ్లోబలిష్టుల పరిష్కారం.

694కు పైగా సదస్సుల్లో ప్రసంగాలు చేసి భారీ మొత్తం ఫీజును ఆదాయంగా పొందిన క్లింటన్, అందులో కొంత మొత్తాన్ని దాతృత్వ సంస్థలకు యిచ్చాడు! వాస్తవానికి దాతృత్వానికి యిచ్చిన మొత్తాలపై పన్ను చెల్లించనవసరంలేదు! అంటే ఎక్కువ మొత్తం దానం యిచ్చినట్టు చూపించి పన్ను కట్టకుండా మిగుల్చుకోవచ్చును.

అయితే క్లింటన్ లాంటి మధ్యేవాద రాజకీయవేత్తకు డోనాల్డు ట్రంపులాంటి తీవ్ర మితవాద రాజకీయవేత్త యొక్క పోటీ ఒక సవాలుగా మారింది. అతడు ప్రజాకర్షక ఉపన్యాసాలతో అసమానతను నిరసిస్తున్న అమెరికన్ ఓటర్లను అసమానతకు వ్యతిరేకంగా రెచ్చగొట్టి, అందుకు కారకులు వలసదారులు, ఇస్లాం మతస్థులైన ముస్లింలు యితర జాతులవారు అన్నట్టుగా వారిని భూతాలుగా చూపెట్టుతూ సంకుచిత జాతీయవాదాన్ని రెచ్చగొట్టి ముస్లిం రాజ్యాలపై దురాక్రమణకు పాల్పడుతూ, అసమానతకు కారకమైన దోపిడీ గ్లోబలిష్టు పెట్టుబడి దారులను తప్పిస్తూ అధ్యక్ష పదవిని సాధించాడు. తిరిగి ఆ పదవిని సాధించటానికి పలు జనాకర్షక కట్టుకధలతో ముందుకు వస్తున్నాడు. ప్రపంచాన్ని ముందుగా అమెరికా దేశాన్ని మెరుగుపరుస్తానని దబాయించి మరీ చెబుతున్నాడు. అయినా యితడూ డెమోక్రాట్లయిన క్లింటన్ లాంటి రాజకీయవేత్తల సిద్ధాంతాలకు వ్యతిరేకి కాదు. వ్యవస్థ మార్పు గురించి ఎన్నడూ పట్టించుకోడు. ప్రాముఖ్యత లేని అంశాలను ఊదరగొడుతూ అదే దోపిడీ వ్యవస్థను, అత్యంత సంపన్నవర్గాల వారి ప్రయోజనాలనూ మరో రూపంలో పరిరక్షిస్తున్నాడు.

ఇతడు అదే నాణేనికి మరోవైపే కానీ, మరో భిన్నమైన నాణెం ఎంతమాత్రం కాదు.


ఈ రకంగా ప్రపంచాన్ని తమ దాతృత్వం ద్వారా మార్చివేస్తామని బూటకమాడుతున్న ప్రపంచంలోని అత్యధిక సంపన్నవర్గంవారైన గ్లోబలిష్టులు, ప్రపంచాన్నంతటినీ కొల్లగొట్టడానికి చేసే కుట్రలను ఎంతో అధ్యయనం చేసి యీ పుస్తకంలో రచయిత ఎన్నో ఉదాహరణలతో వివరించాడు. సామ్రాజ్యవాదం తన ప్రపంచదోపిడీ కోసం ఎన్నెన్ని క్రొత్త ఎత్తులు పన్నుతోందో అర్థం చేసుకోవటానికి యీ పుస్తకం ఎంతగానో తోడ్పడుతుందన్నది నిస్సందేహం. నిజమైన వ్యవస్థ మార్పు అంటే ఏదికాదో తెలుసుకోవటానికి యీ పుస్తకం బాగా ఉపయోగపడుతుంది. ✪



# మందిరమూ – మసీదూ



హిందీ మూలం : **ప్రేమ్‌చంద్ (1925)** తెలుగు స్వేచ్ఛానువాదం : **బాలాజీ (కోల్‌కతా)**




**చౌదరీ** ఇత్రత్ అలీ 'కడే' ప్రాంతానికి పెద్ద జాగీర్దారు. అతని పూర్వీకులు రాచరిక యుగంలో బ్రిటిష్ ప్రభుత్వానికి గొప్పగొప్ప సేవలందించారు. దాని ఫలితంగా వారికీ జాగీరు దొరికింది. అతడు తన నిర్వహణా దక్షతతో, తన యాజమాన్యాన్ని మరింత పెంచుకున్నాడు. ఇప్పుడా ప్రాంతంలో అతడ్ని మించిన పేరైన ధనవంతుడు లేడు. బ్రిటిష్ అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించేటప్పుడు, ఖచ్చితంగా చౌదరీ సాహెబ్ బాగోగులు తెలుసుకోడానికి వస్తుంటారు. కానీ చౌదరీ సాహెబ్ మాత్రం కమీషనర్ హోదాలోని పాలకుడికి కూడా సలాము చేయడానికి వెళ్ళేవాడు కాదు. కోర్టులకు వెళ్లనే కూడదని శపథం చేసుకున్నాడు. ముస్లిం మత కోర్టులకూ వెళ్ళేవాడు కాదు. పాలకుడి ముందు చేతులుకట్టి నిల్చోవడం, అతని ప్రతి మాటకీ 'అవునండయ్యా' అని వంతపాడడం తన గౌరవానికి తగదని తలచేవాడు. నష్టమొచ్చినా భరించేవాడు గానీ, సాధ్యమైనంతవరకు ఏ కేసులకూ – దావాలకూ పోయేవాడు కాదు. అలాంటి పనులు చూట్టానికి ముఖ్తార్లు (ప్రతినిధులు) వుండేవారు. నీట ముంచినా పాల ముంచినా వారిదే భారమని వదిలేశాడు. పెర్షియన్, అరబిక్ భాషల్లో నిష్ణాతుడు, ముస్లిం మత నియమాలు గట్టిగా ఆచరిస్తూ, వడ్డీ వ్యాపారాన్ని పాపంగా భావించేవాడు. ఐదుసార్లు నమాజులు చేస్తూ, ముప్పై రోజులు ఉపవాసముంటూ, క్రమం తప్పకుండా ఖురాన్ పారాయణం చేసేవాడు. కానీ అతడిలో మతపరమైన సంకీర్ణత ఏ కోశానా వుండేది కాదు. ప్రాత:కాలం గంగా స్నానం చేయడం అతని నిత్యకృత్యమైంది. వర్షం పడినా, మంచు కురిసినా, ఐదు గంటలకే లేచి, కోసెడు దూరం నడిచి గంగ ఒడ్డుకు చేరుకుంటాడు. తిరిగి వచ్చేటప్పుడు తన వెండి కూజా నిండా గంగ నీరు తెస్తాడు. ఎల్లప్పుడూ గంగ నీరే తాగుతాడు.

కథ

'గంగాజీ' తప్ప మరో నీరు తాగడు. బహుశా రుషులూ, మునులు కూడా గంగ పట్ల ఇంత గౌరవం కనపరచరేమో! వారానికోసారి లోపలా బయటా ఇల్లు మొత్తం ఆవు పేడతో అలికించేవాడు. అంతే కాదు, తన తోటలో ఒక పూజారి ఏడాది మొత్తం దుర్గాదేవి కథా పఠనం చేసేవాడు. సాధువులు, సన్యాసుల ఆదరణా, సత్కారాలు ఎంతో భక్తిశ్రద్ధలతో చేసేవాడు. అది చూసి రాజులు కూడా ఆశ్చర్య పడేవారు. నిత్యవ్రతాలు నడిచేవి. ఇదిలా వుంటే ముస్లిం ఫకీర్ల కోసమూ వేరే పాకశాలలో భోజనం తయారయ్యేది. ప్రతిరోజూ వందలాది ప్రజలు అతడి భోజనశాలలో తినేవారు. ఇన్ని దానధర్మాలు చేసినా ఏ షావుకారుకీ పైసా అప్పు పడేవాడు కాదు. విధి విచిత్రమేమిటంటే రోజురోజుకూ అతడి పరపతి పెరుగుతూనే వుంది. శవదహనం కోసమైనా, యజ్ఞ యాగాదులకైనా, వివాహాది విందు భోజనాల కోసమైనా, కావలసినన్ని కట్టెల్ని అతడి అధీనంలోని అడవిలోంచి కొట్టుకోవచ్చు. దానికతడి అనుమతి కూడా అవసరం లేదనే అప్రకటిత ప్రకటన లాంటిదుండేది. హిందువుల పెళ్లి పూరేగింపులకు అతడి తరుపు మనిషి వెళ్లి ఆహ్వానపు చదివింపులు పెళ్లి కుమార్తె కన్యాదానం డబ్బులు తప్పకుండా ఇచ్చేవాడు. పెళ్లికి కావలసిన ఏనుగులూ, గుర్రాలూ, గుడారాలూ, షామియానాలూ, పల్లకీలూ, తివాచీలూ, విసనకర్రలూ, వెండి అద్దిన అలంకార సామగ్రి వారడిగిందే తడవుగా అందించేవారు. ఇటువంటి దయార్ద్ర, సుప్రసిద్ధ వ్యక్తి కోసం చావడానికైనా సిద్ధంగా ఉండేవారు అక్కడి ప్రజలు.

## 2

చౌదరీ సాహెబ్ వద్ద భజన్ సింగ్ అనే రాజపుత్ర సేవకుడుండేవాడు. ఆరడుగుల జవాను, వెడల్పాటి ఛాతీ, చేతిలో బరువైన లాఠీతో వంద మంది మధ్యలోంచి పోరాడి బయటికి రాగల సమర్థుడు. భయమన్నది అతడి దరి చేరదు. చౌదరీ సాహెబ్‌కు అతనిపై అపారమైన నమ్మకం. ఎంతగా అంటే అతను హజ్ యాత్రకు వెళ్ళినప్పుడు కూడా ఇతన్నే వెంట తీసుకెళ్లాడు. చౌదరీకి శత్రువుల కొరతేం లేదు, చుట్టు ప్రక్కల జమీందారులంతా అతడి శక్తినీ, కీర్తినీ చూసి ఈర్ష్య పడేవారు. చౌదరీ సాహెబ్ సదా బలహీనుల పక్షానే ఉంటాడు కనుక ఆ భయం వల్ల ఇతర జమిందార్లు తమ ప్రజలపై అత్యాచారం చేసేవారు కాదు. భజన్ సింగ్ తోడుంటే శత్రువు గడపలో పడుకున్నా భయం లేదనుకునేవాడు చౌదరీ. చౌదరీని శత్రువులు చాలా సార్లు చుట్టుముట్టినా అతడిపై ఒక్క దెబ్బైనా పడనీయకుండా క్షేమంగా తీసుకొచ్చేవాడు భజన్ సింగ్. అవసరమైతే అగ్గిలోకి దూకే ఇటువంటి వ్యక్తిని ఎవరూ చూసుండరు. అతడు బయటికెళితే చాలు, 'ఎవరితోనన్నా పోట్లాటకు దిగడుకదా' అన్న

అనుమానంతో, అతడు క్షేమంగా తిరిగొచ్చే దాకా గాబరా పడేవాడు చౌదరీ. కట్లు విప్పిన తోడనే తగాదాకి పోయే పెంపుడు గొర్రెలా వుండేది అతడి వ్యవహారం. ముల్లోకాలలో, చౌదరీ సాహెబ్ తప్ప, అతని దృష్టిలో మరెవరూ లేరు. అతడికి రాజావారన్నా, యజమాని అన్నా, దేవుడన్నా అన్నీ చౌదరి సాహెబే. ముస్లింలకు చౌదరీ సాహబ్ అంటే ఒకటే మంట. అతను తన మత వొరవడి నుండి దారి తప్పాడని వారి అనుమానం. ఇంత విచిత్రమైన జీవనవిధానం ఎవరికర్థమౌతుందీ? నిజమైన ముస్లిం అన్నవాడు గంగాజలం తాగుతాడా? సాధుసన్యాసులకు ఆతిథ్యమిస్తాడా? దుర్గాదేవి కథా పఠనం చేయిస్తాడా? ముల్లాలు అతడికి వ్యతిరేకంగా పన్నాగాలు పన్నేవారు, హిందువులను దెబ్బతీయడానికి సన్నాహాలు చేసేవారు. చివరికి జన్మాష్టమి రోజున దాడి చేయాలని నిర్ణయించారు. గట్టి దెబ్బతీసి హిందువులు తలదించుకునేలా చేయాలనీ, చౌదరీ సాహెబ్ మద్దతుతో ఆటలు సాగవని వారికి తెలిసేలా చేయాలనీ వారి ఆలోచన. అలా చేస్తే చౌదరీ ఏం చేస్తాడో అదీ చూడొచ్చు. అతను గనుక హిందువుల కాపు కాయడానికొస్తే అతడి సంగతీ చూడొచ్చు. హిందూ ప్రేమ దెబ్బకు దిగిపోతుంది.

## 3

అది చీకటి రాత్రి. కడే ప్రాంతపు పెద్ద మందిరంలో కృష్ణ జన్మోత్సవం సాగుతోంది. ఓ వృద్ధ భక్తుడు తంబురా మీటుతూ బోసి నోటితో ధృపదాలాపన చేస్తున్నాడు. ఢోలు, కంజీరలతో మరికొందరు భక్తజనులు కీర్తనలు పాడటానికి తమవంతు ఎప్పుడొస్తుందా, అని ఎదురు చూస్తున్నారు. ఓ షావుకారు ప్రసాదం కలుపుతున్నాడు. ఆ కోలాహలం తిలకించడానికి వందలాది మంది గుమిగూడారు.

హఠత్తుగా, చేతిలో కర్రలతో వచ్చిన ముస్లింల ముఠా ఒకటి మందిరంపై రాళ్ళు రువ్వడం ప్రారంభించారు. 'రాళ్ళెక్కడ నుంచొస్తున్నాయ్? ఎవరు విసురుతున్నారు?' – గొడవ మొదలైంది. కొంతమంది మందిరం బయటికొచ్చి చూడబోయారు. కాసుక్కూర్చున్న ముస్లింలు వారిపై కర్రలతో దాడి చేశారు. ఆ సమయంలో హిందువుల చేతిలో ఢోలు, కంజీరలు తప్ప ఇంకేమున్నాయ్? అంచేత మందిరంలో కొందరు దాక్కోగా, ఇంకొందరు అటూ ఇటూ పరుగెత్తారు. నలువైపులా హాహాకారం!

చౌదరీ సాహెబ్‌కు సంగతి తెలిసింది. భజన్ సింగ్‌ను పిల్చి, "ఠాకూర్! అటు చూడు, ఏదో గొడవ జరిగినట్టుంది. వెళ్లి దుండగులకు హెచ్చరించు, వినకపోతే నాలుగు తగిలించు, కానీ రక్తపాతం కాకుండా చూసుకో" అని చెప్పి పంపాడు.

ఠాకూర్ ఇప్పటికే దూరాన శబ్దాలు వింటూ పళ్ళు నూరుతున్నాడు. తగిన ఆదేశం దొరక్క గుండె మీద రాయి పెట్టుకుని కూర్చునున్నాడు. ఈ ఆదేశంతో అతడి కోరిక పండింది. శత్రునాశక లాఠీని భుజాన వేసుకుని ఒక్క ఉరుకులో మందిరానికి చేరుకున్నారు. చూడబోతే అక్కడ ముస్లింలు భారీ కలకలం సృష్టించేశారు. కొందరైతే పారిపోతున్న వార్ని వెంబడిస్తూ మందిరంలోకి ప్రవేశించి, అక్కడి గాజు వస్తువులు పగలగొడుతున్నారు.

ఠాకూర్ కళ్ళు రక్తంతో ఎరుపెక్కాయి, కోపం కట్టలు తెంచుకుంది. అరుస్తూ ఆలయంలోకి ప్రవేశించి దుండగులను బాదనారంభించాడు. ఒంటరిగా అతడొకవైపు వుంటే, మరోవైపు యాభై మంది ఉన్నారు! కానీ సింహం సింహమే! ఒక్కడే అందర్నీ ఎదుర్కొంటూ కొందరిని మట్టికరిపించాడు. కోపంతో అతడికేం కానడం లేదు. ఎవడు బ్రతికున్నాడా చచ్చాడా అన్నదీ పట్టించుకోవడం లేదు. ఇంత శక్తి ఎక్కడ్నుంచి వచ్చిందో తెలియడంలేదు. ఏదో దైవ శక్తి తనకు సహాయ పడుతోందని అతనికన్పించింది. ఆ శ్రీకృష్ణుడే తన వెన్నంటి వున్నట్లనిపించింది. మతయుద్ధంలో మానవులు మానవాతీత కార్యాలు సాధిస్తారేమో!

అటు ఠాకూర్ బయల్దేరిన తర్వాత, అతడెవర్నైనా చంపేయడు కదా అన్న భయంతో అతడి వెనకాలే చౌదరీ సాహెబ్ కూడా మందిరానికి వచ్చాడు. చూడబోతే ఉపద్రవం ముంచుకొచ్చింది. దుండగులు ప్రాణాలు అరచేత పట్టుకుని పారిపోతున్నారు. కొందరు కిందపడి మూలుగుతున్నారు, ఇంకొందరు 'అమ్మో, అయ్యో' అని అరుస్తున్నారు. ఠాకూర్‌కు కేకవేయాలని అనుకుంటుండగా, అకస్మాత్తుగా ఒక వ్యక్తి పరిగెత్తుకుంటూ వచ్చి అతని ముందు నేలకూలాడు. చౌదరీ సాహెబ్ అతన్ని గుర్తించినంతనే అతని కళ్లు బైర్లుకమ్మాయి. అతడెవరో కాదు – తన అల్లుడు, ఒక్కగానొక్క కుమార్తె భర్త, తన ఆస్తికి వారసుడు షాహిద్ హుస్సేనే!

చౌదరి పరుగున వెళ్లి, షాహిద్‌ను చేతిలోకి తీసుకొని బిగ్గరగా అరుస్తూ – "ఠాకూర్, ఇటురా, ఇటురా – లాంతరు! .... లాంతరు తీసుకురా! అయ్యో, నా షాహిద్!" అని వగరుస్తున్నాడు.

ఠాకూర్ కాళ్ళూ, చేతులూ చల్లబడ్డాయి. లాంతరు తీసుకుని మందిరం బయటకు వచ్చాడు. అవును, అక్కడున్నది షాహిద్ హుస్సేనే. అతని తల చీలిపోయి రక్తం ఉబుకుతోంది.

చౌదరీ తల బాదుకుంటూ అన్నాడు – "ఠాకూర్, నువ్వు నా వంశదీపం ఆర్పేశావు."

"అయ్యా, దొమ్మీలో నేనతడ్ని గుర్తించ లేదని ఆ దేవుడికి తెలుసయ్యా" – ఠాకూర్ వణుకుతూ అన్నాడు.

చౌదరీ – "లేదు, నేను నిన్ను నిందించడం లేదు. దేవుడి మందిరంలోకి ఎవరికీ ప్రవేశించే అధికారం లేదు. కాకపోతే నా వంశదీపం ఆరిపోయింది, అదీనూ నీ చేతుల్లో అన్న బాధ మాత్రమే. నువ్వు నా కోసం నీ ప్రాణాలు అడ్డేసేవాడివి, అటువంటిది ఆ దేవుడు నీ చేతుల్తోనే నా సర్వనాశనం చేయించాడు."

చౌదరీ సాహిబ్ రోధిస్తూ ఈ మాట లంటున్నాడు. ఠాకూర్ అపరాధ భావంతో, పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నాడు. తన సొంత కొడుకు చనిపోయినా ఇంత బాధ కలిగేది కాదేమో! అయ్యో! నా స్వహస్తాలతో నా యజమానిని సర్వనాశనం చేశాను కదా! అతడి ఒక్క చెమట చుక్కకు ప్రతీకారంగా రక్తపుటేర్లు పారించడానికి సిద్ధపడేవాడినే! నా అయ్యగారు, నా దేవుడు ఒక్క ఆజ్ఞ ఇస్తే అగ్నిలో దూకడానికైనా వెనకాడను కదా! అటువంటిది నేనే అతడి వంశవృక్షాన్ని తుంచేశాను, అయ్యో, నన్ను నమ్మకద్రోహి అనరా? "అయ్యా, నాలాంటి అభాగ్యుడు ఇంకొకడుండడు, నేను కళంకితుడనయ్యాను" అని రోధించాడు.

ఆ మాట అంటూనే ఠాకూర్ తన నడుముకు వున్న ఒరలోని కత్తిని తీశాడు. దాన్ని తన గుండెలోకి దింపుకుని తన కళంకాన్ని రక్తంతో కడిగేసుకోవాలని అనుకుంటుండగా,

చౌదరీ సాహెబ్ చప్పున అతడి చేతిలోని కత్తిని లాక్కొని – "ఏం చేస్తున్నావ్? స్పృహలోనే ఉన్నావా? ఇది విధి విచిత్రం, నీ తప్పేమీ లేదు, దేవుడు అనుకున్నట్టే జరిగింది. నేనే గనుక సాతాను ప్రభావానికి లోబడి, మందిరంలోకి ప్రవేశించి, దేవుడ్ని అవమానించినట్లయితే, నీవు నన్ను గుర్తించి కూడా చంపేసినా, నేను నిన్ను క్షమించేవాణ్ణి. ఎదుటి వారి మతాన్ని అవమానపర్చడానికి మించిన పాపం మరొకటి లేదు. ఈ క్షణం నా గుండె పలిగిపోతోంది, ఈ బాధ నా చావుకి దారితీసినా తీయొచ్చు కానీ దేవుని సాక్షిగా నీ మీద నాకే కోపం లేదు. నీ స్థానంలో నేనున్నా, నా యజమాని కొడుకున్నా నేనదే చేసేవాడిని. నా కుటుంబ సభ్యులు నన్ను శూలాలతో పొడుస్తారు, మా అమ్మాయి రోధిస్తూ రక్త ప్రతీకారం కోరుతుంది, ముస్లింలంతా రక్తపిపాసులౌతారు, అందరూ నన్ను మతద్రోహి, మతభ్రష్టుడంటారు, ఎవడో గట్టి మతనమ్మకమున్న యువకుడు నన్ను చంపడానికి కూడా సిద్ధపడతాడు, కానీ నేను న్యాయానికి వెన్ను చూపను. ఇది చీకటి రాత్రి, ఇప్పుడే ఇక్కడ్నుంచి తప్పించుకుపో, మా ప్రాంతానికి పోయి ఏదో శిబిరంలో దాక్కో. అదిగో, చాలా మంది ముస్లింలు వస్తున్నారు – నా కుటుంబ సభ్యులు కూడా – పారిపో, పారిపో!"

## 4

ఏడాదిపాటు భజన్‌సింగ్ చౌదరీ సాహెబ్ ఉంటున్న ప్రాంతంలో దాక్కున్నాడు. ఒక వైపు ముస్లింలూ, మరోవైపు పోలీసులూ అతడిపై నిఘాపెట్టి వున్నారు. కానీ చౌదరీ సదా అతన్ని గోప్యంగా వుంచేవాడు. తన మతంవారి పోరును సహించాడు, కుటుంబం తిరస్కారాన్ని దిగమింగాడు, పోలీసుల వేధింపులు భరించాడు, మతాధికారుల బెదిరింపులు ఎదుర్కున్నాడు కానీ, భజన్ సింగ్ ఆచూకీ మాత్రం మూడో కంటికి తెలీకుండా జాగ్రత్తపడ్డాడు. తన ప్రాణముండగా ఒక నమ్మకమైన సేవకుణ్ణి దయలేని చట్టాల కబంధహస్తాలకు అప్పజెప్ప దలుచుకోలేదు.

అతని ప్రాంతపు శిబిరాల్లో చాలామార్లు తనిఖీలు జరిగాయి. మతాధికారులు ఇంటి నౌకర్లను, తమ బంధువులను, ఆడవాళ్లను కూడా నిఘాలో పెట్టారు కాని చౌదరీ తన విశ్వాసపాత్రుడు ఠాకూర్ జాడ ఎవరికీ తెలీనివ్వలేదు.

తన ప్రాణాలను కాపాడటానికి, చౌదరీ సాహెబ్ ఇబ్బందులుపడడం ఠాకూర్‌కు చాలా బాధ కలిగించేది. 'నన్ను పోలీసులకు అప్పజెప్పేయండి' అని యజమానికి చెప్పాలని పదే పదే కూడబలుక్కునేవాడు కానీ ప్రతిసారీ చౌదరీ సాహెబ్ అతన్ని దాక్కోమని మాత్రమే ఆదేశించేవాడు.

ఓ చలికాలం చౌదరి సాహెబ్ తన జాగిర్దారీలోని ప్రాంతాన్ని సందర్శిస్తున్నాడు. ఈ మధ్య అతను ఇంట్లో చాలా తక్కువగా వుంటున్నాడు. కుటుంబం వారి మాటల బాణాల నుండి తప్పుకోడానికి ఇదే మార్గమని తలిచాడేమో! భోంచేసి నిద్రపోతుండగా అతని ఎదుట భజన్ సింగ్ ప్రత్యక్షమయ్యాడు. అతడి రూపం చాలా మారిపోయింది, చౌదరీ అతన్ని చూసి ఆశ్చర్యపోయాడు. "అయ్యా బాగున్నారా?" – అనడిగాడు ఠాకూర్.

చౌదరీ – 'ఏదో దేవుడి దయ. నువ్వేంటి ఇలా వున్నావ్? ఇప్పుడెక్కడ్నుండి వస్తున్నావ్?'

ఠాకూర్ – 'అయ్యా, మరి దాక్కోలేను. మీరాదేశిస్తే, వెళ్లి కోర్టులో హాజరౌతాను. ఎలా రాసిపెట్టి వుంటే అలానే జరుగుతుంది, నా వల్ల మీరు చాలా ఇబ్బందుల పాలవ్వడం నేనింక చూడలేను.'

చౌదరీ – 'లేదు ఠాకూర్, నేను జీవించి వుండగా అలా జరగనివ్వను. ఉద్దేశపూర్వకంగా నిన్ను నరకకూపంలో పడెయ్యలేను. పోలీసులు వారి ఇష్టానుసారం నిన్ను బలిగొంటారు. నువ్వు ప్రాణాలు కోల్పోతావు. నువ్వు నా కోసం చాలా ప్రమాదాలు ఎదుర్కున్నావు. నేను నీ కోసం ఈ మాత్రం చేయకపోతే, ఏం ప్రయోజనం? ఇంకేం మాట్లాడొద్దు.'

ఠాకూర్ – 'అయ్యా! ఎవరైనా మిమ్మల్ని....'

చౌదరీ – 'అస్సలు చింతించొద్దు. దేవుడు తలంచకపోతే, నన్నెవరూ ఏం చెయ్యలేరు. ఇప్పుడే ఇక్కడ్నుంచి వెళ్ళు, ఇక్కడ ఉండటం ప్రమాదకరం.

ఠాకూర్ – 'మీతో అయినవారెవరూ మాట్లాడ్డం లేదని విన్నాను.'

చౌదరీ – 'శత్రువులు దూరంగా ఉండడమే మంచిది.'

కానీ ఠాకూర్ మనసులో గూడుకట్టుకున్న భావం తొలగిపోలేదు. అతడి ఆలోచన మరింత ధృఢమైపోయింది. తన వల్ల తన యజమాని అక్కడా ఇక్కడా తిరుగుతున్నాడు. ఇక్కడ ఈయనకి సొంతవాళ్లెవరూ లేరు. ఎవరైనా వచ్చి దాడి చేయవచ్చు. అలా జరిగితేనో! ఛీ, నా జీవితమే దండగ!

ఉదయాన్నే ఠాకూర్ జిల్లా అధికారి బంగ్లాకు చేరుకున్నాడు. 'చౌదరీ మాట మీదే ఇన్నాళ్లూ దాక్కున్నావా?' – జిల్లా అధికారి అడిగాడు.

ఠాకూర్ – 'కాదయ్య గారూ, నా ప్రాణ భయంతోనే దాక్కున్నాను.'

## 5

ఈ వార్త విన్న చౌదరీ సాహెబ్ నిశ్చేష్టుడయ్యాడు. ఇప్పుడేం చెయ్యాలి? కేసు విషయంలో పైరవీలు చేయకపోతే ఠాకూర్‌ను కాపాడటం కష్టం. కేసు కోసం కష్టపడితే ముస్లిం సమాజంలో కలకలం లేస్తుంది. నలువైపుల నుండీ ఫత్వాలు రావడం ఖాయం! ముస్లింలంతా ఠాకూర్‌ను ఉరితీయించాలని కంకణం కట్టుకున్నారు. దానికోసం విరాళాలు వేసుకున్నారు. ముల్లాలు మసీద్‌లో విరాళాల కోసం విజ్ఞప్తులు జారీ చేసి ఇంటింటికి వెళ్లి చందాలు సేకరించారు. ఈ కేసుకు మతం రంగు పులిమారు. ముస్లిం న్యాయవాదులకు మంచి పేరు తెచ్చుకునే అవకాశం వచ్చింది. ఈ జిహాద్‌లో పాల్గొనడానికి ప్రక్క జిల్లాల వారు కూడా వచ్చి చేరారు.

ఎన్ని ఇబ్బందులొచ్చినా ఈ కేసు కోసం పైరవీలు చెయ్యాలని చౌదరీ సాహెబ్ కూడా నిశ్చయించుకున్నాడు. న్యాయంగా చూస్తే, ఠాకూర్ నిర్దోషి కనుక నిర్దోషిని రక్షించటానికి ఎవరికీ భయపడనవసరం లేదని భావించాడు. ఇంటి నుండి వచ్చేసి, నగరంలో తిష్టవేశాడు.

ఆరు నెలల పాటు, చౌదరీ సాహెబ్ తన ప్రాణాలకు తెగించి కేసు కోసం పోరాడాడు. నీటిలా డబ్బు ఖర్చుపెట్టాడు. తుఫానులా పరుగులు పెట్టాడు. జీవితంలో గతంలోనూ, భవిష్యత్తులోనూ ఎన్నడూ చేయని పనులు చేశాడు. ప్రభుత్వోద్యోగులను మెప్పించాడు, న్యాయవాదులకు ముడుపులు కట్టాడు, పై అధికారులకు పారతోషికాలందించాడు, అన్నీ చేసి ఠాకూర్‌ను విడిపించుకున్నాడు. ఆ ప్రాంతం

మొత్తం ఖంగైపోయింది. విన్న వాళ్లంతా ఆశ్చర్యపోయారు. ఉదాత్తత అంటే ఇదే! సేవకుడ్ని ఉరిశిక్ష నుంచి తప్పించేశాడు. కానీ మత విద్వేషాలు ఈ మహత్కార్యానికి మరోలా స్పందించాయి. ముస్లింలు మండిపడ్డారు, హిందువులు చంకలు గుద్దారు. తమకున్న ఆ మాత్రం మతగౌరవం కూడా మంటగలిసిందని ముస్లింలు భావించారు. ముస్లింలను శుద్ధిచేసి, పాత లెక్కలు సరిచేసే అవకాశం వచ్చిందని హిందువులు భావించారు. ముల్లాలు ఒకవైపు గట్టిగా సమైక్యం కాగా, హిందువులు కూడా ఐక్యతా సంస్థల జెండాలు ఎత్తిపట్టారు. ముస్లింల ముస్లిమత్వం, హిందువుల హిందుత్వం ఒక్కసారిగా మేల్కొన్నాయి. ఠాకూర్ అడుగులు కూడా ఈ వేలంవెర్రిలో తడబడ్డాయి. దుందుకుడుతనం మొదట్నించీ వున్నదే. ఇప్పుడతడు హిందువులకు నాయకుడయ్యాడు. జీవితంలో ఎన్నడూ శివుడిపై చెంబుడు గంగాజలం వేయనివాడు దేవుళ్లూ దేవతల పేర లాఠీ తిప్పడానికి సమాయత్తుడయ్యాడు. శుద్ధీకరణ కోసం ముస్లింలు దొరక్కపోతే ఒకరిద్దరు చెప్పులు కుట్టే చమార్లను శుద్ధి చేశాడు. చౌదరీ సాహెబ్ ఇతర సేవకులు కూడా ప్రభావితమయ్యారు. ఎన్నడూ మసీదు ముందు నిలబడని ముస్లింలు, ఐదుసార్లు నమాజులు చేయడం ప్రారంభించారు, ఎన్నడూ మందిరం వైపు తొంగిచూడని వాళ్లు రెండు పూటలా హారతి పట్టడం ప్రారంభించారు.

వాడల్లో హిందువులు అధికంగా ఉంటారు. ఠాకూర్ భజన్ సింగ్ వారికి పెద్ద దిక్కయ్యాడు. అతడి లాఠీ బలానికి అందరూ సలాము చెప్పారు. ముస్లింలు సంఖ్యలో తక్కువ ఉన్నప్పటికీ, మొదట్లో వారు పై చేయిగా వుండేవారు. ఇప్పుడు హిందువులు సంఘటిత మయ్యారు. ఇంకేం? పిడికెడుమంది ముస్లింలు వారి ముందేపాటి?

సంవత్సరం గడిచింది. జన్మాష్టమి వేడుక మళ్లీ వచ్చింది. హిందువులు తమ గతకాలపు ఓటమిని ఇంకా మరచిపోలేదు. రహస్యంగా ప్రతీకార సన్నాహాలు చేస్తున్నారు. ఆ రోజు ఉదయం నుండే భక్తులు ఆలయంలో గుమిగూడడం ప్రారంభించారు. ప్రతి ఒక్కరి చేతిలో లాఠీలు ఉన్నాయి, చాలామంది పురుషులు నడుము భాగంలో కత్తులు దాచుకున్నారు. అవతలివారిని రెచ్చగొట్టి మరీ గొడవ చేయాలన్నది వారి నిర్ణయం. ముందెన్నడూ ఈ పండుగ సమయంలో ఊరేగింపు చేయలేదు. ఈ సారి బ్రహ్మాండమైన ఊరేగింపు తీశారు.

సంధ్యా దీపాలు వెలిగాయి. మసీదులలో సాయంత్రపు నమాజులు ప్రారంభమయ్యాయి. ఊరేగింపు బయలుదేరింది. ఏనుగులూ, గుర్రాలూ, జెండాలూ, బాజాభజంత్రీలూ అన్నీ వున్నాయి. భజన్ సింగ్ తన శిష్యబృందాన్ని తోడుపెట్టుకుని ముందు వరుసలో ఠీవిగా నడుస్తున్నాడు.

జామా మసీదు ఎదురుగా కనిపిస్తోంది. శిష్యులు తమ తమ లాఠీల్ని అవిసి పట్టుకున్నారు. అందరూ అప్రమత్తమయ్యారు. అక్కడక్కడా చెల్లాచెదురుగా వున్నవాళ్లు ఒకచోటికి వచ్చారు. ఒకర్నొకరు చెవి కొరుక్కున్నారు. అంతే, వాయిద్యాలు మరింత బిగ్గరగా మోగాయి. జయజయ ధ్వానాలు మరింత బిగ్గరగా చేశారు. ఊరేగింపు మసీదు ముందుకు వచ్చింది.

అకస్మాత్తుగా ఒక ముసల్మాను మసీదు బయటకు వచ్చి – 'ఇది మాకు నమాజు సమయం కనుక వాయిద్యాలు ఆపండ'ని చెప్పాడు.

భజన్ సింగ్ – 'వాయిద్యాలు ఆగవు.'

ముస్లింలు – 'ఆపాల్సి ఉంటుంది.'

భజన్ సింగ్ – 'మీ నమాజ్‌ను ఎందుకాపకూడదు?'

ముస్లింలు – 'చౌదరీ అండ చూసుకుని చెలరేగకు. ఈసారి నీ మతిపోగొడతాం.'

భజన్ సింగ్ – 'చౌదరీ సాహిబ్ బలం మీద మీరున్నారు, ఇది మత వ్యవహారం, మా స్వంత బలం మాకుంది.'

ఇంతలో ఇంకొంత మంది ముస్లింలు బయటికొచ్చి వాయిద్యాలు ఆపమని అభ్యర్థించారు. కానీ వాయిద్యాలు మరింత జోరందుకున్నాయి. మాటకు మాట పెరిగింది. ఒక మౌల్వీ భజన్ సింగ్‌ను మతభ్రష్టుడన్నాడు. ఠాకూర్ అతడి గడ్డం పట్టుకున్నాడు. ఇంకేముంది? అవతలి వీరులు బయటికొచ్చారు. కొట్లాట ప్రారంభమైంది. ఠాకూర్ గోల చేస్తూ మసీదులోకి వెళ్లి లాఠీతో కొట్టడం ప్రారంభించాడు. ఎవరిది పైచేయిగా సాగిందో చెప్పడం కష్టం. మేము ముస్లింలను వెంటాడి వెంటాడి కొట్టామని హిందువులన్నారు. మేం హిందువులను ఎంతలా కొట్టామంటే వారు మరోమారు మా ముందుకు రారని ముస్లిం లన్నారు. కానీ ఈ వివాదాల మధ్యా, ఒక విషయం మాత్రం వాస్తవం – అదే ఠాకూర్ భజన్ సింగ్ అతీంద్రియ శౌర్యం సంగతి! ఠాకూర్ అక్కడ లేకుంటే మేము ఎవరినీ సజీవంగా వదిలిపెట్టేవాళ్లం కాదు అని ముస్లింలన్నారు. ఠాకూర్ సాక్షాత్తూ ఆంజనేయుడి అవతారమే, అతడి లాఠీ అందరినీ మట్టికరిపించిందని హిందువులన్నారు.

వేడుక ముగిసింది. చౌదరీ సాహెబ్ దివాణంలో కూర్చుని హుక్కా తాగుతున్నాడు. అతని ముఖం ఎర్రగా మారివుంది, కోపోద్రిక్తుడై వున్నాడు, కళ్ళ నుండి నిప్పుకణాలు ఎగిసి పడుతున్నాయి. 'ఖుదా (దేవుడి) ఇల్లు' కలుషిత మైందన్న ఆలోచన అతని హృదయాన్ని వెంటాడుతోంది.

దేవుని ఇల్లు నాశనమైంది! ఈ దుండగులకు పోట్లాడుకోడానికి వేరే మైదానమే దొరకలేదా? పవిత్రమైన ప్రభువు ఇంట రక్తపాతమా! మసీదును ఇంత కళంకితం చేస్తారా? మందిరమూ దేవుని నివాసమే, మసీదు కూడా! మందిరాన్ని అపవిత్రం చేసినందుకు ముస్లింలు శిక్షకు అర్హులైతే, మసీదును అపవిత్రం చేసిన హిందువులు అదే శిక్షకు అర్హులు కారా? పైపెచ్చు ఈ పని ఠాకూర్ చేశాడు! ఇలాంటి పనే చేసినందుకు అతను నా అల్లుడిని చంపాడు. అతడిలాంటి పని చేస్తాడని నాకు ముందే తెలిసుంటే అతడ్ని ఉరికంబం ఎక్కనిచ్చే వాణ్ణి. ఇలాంటి వాడి కోసం తనెందుకంత కష్టపడ్డాడు? ఎందుకంత అపఖ్యాతి పాలయ్యాడు? ఎందుకంత డబ్బు ధారపోశాడు? ఠాకూర్ నా నమ్మకమైన సేవకుడు. అతను నా ప్రాణాన్ని సదా రక్షించాడు. నా చెమట బిందువుకు ప్రతీకారంగా, రక్తపాతం సృష్టించడానికైనా సిద్ధపడేవాడు. కానీ నేడతడు దేవుని ఇంటిని కలుషితం చేశాడు. దీనికి ఏమిటి శిక్ష? నరకమే! నరకాగ్ని తప్ప వేరే శిక్ష లేదు. దేవుని ఇంటిని కలుషితం చేశాడు. దేవుని ఇంటిని అపవిత్రం చేశాడు. దేవుణ్ణే అపవిత్రం చేశాడు.

హఠాత్తుగా ఠాకూర్ భజన్ సింగ్ అక్కడికొచ్చి నిలబడ్డాడు.

'నువ్వు మసీదులోకి వెళ్లావా?' – నిప్పుల కళ్ళతో ఠాకూర్‌ని చూస్తూ చౌదరీ సాహెబ్ ప్రశ్నించాడు.

భజన్ సింగ్ – 'అయ్యా, మౌల్వీలు మాపై విరుచుకుపడ్డారు.

చౌదరీ – 'నా మాటకు సమాధానమివ్వు. మసీదులోకి వెళ్లావా?

భజన్ సింగ్ – 'అక్కడి వాళ్లు మసీదు లోపల నుండి మాపై రాళ్ళు రువ్వడం ప్రారంభించినప్పుడు, వారిని పట్టుకోవడానికి మేము మసీదులోకి ప్రవేశించాము.'

చౌదరీ – 'మసీదు దేవుని నివాసం అని నీకు తెలుసా?'

భజన్ సింగ్ – 'అవునయ్యా తెలుసు, ఆ మాత్రం తెలియదా?'

చౌదరీ – మందిరంలానే మసీదు కూడా పవిత్రమైన దేవుడి ఇల్లు కాదా?

భజన్ సింగ్ దీనికి సమాధానమివ్వలేదు.

చౌదరీ – ఒక ముస్లిం మందిరాన్ని అపవిత్రం చేసినందుకు చంపడం అవసరమైనప్పుడు, ఒక హిందువు మసీదును అపవిత్రం చేసినందుకు అతడ్నీ చంపాలి కదా?

భజన్ సింగ్ దీనికీ సమాధానం చెప్పలేకపోయాడు. చౌదరీ సాహెబ్‌ను ఇంత కోపంగా అతడెన్నడూ చూడలేదు.

చౌదరీ – 'నువ్వు నా అల్లుడిని చంపావు, అయినా నేను నిన్ను సమర్థించాను. ఎందుకో తెలుసా? ఎందుకంటే నువ్విచ్చిన శిక్షకు నా అల్లుడు అర్హుడని నేను అనుకున్నాను కనుక. ఒకవేళ నువ్వు నా కొడుకును, ఆమాటికొస్తే నన్ను కూడా అలాంటి తప్పు చేసినందుకు చంపినట్లయితే, నేను ప్రతీకారం కోరేవాణ్ణి కాదు. ఈ రోజు నువ్వే తప్పు చేశావు. ఏవరో ముస్లిం నిన్ను మసీదులోంచి నేరుగా నరకానికి పంపివుంటే నేను సంతోషించేవాణ్ణి. కానీ నువ్వు మూర్ఖుడిలా అక్కడ్నుంచి తప్పించుకున్నావు. దేవుడు ఈ నేరానికి శిక్ష వేయడనుకుంటున్నావా? తనను అగౌరవపరిచినవాడి తల నరికేయాలన్నది దేవుని ఆదేశం. ఆ ఆదేశపాలన ప్రతి ముస్లిం విధి. దొంగకు శిక్ష పడనంతమాత్రాన, అతడు దొంగ కాదా? దేవుణ్ణి అవమానించానని నువ్వు నమ్ముతున్నావా లేదా?'

ఠాకూర్ ఈ నేరాన్ని కాదనలేకపోయాడు. చౌదరీ సాహెబ్ సత్సాంగత్యం అతడి మొండితనాన్ని కుదిపింది. 'అవునయ్యా, నా వల్ల తప్పు జరిగిపోయింది.'

చౌదరీ – 'ఇలాంటి నేరానికై నువ్వే గతంలో శిక్ష వేశావో, అదే శిక్షను అనుభవించడానికి నువ్వు సిద్ధంగా ఉన్నావా?'

ఠాకూర్ – 'నేను ఉద్దేశపూర్వకంగా అల్లుడు గారిని చంపలేదయ్యా.'

చౌదరీ – నువ్వు చంపకపోయుంటే, నేను నా చేతులతో చంపేవాణ్ణి, అర్థమైందా? దేవుడ్ని అగౌరవపరిచినందుకు నేను నీపై ప్రతీకారం తీర్చుకుంటాను. చెప్పు నా చేతుల్లో శిక్ష పొందుతావా లేదా కోర్టు ద్వారానా? కోర్టు కొన్ని రోజుల శిక్షే వేస్తుంది. నేను నీ ప్రాణాలు తీస్తాను. ఎంత ఆప్తుడివైనా నీపై పిసరంతైనా జాలి కలగదు. నా హృదయం ఎంత క్షోభిస్తోందో ఆ దేవుడికే తెలియాలి. నేను నిన్ను చంపాలి. ఇదే నా మతాదేశం.

అలా అంటూ చౌదరీ సాహెబ్ ఖడ్గంతో ఠాకూర్ ఎదుట నిలబడ్డాడు. అదో వింతైన దృశ్యం. పండిన తలతో, వంగిన నడుముతో, ఒక దేవుడిలా ఒక వృద్ధుడు కత్తి పట్టి నిల్చుని వున్నాడు. ఆ వృద్ధుణ్ణి ఒక్క లాఠీ దెబ్బతో అంతమొందించగల బలశాలి అయిన ఠాకూర్ తల వంచుకుని కూర్చుని వున్నాడు. అతడి నరనరాల్లో యజమాని పట్ల గౌరవమే ఉంది. చౌదరీ సాహెబ్‌కు తన మతం పట్ల కూడా అంతే శ్రద్ధ వుందన్న సంగతి అతడు వూహించలేకపోయాడు. హృదయగతంగా అతను హిందువు అన్న తప్పుడు అభిప్రాయంలోనే ఇంతవరకూ వున్నాడు. అది తప్పని ఇప్పుడు తెలిసింది. కాకపోతే, తనను ఉరి నుండి తప్పించిన వ్యక్తిని తనే చంపుతానని వూరకనే అంటాడా? చౌదరీ లోని పరాక్రమమూ, దయా హృదయమూ ఘర్షణ పడుతున్నాయి. క్రోదమూ, క్షమాగుణమూ – రెంటి మధ్యా ఏదో ఒకదాన్ని తేల్చుకోలేకపోతున్నాడు. 'చంపేయ్' అని మతం పోరుతోంది. 'వదిలేయ్' అని సద్గుణం చెబుతోంది.

ఠాకూర్‌కు చౌదరీలోని ఈ సంకటావస్థ అర్థమైంది. గద్గద స్వరంతో ఇలా అన్నాడు – 'అయ్యా, మీ దయార్ద్ర హృదయం నాపై చేయి ఎత్తనివ్వదు. మీరు పెంచి పెద్ద చేసిన ఈ సేవకుణ్ణి మీరు చంపలేరు. కానీ ఈ తల మీదే, మీరే దీన్ని కాపాడారు, మీరే దీనికి హక్కుదారులు. ఇది నా దగ్గరున్న మీ సొత్తు మాత్రమే. మీ సొత్తు మీకు దొరికిపోతుంది. రేపుదయం ఎవర్నైనా మా ఇంటికి పంపి రప్పించుకోండి. నేను ఇక్కడే మీ సొత్తు మీకిస్తే, ఉపద్రవం ముంచుకొస్తుంది. ఇంటి వద్ద ఎవరు చంపారో ఎవరికి తెలుస్తుంది? జరిగిన పొరపాట్లను క్షమించేయండి' అని చెప్పి ఠాకూర్ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు. **('మాధురి', ఏప్రిల్, 1925 సంచికలో ప్రచురితం)**

(నిత్య నమాజులు సాగుతున్న ఒక బహు పురాతన మసీదులో ఓ రాత్రి దొంగతనంగా 'రామ్‌లల్లా' విగ్రహాలు ప్రతిష్టించిన తర్వాత, రథయాత్ర రక్తపాతం సాక్షిగా ఆ మసీదును కూల్చివేసిన తర్వాత, అన్యాయపు కోర్టు నిర్ణయం తర్వాత జన్మస్థలమంటూ ఎంతటి దివ్య భవ్య మందిరం కడితే మాత్రం, అది పవిత్ర స్థలం అనిపించుకుంటుందా? దేవుడి ఇల్లు అనిపించుకుంటుందా? ప్రేమ్‌చంద్ కథ ఈ ప్రశ్నలకు దాదాపు వందేళ్ల క్రితమే సమాధానం చెప్పింది. కానీ, యాదృచ్ఛికంగా ఆయన కథ ప్రచురితమైన 1925లోనే ఆర్.ఎస్.ఎస్ సంస్థను ప్రారంభించారు. **అనువాదకుడు)** ✪

## ఉత్తరాలు

**సంపాదకులకు,**

ఏప్రియల్ – జూలై, 2020 మేడే సంచిక వలస కూలీల దుస్థితికి అద్దం పట్టింది. మోదీ, జగన్‌ల అసంబద్ధ నిర్ణయాలను ఎండగట్టింది. కరోనాను పాలకులు తమ స్వార్థ ప్రయోజనాలకు ఎలా వాడుకుంటున్నారో తేటతెల్లం చేసింది. కాపిటలిజం గుట్టు విప్పింది.

**- కొత్తపల్లి హరిబాబు,**

**3-8-2020** **గుంటూరు**

# సంతాపాలు

## జనసాహితి తూర్పుగోదావరి జిల్లా శాఖ కన్వీనర్ ఎస్.ఎ. కరీం కు జోహార్లు !!



**జనసాహితి** తూర్పుగోదావరి జిల్లా శాఖ కన్వీనర్ సయ్యద్ అహ్మద్ కరీం (65 సంవత్సరాలు) ఒక సంవత్సర కాలంగా క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ 11 జూలై 2020న కాకినాడలో మరణించారు.

కాకినాడలో పుట్టి పెరిగిన ఆయనపై అప్పటికే ఆ పరిసర ప్రాంతాలలో ప్రసరించివున్న ఇస్లాంలోని సూఫీ అభ్యుదయ ప్రభావం వుండేది. విద్యార్థి దశ నుండే 1974-75 మధ్యకాలంలో డాక్టర్ పి.జస్వంత్‌రావు, కోమలి సూర్యారావు, డాక్టర్ పట్టాభిరామయ్య, వై.ఎన్.వి.వి. సత్యనారాయణ (కొండ), కుదరవల్లి రఘురామయ్య తదితరులతో కలిసి కాకినాడలో యువ సాహిత్య సాంస్కృతిక సంస్థ (Y.L.C.O.) కార్యకలాపాలలో క్రియాశీలకంగా పనిచేస్తూ పురోగామి, ప్రజాతంత్ర భావాలవైపుగా కృషి మొదలుపెట్టారు. ఆనాటి 'జీవనాడి' పత్రికను యువజనులకు అందేలా చేసేవారు. 'కరువు కథ' నాటక ప్రదర్శనలో చురుకుగా వుండేవారు. కోమలి సూర్యారావుతో కలిసి ఆత్రేయ రచించిన 'పరివర్తన' నాటకంలో 'దాసు' పాత్రలో బాగా రాణించారు. అత్యవసర పరిస్థితి కాలంలో విప్లవ కార్యకలాపాలకు సహకరించారు.

ఎమర్జెన్సీ అనంతర కాలంలో భారతీయ రైల్వే శాఖలో ఉద్యోగం పొంది తొలి కాలంలో గుంటూరులో పని చేశారు. ఒక పక్క ఉద్యోగం చేస్తూనే కళాకారుడుగా, రంగస్థల నటుడిగా విస్తృతమైన కృషి సాగించారు. అనేక ప్రసిద్ధ పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాలూ నాటికలలో వివిధ పాత్రలలో నటించారు. కళలకు కాణాచి అయిన కాకినాడలో కళారంగంలో కరీమ్ అంటే తెలియనివారు ఎవరూ ఉండరు.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా జనసాహితి - అరుణోదయలు రూపొందించిన 'అప్పుల భారతం' వీధి భాగవతంలో సామ్రాజ్యవాది 'బుష్' పాత్రను నటిస్తూ కొన్ని ప్రదర్శనలలో పాల్గొన్నారు. మధ్యప్రదేశ్‌లోని చిందువాడ జిల్లా 'గుడి- అంబాడా' ప్రాంతంలోని బొగ్గు గని కార్మికుల నడుమ 'అప్పుల భారతం' వీధిభాగవతం (హిందీ) ప్రదర్శనలో నటించారు.

గోర్కీ అమ్మ నవలను నాటకంగా మలచిన సొవిక్ సాంస్కృతిక చక్ర, కలకత్తా వారిచే జనసాహితి ఆధ్వర్యంలో విజయవాడ, విశాఖపట్నంలో జరిగిన ప్రదర్శనలలో (2017-18) ప్రత్యక్షంగా పాల్గొనడమే కాకుండా కాకినాడలో ఉండే కవులు, కళాకారులు, ప్రగతిశీలురందర్నీ ఆ సభలకు ఆహ్వానించారు. తన మిత్రులు అనేక మందితో ప్రజాసాహితి పత్రిక చందాలు కట్టించేవారు. కాకినాడ సెజ్జుకు వ్యతిరేకంగానూ (2011), కొండమొదలు ఆదివాసీల పునరావాస ఉద్యమంలోనూ రైతు-కూలీ సంఘానికి సహకార సంఘీభావాలు అందించారు.

క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూనే, యన్.ఆర్.సి. - సి.ఎ.ఎ. వ్యతిరేక ఆందోళనలలో కాకినాడ బాలాజీ చెరువు కూడలిలో షహీన్ బాగ్ తరహాలో సాగిన ఆందోళనోద్యమంలో కరీం పాల్గొనేవారు.

ప్రజాకళాకారుడు కరీంకు జనసాహితి జోహార్లు చెబుతూంది. వారి కుటుంబసభ్యుల బాధలో పాలుపంచుకుంటుంది. ❂

## హిప్నాటిస్ట్, మెజీషియన్ ఎన్. విక్రంకు జోహార్లు



**అభ్యుదయ,** నాస్తికోద్యమ భావవ్యాప్తిలో ఇంద్రజాల కళను జోడించి మూఢవిశ్వాసాలను పారద్రోలుతూ ప్రజల్ని చైతన్యపర్చటంలో అలుపెరుగని కృషిచేసిన ప్రొ॥ ఎన్. విక్రం కోవిడ్-19 వ్యాధితో హైదరాబాదులో 4-7-2020న మరణించారు. ఆయన 3-9-1947న రంగూన్‌లో జన్మించారు.

హిప్నాటిజం, ఇంద్రజాల కళలపట్ల అత్యంత ఉత్సాహం వున్న విక్రంకు భారత నాస్తిక సమాజంతో అనుబంధం ఏర్పడింది. ఆయన వృత్తి రీత్యా టెక్నికల్ ఉద్యోగి అయినా, సమాజాన్ని పట్టి పీడిస్తున్న మూఢనమ్మకాలు మానసికజాడ్యంగా రూపొందుతున్న విధానాలపైన నిరంతరం పోరాడారు. బాణామతి వంటి మూఢవిశ్వాసాలుతోపాటు బాబాలు, అమ్మలు, స్వాములు, చేసే మహత్యాలన్నీ ఇంద్రజాల విద్యేనని రుజువుచేస్తూ తెలుగు రాష్ట్రాలలోనూ, ఇతర రాష్ట్రాలలోనూ అనేక ఇంద్రజాల ప్రదర్శనలిచ్చారు. నాస్తిక సమాజం నిర్వహించిన అధ్యయన తరగతుల్లో మేజిక్, హిప్నాటిజంలను నేర్పించేవారు. రోజుకొక్కడుగా పుట్టుకొస్తున్న స్వాములు, బాబాలు చేసే 'గోతిలో పూడ్చిపెట్టినవారు బ్రతికి లేవటం' వంటివి, 'కళ్ళకు గంతలు కట్టుకుని బైక్ నడపటం', 'సైకిక్ సర్జరీ', 'మిడ్ బ్రెయిన్ యాక్టివేషన్' వంటి అభూత భావనల్ని తుత్తునియలు చేస్తూ వాటి నిజనిజాలను బహిర్గతపరచేవారు.

విక్రం తను నమ్మిన భావజాలాన్ని ప్రచారం చేయటంలో రచయితగా కూడా ప్రసిద్ధులు. పారాసైకాలజీ అశాస్త్రీయతను తెలియచేస్తూ అనేక రచనలు చేశారు. విక్రంతోపాటు ఆయన కుటుంబసభ్యులూ భావజాల వ్యాప్తిలో భాగస్వాములయ్యారు. ప్రస్తుతం మానవ వికాస వేదిక కేంద్రకమిటీ ఉపాధ్యక్షులుగానూ, జనవిజ్ఞానవేదిక జాతీయ ఉపాధ్యక్షులుగానూ పనిచేస్తున్న నిబద్ధత గల ఉద్యమకారుడు విక్రంకు జనసాహితి సంతాపం ప్రకటిస్తోంది. ఆ సంస్థలకూ, వారి కుటుంబ సభ్యులకూ ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూంది. ✪

# ప్రజా వాగ్గేయకారుడు నిసార్‌కు జోహార్లు



**ప్రజానాట్యమండలి** రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, అరసం బాధ్యులు అయిన నిసార్ కోవిడ్-19 వ్యాధితో హైదరాబాద్‌లో 10 జూలై 2020న మరణించారు. ఆయన నల్లగొండ జిల్లా సుద్దాల గ్రామంలో జన్మించారు.

తెలంగాణ సాయుధ పోరాటం ప్రభావంతో పెరిగిన నిసార్ చిన్నప్పటి నుండి జానపదాలను ప్రజాగేయాలుగా మలచి పాడటంలో నేర్పరి. సుద్దాల హన్మంతు స్ఫూర్తితో ఉద్యమాలలోకి వచ్చిన ఆయన ప్రతి ప్రజా సమస్యను ప్రజలకర్థమయ్యే జానపదాలతో పాటలుగా మలిచేవారు. 'పల్లె సుద్దులు' కళారూపంలో ఒదిగిపోయి నటించేవారు. మూడు దశాబ్దాలుగా ప్రజానాట్యమండలి కార్యక్రమాలలో పాల్గొంటూ ప్రతి వేదిక మీద తన గళాన్ని విన్పించేవారు. 'ఇప్టా'లో జాతీయ కౌన్సిల్ సభ్యునిగా వుంటూ ఇతర రాష్ట్రాలలోనూ అనేక కార్యక్రమాలను నిర్వహించారు. తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె సందర్భంలో కార్మికులకు అండగా నిలబడుతూ వారి సమస్యలను ఎలుగెత్తి చాటారు. ఎన్ఆర్‌సి, సిఎఎలను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లో జరిగిన ఉద్యమాలను నిర్వహించారు. రచయిత, కవి, కళాకారుడు అయిన నిసార్ మృతికి జనసాహితి సంతాపం ప్రకటిస్తోంది. వారి కుటుంబసభ్యులకు, సంస్థలకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తుంది. ✪

# కథా రచయిత బి.పి. కరుణాకర్‌కి జోహార్లు

**'అంబాలిస్',** 'నిర్నిమిత్తం', 'రెల్లు', 'డియర్' కథాసంపుటాల రచయిత బి.పి. కరుణాకర్ (76) గుండెనొప్పితో 20-7-2020న హైదరాబాద్‌లో మరణించారు. ఆయన 22 ఏప్రియల్ 1944న గుంటూరులో జన్మించారు.

కరుణాకర్ బిహెచ్ఇఎల్‌లో వున్నతోద్యోగం చేశారు. సాహిత్య పిపాసి. చిన్న కథలు రాయటంలో నేర్పరి. ఆయన కథలు ఇంగ్లీషు, కన్నడ భాషలలోకి అనువాదమయ్యాయి. కరుణాకర్ మరణానికి 'ప్రజాసాహితి' సంతాపం ప్రకటిస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటిస్తుంది. ✪

# ఉద్యమశీలి బి. పాండురంగారెడ్డికి జోహార్లు



**ఏ.పి.టి.ఎఫ్.లోను,** జనసాహితిలోనూ, రాయలసీమ ఉద్యమంలోనూ క్రియాశీలకంగా పనిచేసిన ఉపాధ్యాయుడు, రచయిత, ఉద్యమ కార్యకర్త బి. పాండురంగారెడ్డి తన 74వ ఏట ఆగస్టు 3, 2020న కరోనా వ్యాధితో మరణించారు. ఆయన నంద్యాల సమీపంలోని గోవిందపల్లెలో 1946లో జన్మించారు.

పాండురంగారెడ్డి తిరుపతిలో విద్వాన్ చదివి 1968లో మొలగపల్లి గ్రామంలో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. అప్పటి నుండి ఎ.పి.టి.ఎఫ్‌లో చురుకైన పాత్ర పోషించారు. ఏపిటిఎఫ్ బాధ్యతలతో పాటుగా 1992-2006 నడుమ ఉపాధ్యాయ పత్రిక సంపాదకవర్గ బాధ్యతలు నిర్వహించారు.

ఆయన 1970లో విరసం సభ్యులుగా చేరారు. 'సంకెళ్ళను తెంచుదాం' అనే కవితా సంపుటిని ప్రచురించారు. 1975లో అనంతపురంలో జరిగిన విరసం 5వ రాష్ట్ర సభలలో జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, కొత్తపల్లి రవిబాబు, చెరుకూరి సత్యంతో పాటు పాండురంగారెడ్డి కూడా విరసంకు రాజీనామా చేశారు. 1975లో ఏర్పడిన రాష్ట్ర జనసాహితి నిర్మాణ వర్గ సభ్యునిగానూ 1978 నుండి రాష్ట్రకమిటీ సభ్యునిగానూ వున్నారు. రాయలసీమ ఉద్యమ సంయుక్త కార్యాచరణ సమితిని రాచంరెడ్డి వెంకట్రాముడు నాయకత్వాన ఏర్పరచి, దానికి తాను కన్వీనర్‌గా వ్యవహరించారు. 'సీమ సాహితి' పత్రికకు సంపాదకునిగా ఉన్నారు. కొంతకాలం ఓ.పి.డి.ఆర్.లోనూ కొనసాగారు. సాయుధ ముఠాల వ్యతిరేక పోరాట కమిటీలో క్రియాశీలకంగా పనిచేశారు.

కీళ్ళ నొప్పులతో బాధపడుతున్నప్పటికీ జనసాహితి రాష్ట్ర కార్యవర్గ సమావేశాలకు హాజరై చర్చలలో చురుకుగా పాల్గొని తన అభిప్రాయాలను సూటిగా సరళంగా చెప్పేవారు. 'ప్రజాసాహితి' పత్రిక అభివృద్ధి కోసం కృషిచేశారు.

పాండురంగారెడ్డి అకాల మరణానికి జనసాహితి సంతాపం ప్రకటిస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియచేస్తూంది. ✪

## సాహిత్యకారుడు వాకాటి శిరీష్ కుమార్ మృతికి సంతాపం

**ఆంధ్రప్రదేశ్** సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాకాటి శిరీష్ కుమార్ నున్నలో వారి స్వగృహమునందు 9.8.2020న మరణించారు. ఆయన కృష్ణాజిల్లా నున్నలో జన్మించారు.

'సంస్కృతీ సమాఖ్య' అనే పేరుతో సాహిత్య సాంస్కృతిక సంఘాన్ని నిర్వహించిన శిరీష్‌కుమార్ నాలుగు దశాబ్దాలకు పైగా యువ రచయితలను, కవులను ప్రోత్సహించారు. 'ప్రజాసాహితి'కి మిత్రులు. శిరీష్‌కుమార్ మృతికి 'ప్రజాసాహితి' సంతాపం ప్రకటిస్తోంది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తుంది. ✪

## ప్రజాకళాకారుడు వంగపండు ప్రసాద్‌కు జోహార్లు



**ప్రజాకళాకారుడు** వంగపండు ప్రసాద్ గుండెనొప్పితో విజయనగరం జిల్లా పార్వతీపురం వై.కే.ఎం. నగర్‌లో 4-8-2020న మరణించారు. ఆయన విజయనగరంజిల్లా పార్వతీపురం మండలంలోని బొండపల్లి గ్రామంలో జన్మించారు.

వంగపండు ఆదివాసీలు, ఇతర పీడిత ప్రజల సమస్యలు, బాధలు కన్నీళ్ళతోపాటు పోరాటాలను కూడా గానం చేస్తూ అనేక పాటలు రాశారు. ఆయన రచించిన 'సుత్తీ కొడవలి ఎత్తిన జెండా' పాటను 1977లో ప్రజాసాహితి ప్రచురించింది. ఎమర్జన్సీ కాలంలో ఆయన రచించిన 'భూమి భాగోతం' కళారూపాన్ని అనేక బృందాలు, ప్రదర్శించాయి. శ్రీకాకుళ గిరిజన సాయుధ పోరాటాన్ని గానం చేస్తూ రచించిన 'సిక్కోలు యుద్ధం' నృత్యరూపకం ఈనాటికీ ప్రదర్శింపబడుతోంది.

వంగపండు విశాఖ షిప్‌యార్డులో ఉద్యోగం చేస్తూండగా జన నాట్యమండలితో ఏర్పడిన పరిచయాలతో ఉద్యోగానికి రాజీనామా చేసి జన నాట్యమండలి కళాకారుడిగా అనేక విప్లవ ప్రజా గీతాలను రచించి గానం చేశారు. విప్లవ సినిమాలకు ఆయన రాసిన పాటలు ప్రజాదరణ పొందాయి. ఆయన జీవితం చివరి రోజుల్లో పాలకవర్గ పార్టీల వేదికలపై కళాప్రదర్శనలిచ్చినప్పటికీ ఆయన జీవితంలో చాలాభాగం శ్రమజీవుల గానానికి, ప్రజా చైతన్యానికి, ఉద్యమాలకి అంకితం చేశారు. వంగపండు ప్రసాద్ మరణానికి జనసాహితి సంతాపం ప్రకటిస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటిస్తోంది. ✪

## కలువకొలను సదానంద



**ప్రముఖ** రచయిత, చిత్రకారుడు కలువకొలను సదానంద తన 81వ ఏట 25 ఆగస్టు 2020 ఉదయం పాకాలలో మరణించారు. ఆయన 22 ఫిబ్రవరి 1939లో పాకాలలో జన్మించారు.

సదానంద కథ, నవల, గేయాలు మొదలగు ప్రక్రియలలో బాలసాహిత్యాన్ని ప్రధానంగా రచించారు. చిత్రకారునిగా, కార్టూనిస్టుగా కూడా పాఠకులకు వీరు పరిచయం. 'రక్తయజ్ఞం', 'పైరుగాలి', 'మాయకంబళి', 'నవ్వే పెదవులు, ఏడ్చే కళ్ళు' వీరి కథాసంపుటాలు. 'గాడిద బ్రతుకులు', 'గందరగోళం' వీరి నవలలు. ఆయన రచించిన 'అడవి తల్లి' నవలకు సాహిత్య అకాడమీ అవార్డు లభించినది. 1976లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు వీరి 'నవ్వే పెదవులు, ఏడ్చే కళ్ళు' కథాసంపుటానికి వచ్చింది. బాలసాహిత్య రచయితగా పేరుపొందారు. ఉత్తమ ఉపాధ్యాయునిగా కూడా సత్కారాన్ని అందుకున్న వీరి మరణానికి సంతాపం ప్రకటిస్తున్నాం. ✪

## ఆచార్య పి. సి. నరసింహారెడ్డి

**శ్రీ** వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్రాధిపతిగా చేసిన ఆచార్య పి.సి. నరసింహారెడ్డి తన 77వ ఏట 19 అగస్టు 2020న హైదరాబాదులో మరణించారు. ఆయన గద్వాల సమీపంలోని గట్టు మండలంలోని పెంచుకలపాడులో 3 జులై 1943లో జన్మించారు.

యువకునిగా వీరు "తిరగబడు' కవుల్లో ఒకరిగా ఆ కవితా సంకలనంలో 'ఐ' అనే కలంపేరుతో 'తిరగబడు' అనే కవిత రాశారు. విరసం ఏర్పాటుతో సంబంధాలు వున్నా, సభ్యత్వం తీసుకోలేదు. 'శక్తి' పేరుతో చిత్రకారునిగా చిత్రాలు గీశారు. 'సృజన' పత్రిక అక్షరాలు వీరు రాసినవే. శ్రీశ్రీ 'మరో ప్రస్థానం' ముఖచిత్రం వీరిదే. నార్ల చిరంజీవి 'కొమ్మలు – రెమ్మలు' కవితలకు వేసిన చిత్రాలను బాపు మెచ్చుకున్నారు. చలసాని ప్రసాదరావు సంపాదకత్వంలో వచ్చిన 'కళ' కొన్ని సంచికలకు బొమ్మలు వేసారు.

వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చేరిన తర్వాత ఆయన కేవలం భాషాశాస్త్రానికి పరిమితమైపోయారు. వారి మరణానికి 'ప్రజాసాహితి' సంతాపం ప్రకటిస్తూంది. ✪

# శారదమ్మ

**భారత** నాస్తిక సమాజ వ్యవస్థాపక సభ్యురాలు, జయగోపాల్ భార్య శారదమ్మ 29 ఆగస్టు 2020న విశాఖలో చనిపోయారు.

గత 50 ఏళ్ళకుపైగా జయగోపాల్‌తో పాటు నాస్తికోద్యమపు ఎగుడుదిగుడుల ప్రయాణం చేసిన శారదమ్మ మరణానికి 'ప్రజాసాహితి' సంతాపం తెలియచేస్తూంది. వారి కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటిస్తున్నాం. ✪

# కాట్రగడ్డ నరసయ్య

**నవయుగ** ఫిల్మ్స్ మేనేజర్‌గా పనిచేసి, చలనచిత్ర ప్రకటనలలో, ప్రచారంలో వినూత్నమైన విజయవంతమైన ప్రయోగాలు చేసిన అభ్యుదయవాది కాట్రగడ్డ నరసయ్య తన 96వ ఏట – 31 అగస్టు 2020న విజయవాడలో మరణించారు.

విజయవాడలో ప్రముఖ కమ్యూనిస్టు కుటుంబమైన కాట్రగడ్డ కుటుంబసభ్యుడైన నరసయ్య బెనారస్ హిందూ యూనివర్శిటీలో విద్యార్థిగా వున్నపుడే – 1943లో తెనాలి సమీపాన పెదపూడి గ్రామంలో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం నెల రోజులపాటు నిర్వహించిన సాహిత్య పాఠశాలకు హాజరయ్యారు. నవయుగలో పనిచేశారు. రిటైరైన తర్వాత విజయవాడ నగర అభివృద్ధికీ, సీనియర్ సిటిజన్స్ సౌకర్యాలకీ, శరీర అవయవదాన ఉద్యమానికీ కృషిచేశారు. విజయవాడ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షునిగా పనిచేశారు. 1993లోనే రైతుబజారు నిర్వహించారు.

ఎందరు విమర్శించినా, దూరదృష్టితో ఊరిచివర మొగల్రాజపురంలో మధు కళామండపం కట్టారు. ఇప్పుడు ఊరు అభివృద్ధికాగా అది నగరానికి నట్టనడిమిన ఉన్న మధుమాలక్ష్మి చాంబర్స్‌గా కొనసాగుతూంది. చివరి సంవత్సరాలలో నడవలేని పరిస్థితుల్లో అందరితో ఫోన్లలో మాట్లాడుతూ తన భావాలను పంచుకునేవారు. వారి మరణానికి 'ప్రజాసాహితి' సంతాపం ప్రకటిస్తూంది. ✪

# సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేశ్ మరణానికి సంతాపం




**స్వామి** అగ్నివేశ్ ఆర్యసమాజం ఆశయాలను కొనసాగిస్తూ 'ఆర్యసభ' అనే రాజకీయ పార్టీని ఏర్పాటుచేశారు. హర్యానా రాష్ట్రం నుండి కాబినెట్ మినిస్టర్‌గా ఎన్నికయ్యారు. విద్యాశాఖమంత్రిగా పనిచేశారు. ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోసం కృషిచేసిన ఆయన 11-9-2020న ఢిల్లీలో కాలేయ వ్యాధితో మరణించారు. అగ్నివేశ్ 21-9-1939న శ్రీకాకుళంలో జన్మించారు.

హిందూమతంలోని దురాచారాలను వ్యతిరేకిస్తూ ఆర్యసమాజంలో చేరారు. ప్రజాస్వామిక హక్కుల కోసం ఉద్యమిస్తున్న అగ్నివేశ్‌ను 2008లో ఆర్యసమాజం బహిష్కరించింది. ఢిల్లీ పరిసర ప్రాంతాలలోని గనుల్లో సాగుతున్న వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ఉద్యమించినవారిపై పోలీసులు కాల్పులు జరుపగా – పోలీసులపై హర్యానా ప్రభుత్వం చర్య తీసుకోనందున వెట్టిచాకిరీ వ్యతిరేక ఉద్యమకారులకు అండగా నిలబడుతూ ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. హర్యానా ప్రభుత్వం ఆయనను సంవత్సరకాలం పైగా జైలులో పెట్టింది. రాజస్థాన్ రాష్ట్రంలో సాగుతున్న దురాచారం 'సతీ సహగమనం' రూపుమాపటానికి కృషిచేశారు. 1987లో 'సతి' చట్టం రూపొందింది. అలాగే భ్రూణ హత్యలకు వ్యతిరేకంగానూ, వలస చట్టాలను మార్చాలని, బంధువా ముక్తి మోర్చా ఉద్యమాన్నీ, బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా, నర్మదా బచావో ఆందోళనలోనూ, అవినీతిపై అన్నా హజారే నిర్వహించిన ఆందోళనలోనూ, మావోయిస్టులతో చర్చల కార్యక్రమంలోనూ, ఆంధ్ర రాష్ట్రంలో నూతన రాజధాని పేరుతో భూసేకరణకు వ్యతిరేకంగానూ అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు, నిర్వహించారు. దళితులు, ఆదివాసీలు, మహిళలు – పీడిత ప్రజల పక్షాన నిలబడి పోరాడారు. హిందూ మతాచారాలను ప్రశ్నించినందుకు, మతతత్వాన్ని దుయ్యబట్టినందుకు హిందూ మతోన్మాదులు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడిన ఆయన వైద్య సహాయం తీసుకుంటూ మరణించారు.

స్వామి అగ్నివేశ్ మరణానికి జనసాహితి సంతాపం ప్రకటిస్తూంది. ✪

## బహుజన ఉద్యమ నాయకుడు ఉ.సా. మరణానికి సంతాపం



**బహుజన** ఉద్యమకారుడిగా కృషిచేస్తున్న ఉప్పుమావులూరి సాంబశివరావు 24 జూలై 2020న కరోనా వ్యాధితో హైదరాబాద్‌లో మరణించారు. ఆయన గుంటూరుజిల్లా బ్రాహ్మణ కోడూరులో జన్మించారు.

ఉ.సా. తెనాలిలో డిగ్రీ చదివే రోజుల్లో (1973-74) ఏర్పడిన 'అరుణోదయ సాంస్కృతిక సంస్థ'లో చేరి సామాజిక అంశాలపై కళారూపాలను నేర్చుకుంటూ, నేర్పుతూ - వివిధ సమస్యలపై పాటలు రాశారు. 1978లో జనసాహితి ఏర్పడినపుడు చురుకైన కార్యకర్తగా కృషిచేస్తూ పలు జనం పాటలు రాశారు. జనసాహితి సంస్థ గీతంగా పాడుకునే "మేం పాడుతాం ప్రజల పాట పాడుతాం" పాటను ఆ రోజుల్లో ఉ.సా. రాశారు. సన్నశెట్టి రాజశేఖర్‌తోపాటు సంస్థ తరఫున కొండమొదలు గిరిజన ఉద్యమ ప్రాంతాలలో వున్న గిరిజనుల కళలను, సంస్కృతిని అవగాహన చేసుకుంటూ పాటలను సేకరించి, రికార్డు చేశారు. వాటిని 'జానపద గేయాలు, జనం పాటలు' జనసాహితి పుస్తక రూపంలో ప్రచురించింది. ఆయన కాలక్రమంలో శ్రామిక విప్లవ బాటకు దూరమయ్యారు. వారి అకాల మరణం చాలా బాధాకరం. వారు కృషిచేస్తున్న బహుజన ఉద్యమానికి తీరని లోటు. ఉ.సా. మరణానికి జనసాహితి సంతాపం ప్రకటిస్తుంది. ✪

---




## నాస్తిక్ వెంకన్న మరణానికి సంతాపం

**మానవ** వికాస వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు, గాయకుడు నాస్తిక వెంకన్న 7-9-2020న హైదరాబాద్‌లో కరోనా వ్యాధితో మరణించారు. ఆయన కరీంనగర్ జిల్లా మంథని గ్రామంలో జన్మించారు.

మహిమలు, మూఢనమ్మకాల బండారాన్ని బట్టబయలు చేసే ఇంద్రజాలికుడిగా, డప్పు వాయిస్తూ మూఢనమ్మకాలను పారద్రోలుతూ, మూఢత్వాన్ని ప్రశ్నిస్తూ పాటలు పాడే గాయకుడిగా రెండు తెలుగు రాష్ట్రాలలో కృషిచేశారు. వెంకన్న మరణానికి జనసాహితి సంతాపం ప్రకటిస్తుంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియచేస్తుంది. ✪

---

## విద్యావేత్త, అభ్యుదయవాది చౌదరిబాబు మృతికి సంతాపం



**గౌతం** విద్యాసంస్థల అధినేత, విద్యావేత్త ఎన్. చౌదరిబాబు మూత్రపిండాల వ్యాధితో 5 ఆగస్టు 2020న విజయవాడలో మరణించారు. ఆయన గుంటూరుజిల్లా పాలపర్రులో 11 నవంబరు 1949న జన్మించారు.

చౌదరిబాబు విద్యార్థి దశ నుండీ మార్క్సిజాన్ని నమ్మారు. అసమాన సమాజం పోయినపుడే విద్యావ్యవస్థలోనూ మార్పులు వస్తాయని నమ్ముతూనే ఈ కార్పొరేట్ పోటీ ప్రపంచంలో నిలబడి తనదైన రీతిలో నర్సరీ నుండి పి.జి. వరకూ విద్యాసంస్థలను నెలకొల్పి నిర్వహించారు. తన స్వగ్రామమైన పాలపర్రులో హైస్కూలును దత్తత తీసుకున్నారు. పాలపర్రు గ్రామ చరిత్రను - అక్కడ జరిగిన రాజకీయ ఉద్యమాల చరిత్రను తెలియచేస్తూ గ్రంథాన్ని రచించారు. Students, Teacher, Educator, Parent (STEP) సంస్థను నెలకొల్పారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్య సంఘానికి బాధ్యులుగా వుండేవారు. 'ప్రజాసాహితి'కి ఆప్తులు. ప్రజాసంఘాలతో సన్నిహిత సంబంధాలుతో వుండేవారు. వితరణశీలి. చౌదరిబాబు మరణానికి 'ప్రజాసాహితి' సంతాపం ప్రకటిస్తోంది. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తుంది. ✪

### "ముక్కానీ నవల" ధారావాహిక గురించి

ఈ ధారావాహిక ప్రచురణను ఈ సంచిక నుండి ఆపివేస్తున్నాము. త్వరలో పుస్తక రూపంలో వెలువరిస్తాము. 'ప్రజాసాహితి' పత్రికను నెలనెలా ప్రచురించలేకపోతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నాం.

- సంపాదకుడు

ప్రకటన

# వ్యవసాయాన్ని, పరిశ్రమలను బహుళజాతి కార్పొరేట్ శక్తులకు అప్పగించే, రైతాంగాన్ని, కార్మికులను కట్టుబానిసలుగా మార్చనున్న ఇటీవలి పార్లమెంటు బిల్లులు, చట్టాలకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాలకు కవుల, కళాకారుల, రచయితల, మేధావుల సంఘీభావం

*మిత్రులారా,*

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపీ కూటమి, నయాన్నో భయాన్నో రాష్ట్రాల్లో తమకు పాలకమిత్రులుగా మార్చుకున్న పార్టీలతో కలసి ఈ దేశ ప్రధాన పునాది రంగాలైన వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను దుంపనాశనం చేయడానికి ఉద్దేశించిన బిల్లులను పార్లమెంట్‌లో హడావిడిగా ఆమోదించింది. కరోనా పేరుతో ఇప్పుడు నడుస్తున్నది అప్రకటిత ఎమర్జెన్సీ రోజులు. ప్రజలంతా కరోనాకు, దాని పేరుతో పాలకులు సాగిస్తున్న అనాలోచిత విధానాలకు గడచిన ఆరునెలలుగా ఎంత మూల్యం చెల్లించారో చూస్తున్నాం. గత పార్లమెంటు సమావేశాలకు, ఈ పార్లమెంట్ సమావేశాలకు మధ్య బిజెపి పాలిత రాష్ట్రాల్లో రిహార్సల్స్ వేసుకుని ఏకంగా భారత రైతాంగం పైన, కార్మికుల పైన, మొత్తం ప్రజల పైన ప్రభావాన్ని చూపే దుర్మార్గపు బిల్లులను – సెప్టెంబర్ 20న మూడు బిల్లులు, 23న కొన్ని బిల్లులు పార్లమెంట్‌లో ఆమోదించారు.

మొదటి 3 చట్టాలుగా మారితే కార్పోరేట్ కంపెనీల చేతుల్లో చిన్న రైతులు లీజుకి భూములిచ్చిన బందీలుగా, క్రమంగా ఒకనాటి నీలి రైతులుగా మారిపోతారు. మార్కెట్ యార్డులను గల్లీ దళారులకు బదులు ఢిల్లీ దళారులు కబ్జాపెడతారు. ఇప్పటికే ప్రకటించిన మద్దతు ధర ఎన్నడూ, ఎక్కడా అమలు గాదు. మొక్కజొన్నకు 1700/– అంటారు, మేమే కొనేస్తామంటారు. 1300/–కి ఆడిగేటోళ్లు లేరు. గిట్టుబాటు ధర అన్న పదమే ఉండదు. పంటల విధానం, మార్కెట్, స్టోరేజ్ – వాటిపైన పన్నులు రాష్ట్రాలతో నిమిత్తం లేకుండా కేంద్రం బహుళజాతి కార్పొరేట్లకప్పగించేస్తుంది. నిత్యావసరాల సరుకుల లిస్టు లోనుంచి చాలా పంటలకు మినహాయింపు ఇచ్చారు. ఫలితంగా అన్ని ఆహారపంటలు లక్షల టన్నులు కార్పొరేట్ బ్లాక్ మార్కెట్లోకి వెళతాయి. ఈ దేశ ప్రజానీకాన్ని ఇప్పటివరకు వినియోగదారులుగా చూస్తున్న కంపెనీలు తమకు లాభాలు కురిపించే నట్టులు బోల్టులుగా చూస్తారు. రైతుకు ఎవరికైనా అమ్ముకునే స్వేచ్ఛ ఉంటుందని, దళారుల పీడ వుండదని పాలకులు, వారి అనుకూలమైన మేధావులు, మీడియా తెగ ఊదరకొడుతున్నారు. అమెరికా నుంచి దిగుమతులపై మరొక 15 శాతం సుంకం తగ్గించే ఒప్పందాలు చేసుకుని కార్పొరేట్ కంపెనీలకు మరింత స్వేచ్ఛ ఇచ్చారు. ఆకంపెనీలు ఆహార ప్రాసెసింగ్ కోసం ఎవరి ముడి సరుకులు కొంటారో స్పష్టమే. ఇప్పటికే రైతాంగానికి సుబాబుల్, జామాయిల్, పొగాకు కొనుగోళ్ల అనుభవాలు బోల్డున్నాయ్. మొత్తం వ్యవసాయమే గిట్టుబాటు కాదనుకుని పాడి రైతులుగా మారిపోతున్నారు. వారిని ఆ కంపెనీలు ఎలా దోపిడి చేస్తున్నాయో చూస్తున్నాం. రేపటి రోజున ఈ పాల కంపెనీలన్నీ కార్పొరేట్ హాస్పిటళ్లు అమ్ముడుపోయినట్టు అమ్ముడయి ఏ వాల్ మార్ట్ మాత్రమే మిగిలితే పాడికూడా గిట్టుబాటు కాని రోజు రాబోతున్నది. బతుకంతా మోసానికి గురౌతున్నా ఇంకా అర్థం కాని వారెవరుంటారు. పాలకులు చెప్పే స్వేచ్ఛ కంపెనీలకు. వ్యవసాయ రంగంలో బతుకులు సాగిస్తున్న 70 శాతం పైగా ఉన్న ప్రజల జీవితాల్లో మరొక చీకటి దశ మొదలవ బోతుంది. ఇది ప్రపంచీకరణ స్వేచ్ఛ లాంటిదే.దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మల లాంటి ఎల్ ఐ సి, బి ఎస్ ఎన్ ఎల్ , బ్యాంకులు, రైల్వే, ఎలక్ట్రిసిటీ, కోల్ రంగాలను విదేశీ కార్పొరేట్లకు అప్పగించే వినాశకర చర్యలను పాలకులు స్వేచ్ఛగా చేపడుతున్నారు. ఇది ప్రజాస్వామ్యం అంటున్నారు. దేశభక్తి అంటున్నారు. మనదేశం లేబుల్తో అంబానీ, ఆదానీల కంపెనీలు విదేశీ ఫైనాన్స్ పెట్టుబడి వాటాలతో లక్షలకోట్లు ఆస్తులు పెంచుకోవడం దేశభక్తికి ఉన్న అభివృద్ధి కోణం కావచ్చు. కరెంట్ మొత్తాన్నీ కేంద్రం తన గుప్పెట్లోకి లాగేసాక రేపు నెలకోసారి గ్యాసు ధరల్లాగా పెరగబోయే కరెంటు చార్జీలు కట్టుకోలేక దివాలాతీసే స్వేచ్ఛను ఈ దేశ ప్రజలకు బహుమతిగా ఇవ్వనున్నారు. ప్రపంచమంతా పెట్రోల్, డీజల్ ధరలు ఎలా పెరుగుతున్నాయో, ఎవరు పెంచుతున్నారో తెలియనిదెవరికి. ఈ రైతు స్వేచ్ఛ బూటకం, పాలకుల నాటకం.

మరొకవైపు దేశవ్యాప్తంగా కార్మిక వర్గం, ట్రేడ్ యూనియన్‌లు ప్రతిఘటిస్తున్నప్పటికీ 44 చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చి పార్లమెంటులో ఆమోదింపచేసారు. శతాబ్దం పైగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్చి యాజమాన్యాలకు, కార్పొరేట్లకు తాకట్టు పెట్టారు. గతంలో వందమంది వరకు వున్న పరిశ్రమలలో కార్మిక చట్టాల మినహాయింపు వుంది. దాన్ని 300 మందికి పెంచారు. ఆధునిక టెక్నాలజీ యుగంలో ఈ మార్పుతో దాదాపు 49% పరిశ్రమలలో పనిచేసే కార్మికులు చట్ట పరిధి నుండి తప్పించబడతారు. 8 గంటల పని దినం బదులు 12 గంటల పని దినం అమలు లోకి వస్తుంది. ట్రేడ్ యూనియన్ హక్కులు దారుణంగా దెబ్బతింటాయి. ఇష్టారాజ్యంగా కార్మికులను తొలగించగలుగుతారు. కాంట్రాక్టు కార్మిక వ్యవస్థ శాశ్వతంగా అమలు లోకి వస్తుంది. ఒక్క మాటలో 19 వశతాబ్దపు బానిస పరిస్థితిలోకి కార్మిక వర్గం నెట్టబడుతుంది.

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలైన రైతాంగం, కార్మికుల శ్రమ అనే రక్తాన్ని పిండి, పాకెట్లుగా కార్పొరేట్ కంపెనీలకు కారు చౌకగా అప్పగించడానికి చూస్తున్నాయి. ఈ పరిస్థితులలో భారతదేశ శ్రామికులు చేయ తలపెట్టిన ఆందోళనలు న్యాయమైనవి. వారుచూపుతున్నది ధర్మాగ్రహం. వారి న్యాయమైన కోర్కెలను ప్రభుత్వాలు, రాష్ట్రపతి పతిగణలోకి తీసుకోవాలని, ఆ బిల్లులు చట్టరూపం పొందరాదని మేము కోరుతున్నాము. మనకందరికీ అన్నం పెట్టే శ్రామికులకు సంఘీభావాన్ని తెలుపుతున్నాము.

**ఇట్లు :**

కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు

ప్రొ॥ వకుళాభరణం రామకృష్ణ, ప్రొ॥ డి. నర్సింహా రెడ్డి, ప్రొ॥ తోట జ్యోతిరాణి, ప్రొ॥ కె.ఆర్. చౌదరి, సుద్దాల అశోక్ తేజ, గోరటి వెంకన్న, భూపాల్, శీలా వీర్రాజు, శీలా సుభద్రాదేవి, బి. విజయభారతి, కాత్యాయని, ఘంటసాల నిర్మల, డా॥ నళిని, డా॥ ఆలూరి విజయలక్ష్మి, భండారు విజయ, ఎం. లక్ష్మీ, శాంతి ప్రబోధ, విమల, కొండేపూడి నిర్మల, శివలక్ష్మి, దేవరాజు మహారాజు, ముక్తవరం పార్థసారథి, వారాల కృష్ణమూర్తి, సి. హెచ్. మధు, జయధీర్ తిరుమలరావు, డా॥ ఎ. కె. ప్రభాకర్, వఝల శివకుమార్, ప్రొ॥ దార్ల వెంకటేశ్వర్లు, శ్యామ్, వి.ఆర్. శర్మ, కె. పి. అశోక్ కుమార్, జనజ్వాల, విద్యాసాగర్, కె. వేణుగోపాల్, అశోక్ కుమార్ (టిపిటిఎఫ్), డా॥ భట్టు లక్ష్మీనారాయణ, కె. రామ్మోహన్ (జనసాహితి), రమణ ప్రసాద్ (ఏఐ పిఎల్.సిఎఫ్), డా॥ ఎన్. వెంకట్రావు, కోయిన్ని వెంకన్న, కె. శాంతారావ్, గడీల సుధాకర్ రెడ్డి, కార్టూనిస్టులు : సుధామ, శంకు, నర్సింహ, సురేంద్రనాథ్

**24.09.2020**

**జనసాహితి**
**జంటనగరాల శాఖ**

ప్రకటన

# మనీషా వాల్మీకి హత్యాచారం అమానుషం! నేరస్థులను కఠినంగా శిక్షించాలి

**మనీషా** వాల్మీకి ఉత్తరప్రదేశ్ – హత్రాస్ జిల్లాలోని గ్రామానికి చెందిన 19 ఏళ్ళ దళిత యువతి. సెప్టెంబర్ 14, 2020న ఆమె తన తల్లితో కలసి పశువుల మేత కోసం పొలం వెళ్ళింది. తల్లీ కూతుళ్ళు పొలంలో చెరొకవైపు గడ్డి కోసుకుంటుండగా ఆధిపత్య కులాలకి చెందిన నలుగురు యువకులు మనీషాను పక్కకు లాక్కెళ్ళి లైంగికదాడి చేశారు. ప్రతిఘటించిన ఆమెను భయంకరమైన చిత్రహింసలకు గురిచేశారు. వెన్నెముక విరిచేశారు. సాక్ష్యం చెప్పటానికి వీలులేకుండా నాలుకను కోసేశారు. మనీషా కోసం వెతుకుతున్న తల్లి, రక్తపు మడుగులో పడి వున్న కూతురిని చూసి గుండెలు బాదుకుంటూ పోలీస్‌స్టేషన్‌కి తీసుకెళ్ళారు. పోలీసులు అత్యంత నిర్లక్ష్యంగా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. కుటుంబసభ్యులు ఆమెను హాస్పిటల్‌లో చేర్పించగా మృత్యువుతో పోరాడుతూ 15 రోజుల తర్వాత సెప్టెంబరు 29న మనీషా మరణించింది. తనను ఎవరు హింసించారో, లైంగికదాడి చేశారో మనీషా పోలీసు స్టేట్‌మెంట్ ఇచ్చింది. అయినప్పటికీ పోలీసులు నేరస్థులపై ఏ విధమైన చర్యలు తీసుకోకపోగా, మనీషా కుటుంబాన్ని ఇంట్లో బంధించి, మున్సిపల్ సిబ్బంది, అధికారుల సహాయంతో ఆమె శవాన్ని దహనం చేశారు. ఎంత అన్యాయం! ఎంతటి ఘోరం.

మహిళల మీద అత్యాచారం, హింసల నేరాలు నిత్యకృత్యమై పోయాయి. నిర్భయ సంఘటనకు ముందూ – తర్వాత చాలా 'దిశ' సంఘటనలు జరిగాయి, జరుగుతూనే వున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోనే నిర్భయ లాంటి ఘటనలూ చోటుచేసుకున్నాయి. సంఘటనలు జరిగిన వెంటనే తెచ్చే కొత్త చట్టాలు ప్రతిఘటిస్తున్న ప్రజల ఆగ్రహావేశాలను, ఆందోళనలను చల్లార్చటానికి మినహా నేరస్థులను శిక్షించటం కోసం కాదనీ, బాధితులను రక్షించటం కోసమూ కాదని – తేటతెల్లమవుతూంది. గ్రామాలలో ఆధిపత్యవర్గాల పెత్తందారీశక్తుల దోపిడీ పీడన ఎంత బలంగా వుంటున్నాయో, పెత్తందారీ శక్తులను రక్షించటం కోసం, వారి అరాచకాలను, దుర్మార్గాలను కాపలా కాయడం కోసం పాలకులు, వ్యవస్థ ఎంతగా నిలబడుతున్నారో ఈ సంఘటనలు తెలియచేస్తున్నాయి. చాలా సందర్భాలలో పోలీసులు రాజ్యానికి సేవకులై పెత్తందారీ శక్తులను కాపాడటానికి నేరస్థులను పట్టుకోకపోవటం, సాక్ష్యాధారాలను తారుమారు చేయటం, సాక్షులను బెదిరించటం, హతమార్చటం చూస్తూ వస్తున్నాం. మనీషా సంఘటనలో అసలు నేరమే జరగలేదని నిరూపించదలిచారు.

ఆదివాసీలు, దళితులు, మహిళలు ఘడియ ఘడియకు ఏదో ఒక దౌర్జన్యాలకో, అత్యాచారాలకో గురౌతున్నారు. చుండూరు దళితుల ఊచకోత జరిగింది. కానీ ఈ సంఘటనలో నేరస్థులే లేరని కోర్టు తీర్పునిచ్చింది. బాబ్రీ మసీదును కూల్చివేశారు. అయినా దోషులెవరూ లేరని కోర్టు తీర్పునిచ్చింది. చట్టాలు, కోర్టులు, పోలీసులు – పాలకులే ఆధిపత్యవర్గాలకు, పెత్తందారీశక్తులకు కొమ్ముకాస్తున్న విధానాలను త్రిప్పికొట్టాలి. అమానుషమైన, అవమానకరమైన దాడులకు, అకృత్యాలకు వ్యతిరేకంగా సంఘటితమవుదాం. హింసను, నేర ప్రవృత్తిని పెంచి పోషిస్తున్న విషసంస్కృతిని పారద్రోలటానికి ఏక గొంతుగా ఉద్యమిద్దాం.

**01.10.2020**

**జనసాహితి**

# క్యూబా జాతీయ నృత్యరూపక కళానిర్మాత అలీసియా అలోంసో మరణం



**క్యూబా** రాజకీయరంగాన్ని ఫిడెల్ కాస్ట్రో సుసంపన్నం చేయగా, క్యూబా సాంస్కృతిక, కళారంగాన్ని అలీసియా అలోంసో సుసంపన్నం చేశారు. ఆమె 1920 డిసెంబర్ 26న జన్మించారు. తన 98వ ఏట 2019 అక్టోబర్ 17న మరణించారు.

నృత్యకళాకారిణిగా అలీసియా తన 11వ ఏట 1931 డిసెంబర్ 29న హవానాలో మొదటి ప్రదర్శన ఇచ్చారు. తన సహాధ్యాయుడైన ఫెర్నాండోను 16వ ఏట వివాహం చేసుకున్నారు. ఇద్దరూ కలసి న్యూయార్క్‌లోని బ్యాలే కారవాన్‌లో చేరి పనిచేశారు. ఆమెకు 19వ ఏట నుంచీ కంటిచూపు మందగించి, చూపు దాదాపు కోల్పోగా 1970ల ప్రారంభంలో రెండు ఆపరేషన్ల తర్వాత మరల కొంత చూపు వచ్చింది. దానితో మనుష్యులను, వస్తువులను నీడలుగా మాత్రమే చూడగల్గారు. ఐనా ప్రపంచవ్యాప్తంగా బాలే నృత్య కళాకారిణిగా పేరు గడించారు. విశ్వవిఖ్యాత బాలే సంస్థను హవానాలో స్థాపించారు.

నియంత బతిస్టా పాలనను నిరసిస్తూ దేశంలో రాజకీయ వ్యవస్థ మారేంతవరకు, క్యూబాలో తన నృత్య ప్రదర్శనలు వుండవు అని ప్రకటించి, ఆమె 1956లో క్యూబా వదలి అమెరికా వెళ్ళారు. క్యూబా విప్లవం విజయవంతమై, ఫిడెల్ కాస్ట్రో 1959 జనవరి 1న అధికారం స్వీకరించిన తర్వాతే క్యూబాకు తిరిగి వచ్చారు. 1948లో హవానాలో తన పేరుతో బాలే సంస్థను ప్రారంభించి 1956లో ఆర్థిక కారణాల వల్ల మూసేసారు. ఈ సంస్థకు అప్పటికే వచ్చిన పేరు ప్రతిష్ఠలను నియంత బతిస్టా వాడుకోవాలని విఫలయత్నం చేసి, చివరకు అలోంసో కమ్యూనిస్టు అని చెప్పి, సంస్థకు ఆర్థిక సహాయాన్ని నిలిపివేశాడు.

తన దేశ పరిస్థితి మెరుగవుతుందన్న దృఢమైన అభిప్రాయంతో వున్న అలోంసా, నియంత బతిస్టా సైన్యాన్ని, విప్లవకారులు ఓడించడానికి ముందే రాబోయే రోజుల్లో బాలే ప్రాముఖ్యతను వివరిస్తూ సియర్రా మేస్త్రాలో వున్న తిరుగుబాటుదారులకు తన ప్రతిపాదనలు పంపారు.

విప్లవం విజయవంతమైన వెంటనే అలోంసా తన సాంస్కృతిక కార్యకలాపాలు ప్రారంభించి సామాజిక మార్పును ప్రతిఫలించే కళారూపాలను తయారుచేశారు. క్యూబా జాతీయ సంస్కృతికి ప్రతిరూపంగా, విశ్వవ్యాప్తంగా ఆ కళారూపానికి కేంద్ర స్థానంగా ఆమె కాస్ట్రో ఇచ్చిన ప్రోత్సాహంతో తన సంస్థను రూపుదిద్దారు. దీనికోసం ఆమె కాస్ట్రోని లక్ష డాలర్ల ఆర్థిక సహకారం కావాలని అడిగితే, కాస్ట్రో 2 లక్షల డాలర్లను మంజూరు చేశారు. ఈ చిన్న ద్వీపంలో వున్న ఈ సంస్థ, “శిష్టవర్గాల కోసంగాక, ప్రజలందరికీ, ప్రజల్లో నుంచి తయారైన నృత్య కళాకారులు, అధ్యాపకులతో కూడినట్టిది” అని ఆమె ప్రకటించారు. “ఇది అద్భుతమైనది. ఇటువంటిది ప్రపంచంలో ఎక్కడా లేదు. నిశ్చయంగా చెబుతున్నా. నిజాన్ని బహిర్గతం చేయాలి. ఈ సంస్థ విప్లవం ద్వారా రూపొందిన సంస్థ” అని అన్నారు.

ఈ జాతీయ బాలేకు చెందిన నటులు తమ సందేశాత్మక నృత్య కళారూపాలను కర్మాగారాల్లో, పని ప్రదేశాల్లో, పాఠశాలల్లో ప్రదర్శించారు. అవసరమైనచోట్ల స్వచ్ఛంద సేవలందించారు. మారుమూల ప్రాంతాలకు నృత్యాన్ని తీసుకువెళ్ళారు. ప్రతిష్ఠాత్మకమైన “స్వాన్ లేక్” (హంసల సరస్సు) కళారూపాన్ని క్యూబా సామాన్య ప్రజలు చూడగల్గేట్లు చేయాలన్న అలోంసో స్వప్నాన్ని నిజం చేశారు.

“పూర్వం 1950లలో కళ అనేది ఒక చిన్న సంపన్నవర్గపు వారసత్వంగా వుండేది. మన విప్లవం తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు మనం నూతన కర్తవ్యాలను ఎదుర్కొంటున్నాం. శ్రామిక జనాలలో కళను ప్రవేశపెట్టడం, ప్రదర్శించడమేగాక, వారిలో నుండి కళాకారులను అభివృద్ధి చేయాలి, సృష్టించాలి”, అని ఒక ముఖాముఖి కార్యక్రమంలో ఆమె ప్రకటించారు.

అక్టోబర్ విప్లవం తర్వాత సోవియట్లు తమ సాహిత్యం, కళలను వృద్ధి చేసుకున్నట్లే, క్యూబా కూడా విప్లవం తర్వాత ప్రతిభావంతమైన నృత్యకళా వ్యవస్థను సృష్టించుకుంది. వీరి బాలే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కళారూపం. ఏ వర్గం నుంచి వచ్చినవారైనాసరే, నైపుణ్యమూ, శ్రమచేసే తత్త్వమూ గల క్యూబా యువతకు ఈ సంస్థ ఒక అపురూపమైన బహుమానం! దీనికి లాటిన్ అమెరికాలో మాత్రమేగాక, యూరప్ అంతా వున్న పేరు ప్రఖ్యాతుల వల్ల ఆయా దేశాల నుండి విద్యార్థులు క్యూబాలో శిక్షణ పొందటానికి వస్తున్నారు.

క్యూబా ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత పురస్కారం జోస్‌మార్టి పతకాన్ని ఫిడెల్ కాస్ట్రో చేతుల మీదుగా, అలోంసో 2000 డిసెంబర్‌లో అందుకున్నారు.

తన జీవితకాలంలో తన స్వప్నాన్ని సాకారం చేసుకున్న అలీసియా అలోంసో, “చాలా గర్వపడుతున్నాను. ఇక్కడ మేము దేశం కోసం కృషి చేస్తున్నాం. మానవులుగా అభివృద్ధి కావాలని కష్టనష్టాల మధ్య ప్రయత్నిస్తున్నాం. భవిష్యత్తుపట్ల అత్యంత విశ్వాసంతో ముందుకు సాగుతున్నాం” అన్నారు.

ప్రజాకళాకారులందరికీ చిరస్మరణీయురాలు అలీసియా అలోంసో. ✪

# ముప్పై ఏళ్ళ క్రితం "ప్రజాసాహితి"

## సంపుటులు : 13, 14 సంచికలు : 10, 11, 12, 1, 2, 3

**1990లో** 'ప్రజాసాహితి' మే, జూన్, జులై, ఆగష్టు నెలలకు కలిపి ఒక సంచిక, సెప్టెంబర్ – అక్టోబర్ నెలలకు మరో సంచిక వెలువడ్డాయి.

ఆంధ్ర ప్రజానీకానికి, సాహితీ సాంస్కృతిక కార్యకర్తలకూ, రచయితలకూ కళాకారులకు సన్నిహితులైన హరీంద్రనాథ్ చటోపాధ్యాయ 1990 జూన్ 23న మరణించారు. ఆయన ముఖచిత్రంతో మే, జూన్, జులై, ఆగష్టు సంచిక వెలువడింది. 1990 ఆగష్టు 9 నుండి 15 వరకు కాశ్మీర్ సమస్యపై పిడిఎస్‌యు, డిఎస్ఓ, పిడిఎస్‌యు (విజృంభణ) విద్యార్థి సంస్థలవారు చేపట్టిన ప్రచార కార్యక్రమం సందర్భంగా విడుదల చేసిన "కాశ్మీరీ ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కును బలపరచండి!" అనే కరపత్రాన్ని సంపాదకీయంగా, ప్రచురించారు. 'బహుముఖ ప్రజ్ఞాశీలి హరీంద్రనాథ చటోపాధ్యాయకు మా జోహార్లు' అని స్మరించుకుంటూ 'ప్రజాసాహితి' హరీన్‌దా గురించి రాసిన వ్యాసాన్ని ముద్రించారు. ఆంక్షలు – నిషేధాలు శీర్షికలో 'గుజరాత్ నాటకరంగంపై ఆంక్షలు'ను, దేశ దేశాల్లో శీర్షికలో అమెరికన్ రచయిత హోవర్డ్ ఫాస్ట్ రాసిన 'మా పూర్వీకుడు' కథను ప్రచురించారు. వాడని మందారాలు : 7 శీర్షికలో 'తండ్రి' చిత్రంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన – 'కార్మికులం మేమే, మేమే, కర్షకులం మేమే' – పాటను, ప్రపంచంలో సగం శీర్షికలో – బొలీవియన్ తగరపు గనుల మహిళాసంఘం నాయకురాలు దొమితెల బొరియోస్ ది చుంగార, 'ఇప్పుడెక్కడున్నారు? ఏం చేస్తున్నారు' అనీ, దొమితెలా రాసిన 'మా కథ' నవల నుండి 'దొమితెల భావ పరంపర'ను ప్రచురించారు. కవితాఝరి శీర్షికలో 'వాళ్ళు జీవితాన్ని బీళ్ళు చేస్తారు' – భూమి రాసిన కవితను, పి. తిరుపాలు రాసిన 'మిస్ ఆంధ్రా' కవితను, మధుసూదనరావు రాసిన 'అభిసరణ' కవితను, రఘు రాసిన 'మేరా భారత్ మహాన్' కవితను, వి.సి. రాసిన 'జనాన్ని వదలకు', దివికుమార్ రాసిన 'కలుపు మొక్క', గాలి ఉదయకుమార్ రాసిన 'నా చుట్టూరా పిల్లలు' కె.వి. శివరామకృష్ణ రాసిన 'స్వార్థం – స్నేహం', చల్లపల్లి పూర్ణచంద్రరావు రాసిన 'క్రూరమృగాలు', కవితలను ప్రచురించారు. కరపత్రాలు – కదిలే చరిత్ర శీర్షికలో చలసాని ప్రసాద్ కరపత్రం 'అకాడమీలకు మరో సూటిప్రశ్న'ను, వివేచన శీర్షికలో 'అద్భుతమైన సాహిత్య సిద్ధాంత గ్రంథం – రాల్ఫ్ ఫాక్స్ రచన 'నవల – ప్రజలు" ముందుమాటను కొత్తపల్లి రవిబాబు అనువదించారు.

చైతన్యవాహిని శీర్షికలో విరసం ద్విదశాబ్ది సభల సందర్భంగా జనసాహితి ఇచ్చిన సందేశం, రేఖా ప్రపంచం శీర్షికలో డిమిత్రీమూర్ రష్యను చిత్రకారుడు రైతులను ఆదుకోవటానికి వేసిన పోస్టర్ 'హెల్ప్'ను, జనసాహితి రాష్ట్ర కార్యవర్గ తీర్మానాలను, 'శ్రీకాకుళం' కావ్యంపై చర్చలో భాగంగా పోలవరం నుండి జంజనం ఉదయ్‌కిరణ్ రాసిన వ్యాసాన్ని, సినిమా సమీక్ష శీర్షికలో "ప్రజాపంథాలపై నీడా అతివాదంపై వెలుగు" – 'అడవి దివిటీలు' సినిమా సమీక్షను విజయవాడ నుండి ప్రజామిత్ర రాశారు. బ్రహ్మయ్య స్వామి రాసిన 'దారి ఉన్నదీ – పోరుదారి ఉన్నది' – జనం పాటను, దొమితెల ఫొటోను ఆఖరిపేజీలో ముద్రించారు.

సెప్టెంబరు – అక్టోబరు సంచిక 'అనగా.... అనగా..... మెరిట్' ముఖచిత్రంతో విడుదలయ్యింది. 'రామజన్మభూమా? రాజకీయ మరుభూమా' అనే సంపాదకీయం, చెరుకు సుధాకర్ రాసిన వచన కవిత 'అనగా.. అనగా.... మెరిట్'ను, ఆంక్షలు నిషేధాలు శీర్షికలో యార్లగడ్డ రాఘవేంద్రరావు రాసిన 'ఈనాటిది కాదీ అణచివేత ఆంక్షల చరిత్ర'ను, దేశ దేశాల్లో శీర్షికలో మరాఠీలో సదానంద్ రాగే రాసిన ముప్పన అచలజ అనువాదం చేసిన దైవ సాక్షాత్కారం కథనూ, స్పందన శీర్షికలో జ్యోతుల కిరణ్మయి రాసిన 'సిగరెట్టు కంపెనీలవారు స్త్రీల పట్ల కుమ్మరిస్తున్న అభిమానం' వ్యాసాన్ని, ప్రపంచంలో సగం శీర్షికలో 'స్త్రీల విముక్తి గురించి' – లూషన్ రాసిన వ్యాసాన్ని కొత్తపల్లి రవిబాబు అనువదించారు. కవితాఝరి శీర్షికలో పాతూరి వెంకటేశ్వరరావు రాసిన 'కాళ్ళూ–చేతులూ', చల్లా విశ్వనాథం రాసిన 'మగ్గం కొయ్యపై చేనే'తనువులు", పి.ఆర్.రాసిన 'సూర్యోదయం నిజం', జి. సత్యం రాసిన 'మీ హయాం – మా హయాం', సూర్యచంద్రరావు రాసిన 'ఫిబ్రవరి 1990', ప్రతీక రాసిన 'తోడుకావాలి', నగారా రాసిన 'చరిత్ర క్షమించదు', ఎ.ఎన్. రాసిన 'అవి పువ్వులే', కవితలున్నాయి. మండే అరుణకుమార్ రాసిన 'శోష'లిస్టు రష్యా నేటి సంస్కృతి!' వ్యాసం, తెలుగు కథానికరంగంలో విశేష కృషి చేసి ప్రజాసాహిత్యాన్ని సృష్టించిన బీనాదేవి 5–9–90న మరణించారు. ఆయన్ను స్మరించుకుంటూ 'కన్నీళ్ళొచ్చాయి'ని ప్రచురించారు. రాల్ఫ్ ఫాక్స్ రచించిన 'నవల–ప్రజలు' సిద్ధాంత గ్రంథానికి కొత్తపల్లి రవిబాబు అనువాదం ఈ సంచిక నుండీ ధారావాహికగా ప్రారంభించారు. స్పందన శీర్షికలో 'జన చైనా'లో ఆధునీకరణ వికృత ఫలితాలు వ్యాసాన్ని, చివరి అట్ట మీద బ్రహ్మయ్య రాసిన 'ప్రతిభ' జనంపాటను ప్రచురించారు. ✪

# ఇథియోపియా యువగాయకుడు, ఒరోమో తెగ ప్రజానాయకుడు హచాలు హండీసా హత్యను ఖండిద్దాం!

**ఇథియోపియాలో** ఒరోమో తెగ ప్రజల పోరాటాన్ని సమర్ధిస్తూ, వారిని ఉత్తేజపరుస్తూ ఉద్యమించిన 34 ఏళ్ళ యువ వాగ్గేయకారుడు హచాలు హండీసాను ఈ ఏడాది జూన్ 29న రాజధాని నగరమైన అడ్డిస్ అబాబాలో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. ఆయన అడ్డిస్ అబాబాకు 100 కి.మీ. దూరంలో వున్న ఆంబో పట్టణంలో 1985లో జన్మించారు.

తన కుటుంబంతోపాటు పశువుల పోషణ బాధ్యత చూసుకుంటూ, పాఠశాలల్లో పాటలు పాడుతూ తన బాల్యం గడిపాడు. డాక్టరును చేయాలనుకున్న తండ్రి కోరిక నెరవేరలేదు. పాటల రచయితగా, గాయకునిగా స్వయం కృషితో గుర్తింపు పొందాడు.

ఈశాన్య ఆఫ్రికాలో అతి ప్రాచీన నాగరికత గల దేశం ఇథియోపియా. దీనిలో ఎన్నో తెగల ప్రజలున్నారు. ఒక్కో తెగకు ఒక్కో భాష వుంది. తొమ్మిది పరిపాలనా ప్రాంతాలుగా విభజింపబడి వుంది. 1974లో హెయిలీ సెలాసీ అనే చక్రవర్తి పాలన అంతమొందించి వర్కర్స్ (మార్క్సిస్టు) పార్టీ నాయకత్వంలో 1991 వరకు మెంగిస్తూ హైతే మారియం పరిపాలించాడు. ఆ పాలన క్రమంగా నియంతృత్వం వైపు ప్రయాణించి, ప్రజలపై అణచివేత విధానాలు కొనసాగించిన ఫలితంగా 1991లో మెలెస్ జానావి అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. మెలెస్ దేశంలో అన్ని తెగల ప్రజలలో ఐక్యత సాధించడానికి కృషిచేశాడు. కాని తిగ్రాయి తెగవారి ఆధిపత్యం క్రమంగా పెరిగిపోతుండటం వల్ల మిగిలిన ప్రాంతాల్లో వున్న తెగలలో అసంతృప్తి పెరిగి ఘర్షణలు ప్రారంభమయ్యాయి. మెలెస్ 2012లో మరణించగా, తర్వాత ప్రధానమంత్రి కూడా మెలెస్ చేబట్టిన అడ్డిస్ అబాబా పాలనా ప్రాంత విస్తరణ పథకాన్ని అమలుపరచడానికి చర్యలు చేపట్టడంతో, ఒరోమో తెగవారు ప్రతిఘటించారు. ఈ విస్తరణ వల్ల ఒరోమోల కేంద్రమైన అదామా పట్టణాన్ని ఒరోమియా ప్రాంతం పోగొట్టుకుంటుంది. ఒరోమియా భాషను నిర్లక్ష్యం చేస్తారు. జాతీయ భాష ఐన 'అమ్హారా' మాట్లాడాల్సి వస్తుంది. కనుక ఒరోమియా ప్రజలు తమ నిరసనలు తెలియచేస్తున్నారు.

2003లో తన 17వ ఏట హచాలు ఒక నిరసన ప్రదర్శనలో పాల్గొని ఐదేళ్ళు జైలుపాలయ్యాడు. "నేను జైలులోనే పాటలు రాయడం నేర్చుకున్నాను. అంతకు ముందు నాకు పాటలు రాయడం తెలియదు" అని చెప్పాడు. జైలు నుండి విడుదలైన ఏడాది తర్వాత జైలులో రాసిన 9 పాటలతో 2009లో తన మొదటి పాటల ఆల్బమ్‌ను విడుదల చేశాడు. 2014లో చెలరేగిన ప్రభుత్వ వ్యతిరేక నిరసనలో చురుకుగా పాల్గొని, ఒరోమో తెగ ప్రజల స్వరపేటికగా మారాడు. ఫలితంగా 2018లో ప్రధానమంత్రి హైలేమారియం రాజీనామా చేసాడు.

అమ్‌హారా తెగవారి ప్రాంతంలో కూడా నిరసనలు ప్రదర్శనలు ప్రారంభమై, ఒరోమియా, అమ్‌హారాలలో అక్టోబర్ 2, 2016లో పరాకాష్టకు చేరి, 55 మంది మరణానికి దారితీసాయి. ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ఎందరో రాజకీయ కార్యకర్తలను, నిరసనకారులను, పాత్రికేయులను, మానవ హక్కుల సంస్థ సభ్యులను ప్రభుత్వం అరెస్టు చేసింది. 2018లో ఒరోమో తెగకు చెందిన అబీ అహ్మద్ మొదటి ప్రధానమంత్రి అయ్యాడు. రాజకీయ ఖైదీలను, ప్రతిపక్ష గ్రూపు వారిని విడుదల చేసి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు పెడతానన్నాడు.

2017లో హంచాలు చేసిన ప్రసిద్ధ పాట కచేరీ కొన్ని తెగలపై జరుగుతున్న హింసాకాండను, విస్తాపన గురించి ప్రజల్లో చైతన్యం రగిలించింది. దానితో ఈ గాయకుడు ఒరోమో ప్రజల ఆకాంక్షకు అనధికార ప్రతినిధిగా మారాడు. 2015లో ఆయన పాడిన పాట 'మాలన్ జిరా' (ఏం బతుకురా నాది!) ఇప్పటికీ నిత్యనవీనంగా ప్రజలు పాడుకుంటున్నారు. ఈ పాటలో ఆయన ఒరోమా ప్రజల సమస్యలపై కేంద్రీకరించినా, దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలవారి సంగీత బాణీలతో కూడి వుండటంతో, ఇథియోపియన్లందరికీ ప్రీతిపాత్రమైంది. ఈయన పాటల్లో కవిత్వమూ, సాహిత్యపు గుబాళింపు కూడి, తేలిక పదాల్లో సార్వభౌమత్వం, స్వేచ్ఛ గురించి లోతైన భావాలను, సత్యాలను చెప్పడం చేత ఇథియోపియన్లు ఈయన సంగీతాన్ని అభిమానిస్తున్నారు.

హచాలు తన ప్రాసతో కూడిన గేయాలలో ఒరోమో ప్రజలను పాలకులు నిర్లక్ష్యం చేయడాన్ని విమర్శించాడు. 2015 నాటి పాట 'మాలన్ జిరా' (ఎక్కడున్నాం మనం?)లో ఇథియోపియాలో అనంతంగా సాగుతున్న అణచివేతపట్ల దుఃఖాన్ని చిత్రించడమేకాక అడ్డిస్ అబాబాపై తమకున్న చారిత్రక అధికారాన్ని కూడా తెలియచేశాడు. ఇక 2017లో 'జిర్రా' (మనం ఇక్కడ వున్నాం!) పాట ద్వారా తామెక్కడ వున్నారో, భవిష్యత్తులో వారేమి చేసి తీరాలో ఒరోమో ప్రజలకు జ్ఞాపకం చేయాలన్నది తన ఆకాంక్ష అన్నాడు. జనవరి 2018లో ఒక ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతూ, "అవును – సంగీతం ద్వారా మనం రాజకీయ, సామాజిక, ఆర్థికరంగాలేగాక, సమాజపు జీవితాన్ని కూడా విశ్లేషించవచ్చని నేనను కుంటున్నాను. ప్రతిఘటనా పాటలు పాడుతున్నప్పుడు వ్యక్తిగతంగా నాకెంతో సంతోషంగా వుంటుంది. నేను సమాజంలో ఒక భాగం గనుక అటువంటి పాటల గానం నాలో నిబిడీకృతమై వుంది." అని చెప్పాడు.

"ఒక అణచబడ్డ సమాజం వుంటే, నేనూ అణచబడ్డవారిలో ఒకడినైతే, నా బానిసత్వానికి వ్యతిరేకంగా నా ఆశాభంగాన్ని సంగీతం ద్వారా వెల్లడిస్తాను. కళ అనేది సత్యాన్ని తెలియచేసేది, నిరంకుశ పాలనను బట్టబయలు చేసేది" అన్నాడు హచాలు. అంతేగాక 'ఎస్సా జిర్రా?' (నువ్వెక్కడున్నావ్?) అనే కొత్త పాటను త్వరలో బయటకు తెచ్చే ప్రయత్నంలో వున్నానన్నాడు.

అన్ని ప్రజాస్వామ్య వ్యతిరేక దేశాల్లోలాగానే, ఇథియోపియాలో కూడా ప్రజలను చైతన్యపరిచే ప్రజా కళాకారులపై నిర్బంధం, అణచివేత కొనసాగుతోంది. గతంలో 2008లో ఇథియోపియాకు చెందిన సుప్రసిద్ధ

గాయకుడు టడ్డీ అఫ్రోను హత్యానేరంపై జైల్లో పెట్టారు. అయితే ఆ ఆరోపణ ఋజువు చేయలేక విడుదల చేశారు. 1974–1991 సంవత్సరాల మధ్య కాలంలో తమపై దాడులు తప్పించుకోడానికి సంగీతకారులు కొందరు అజ్ఞాతంలోకి, మరికొందరు ఇతర దేశాలకు వెళ్ళారు. కాని హచాలు ప్రవాసానికి పోకుండా, దేశంలోనే వుండి యువతను తమ హక్కులపై పోరాడమని చైతన్యపరిచాడు.

2015లో విడుదల చేసిన 'ఏం బతుకురా నాది!' పాటలో హచాలు, ఇథియోపియా చరిత్రలో ఒరోమో ప్రజల పాత్ర, వారు చేసిన పోరాటం సంక్షిప్తంగా చిత్రించాడు. అడ్డిస్ అబాబా పట్టణ పరిధులు విస్తరించే పథకం వల్ల ఒరోమో ప్రజలు పోగొట్టుకోబోతున్న తమ భాష, సంస్కృతి మొదలగు విషయాలను ఈ పాట వివరిస్తుంది. సోమాలి ప్రాంతంలో తెగల మధ్య జరిగిన హింసాకాండలో విస్తాపన చెందిన ఏడు లక్షల మంది ఒరోమో తెగ ప్రజల సహాయార్థం నిధి సేకరణకై 2017 డిసెంబరు 10న హచాలు ఒక బ్రహ్మాండమైన గాన కచేరి అడ్డిస్ అబాబాలో నిర్వహించాడు. హచాలు పాటలు ఒరోమోల ఆశలు, నిరాశలు ప్రతిభావంతంగా చిత్రించాయి. అవోల్ అల్లో అనే లెక్చరర్ మాటల్లో చెప్పాలంటే, "హచాలు ఒరోమో విప్లవానికి స్వరం లాంటివాడు. గేయ రచనలో ప్రజ్ఞావంతుడు. ఒరోమో ప్రజల ఆశలు, ఆకాంక్షలు పుణికి పుచ్చుకున్న క్రియాశీల కార్యకర్త."

ఒరోమో ప్రాంతమంతా హచాలు హత్యకు నిరసన తెలియచేస్తూ రెండు రోజులపాటు జరిగిన అల్లర్లలో 168 మంది చనిపోయారు. ఒరోమేతర తెగవారి చర్చీలు, ఇళ్ళు, పాఠశాలలు, హోటళ్ళు తగుల బెట్టారు. ఆయన అంత్యక్రియలు సందర్భంగా జరిగిన అల్లర్లలో దాదాపు 80 మంది మరణించారు. నిరసనకారులు హరార్ పట్టణంలోని ప్రిన్స్ మైకేల్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. జూన్ 30న చక్రవర్తి హెయిలీ సెలాసీ విగ్రహాన్ని కూల్చేశారు. ఈ నిరసన ఆందోళనలో హచాలు మామను చంపేశారు.

హచాలు తన రెండవ ఆల్బమ్‌ను అమెరికా పర్యటన సందర్భంగా 2013లో విడుదల చేశాడు. 2017 నాటి 'జిర్రా' (మనం ఇక్కడ ఉన్నాం) ఆల్బంలోని ఈ పాటలో ఒరోమో తెగ వారి సహనశీలత, ఆత్మగౌరవం, చురుకుదనం తెలియచేశాడు. అంతేగాక ఒరోమో ప్రజలు ఎక్కడ వున్నారో, భవిష్యత్తులో వారి కర్తవ్యమేమిటో ఆ పాటలో చెప్పాడు. ఈ పాటలో "బయట నుండి సహాయం కోసం వేచి వుండకండి. అటువంటి సహాయం వస్తుందనుకోవడం ఒక కల. మీ అశ్వాల నధిరోహించండి – పోరాడండి. మీరు రాజ్యాధికారానికి దగ్గర్లో వున్నారు" అనే సందేశాన్నిచ్చాడు. 2015 నాటి పాటలు ఒరోమోల విస్తాపనకు అంతం పలకాలనే డిమాండ్ చేశాయి. ఆనాటి నిరసన ఉద్యమానికి జాతీయ గీతాలుగా పనికి వచ్చాయి.

ఎట్టకేలకు 2018లో ఒరోమో తెగ అబియీ ప్రధానమంత్రి అయ్యారు. అతిథిగా వచ్చిన ఎరిట్రీయా దేశపు అధ్యక్షుడి గౌరవార్థం ఒక కచేరిని చేయమని హచాలును ప్రభుత్వం ఆహ్వానించింది. అయితే గతంలోలాగానే తన స్వేచ్ఛా ప్రియత్వాన్నీ, నిర్భీతిని ప్రదర్శిస్తూ, తూర్పు ఇథియోపియాలో ఒరోమో, సోమాలి తెగల మధ్య జరిగిన సంఘర్షణలో మరణించినవారికి న్యాయం జరగాలనీ, వారి కుటుంబాలు దుఃఖంలో మునిగి వుండగా గానకచేరీ పెట్టడంలోని విజ్ఞతను ప్రశ్నిస్తూ పాటలు పాడాడు. ఆ తరువాత ప్రభుత్వ అధికారులు ఆ సందర్భంగా హచాలు "అసందర్భమైన" పాటలు పాడినట్లు విమర్శించినా, ప్రజల్లో మాత్రం గొప్ప ఆదరణ లభించింది.

"సంగీతమే నా జీవితం.
అది నాకు స్నేహితులనూ, శత్రువులనూ
తెచ్చిపెట్టింది –" అనే హచాలు తన అఫాన్ ఒరోమో భాషలోనే పాడినా, ఆ పాటలన్నీ ఇథియోపియాకు మరింత రాజకీయ స్వాతంత్ర్యాన్ని కాంక్షించేవే కావడంచేత అన్ని తెగలవారిలోనూ ఆయనకు అభిమానులు ఏర్పడ్డారు.

"నా ప్రజలతో సంభాషించడానికి
సంగీతం నాకొక సాధనం –
దీని ద్వారా నా గుండె లోతుల్లోని
భావాలను వ్యక్తీకరిస్తాను" అని ప్రకటించిన హచాలు అంత్యక్రియల వద్ద, ఆయన అభిమానులు ఒరోమియా జెండాలు పట్టుకొని "ఏదో ఒకరోజున మేం స్వేచ్ఛ సాధిస్తాం! హచాలూ! నీవు చిందించిన రక్తం వృథా కాదు" అని నినాదాలు ఇచ్చారు. ✪



## బొర్రా సత్యనారాయణగారు 30వ వర్ధంతి

**కమ్యూనిస్టు** సత్యంగా అందరకు పరిచయమైన బొర్రా సత్యనారాయణగారిది గుంటూరు జిల్లా నిజాంపట్నం మండలం బొర్రావారిపాలెం. వారు 1950 – 1960లలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా రేపల్లె తాలూకాలో పనిచేశారు. తన 60వ ఏట 1990 ఆగస్టు 18వ తేదీన అనారోగ్యంతో మరణించారు. ఆయన జ్ఞాపకార్థం, వారి కుమారుడు బొర్రా గోవర్ధన్ (నగరం) 25,000 రూపాయలు, ప్రజాసాహితి శాశ్వతనిధికి విరాళం ఇచ్చారు. సత్యంగారి 30వ వర్ధంతి సందర్భంగా వారిని జ్ఞాపకం చేసుకుంటున్నాము.

ప్రజాసాహితి

# చైతన్యవాహిని

## "వలస భారతం" వచన కవితాకావ్యం అన్‌లైన్‌లో 9-8-2020న జనసాహితి ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ

కరోనా, లాక్‌డౌన్ వంటి వాటితో మన వైద్య ఆరోగ్య, ఆర్థిక వ్యవస్థలోని డొల్లతనం బయటపడింది. వలస కూలీల వెతలే ఇందుకు నిదర్శనం. ఉపాధి, ఆదాయం, కొనుగోలుశక్తి ఈ మూడింటి మధ్య సంబంధాన్ని గుర్తించనంతకాలం, స్వావలంబన సాధించనంతకాలం అసమానతలు అంతంకావు. ప్రభుత్వాలు తాత్కాలిక పథకాలు, ఉపశమనాలేగాని పరిష్కారం కాదని ప్రముఖ సాహితీ విమర్శకులు డా॥ ఎ.కె. ప్రభాకర్ ప్రసంగించారు. జనసాహితి రాష్ట్ర కార్యవర్గసభ్యులు డా॥ జి.వి. కృష్ణయ్య రచించిన "వలస భారతం" వచన కవితాకావ్యాన్ని 9-8-2020న సాయంత్రం ఆన్‌లైన్‌లో ఆవిష్కరణ కార్యక్రమంలో సమీక్షించారు. ఇందులో కేవలం వలస కార్మికుల కష్టనష్టాలను గూర్చి వివరించడమే కాక, వలసల ఉత్పత్తి కేంద్రాలెక్కడవని ప్రశ్నిస్తూ, కరోనా వంటి వైరస్‌లు పుట్టుకకు పర్యావరణ కాలుష్యం, పెట్టుబడిదారుల లాభాపేక్ష, నాగరికత చాటున దాగిన నిర్లక్ష్యం ఎలా దోహదకారులుగా వున్నాయో వివరించారన్నారు. జనసాహితి పూర్వ అధ్యక్షులు, విమర్శకులు డా॥ సూర్యసాగర్ అనంతపురం నుండి పుస్తకం ఆన్‌లైన్‌లో ఆవిష్కరించారు. పద్దెనిమిది పర్వాలున్న భారతంతో పోల్చదగినదిగా వర్ణించారు. 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకులు కొత్తపల్లి రవిబాబు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. రాష్ట్రం నలుమూలల నుండి సాహిత్యాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఛాయరాజ్ వర్ధంతి సభ

20-09-2020 ఆదివారం నాడు స్కైప్ యాప్ ద్వారా రాష్ట్ర స్థాయిలో ప్రముఖ ప్రజా రచయిత, సామాజిక ఉపాధ్యాయుడు ఛాయరాజ్ 7వ వర్ధంతి సభ జనసాహితి నిర్వహించింది. సాయంకాలం గం.6 కు ప్రారంభమైన ఈ సమావేశం రాత్రి గం.9 ల వరకూ కొనసాగింది. ఈ సమావేశానికి 'ప్రజాసాహితి' పత్రిక సంపాదకుడు పి.యస్. నాగరాజు అధ్యక్షత వహించారు. ముందుగా సూర్యసాగర్ ఛాయారాజ్ నిబద్ధత గూర్చి మాట్లాడగా, కొత్తపల్లి రవిబాబు ఛాయారాజ్ ప్రజాసాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నిరంతరం కృషిచేశారని తెలియజేశారు. ఏ.కే ప్రభాకర్ మాట్లాడుతూ ఛాయరాజ్‌గారి 'శ్రీకాకుళం' కావ్యం ప్రత్యామ్నాయ రాజకీయాలను చర్చకు పెట్టిన కావ్యమే గాక, చారిత్రిక రాజకీయ కావ్యమని విశ్లేషించారు. జనసాహితి రాష్ట్ర అధ్యక్షులు దివికుమార్ ఛాయారాజ్ సాహిత్య విశిష్టతను గూర్చి వివరించారు. ఎ.పి.టి.యఫ్ రాష్ట్ర అధ్యక్షుడు భానుమూర్తి ఛాయరాజ్ 'కారువాకి' నవలను విశ్లేషించారు. శంకర్రావు ఛాయరాజ్ సాహిత్యంలో విద్యా సంబంధ విషయాలపై మాట్లాడారు. సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో అత్యధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు, ప్రజాసంఘాలు, కళాకారులు, విద్యార్థులు, స్త్రీ సంఘటన పత్రికా బాధ్యులు, ఛాయరాజ్‌గారి కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు. ✪

# ఈ పుస్తకాలు అందాయి

**నిరంతరం – టాగూర్ తిరిగిన దారుల్లో.. యాత్రాకథనం: రచయిత – ఆకెళ్ళ రవిప్రకాశ్**

విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ సాహిత్యానికి ఆకర్షితుడై – ఆయన సంచరించిన దారుల్లో ప్రయాణం చేసి – ఆ సాహిత్య సృజనను అనుభూతించాలనే సంకల్పంతో ఆకెళ్ళ రవిప్రకాశ్ చేసిన యాత్రా కథనం ఈ పుస్తకం. శాంతినికేతన్, దక్షిణ బెంగాల్, ఉత్తర బెంగాల్, సిక్కిం మంచు పర్వతాల్లో ప్రయాణించి, రవీంద్రుడు సాగించిన జీవన యానపు చరిత్రను ఆయన అనుభవాలను 'నిరంతరం'లో రచించారు.

1/8 డెమ్మీలో పుటలు : 104, వెల : రూ.100/- ప్రచురణ : జూలై 2020.

**చంద్రుణ్ణి చూపించే వేలు – సాహిత్య వ్యాసాలు : రచయిత – ఆకెళ్ళ రవిప్రకాశ్**

రవిప్రకాశ్ సాహిత్య అనుబంధాన్ని, వివిధ రచయితల కవిత్వం, కథలు, నవలలు మొదలైన సాహిత్యాన్ని సమీక్షిస్తూ రాసిన వ్యాసాల సంపుటి ఇది. కవి ఇస్మాయిల్ సాహిత్యం గురించీ, విన్నకోట రవిశంకర్, రవూఫ్, బి. ప్రసాదమూర్తి, దేవదానం రాజు, వాడ్రేవు వీరభద్రుడు, కేరళ రచయిత తకళి శివశంకరం పిళ్ళై, బొల్లోజు బాబా, బి.వి.వి. ప్రసాద్, ప్రసేన్, అంగలకుర్తి విద్యాసాగర్‌ల సాహిత్యాన్ని సమీక్షిస్తూ రాసిన వ్యాసాలతోపాటు రచయిత కవిత్వ నేపథ్యం గురించి కూడా రాశారు. సాహిత్య సమీక్షతోపాటు ఆ కాలపు సాహిత్యకారులు, అనుబంధాలు, నేపథ్యాలను వివరిస్తూ సమీక్షా కథనాలతో ఈ సాహిత్య వ్యాసాలు ఉన్నాయి.

1/8 డెమ్మీలో 104 పుటలు. వెల : రూ.100/- ప్రచురణ : జూలై 2020.

**అరకు అనుభవాలు : రచయిత – ఆకెళ్ళ రవిప్రకాశ్**

రవిప్రకాశ్ ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంస్థకు వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా విశాఖ జిల్లాలో కొనసాగిన కాలంలో అరకు ప్రాంత ఆదివాసీల జీవన విధానాన్ని, అరకు కాఫీ ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో చేసిన రచన ఇది.

1/8 డెమ్మీలో 104 పుటలు. వెల : రూ.100/- ప్రచురణ : జూలై 2020.

పై మూడు పుస్తకాలు లభించు చోటు : అనేక – విజయవాడ, నవోదయ బుక్ సెంటర్, నవతెలంగాణ, నవచేతన బుక్ సెంటర్స్ – హైదరాబాద్. ✪




**తరిమెల అమరనాథ్‌రెడ్డి ఆరు రచనలు :**

1. **కమ్యూనిస్టు ఉద్యమంలో తరిమెల – మా నాన్న ఎల్లూరి శ్రీరామిరెడ్డిగారి మాటల్లో :** 1/8 డెమ్మీ. 14+172 పుటలు. వెల : రూ. 75/–
2. **మా తరిమెల కథలు :** 1/8 డెమ్మీ. 10+100 పుటలు. వెల : రూ. 50/–
3. **అమర్ ఆలోచనలు :** 1/8 డెమ్మీ. 44+60 పుటలు. వెల : రూ. 50/– పై మూడు పుస్తకాలూ ప్రథమ ముద్రణ : 2019.
4. **అమర్ టాక్స్ – 'సం'భాషణలు :** 1/8 డెమ్మీ. 16+184 పుటలు. వెల : రూ. 50/–
5. **అమర్ హార్ట్ – 'మానవత' అనుభవాలు :** 16+252 పుటలు. వెల : రూ. 100/–
6. **అమర్ హ్యూమర్ – నవ్వుతూ బతకాలి :** 20+188 పుటలు. వెల : రూ. 50/– పై మూడు పుస్తకాలూ ప్రథమముద్రణ : 2020. ప్రతులకు : తరిమెల అమరనాథరెడ్డి, 13–2–202 రామచంద్రనగర్,

అనంతపురం – 515001. ఫోన్ : 93467 35480; 93937 23881. మెయిల్ : amar.tarimela@gmail.com

అమరనాథరెడ్డి ఇంటిపేరు ఎల్లూరి. కాని తరిమెల గ్రామంతోనూ, తరిమెల నాగిరెడ్డితోనూ, వామపక్ష భావాలతోనూ వున్న విడదీయలేని సాన్నిహిత్యం వల్ల తన ఇంటిపేరును తరిమెలగా చెప్పుకోవడమే ఆయనకు ఇష్టం.

అమర్, సలీంలు కలసి గత 26 సంవత్సరాలుగా 'మానవత' అనే సంస్థ ద్వారా అనంతపురంలో రక్తదాన ఉద్యమంతోపాటు మూఢనమ్మకాల వ్యతిరేక ఉద్యమంలో చురుకుగా పనిచేస్తున్నారు. ఈ సీరియస్ కర్తవ్యాలను చేబట్టిన అమర్‌లో వున్న సేవా దృక్పథంతో పాటు హాస్యప్రియత్వం ఆయనను ప్రజలకు చేరువ చేసింది. కొందరు తాము నవ్వకుండా ఇతరులను నవ్విస్తారు తమ హాస్య చతురతతో. కాని అమర్ ఎప్పుడూ చిరునవ్వు చెదరకుండా ఇతరులను నవ్విస్తుంటారు. వారి ఉద్యమ అనుభవాలన్నిటినీ గుది గుచ్చి అనంతపురం మాండలీక పదాలతో ఈ పుస్తకాలలో వివరించారు. మొదటి రెండు పుస్తకాలలో నాగిరెడ్డి గురించీ, ఆయన అడుగుజాడల్లో నడచిన తన తండ్రి శ్రీరామిరెడ్డి గురించీ, కమ్యూనిస్టు ఉద్యమం గురించీ చాల విలువైన సమాచారం అందించారు. అమర్ రచనాశైలి విలక్షణమైనది. మన ఎదురుగా నిలబడి మాట్లాడినట్లు వుంటుంది. ఎన్నెన్నో సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అంశాలపై ఆయన రాసిన ఈ ఆరు పుస్తకాలూ సామాజిక ఉద్యమాలలో పనిచేస్తున్నవారూ, పనిచేయాలనుకునేవారు తప్పక చదివి తీరాలి.

**ఒక ఆదివారం సాయంత్రం : ఇంకా ఇతర కవితలు : రచయిత – విజయ్ కోగంటి**

నిండు వేసవిలో చల్లని, సన్నని వానజల్లులా వచ్చింది విజయ్ కవితాసంపుటి. వచనపు తుంటలనే కవితలుగా పాఠకులకు అందిస్తున్న 'కవులూ', పత్రికలూ వచన కవిత్వపు నిజమైన సొగసునూ, వచనంలో కవితాత్మకతనూ ఈ సంపుటిలో చూడగలరు.

'తోస్తే గానీ తెరుచుకోని తలుపులా / మళ్ళీ బద్ధకంగా మేల్కొంది / మరో యీ వుదయం' అంటున్నాడు కవి. కొత్తదనం ఏమీ లేని ఉగాది రాకను వర్ణిస్తూ, స్త్రీ మూర్తి గురించి చెబుతూ. 'ఆమె నిను గుండెలో చుట్టి దాచుకునే / ఓ మొక్కజొన్న పొత్తు'.... 'తనలో తానే వుడికి / నీ కడుపు నింపే అన్నపు గిన్నె' అని సరికొత్త భావచిత్రంతో మనముందుకు వచ్చిన ఈ కవి 'దాస్య శృంఖలాల్ని / తెంచాల్సిన లక్ష్యాల గురించి.... పోరాట యోధుల్ని స్మరించాల్సిన అవసరం గురించి గుర్తు చేస్తున్నాడు. ముందుమాట రాసిన పాపినేని శివశంకర్‌తో గొంతు కలుపుతూ సామాజికత నిండిన కవితలు ఎక్కువగా రాయాలని ఈ కవిని కోరుతున్నాం.

1/8 డెమ్మీలో 96 పుటలు. 51 కవితలు. వెల : రూ. 130/– ప్రథమముద్రణ : జనవరి 2020. ప్రతులకు : డా॥ కోగంటి విజయబాబు, 26–38–143, కావ్య హౌస్, 3వ లైను, శ్రీరామనగర్, గుంటూరు – 522006. ఫోన్ : 88018 23244. drvijaykoganti@gmail.com

**నుడి–నానుడి : రచయిత – బి.ఏ.బంగారయ్య, సంపాదకులు : జయధీర్ తిరుమలరావు.**

సరిఅయిన తెలుగు నుడి, నానుడిని పరిచయం చేయటానికి, రాయటానికి పురికొల్పే ఉద్దేశ్యంతో ఈ పుస్తకాన్ని ప్రచురించారు. తెలుగుని బతికించటానికి దేశీయమైన బహుముఖ ప్రణాళికగా దీనిని జయధీర్ అభివర్ణించారు. 'తెలుగు నుడి' అధ్యాయంలో మూడు వ్యాసాలు, 'తెలుగు నానుడి' అధ్యాయంలో మరో మూడు వ్యాసాలుతో పాటుగా మరో 4 అధ్యాయాలు ఈ సంకలనంలో వున్నాయి.

1/8 డెమ్మీలో 194 పుటలు. వెల : రూ. 200/– ప్రచురణ : జూలై 2018. ప్రతులకు : సాహితీ కేంద్రం, 402, ఘరోండా అపార్టుమెంట్స్. ఉస్మానియా యూనివర్శిటీ మెయిన్‌గేట్–1 దగ్గర, డి.డి.కాలనీ, హైదరాబాద్ – 500007.

**కులం – ఆర్థిక పునాది : రచయిత – కె.ఎస్.చలం**

కులం సామాజిక, మానవశాస్త్ర సంబంధమైనదనే అపోహ విద్యా పరిశోధనలలో ప్రబలంగా వుండటాన్ని గమనించిన రచయిత, అర్థశాస్త్రంలో మార్క్స్ చెప్పే విశ్లేషణ ఉపయోగపడుతుందని గ్రహించి రాసిన పుస్తకం ఇది. 6 అంశాలతో వున్న ఈ పుస్తకంలోని విషయాలపై రచయిత చర్చను ఆహ్వానించారు.

1/8 డెమ్మీలో 64 పుటలు. వెల : రూ. 50/–, ప్రచురణ : అక్టోబర్ 2018. ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

**కుసుమ ధర్మన్న కవి రచనలు – దళిత దృక్పథం :** పరిశోధన – మద్దుకూరి సత్యనారాయణ.

తెలుగు సమాజంలో దళిత సాహిత్యకారుడు కుసుమ ధర్మన్న కవి రచనల్లో వ్యక్తమయిన దళిత దృక్పథాన్ని విశ్లేషిస్తూ వచ్చిన సిద్ధాంత వ్యాసం ఇది. ఇందులో అయిదు అధ్యాయాలున్నాయి. ధర్మన్న కవి జీవిత విశేషాలు, హరిజనోద్యమం – సాహిత్యం, నల్లదొరతనం గేయం, హరిజన శతకం, వారు రాసిన వచన రచనల్లోని దళిత దృక్పథం, వ్యాసాలు, ఉపన్యాసాలు మొదలగునవి పొందుపర్చారు.

1/8 డెమ్మీలో 112 పుటలు. వెల : రూ.75/– ప్రచురణ : సెప్టెంబర్ 2016. ప్రతులకు : అన్ని ప్రజాశక్తి పుస్తకాల షాపులలో.

**గుంటూరు సీమ సాహిత్య చరిత్ర : రచయిత : పెనుగొండ లక్ష్మీనారాయణ.**

స్థానిక సాహిత్య చరిత్రలు, స్థానిక చరిత్ర రచనకు బహుముఖంగా ఉపయోగపడతాయి. ఇటీవల తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణలోని వివిధ జిల్లాల సాహిత్య చరిత్రలను ప్రచురించడం ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాల సాహిత్య చరిత్ర పుస్తక రూపంలో వచ్చినవి చాల తక్కువ. వ్యాసరూపంలో ప్రస్తావించిన సందర్భాలే కనబడతాయి.

అరసం జాతీయ అధ్యక్షులలో ఒకరైన పెనుగొండ గుంటూరు సీమ సాహిత్య చరిత్రను రచించే భారం తలకెత్తుకొని, ఎంతో పరిశోధన చేసి, పలు ఆధారాలు సేకరించి – మొత్తం మీద సఫలీకృతుడయ్యారు. ఆయనే 'నా మాట'లో అన్నట్లు "ఇటువంటి రచనలెప్పుడూ అసంపూర్ణాలే!.... నిరంతరం కొనసాగించాల్సిన సాధన, శోధన, పరిశోధనాప్రక్రియ యిది."

మూడు భాగాలుగా సాగిన ఈ పరిశోధన – సాహిత్య విద్యార్థులందరికీ ఒక పాఠ్యపుస్తకం. తాము పుట్టకముందు జరిగిన సాహిత్య కృషి, ఆనాటి రచయితల జీవితాలు, అప్పటి ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఈనాటి యువ రచయితలకు మార్గదర్శకంగా పనికివస్తాయి.

1/8 డెమ్మీలో 300 పుటలు. వెల : రూ. 200/– ప్రథమముద్రణ : జనవరి 2020. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం – గుంటూరుజిల్లా శాఖ వారి 62వ ప్రచురణ. ప్రతులకు : విశాలాంధ్ర – అన్ని శాఖలలోనూ. లేదా అరసం, 101 బృందావన్ పార్క్ రెసిడెన్సీ, 7వ లేన్, ఎస్.వి.ఎన్. కాలనీ, గుంటూరు – 522006. ఫోన్ : 92915 30714.

**అసత్య ప్రేలాపనలు – సైన్సు సమాధానాలు : రచయిత : బాలాజీ (కోల్‌కతా) – జనవిజ్ఞానవేదిక ప్రచురణ.**

బ్యాంకు ఉద్యోగి అయిన బాలాజీ, అభ్యుదయ దృక్పథంతో టిటాగడ్‌లో 'ముందడుగు' సంస్థనూ, పత్రికనూ నడుపుతూ, తెలుగు పత్రికలలో అభ్యుదయకరమైన సినిమాల సమీక్షలు రాస్తూ తెలుగు వారందరికీ పరిచయమయ్యారు.

ఇటీవల హిందూమతం లేక ధర్మం పేరుతో దళితులపై, మైనారిటీలైన ముస్లిములపై దాడులు చేయడం, సనాతన సంస్కృతి పేరుతో మూఢవిశ్వాసాలను ప్రచారం చేయడం ముమ్మరమైంది. ప్రగతిశీలవాదులు వీటిని సమర్ధవంతంగా త్రిప్పికొడుతున్నారు. ఆయా సందర్భాలలో ఇటువంటి అంశాలపై బాలాజీ వివిధ పత్రికలలో రాసిన 26 వ్యాసాల సంపుటి ఇది. డా॥ వి. బ్రహ్మారెడ్డి అభినందన రాస్తూ "నిజమైన దేశభక్తుల"ందరూ అధ్యయనం చేయదగిన పుస్తకం యిది – అన్నారు. 'సైన్స్–హేతువాదం' మాసపత్రిక సహాయ సంపాదకుడు సమతా శ్రీధర్, దీన్ని పరిచయం చేస్తూ 'అసత్య ప్రేలాపనపై కొరడా ఝళి' అన్నారు.

1/8 డెమ్మీలో 152 పుటలు. వెల : రూ. 75/– ప్రథమముద్రణ : ఫిబ్రవరి 2020. ప్రతులకు : జంపా కృష్ణకిశోర్, 20–3/1–91ఇ, సాయితేజ టవర్స్, టి.ఎఫ్–3, వి. బ్లాక్, అయోధ్యనగర్, విజయవాడ – 520003. ఫోన్ : 83419 11718. jampavisiso@gmail.com

**పరిపూర్ణతకు పదిమెట్లు :** (దశపారమితలు) The Perfections **రచన : బొర్రా గోవర్ధన్.**

బౌద్ధంలోని 'బోధిసత్వం' సంప్రదాయానికి సంబంధించిన పుస్తకం ఇది. ఒక వ్యక్తి సత్పుడు కావాలంటే పది విషయాల్లో పరిపూర్ణత్వం సాధించాలి. అవే 'దశపారమితలు'.

పిసినారితనం, దుశ్శీలం, మోహం, అజ్ఞానం, పిరికితనం, అసహనం, అసత్యం, బెరుకుతనం, ఈర్ష్య, నిష్క్రియత్వం అనే పది అవరోధాలను ఛేదించుకుని వాటి స్థానంలో దశపారమితుల్ని ప్రతిష్టించుకున్నవాడు మనీషిగా ఎదుగుతాడు. వీటిని కథల రూపంలో వివరించిన పుస్తకం.

1/8 డెమ్మీలో 192 పుటలు. వెల : రూ. 140/– మొదటిముద్రణ : డిసెంబరు 2019. లతా రాజా ఫౌండేషన్‌వారి ప్రచురణ. ప్రతులకు : ఆర్ట్స్ అండ్ లెటర్స్. 1–2–365/25/సి, ఇందిరాపార్కు క్రాస్‌రోడ్స్, దోమలగూడ, హైదరాబాదు – 500029. ఫోన్ : 97046 40273; 040–27635654.

**ప్రొఫెసర్ కర్వాలో – కన్నడ నవల : కన్నడ మూలం : పూర్ణచంద్ర తేజస్వి; తెలుగు అనువాదం : శాఖమూరు రామగోపాల్.**

కన్నడంలో నలభైసార్లు ముద్రితమైన నవల ఇది. ఇప్పటికి ఇంగ్లీష్, హిందీ, మరాఠీ, మళయాళం, జపనీస్, తెలుగు భాషలలో అనువదించబడింది. పూర్ణచంద్ర తేజస్వి పర్యావరణం గురించి, సేంద్రీయ వ్యవసాయం గురించి పరిశోధనలు చేస్తూ ఆయన అనుభవాలను రచించారు. ఆయన జ్ఞానపీఠ్ అవార్డు పొందిన కన్నడ కవి. ఈ నవలకు అనుబంధంగా మరొక నాలుగు పెద్ద కథలున్నాయి.

1/8 డెమ్మీలో 310 పుటలు. వెల : రూ. 350/– ప్రచురణ : 2017.

**డా॥ నా.డి' సోజగారి కథలు :** కన్నడ మూలం : డా॥ ఎన్.డి. సౌజ; తెలుగు అనువాదం : శాఖమూరు రామగోపాల్

కన్నడ సాహిత్యకారుడు డా॥ నా.డి.' సోజగారు రాసిన 24 కథల అనువాదంతో వెలువడిన పుస్తకం ఇది. వీరి కథలు హిందీ, ఇంగ్లీషు, మళయాళం, తుళు, కొంకణి భాషలలోకి అనువదించబడినాయి.

1/8 డెమ్మీలో 300 పుటలు. వెల : రూ. 300/– ప్రచురణ : 2016.

ప్రతులకు : శాఖమూరు రామగోపాల్, 31–7–4, ఫ్లాట్‌నెం : 202, జయప్రద ఫార్చ్యూన్ అపార్టుమెంట్, జెఎంజె కాలేజి ఎదురు, సరళానగర్, సుల్తానాబాద్ వార్డు, తెనాలి – 522202. ఫోన్ : 90525 63666.

**(ఇంకా వున్నాయి)**

కవిత

# నాతోపాటు నాలుగు అడుగులు వేస్తావా?

నీ ఉదయపు నడక ఎలాగూ లేదు కదా
ఈ రోడ్డుపై నాతోపాటు నాలుగు అడుగులు వేస్తావా?
ఎక్కువ దూరం వద్దులే. నాలుగు అడుగులు చాలు.
నా పాదాలు పుళ్ళు పడిపోయినాయి గనుక.
నాతోపాటు నిరాశనూ, వేసవి తాపాన్నీ
కొంతైనా పంచుకోగలవా?
మమ్ములను ఎవరూ పట్టించుకోరు,
మావైపు చూడనైనా చూడరు
మమ్ములను మా ఇంటికి చేర్చడానికి
ఏ విమానమూ లేదే!
నా చంకలో పిల్లాడు - నా భవిష్యత్తు అంధకారం
నా జీవితం ఈ కుంటుతున్న శరీరమనే గోతాంలో
ఎవరూ చూడరు. ఎవరూ వినరు.
మా కేకలకు విలువ లేదు
మాకు ఓటు లేదు -
ఎవరికీ పట్టని ఈ ప్రవాహం సాగుతోంది.
నిండారా ప్రేమతో ఆహ్వానించే చేతులు లేవు -
మాపై వెదజల్లే పూరేకులు లేవు
దభేల్‌మని మూసుకునే తలుపులున్నాయి.
నా పిల్లాడు నా వంక చూస్తాడు
ఈ దేశంవాడివేనా నీవు అనే ప్రశ్న వాడి చూపుల్లో!
ఇళ్ళకు తిరిగి వెళ్ళే వలస కార్మికుల కోసం
వెచ్చించే సమయం లేదు
వారి కష్టాలు బహు పొడవు
శ్రమజీవుల కోసం కార్లు, బస్సులు లేవు,
రైళ్ళు లేవు. తిండి లేదు.
ఏమాత్రం పట్టించుకునేవారు లేరు
నోరారా మాట్లాడేవారు లేరు -
కనీసం పైపై ఓదార్పు మాటలూ లేవు

మేమేమో నడుస్తూ, నడుస్తూ వుంటాం
మీరేమో ఉపన్యాసాలు దంచుతూ వుంటారు
ఏ బాధ లేకుండా మా విషాద చిత్రాన్ని
చూస్తూ వుంటారు.
సమాజం కృంగిపోతోంది.
అసలు వ్యాధిని పట్టుకోలేకపోతోంది
'రొట్టె లేదా అయితేనేం కేక్స్ ఇవ్వండి వారికి' అంటోంది
వారి మూల్గులూ, అల్లరి పట్టించుకోకండి అంటోంది
వారు పోతారు, అదృశ్యమౌతారు,
నోరూ, వాయీ లేని గుంపు అది
తర్వాత వారు నీకు అవసరమైనపుడు ఒక చిటికె వేయి
మరల వారు ఈ రోడ్డుపైనే నడుస్తూ వస్తారు -
మీ ఇళ్ళు కట్టడానికి, మీ బరువులు మోయడానికి
మీ చలువరాతి ఇళ్లను తడిగుడ్డతో శుభ్రం చేయడానికి
ఓ వలస అతిథీ! నీవు దేవుడివేనోయ్!
మా అవసరానికి నిన్ను జ్ఞాపకం చేసుకుంటుంటాం!
మిగిలిన సమయాల్లో మాకు కనబడవు,
మాకు వినపడవు.
మా అత్యాశ క్రింద కప్పబడి వుంటావు.
ఈ దృశ్యాలు మమ్ములను వెంటాడుతూనే వుంటాయి.
నిరాశాపూరిత దృక్కులు, అలసి సొలసిన పాదాలు,
ఆత్మ అనేదే లేని ఈ దేశం!
ఆత్మ నిర్భర్ - నేను నడిచే దారిలో
అది చాల క్లిష్టమైన పదం
నేను గొంతెత్తి చెబుతున్నా, నేను స్థానికుణ్ణి
కాని ఎవరూ పట్టించుకునేట్లు లేదు
నేను గొంతెత్తి చెబుతున్నా! నేను స్థానికుణ్ణి
కాని ఎవరూ పట్టించుకునేట్లు లేదు.

(అనిల్ అబ్రహాం ఇంగ్లీషు కవితకు అనువాదం : రవిబాబు)

PRAJAA SAAHITHI August-October, 2020 (TELUGU) Rs. 40/- RNI No.APTEL/1977/0571 Postal Regd. No. Vj/030/2018-2020
No. of Pages : 84 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

కవిత

# పిరికిపందల్లారా!

కన్నడ మూలం : హుళతంగి ప్రసాద్ ఆంగ్ల అనువాదం : అనిరుద్ధ నాగరాజ్, ఆలీ హసన్
తెలుగు అనువాదం : కొత్తపల్లి రవిబాబు

పిరికిపందలురా మీరు....
కలం పట్టే మమ్మల్ని కాల్చి చంపుతారా!
హంతకులు మీరు
అమాయకులను చంపడంలో ఆరితేరినవారు
మీ తుపాకులకు ఎదురొడ్డి
పిచ్చుకలు గూళ్ళు కట్టుకుంటాయి
మీ తూటాలు మమ్మల్ని గాయపరచవచ్చు
కాని మేం కేవలం మాంస శరీరాలం కాదురా!
మేం ఈ నేల తల్లి కన్నబిడ్డలం
మా తల్లి ప్రతి అక్షరంతో
మాకు ప్రాణం పోసింది - శక్తినిచ్చింది.
చూడరా! చూడు
మేం ఒలికించేది రక్తం కాదురా
ఇది వాస్తవ చరిత్రను రాసే
చెరపరాని తాజా సిరా
మా ప్రతి రక్తపు బొట్టూ
వేల విత్తనాలుగా పునర్జన్మనొందుతాయి
వినండిరా - మత విశ్వాసుల్లారా!
శంబూకుని తల నరికిన కత్తి గురించి నాకు తెలుసు
ఏకలవ్యుని బొటనవేలు కోరినవాడూ నాకు తెలుసు
నన్ను హతమార్చడానికి తుపాకిగా మారినవాడూ నాకు తెలుసు.
వినండి జాగ్రత్తగా....
విత్తనాన్ని నమిలివేసే చెదపురుగులు కాదు అబద్ధాలు
తుపాకులు విత్తనాన్ని నాశనం చేయలేవు
ఎన్నో విత్తనాల మర్రిచెట్టులా ఎత్తుగా, బలంగా
ఈ కలాలూ, ఈ అసంఖ్యాకమైన కలాలు
ఎలా పెరుగుతున్నాయో గమనించరా! గమనించు!

(జనత - ఆంగ్ల వారపత్రికలో కల్బుర్గిని స్మరించుకుంటూ - సెప్టెంబర్ 8, 2019 సంచికలో వచ్చిన కవిత ఆంగ్లానువాదం నుండి) ✤

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI